శ్రీరస్తు.

[illegible]లంకార సంగ్రహా[illegible]

LIBRARY

రసప్రకరణ న[illegible]యక [illegible]కరణములు.

శ్రీ శ్రీ రాజా వెలుగోటి వేంకటకృష్ణయాచేంద్ర బహాదుర్

వారి యాజ్ఞచొప్పున

నైజాము రాజ్యమునకుఁ జేరిన శ్రీ జటప్రోలు సంస్థానము పండితులగు

వెల్లాల సదాశివ శాస్త్రిల వారిచే

తత్సంస్థానపండితులగు

అవధానము శేషశాస్త్రిలవారి సహాకారమున

వ్రాయఁబడిన సవిమర్శ మగు

వ్యాఖ్యానముతోఁ గూడినవి.

ద్వితీయవారము

చదలువాడ సుందరరామశాస్త్రిలవారిచే

పరిష్కరింపఁబడి

ముద్రింపఁబడియె.

Madras

EMPRESS OF INDIA PRESS

1904.

T
415
S915K

University of Hyderabad
LIBRARY
Acc. No. 29360
Dated 14.9.87
Hyderabad - 500 134.

శ్రీ

ద్వితీయవార ప్రకటనమునందలి విశేషములు.

ప్రథమ ప్రకటితమైన యీ సవ్యాఖ్యాన కావ్యాలంకార సంగ్రహమును బరికించి పండితులు కొందఱొసంగిన స్వాభిప్రాయములలో గ్రాహ్యములగునవి గ్రహించి యీ కూర్పునం జేర్పఁబడెను. తదితరములగు వానికి బాలవ్యుత్పాదనార్థము తదుపన్యాస పూర్వకముగా సమాధానము పొందుపఱుపఁబడెను.

మూల గ్రంథమునందు నూతన [illegible] కల్పించిన చోటఁ బూర్వ పాఠమునకుఁ గుండలీకరణమును (   ) నూతన పాఠముక్రింద గీటును —— గుఱుతుగాఁ బాటింపఁబడెను.

మఱియు మూలకారునిమీఁద నాక్షేపముగా వ్రాయు గ్రంథ సందర్భముల కంతయు ముందు వైశద్యార్థము శంకాద్యోతకమైన § ఈ యంకము వేయఁబడెను.

మఱియు, సంస్కృత గ్రంథములనుండి యుదాహరించు శ్లోకములకుఁ దెనుఁగున నర్థముండుట విద్యార్థిజనులకు మిగుల నుపకారకం బని తలంచి లక్ష్య శ్లోకములకంతయు నాయాయిచోటులం జిహ్నంబులుంచి యాచిహ్నంబుల చొప్పున నడుగున సూక్ష్మాక్షరములచేఁ దత్తదర్థములు ముద్రింపఁబడెను. లక్షణశ్లోకములకు మాత్రము తత్తత్ప్రదేశ స్థితైతద్వ్యాఖ్యాన పూర్వాపరభాగ పఠనంబుచేతనే యవగతంబగు నని ప్రాయికముగా నర్థము వ్రాయఁబడ దయ్యె.

శ్రీ

కావ్యాలంకార సంగ్రహము.

విషయసూచిక.

పుటసంఖ్య.	విషయములు.
1	విజ్ఞాపనము.
1	గ్రంథారంభము.
4	రసలక్షణము.
5	స్థాయిభావ లక్షణము.
8	రసభేదములు.
13	స్థాయిభావ భేదములు.
14	రతిలక్షణము.
17	రతి కుదాహరణము.
18	హాసలక్షణము.
19	హాసోదాహరణము.
21	శోకలక్షణము.
27	శోకోదాహరణము.
28	ఉత్సాహలక్షణము.
29	ఉత్సాహోదాహరణము.
30	భయమునకు లక్షణము.
33	భయోదాహరణము.
34	జుగుప్సా లక్షణము.
36	జుగుప్సోదాహరణము.
37	క్రోధలక్షణము.

పుటసంఖ్య.	విషయములు.
38	క్రోధోదాహరణము.
41	విస్మయలక్షణము.
42	విస్మయోదాహరణము.
43	శమలక్షణము.
44	శమోదాహరణము.
48	స్థాయి భావకారణ నిరూపణము.
49	విభావస్వరూప నిరూపణము.
65	ఆలంబన విభావోదాహరణము.
66	నాయకభేద నిరూపణము.
67	దక్షిణాది నాయక లక్షణములు.
68	దక్షిణ నాయకోదాహరణము.
70	అనుకూల నాయకోదాహరణము.
71	ధృష్టనాయకోదాహరణము.
72	శఠున కుదాహరణము.
73	నాయక సహాయ నిరూపణము.
,,	విటాది విశేషలక్షణములు.
74	నాయికా నిరూపణమున స్వీయాలక్షణము.
75	పరకీయా సామాన్యల లక్షణములు.
76	స్వీయ కుదాహరణము.
77	పరకీయోదాహరణము.
78	కన్యోదాహరణము.
79	సామాన్యోదాహరణము.
80	ముగ్ధాది భేదంబులు.
81	ముగ్ధాది లక్షణములు.

పుటసంఖ్య.	విషయములు.
82	ముగ్ధ కుదాహరణము.
83	మధ్య కుదాహరణము.
84	ప్రౌఢ కుదాహరణము.
86	ధీరాదిభేదములు.
87	మధ్యధీరాది లక్షణములు.
,,	ప్రౌఢ ధీరాదిలక్షణములు.
88	మధ్యధీర కుదాహరణము.
,,	మధ్యాధీర కుదాహరణము.
89	మధ్య ధీరాధీర కుదాహరణము.
90	ప్రౌఢధీర కుదాహరణము.
92	ప్రౌఢాధీర కుదాహరణము.
,,	ప్రౌఢ ధీరాధీర కుదాహరణము.
93	జ్యేష్ఠా కనిష్ఠా భేదంబులు.
94	స్వీయాదిభేద నిరూపణము.
,,	అష్టవిధ నాయికా నిరూణము.
95	స్వాధీనపతికాది లక్షణములు.
97	స్వాధీన భర్తృకోదాహరణము.
98	వాసకసజ్జోదాహరణము.
,,	విరహోత్కంఠిత కుదాహరణము.
99	విప్రలబ్ధ కుదాహరణము.
100	ఖండితోదాహరణము.
,,	కలహాంతరిత కుదాహరణము.
102	ప్రోషిత భర్తృక కుదాహరణము.
103	అభిసారికోదాహరణము.

పుటసంఖ్య.	విషయములు.
104	నాయికలసంఖ్య.
105	ఉత్తమాది భేదములు.
114	ఉద్దీపన విభావములలోఁ బ్రాయంబు.
115	సామ్యున కుదాహరణము.
116	చేష్ట కుదాహరణము.
,,	తటస్థోద్దీపనోదాహరణము.
117	అనుభావ నిరూపణము.
118	అనుభావోదాహరణము.
130	సాత్త్వికభావ సామాన్యలక్షణము.
,,	సాత్త్వికభావ విశేషలక్షణములు.
133	స్తంభమున కుదాహరణము.
134	ప్రలయమున కుదాహరణము.
135	అశ్రువున కుదాహరణము.
,,	స్వేదంబున కుదాహరణము.
136	వైస్వర్యమున కుదాహరణము.
137	రోమాంచమున కుదాహరణము.
,,	కంపమున కుదాహరణము.
138	వివర్ణత కుదాహరణము.
139	సంచారి భావలక్షణము.
,,	సంచారిక్రమ నిరూపణము.
140	నిర్వేద శ్రమముల లక్షణములు.
141	నిర్వేదమున కుదాహరణము.
,,	శ్రమమున కుదాహరణము.
147	దైన్యజాడ్యంబుల లక్షణములు.

పుటసంఖ్య.	విషయములు.
149	దైన్యమున కుదాహరణము.
150	జాడ్యమున కుదాహరణము.
151	గ్లానిత్రాసములకు లక్షణములు.
„	గ్లాని కుదాహరణము
152	త్రాసమున కుదాహరణము.
153	శంకార్తులకు లక్షణములు.
„	శంక కుదాహరణము.
154	ఆర్తి కుదాహరణము.
„	రోష గర్వములకు లక్షణములు.
157	రోషమున కుదాహరణము.
158	గర్వమున కుదాహరణము.
„	ఆవేగ ధృతులకు లక్షణములు.
159	ఆవేగమున కుదాహరణము.
„	ధృతి కుదాహరణము.
160	స్మృతిచాపలోగ్రతల కులక్షణములు.
„	స్మృతి కుదాహరణము.
161	చాపలమున కుదాహరణము.
162	ఉగ్రత కుదాహరణము.
„	అవహిత్థాత్రపా విషాదములకు లక్షణములు.
163	అవహిత్థ కుదాహరణము.
„	త్రప కుదాహరణము.
164	విషాదమున కుదాహరణము.
.165	మదౌత్సుక్యమతులకు లక్షణములు.
„	మదమున కుదాహరణము.

పుటసంఖ్య.	విషయములు.
166	ఔత్సుక్యమున కుదాహరణము.
,,	మతికుదాహరణము.
167	నిద్రామోహబోధాంతములకు లక్షణములు.
,,	నిద్ర కుదాహరణము.
168	మోహమున కుదాహరణము.
169	బోధమున కుదాహరణము.
,,	అంతమున కుదాహరణము.
170	ముదాలస్య వితర్కములకు లక్షణములు.
171	ముదమున కుదాహరణము.
172	ఆలస్యమున కుదాహరణము.
173	వితర్కోదాహరణము.
174	సుప్తీర్ష్యాధ్యానంబులకు లక్షణంబులు.
,,	సుప్తి కుదాహరణము.
175	ఈర్ష్యకుదాహరణము.
,,	ఆధ్యానమున కుదాహరణము.
176	ఉన్మాదాపస్మృతులకు లక్షణములు.
177	ఉన్మాదమున కుదాహరణము.
179	అపస్మారమున కుదాహరణము.
181	శృంగారచేష్టల నామక్రమంబును భావలక్షణంబును.
182	హావహేలలకు లక్షణములు.
,,	భావమున కుదాహరణము.
184	హావోదాహరణము.
185	హేల కుదాహరణము.
186	విలాసమాధుర్యములకు లక్షణములు.

పుటసంఖ్య.	విషయములు.
,,	విలాసమున కుదాహరణము.
187	మాధుర్యమున కుదాహరణము.
188	ధైర్యవిభ్రమలీలలకు లక్షణములు.
,,	ధైర్యమున కుదాహరణము.
189	విభ్రమమున కుదాహరణము.
190	లీల కుదాహరణము.
191	కిలికించిత మోట్టాయితంబుల లక్షణంబులు.
,,	కిలికించితమున కుదాహరణము.
192	మోట్టాయితంబున కుదాహరణము.
193	లలితవిచ్ఛిత్తులకు లక్షణములు.
,,	లలితమున కుదాహరణము.
195	విచ్ఛిత్తి కుదాహరణము.
,,	బిబ్బోకవిహృతములకు లక్షణములు.
196	బిబ్బోకమున కుదాహరణము.
197	విహృతమున కుదాహరణము.
199	చకితహాసిత కుట్టమిత కుతూహలంబుల లక్షణములు.
201	చకితమున కుదాహరణము.
202	హాసితమున కుదాహరణము
203	కుట్టమితమున కుదాహరణము.
,,	కుతూహలమున కుదాహరణము.
204	దశావస్థా నిరూపణము.
206	దశవస్థానామంబులు.
207	చక్షుఃప్రీతి కుదాహరణము.
209	చింతించుట కుదాహరణము.
,,	తలంచుట కుదాహరణము
210	గుణవినుతి కుదాహరణము.
211	అరతికుదాహరణము

పుటసంఖ్య.	విషయములు.
212	తాపమున కుదాహరణము.
,,	లజ్జాత్యాగమున కుదాహరణము.
213	గమనమున కుదాహరణము.
214	మూర్ఛ కుదాహరణము.
216	ధన్యత కుదాహరణము.
221	శృంగార భేదనిరూపణము.
222	సంభోగ శృంగారమున కుదాహరణము.
223	విప్రలంభ శృంగారభేద నిరూపణము.
,,	అభిలాషాదుల లక్షణములు.
225	అభిలాషజన్య విప్రలంభమున కుదాహరణము.
226	ఈర్ష్యాజన్య విప్రలంభమున కుదాహరణము.
227	విరహజన్య విప్రలంభమున కుదాహరణము,
,,	ప్రవాసజవిప్రలంభమున కుదాహరణము.
228	రసాభాసమునకు లక్షణము.
237	రసాభాసంబులకు వరుసగ నుదాహరణంబులు.
245	భావప్రోదయాదినామక్రమ తల్లక్షణనిరూపణము.
246	భావశాంతి కుదాహరణము.
249	భావప్రోదయమున కుదాహరణము.
252	భావసంధిధ్వన్యు దాహరణము.
254	భావశబలత కుదాహరణము.
255	నవరససంకరమున కుదాహరణము.
256	రసాధిదేవతా నిరూపణము.
258	రసవర్ణ నిరూపణము.
260	రస మానంద మయమనుట యందాక్షేపము.
261	తత్సమాధానక్రమము.
264	కావ్యాదులయందు రసోదయ నిరూపణము.

విషయసూచిక ముగిసెను.

శ్రీరస్తు.

విజ్ఞాపనము,

ప్రాజ్ఞులారా! ప్రపంచంబునం దెల్లం దేశములు విద్యలలోం గొన్ని ప్రభుసమ్మితంబులు గొన్ని సుహృత్సమ్మితంబులు గొన్ని కాంతాసమ్మితంబు లనియు, నందుఁ బ్రభుసమ్మితంబు లయి శబ్దప్రధానంబులగు వేదాదులకన్నను సుహృత్సమ్మితంబు లయి యర్థప్రధానంబు లగుపురాణాదులకన్నను గాంతాసమ్మితం బగుకావ్యంబు శబ్దార్థ విలక్షణమై లోకోత్తరానందకందం బైనకొండొకయర్థంబును బోధించుటం జేసి సకలసహృదయ సముదయంబున కవశ్యసేవ్యం బనియు, నట్టిసత్కావ్యంబునకు •క. తను వగు శబ్దార్థంబులు, ధ్వని జీవ మలంక్రియావితానముసొమ్ముల్। తనరు గుణంబులు గుణములు। ఘనవృత్తులు వృత్తులార • కావ్యందిరకుక్." అనుటచేత ధ్వని యనునది ప్రాణరూపమనియు, నట్టిధ్వని రసధ్వని వస్తుధ్వని యలంకారధ్వని యని ముత్తెఱంగులై విలసిల్లుచుండిన నందు రసధ్వనియే నిర్భరానందరూప మగుట నాదరణీయ మ్మనియు, నయ్యది రస భావ రసాభాస భావాభాస భావశాంతి భావోదయ భావసంధి భావశబలత్వరూపముగాఁ గావ్యప్రకాశాదుల్ విశదీకరింపఁబడిన దనియుం, దమయంతరంగంబులకు విదితంబె కదా! ఇట్లుండినను మనయాంధ్ర దేశమున నానాఁటికి సంస్కృతభాషాప్రచారము తగ్గి యాంధ్రభాషయే ప్రబలినందునఁ దద్గ్రంథపఠనపాఠనాదులే యెంతయు విస్తరిల్లెను.

శ్రీశ్రీ రాజా వెలుగోటి వేంకటకృష్ణయాచేంద్రబహాదుర్ వారు దీని నంతయుఁ బర్యాలోచించి మనయాంధ్రభాషలో రసస్వరూపనిరూపకంబులు గా నుండునలంకారగ్రంథముల యన్నింటిలో నీకాలమునఁ గావ్యాలంకారసంగ్రహ మను నరసభూపాలీయ ముత్తమముగా

భావింపఁ బడుచున్న దని, పై మావ్రాసినరీతి నానరసభూపాలీయ మున రసప్రకరణనాయక ప్రకరణంబులు యథాసందర్భముగాఁ బరిశీలించి లఘుటీకతోఁ జేర్చి ప్రకటీకరించినచో రసికజనమనంబుల కత్యంత ప్రమోదావహం బగునని భావించి య ట్లొనరింపుఁడని సకరుణాబహుమానంబుగ నానతి యొసంగుటం జేసి యా ప్రకరణంబుల మతికొలఁదిఁ బరిశీలించి యీలఘువ్యాఖ్యానము వ్రాయఁబడెను.

ఈనరసభూపాలీయ మనునది యించుమించుగాఁ బ్రతాపరుద్రీయము ననుసరించి యున్నదని యెల్లరకు విదితంబే కదా! అయిననిందుఁ గొన్ని లక్ష్యలక్షణంబులు ప్రతాపరుద్రీయమునకు సరియైన యర్థమును బోధించునవి గాక స్వకపోలకల్పితములుగా నున్నవి. స్వయంకల్పితములైన నిర్దోషములుగా నున్నచో గ్రహించుట కాటంకంబు లేదు. అట్లు లేక యిందుఁ గొన్నిచోటుల లక్ష్యలక్షణ సమన్వయము లేమియుఁ, గొన్నిప్రదేశములఁ బ్రతాపరుద్రీయ విరోధంబును గనిపించుచున్నవి. కావున, సంస్కృతభాషాపరిచయము లేక యాంధ్రభాష మాత్రము తెలిసినవా రీనరసభూపాలీయమే రసాలంకారాదిగ్రంథముగా నమ్మి మార్గము దప్పదురు. పాఠశాలలయందుఁ బరీక్షార్థంబుగా (సెనట్‌వారు) దీనిం జదివించెదరు. అందు బాలురు దీని యథాశ్రుతార్థమునే యభ్యసింతురు కాఁబట్టి సంస్కృతము తెలియనిలోకము క్రమక్రమంబుగఁ దప్పుత్రోవం బోవుటకు సందియంబే లేదు.

దీని కొక చిన్న దృష్టాంతము. — చిన్నకోట పెద్దయమహాకవిచే రచియింపఁబడిన కావ్యాలంకారచూడామణి యనుగ్రంథమునఁ బ్రథమోల్లాసమున మూఁడవపుటను "క. బహిరర్థాలంబనమై విహరించు మనోవికార ♦ విలసితము సుమీ! మహిత మగు భావ మన" అని భావలక్షణముఁ జెప్పి, "తే. అట్టివిజ్ఞానలసితమై ♦ యమరుభావ । మాత్మఁ బ్రవ్యక్తమై విభా♦వానుభావ । సాత్త్వికవ్యభిచారిసం♦జ్ఞలఁ దనర్చు।

నాల్గు తెఱఁగుల రససిద్ధాంతంబు గాఁగ" అని భావభేదములు చెప్పఁ బడియె. దీని ననుసరించి యలంకారసంగ్రహమున భావభేదములను రూపించునపుడు, "భావము లైదువిధములు, స్థాయిభావములు విభావములు అనుభావములు సాత్త్వికభావములు వ్యభిచారి భావములు" అని వ్రాయఁబడియె. స్థాయిభావములకు ముఖ్యముగ నుండ వలసిన భావత్వమును బెద్దయుకివి గణింపమి పొరపాటుగా నున్న దని భావకోటిలో స్థాయులను జేర్చుట సకల శ్లాఘ్యమైనదె కాని విభావానుభావములకు భావత్వము కవిప్రమాదపతిత మని గణించి వాని నెత్తివేయకుంట శ్లాఘ్యమైనది కాదు. విభావానుభావములు మనోవికారాత్మకభావవర్గములోఁ జేరవని సుప్రసిద్ధంబు. ఆలంబనోద్దీపన భేదములచే విభావము రెండువిధము లనియు నందు నాలంబనము నాయికానాయకరూప మనియు, ఉద్దీపనము ఆలంబన గుణతచ్చేష్టాంతదలంకృతి తటస్థభేదముచే నాల్గువిధములనియు నందు రూపయౌవనాదు లాలంబనగుణములనియు హావభావాదులు తచ్చేష్ట లనియు నూపురాంగదాదులు తదలంకృతు లనియు, మలయానిలచంద్రాదులు తటస్థములనియు. సకలాలంకారికులు వక్కాణించి యున్నారుగదా! ఇట్లుండ మనోవికారవిలసన రూపభావమునందు నాయికానాయక తద్గుణాదులు కటాక్షభుజాక్షేపమందస్మితాద్యనుభావములు చేరు ననుట ప్రామాదికమని యెవ్వరు చెప్పరు? రోమాంచాదులు శరీర వికారములు గావున వానికే మనోవికారరూపభావలక్షణము సమన్వితముకాదని సాత్త్వికములయందు భావపదప్రయోగము భాక్త మని రసచంద్రికాదులును రసానుకూలవికారమె భావము, అది యాంతర మని శారీరమని రెండు తెఱంగులు, అందాంతరము స్థాయిభావమని వ్యభిచారిభావమని రెండు విధములు, శారీరము సాత్త్వికభావరూపముగాన నందా శబ్దముభాక్తమనుట తగ దని రసతరంగిణ్యాదులును, వివదించుచుండఁగా విభావాను

భావములకుఁ గూడ భావాంతర్గతి కరం బాశ్చర్యకరము. ఇట్లు ప్రసిద్ధకవులై యుభయభాషాపాండిత్య మండితు లైనవారికే ప్రాచీనగ్రంథమనియు మహాకవిప్రణీత మనియుఁ బ్రసిద్ధపండితులచేఁ బరిష్కృతమైన దనియు, నమ్మకము తప్పుత్రోవంబోవుటకు మూలమై యుండఁగా నల్పప్రజ్ఞ గలవా రిట్టియుద్గ్రంథము లని పేర్కొనఁబడినవానిని జూచి త్రోవం దప్పుదు రనుట కేమిసందియంబు? అందువలనఁ దన్నివారణార్థము గావింపఁబడిన యీపరిశీలనము వ్యర్థము గాదు.

మఱియుఁ బ్రతాపరుద్రీయము ననుసరించిన నరసభూపాలీయంపుఁజోటులయందును, వానికి సంబంధించినకొన్ని ప్రతాపరుద్రీయభాగములయందునుం గలయుద్గ్రంథ విరోధంబు విశదీకరింపవలసిన దని శ్రీశ్రీ వేంకటగిరిసంస్థానప్రస్తుత ప్రభుపుంగవులవారు సెల వొసంగిరి గావున నట్టిదోషంబులును యథామతి నిందు వివరింపఁబడెను.

రసగంగాధరకారుండగు జగన్నాథపండిత నరేంద్రుం డత్యంత ప్రౌఢమార్గము నవలంబించి పెక్కుతర్కంబుల సూక్ష్మతరదోషంబుల నుద్ఘాటించె. ఆమార్గమునకుఁ గొన్నికొన్నిచోటులఁ గావ్యప్రకాశాదిప్రామాణికగ్రంథములే మిక్కిలిదూరంబు లగుచున్నవి గావునఁ బ్రసిద్ధంబులుగా నున్నదోషంబులే తఱుచుగ నిందు విశదీకరింపఁబడెను.

ఈనరసభూపాలీయమునం దీరసప్రకరణనాయక ప్రకరణములయందే గాక యితరము లగుధ్వన్యలంకారాది ప్రకరణంబులయందునుం గొన్నిదోషంబు లచ్చటచ్చటఁ జూపట్టుచున్నవి. అవి సాకల్యంబుగ వ్రాయుట యప్రస్తుతంబు గావున దిఙ్మాత్రప్రదర్శనంబుగ నొకటి రెండుదోషంబు లిచ్చట నుదాహరింపఁబడు. ఎట్లన్న.—

కావ్యప్రకరణంబున వ్యంజనాలక్షణపద్యము. ౬౬ ''క. సంగతము లగుపదార్థము । లం గలవాక్యార్థమున కలంకారంబై । రం గగు నర్థాంతర మర । యం గావ్యములందు వ్యంజనాఖ్యఁ జెలంగున్.''

దీనిచే నర్థ విశేషరూపమే వ్యంజనయని వచింపఁబడినది. ౫౫ "గీ. శబ్దవృత్తులు నభిధ లక్షణ యనంగ | వ్యంజన యనంగ," నను పద్యమున శ్శబ్దవ్యాపార విశేషరూపముగాఁ జెప్పఁబడినవ్యంజన కీలక్షణము సంభవింపదు గావున నసంభవదోషగ్రస్తముగా దీని నెఱుంగునది. ప్రతాపరుద్రీయమున "అన్వితేషు పదార్థేషు వాక్యార్థోపస్కారార్థ మర్థాంతరవిషయ శ్శబ్దవ్యాపారో వ్యఞ్జనా" అని వ్యంజన శబ్దవ్యాపారరూపముగఁ జెప్పఁబడినది. "పదప్రతిపాద్యములగు నర్థములు పరస్పరాన్వయము నొందినవెనుక వాక్యార్థాలంకారమున కైన యర్థాంతర విషయకశబ్దవ్యాపారము వ్యంజన" అని దీనియర్థము. ఇట్లు దోషాంతరంబు లూహ్యంబులు.

ఇఁక నలంకారప్రకరణమున వ్యతిరేకాలంకార లక్షణము. ౧౫౯ "క. ధర నుపమానముకన్నను | నరు దగునుపమేయ మధికమా ననసామ్యం | బును భేదకారణంబై | యిరవుగ వ్యతిరేకమయ్యె నిది యెల్లన్నన్." ఇది యుపమేయాధిక్య పర్యవసాయియగు వ్యతిరేకమందు మాత్ర మన్వయించును గాని యుపమేయన్యూనతాపర్యవసాయ్యనుభయపర్యవసాయి వ్యతిరేకములయం దన్వయింపదు గావున నవ్యాప్తిదోషగ్రస్తము. ప్రతాపరుద్రీయమునందు "శ్లో॥ భేదప్రధానసాధర్మ్య ముపమానోపమేయయోః | అల్పత్వాధిక్య కథనాద్వ్యతిరేక స్స ఉచ్యతే॥" అని యుపమానోపమేయములకుఁ బరస్పరముగ నాధిక్యాల్పత్వములు వర్ణించినపుడు వ్యతిరేకాలంకారముగఁ జెప్పఁబడినది. ఈభేదములలో మొదటిభేదమున కిందుఁ జెప్పిన "బహుతరాశాభ్రాంతి" యను సీస ముదాహరణం బగును. ద్వితీయభేదమునకు 'శ్లో॥ రక్తస్త్వం నవపల్లవైరహమపి శ్లాఘ్యైః ప్రియాయాగుణైస్త్వామాయాన్తి శిలీముఖాః స్మరధనుర్ముక్తాస్తథా మా మపి | కాన్తాపాదతలాహతి స్తవ ముదే తద్వ న్మమాప్యావయో స్సర్వంతుల్యమశోక

కేవలమహం ధాత్రాసశోకః కృతః॥" అనునది యుదాహరణము. దీని యర్థము. అశోక = ఓఅశోకవృక్షమా! త్వమ్ = నీవు; నవపల్లవైః= నూతనములగు చిగురుటాకులచేత; రక్తః=రక్తమయినదానవు, అనఁగా నెఱ్ఱనిదానవు. అహమపి=నేనును; శ్లాఘ్యైః= శ్లాఘనీయములగు; ప్రియాయాః=ప్రియురాలియొక్క; గుణైః=గుణములచేత; రక్తః=రక్తుఁడను, అనురక్తుఁడననుట. త్వామ్=నిన్ను; శిలీముఖాః=భృంగములు; ఆయాన్తి=పొందుచున్నవి. మామపి=నన్నును; తథా=అలాగుననే; స్మరధనుర్ముక్తాః=మన్మథునిధనువువలన విడువఁబడిన శిలీముఖములు, అనఁగా బాణములు; ఆయాన్తి=పొందుచున్నవి. కాన్తాపాదతలాహతిః= ప్రియురాలిపాదాఘాతము; తవ=నీకు; ముదే = సంతసముకొఱకగుచున్నది. మమాపి=నాకును; తద్వత్=అలాగుననే యగుచున్నది. ఆవయోః=మనయిరువురకు; సర్వమ్=సమస్తము; తుల్యమ్= సమమైనది. అహంకేవలమ్= నేనుమాత్రము; ధాత్రా=బ్రహ్మచేత; సశోకః= శోకవంతుఁడనుగా; కృతః=చేయఁబడినాఁడను; అనఁగా నీవశోకమవు, నేను సశోకుఁడను, అనునింతమాత్రమె భేదము, తక్కినదంతయు సమమనుట. ఇందు వర్ణనీయరాజునందుఁ జెప్పినసశోకత్వము అశోకత్వముగల వృక్షమున కన్న న్యూనత్వమును దోఁపించుచున్నది. ఇఁకఁ దృతీయభేదమున కుదాహరణము "శ్లో॥ దృఢతరనిబద్ధముష్టేః కోశనిషణ్ణస్య సహజమలినస్య। కృపణస్య కృపాణస్యచ కేవలమాకారతో భేదః॥" అనునది. దీనికి "అతిదృఢముగ బంధింపఁబడిన ముష్టిగలుగుట, అనఁగా ముష్టివదలకుండుట, కోశమునందుండుట, సహజమాలిన్యము సమానములైనను, కృపణ కృపాణములకు ఆకారమునమాత్రమె, అనఁగా ఆకృతివలననె, కాదేని, ఆయనువర్ణముననే భేదమనియభిప్రాయము. ఇందుపమేయముకృపణునియం దుపమానకృపాణమునకన్న న్యూనాధిక్యములు

దోఁపమి ననుభయపర్యవసాయి యగునని కువలయానందమునం దున్నది. ఇట్టిదోషంబుల నెల్ల నెవ్వారైన మహాశయులు సవరించినచో నతిశ్లాఘ్య మగు నని తోఁచెడు.

నేను వ్రాయుటీకయందుఁ దప్పులుగాని పొరపాటులు గాని యుండినచో నవి యెల్లఁ బరమానుగ్రహముతో మన్నించి గుణాంశములు మాత్రము గ్రహింపుఁడని ప్రార్థించుట "శ్లో॥ శూన్యేపిచ గుణవత్తామాతన్వానః స్వకీయగుణజాలైః। వివరాణిముద్రయన్ ద్రాగూర్ణాయు రివేహ సజ్జనో జయతి॥" అనున్యాయమునుబట్టి గుణోద్ఘాటనదోషాచ్ఛాదనంబులు సజ్జనసహజధర్మములైనందునఁ బునరుక్తం బగునని కేవలముగ సత్పురుషులం గూర్చి వందనంబు లొనరించుచున్నాఁడను.

ఇట్లు,

వె - సదాశివశాస్త్రిలు.

శ్రీ ర స్తు.

శ్రీవిశ్వేశ్వరాయనమః.

కావ్యాలంకార సంగ్రహము.

తృతీయాశ్వాసము

ఆంధ్రవ్యాఖ్యానసహితము.

శ్లో. అనధిగతమానసవ్యథ, మపరిచితాసూయ మశ్రుతోత్కలికమ్
అపరిజ్ఞాతవియోగం, కలయామి కయోరపి ద్వన్ద్వమ్.

ఉ. పంకజజన్ము యొప్పులను ♦ బాసి సృజింప హసించుమాడ్కి నే
వంకను దప్పు లేక వర ♦ వల్గుకవీంద్రముఖాబ్జవాసయై
పొంకము లొనఁగుల్ భువన ♦ పుంజములన్ గనిపించువాణి యా
వేంకటకృష్ణయాచనృపు ♦ వేడుక మీఱఁ గృతీంద్రుఁ బ్రోవుతన్.

గ్రంథారంభము.

క. శ్రీరమణచరణసేవా। పారాయణ యుభయవంశ ♦ పావన లక్ష్మం
బారచితభాగధేను యు।పారకృపాసరస యోబ ♦ పార్థివనరసా. 1.

టీ॥ శ్రీరమణ.. పారాయణ=నారాయణునిపాదముల సేవించుటయం దాసక్తుఁడా! ఉభయవంశపావన=మాతాపితృవంశముల పరిశుద్ధముచేయువాఁడా! లక్ష్మంబారచితభాగధేయ = అనఁగా లక్ష్మ

మాంబాపుత్త్రేఁడాయనుట. అపారకృపాసరస = అధికమైనకరుణచే నార్ద్రహృదయుఁడైనవాఁడా! ఓబపార్థివనరసా=ఓబయరాజనందనుఁడైన నరసభూపాలుఁడా! దీనికి నవధరింపు మనుముందరిక్రియతో నన్వయము.

గీ. అవధరింపుము లక్ష్మల ♦ క్ష్యముల నెల్ల
నసఘ భవదీయనామధే ♦ యాంకితముగ
బహువిభక్తుల నొనరింతుఁ ♦ బద్యవితతి
నిచ్చటఁ బ్రబంధజీవితం ♦ బెట్ల టన్న. 2

టీ॥ అవధరింపుము= చిత్తగింపుము. అనఘ=పవిత్రుఁడా! కృతిపతి సంబోధనము; ప్రబంధజీవితంబు=ప్రబంధమునకుఁ బ్రాణప్రాయమగురసము; ఎట్లుఅటుఅన్నన్; ఇచ్చటన్ =ఈయాశ్వాసమునందు; లక్ష్మలక్ష్యములన్ ఎల్లన్=లక్షణములనులక్ష్యములను అన్నింటిని; బహువిభక్తులన్ = అనేకవిభాగములచేత ; భవదీయనామధేయాంకితముగన్=నీనామముచేత అంకితమగునట్లు ; పద్యవితతిన్=పద్యముల సమూహముచేత; ఒనరింతున్=నిరూపింతును.

వి. ఇటలక్ష్యలక్షణములయందు సాకల్యముగఁ గృతిపతినామంబు లేనందున భవదీయనామధేయాంకితముగ ననునది యసమంజసమగుట సంభవించుచున్నది. లక్షణపద్యములన్నింటియందును, లక్ష్యపద్యములలో ననేకములయందును, నృసింహనామధేయాంకనము లేమి గనుచున్నారముగదా! అధ్యాహార్యమన్నచో నన్యులకుం గావచ్చును. ఎల్లశబ్దము సాకల్యార్థకముగాన సకలలక్ష్మలక్ష్యములయందు భవన్నామధేయాంకితత్వ మవినాభావసంప్రాప్తము. ఇఁక లక్ష్యలక్షణములనెల్లఁబద్యవితతిచే నొనరింతుననఁగాఁ గొన్నివాక్యములుగా వను తాత్పర్యమన్నచో, లక్ష్మలక్ష్యములను నామధేయాంకితముగ నొనరింతునని పృథగ్వ్యాఖ్యా

ర్థము సకలపదములచేఁ దేర్పడవలసివచ్చును. ఇట్లు వాక్యద్వయకల్పన యందు విశేషప్రమాణ జిజ్ఞాసాదివివాదము లనేకములు గలుగును.

గ. మఱియు నీపద్యమువలన నీయాశ్వాసమున రసము నిరూపింపఁబడు ననునర్థము వ్యక్తమగుఁగాన నీపద్యముతోడనే, "పులకండము" లనుపద్యమును జెప్పక పునరుక్తప్రాయముగ "మహిత కవితా విలాసినీ" యనుపద్యమును గవి యేల వ్రాసెనో !

ఇచట రసవస్త్వలంకారరూపమగుధ్వనియంతయు జీవితంబయిన నందు రసధ్వనియే లోకోత్తరానందరూప మగుట ముఖ్యజీవిత మని భావము. ప్రతాపరుద్రీయమునందును, "అథ సర్వేషాం ప్రబంధానాం జీవితభూతస్య రసస్య" అనియున్నది. "సర్వప్రబంధములకుఁ బ్రాణప్రాయ మగురసమునకు" అని దీనియర్థము. ఇందువలన, "ధ్వని జీవ మలంక్రియావి ♦ తానము సొమ్ముల్" అనుదానితో విరోధములేదని తెలియునది.

గీ. మహితకవితావిలాసినీ ♦ మధురతరవి
లాసవిన్యాసములలీల ♦ వాసి కెక్క
నవరసంబుల నెఱిఁగింతు ♦ నవరసార్థ
గుంభగంభీరతరవచో ♦ జృంభణముల. 3

టీ॥ మహిత...లీల—మహిత=పూజ్యయగు, కవితావిలాసినీ=కవితయనెడు స్త్రీయొక్క, మధురతరవిలాస-మిక్కిలి మనోజ్ఞములగు విలాసములయొక్క, విన్యాసలీల=విన్యాసభంగి; వాసికెక్కన్=వన్నెకెక్కునట్లు; నవ...జృంభణములన్ = నవరసయుక్తములగునర్థముల యొక్క-గుంభనముచే నతిగంభీరమైనమాటల యతిశయములచేత; నవరసంబులన్=శృంగారాదినవరసములను ; ఎఱిఁగింతున్ = తెలుపుదును.

రసలక్షణముఁ జెప్పుచున్నాఁడు—

క. పులకండంబులు గలిపిన
నలు వగుసలిలము రసాయ ♦ నం బగుపగిదిన్
లలితవిభావాదులచే
నలఘు (తర) వయిన స్థాయిభావ ♦ మమరున్ రసమై. 4

టీ॥ పులకండంబులు...సలిలము=కండచక్కెర గలిపిన యొప్పి దముగునుదకము; రసాయనంబగుపగిదిన్=పానకమగురీతి; లలితవిభావాదులచేన్=మనోహరములైన విభావానుభావసాత్త్విక వ్యభిచారిభావములచేత; అలఘు ..భావము=అధికమగురత్యాది స్థాయిభావము; రసమై=రసస్వరూపమై; అమరున్=ఒప్పును.

శర్కరాకర్పూరాది యోగ్యవస్తువులవలన మధురతరంబగు నుదకము పానకమగురీతి సముచిత విభావాదులవలన నతిశయించి ప్రకాశించురతిహాసశోక క్రోధోత్సాహభయజుగుప్సా విస్మయశమంబు లను స్థాయిభావములు వరుసగ శృంగారహాస్యకరుణ రౌద్రవీరభయానక బీభత్సాద్భుత శాంతంబు లనురసంబులగు నని తాత్పర్యము.

§. ఈపద్యమునం దలఘుతరస్థాయిభావ మనుచోట "అలఘువయినస్థాయిభావ" మని యుండినచో నేక దేశాన్వయాదిదోషంబు లెవ్వియుఁ బ్రసరింపవు. "శ్లో॥ విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః। ఆనీయమానస్స్వాదుత్వం స్థాయీభావోరసస్స్మృతః॥" అనులక్షణముతో నేకవాక్యతయు నతివ్యక్తంబుగ భాసిల్లును. దీనియర్థము విభావానుభావసాత్త్విక వ్యభిచారులచే స్వాదుత్వము నొందింపఁబడినది యనఁగా నిర్భరానందరూపత నొందింపఁబడినదియగు స్థాయిభావము రసమనఁబడునని. ఇందు "ఆనీయమానః" అనునది వ్యస్తపదమ

గుటచే నందు "విభావైః" అనునదిలోనగు తృతీయాంతపదము లన్వయించును. ఇటనో, "అలఘుతరస్థాయిభావ" అనునదిసమస్తపదము గాన నందు సమానబహిర్వ్యాఖ్యాతమగు లలితవిభావాదులచే నను తృతీయాంత మన్వయించుట సంప్రదాయవిరుద్ధము. అలఘుపదము నిత్యసాకాంక్షముఁగాదు. కావున "అలఘువయిన" అనియుండినచో నీదోషము తొలంగుటయేకాక పై శ్లోకముతో సమానార్థకతయుఁ గలుగును.

స్థాయిభావలక్షణముఁ జెప్పుచున్నాఁడు.—

గీ॥ గరిమ నదు లెన్ని గలిసినఁ ♦ గప్పుకొనుచు
జలధి గనుపట్టురీతి (సం ♦ చారి) ని ♦ జగతి భావ
సంచయము లెన్ని గలిసిన ♦ మించనీక
తాన కనుపట్టు భావంబు ♦ స్థాయి దలఁప. 5

టీ॥ జలధి=సముద్రము; గరిమన్=ఆధిక్యముచేత; నదులెన్ని గలిసినన్=తనలో నెన్నినదులుచేరినను; కప్పుకొనుచున్=ఆవరించుచు; కనుపట్టురీతిన్= అగపడునట్లు; సంచారిభావసంచయములు=వ్యభిచారిభావములయొక్క గుంపులు; ఎన్నిగలిసినన్=ఎన్నిచేరినను; మించనీక= అతిశయింపనీయక; తాన=తానే; కనుపట్టుభావంబు = చూపట్టుభావము; తలఁపన్=విచారింపఁగా; స్థాయి=స్థాయిభావ మనఁబడునని యర్థము.

లవణ సముద్రము తనలో మంచినీటినదు లెన్నిగలిసినను వాని మంచిగుణమును మించనీక తనక్షారగుణమునే ప్రకాశింపఁ జేయునట్లు విరుద్ధావిరుద్ధభావంబు లెన్ని గలిసినను వాని నణఁచి తానొకటియే వెలయుభావంబు స్థాయి యనంబడు నని తాత్పర్యము.

§. ఈలక్షణము "శ్లో॥ విరుద్ధై రవిరుద్ధైర్వా భావై ర్విచ్ఛిద్యతే న యః। ఆత్మభావం నయ త్యన్యాన్ స స్థాయీ లవణాకరః॥" అను

ప్రాచీనలక్షణము ననుసరించియున్నది. విరుద్ధభావములచేతఁగాని యవిరుద్ధభావములచేతఁ గాని విచ్ఛిత్తినొందని దెద్దియో, ఇతరభావములను దన స్వరూపము నొందించునది యెద్దియో, అది స్థాయి యనఁబడు, ఇంములకు లవణాకరము దృష్టాంత మని దీనియర్థము. ఎల్లైన నీఁదు సంచారి సంచయములనుదానికి నిర్వేదగ్లానిశంకాది వ్యభిచారిభావముల గుంపులని యర్థము. "విరుద్ధైరవిరుద్ధైర్వాభావైః" అనుదానికి విరుద్ధస్థాయిభావములచేతఁగాని యవిరుద్ధస్థాయిభావముల చేతఁగాని యని యర్థముగానున్నది. "సజాతీయ విజాతీయై రతిరస్కృతమూర్తిమాన్" అనులక్షణమునకు నింతియేయర్థము. వీనివ్యాఖ్యలయందును, రత్యాదిభావము సజాతీయములు లేక అవిరుద్ధములగు నాయికాంతరరత్యాదుల చేతఁగాని విజాతీయములు లేక విరుద్ధములగు జుగుప్సాదులచేతఁగాని తిరస్కృతము గాక నెఱయునపుడు స్థాయిభావ మనఁబడు నని వ్రాయంబడియున్నది. విరోధమైత్రులు రత్యాదిస్థాయి భావములలోఁ బరస్పరమునకుఁ జెప్పఁబడినవిగాని స్థాయిసంచారులకుఁ జెప్పఁబడలేదు. " శ్లో॥ విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః । ఆనీయమానస్స్వాద్యత్వ" మ్మను రసలక్షణపద్యమునను సంచార్యాదులచేత నుచ్ఛ్రితి నొందింపఁబడినస్థాయి రసమగుననియున్నది. "లలితవిభావాదులచే, నలఘుతరస్థాయిభావ ♦ మమరున్ రసమై" అనునదియు నీయర్థమునే చెప్పుచున్నది. ఇఁక సంచారిలక్షణములలో "విశేషాదాభిముఖ్యేన చరన్తో వ్యభిచారిణః। స్థాయిన్యున్మగ్ననిర్మగ్నాః కల్లోలా ఇవవారిధౌ" అనుదశరూపకమును, "యథా వారిధౌసత్యేవకల్లోలా ఉద్భవన్తి విలీయన్తేచ తద్వదేవ రత్యాదౌ స్థాయిని సత్యే వావిర్భావతిరోభావాభ్యా మాభిముఖ్యేన చరన్తో వర్తమానా నిర్వేదాదయోవ్యభిచారిణోభావాః," అనుతద్వ్యాఖ్యయును, "ఉన్మజ్జన్తోనిమజ్జన్తః కల్లో

లాస్తేయథార్ణవే। తస్యోత్కర్షం వితన్వన్తి యాన్తి తద్రూపతామపి। తథాస్థాయిని నిర్మగ్నా హ్యున్మగ్నా వ్యభిచారిణః। పుష్ణన్తి స్థాయినం స్వాంశ్చ తన్నయన్తి రసాత్మతామ్" అను లక్షణాంతరమును సముద్రమునందుం దరంగ లుద్భవించుచు లయించుచు నాసముద్రమునకుఁ బుష్టిఁగలుగఁజేయునవియై తద్రూపత నొందుభంగి స్థాయియందు సంచారులు పుట్టుచు మున్గుచు దానిని రసత్వము నొందించుచుఁ దద్రూపతనొందుననియు, సముద్రములేక తరఁగలు లేనిభంగిస్థాయిలేక సంచారులుదయింపవనియుఁ జెప్పుచున్నవి. "రమణీయోల్బణతాసమేతమగునీ రరత్యాదిభావాబ్ధిలోన్ సమరన్ బుట్టుచు మున్గుచున్ దగుఁదరంగ గారూఢి సంచారిసంఘము" లను నేతదాశ్వాసాంతిమపద్యమందును, సంచారులు స్థాయిభావాబ్ధిలోఁ బుట్టుచు మునుఁగుచు నుండునవియేకాని ప్రతిస్పర్ధులు కావని తెల్లమగుచున్నది. ఇట్లు స్థాయ్యాశ్రితములై క్షణానస్థాయులగు సంచారులు స్థాయిభావముల నుపమర్దము సేయఁజాలవుగావున "సంచారి సంచయము లెన్నిగలిసిన మించనీక" యనుచో సంచారిశబ్దము స్థాయిభావాభిప్రాయముచేఁ బొరపాటుగాఁ జెప్పినయట్లు వ్యక్తంబగుచున్నది. సంచారిశబ్దము వ్యభిచారిబోధకమేకాని స్థాయిభావబోధకము గాదు. భావసంచయము లనిమాత్రమున్నచో నదూష్యంబు.

దీనింగూర్చి, కొందఱు "జలధిగనుపట్టురీతిని సరవిభావ" అనియు, కొందఱు "జలధిగనుపట్టురీతినిజగతిభావ" అనియుమార్చిపై దోషమునుదొలఁగించిరి. ఈమార్పులు నాయుద్దేశమును బోషించుచునే యున్నవి, నాయుద్దేశమిపుడు ముద్రితములై యశేషదోషజ్ఞులచేఁబఠనపాఠనాదివ్యవహారములయందుం దదూష్యములుగా నాదరింపఁబడు పుస్తకములయందుఁగలపాఠములు కొన్నిపట్టులఁ బ్రామాణికగ్రంథవిరుద్ధములై పాఠకులకుఁ దప్పుత్రోవలం జూపుచున్నవనియకదా!

క. ధర శృంగారము హాస్యము
కరుణ (యు) ము వీరము భయాన • కము బీభత్సం
బురరౌద్ర మద్భుతము శాం
తరసంబును రసము లనఁగ • దనరుం గృతులన్.

టీ॥ శృంగారము హాస్యము, కరుణము వీరము భయానకము బీభత్సము రౌద్రము అద్భుతము శాంతము అను తొమ్మిదిరసములు కృతులయందుఁ బ్రయోగింపఁబడునని యర్థము.

§. రసంబులు లౌకికాలౌకికభేదంబున ద్వివిధంబులనియు, నందలౌకికము స్వాప్నికమానోరథికఔపనాయికభేదంబులఁ ద్రివిధంబనియు, నందౌపనాయికము కావ్యనాట్యగత మనియు సిద్ధాంతము. ఇట్లు "మ. రసనీయోల్బణతాసమేత మగునీ • రత్యాదిభావాబ్ధిలో। నమరం బుట్టుచు మున్గుచుం దగుఁ దరం • గారూఢసంచారిసం । ఘము లే తత్ప్రతిపన్న మౌరసము ద • ళ్యాలంబునం దైన స। త్యము రామాదులయంద నాట్యమున స • భ్యావాసమై భాసిలున్" అనునీపద్యమునందును లౌకికాలౌకికభేదంబు లీయాశ్వాసాంతమునఁ జెప్పఁబడియున్నవి. ఇందుఁ గృతులనన్నందున నౌపనాయికరస మొక్కటియే శృంగారాదిభేదములు గలదనునభిప్రాయము తోఁచును. కృతిపద మలంకారశాస్త్రమాత్రపరమైనం గావచ్చు.

§. మఱియు నిందుఁ గరుణయనుచోట, శ్లో॥ శృఙ్గారాచ్చ భవేద్ధాస్యో రౌద్రాచ్చ కరుణోభవేత్ । శృఙ్గారహాస్యకరుణరౌద్రవీరభయానకాః । పుటపాకప్రతీకాశో రామస్యకరుణోరసః । కరుణస్యమూర్తిరవవా శరీరిణీ విరహవ్యథేవ వనమేతిజానకీ॥ ఇత్యాదిప్రయోగముల

యందు రసబోధకమగు కరుణశబ్దము పుంలింగముగను, శ్లో॥ కరుణా శాలికపాలిభాగధేయమ్ । కరుణావతికస్తు తేమమస్తాన్తమ్ । కారుణ్యం కరుణాఘృణా॥ ఇత్యాదులయందు దయాబోధకమగునది స్త్రీలింగముగను, సర్వసంప్రతిపన్నమైయుండఁగా రసవిషయమందు స్త్రీలింగ ప్రయోగమయుక్తముగఁదోఁచెడు. కరుణయుననుచో "యు" అనుసముచ్చయమునకు సందర్భములేదు గావునఁ గరుణమనియే గ్రంథకర్త ప్రయోగించియుడుననవచ్చును. అయినను, "కరుణ విద్రుమ వర్ణగౌర వచ్ఛలమున, కరుణాభయబీభత్సము। ఖరసంబులు శోకభీతి॥ గాఢజుగుప్సాకరములు" అనుపద్యములందు రసవిషయమందును స్త్రీలింగముగఁ బ్రయోగించుటంజేసి యిందును గరుణయుననియే ప్రయోగించియుండు నని తోఁచుచున్నది.

§ ఈరీతి లింగభేదమేకాదు. అర్థభేదముంగలదు. ఏలాగనిన,నిరుపాధి పరదుఃఖప్రహాణేచ్ఛ కరుణ యనియు, శోకాతిరేకము కరుణమనియు, దయారూప మగుకరుణకు, రసరూప మగుకరుణమునకు లక్షణములు శాస్త్రసిద్ధములై యున్నవి. పరులకు సంభవించిన దుఃఖమును దొలంగింపవలయు నని నిర్నిమిత్తముగ నుదయించునిచ్ఛదయయనియు, శోకముయొక్క యతిశయము కరుణ రస మనియు, వీనియర్థము. ఇట్లుండఁ గారసాధిదేవతలఁ జెప్పుసీసములో "యమునియందు దయామయత్వంబు ఘటియించు, జగతిమహాకాలు సభయుఁజేయు" నని కరుణరసాధిపతియగు యమునియందు శోకహేతుత్వమనుటకు మాఱుగ దయామయత్వమనుటయు, నవరససంకరమునుజెప్పు "జయలక్ష్మీరతమై ప్రతాప యుతమై. శత్రుచ్ఛిదాధుర్యమై । ప్రయాతార్తావనమై" యనుపద్యమునందుఁ గరుణమునకు "శ్లో॥ లక్ష్మీమాలోక్య లుభ్యన్నిగమ ముపహాసన్ శోచయన్ యజ్ఞ జన్తూన్" అనురసతరంగిణీశ్లోకమున "శోచ

యఙ్ఞ యఙ్ఞజన్తూన్" అని యుదాహరించిన ట్లుదాహరింపక "ప్రయుక్తార్తావనమై" యని దయావీరోదాహరణముగఁ జెప్పుటయు నాదరణీయము గాదు. వీనియర్థము, యఙ్ఞజంతువులను శోకవంతములుగాఁ జేయుచు ననియు, పరిశుద్ధుఁడైన యార్తునకు రక్షకమైన యనియు కావునఁ బై యుదాహరణములలో మొదటిదానియందుఁ గరుణరస మనియు, రెండవదానియందు దయావీర మనియు, స్పష్టముగు చుండఁగా రెండును గరుణరసోదాహరణము లనుట యాదరణీయముగా దనుట. రసచంద్రికలోఁ గరుణరసస్థానమునందు "ఆర్తరక్షాంకుర్వన్" అనుట,
* శ్లో ॥ గ్రాహగ్రహగ్రస్త మతీవ దీనం పుత్రైః కళత్రై రపి మిత్రవర్గైః। త్యక్తం గజేన్ద్రం త్వరయాఽభ్యుపేత్యారక్ష యోఽసౌ సహి మేశరణ్యః॥ అని యుండే ముందువ్రాయఁబడిన దయావీరోదాహరణములోఁ జేరుఁగాని పార్థక్యము నాపాదించుట కష్టఁబు కాదు.

ఈ దయావీరోదాహరణమునకు, "ఆర్తరక్షాంకుర్వన్" అనుకరుణరసోదాహరణమునకు నెట్టిభేద మేర్పడునో భావింప వలయు. ఇట్లు "ఆర్తత్రాణపరాయణ స్స భగవాన్నారాయణో మేగతిః" ఇత్యాదు లన్నియు దయావీరములోఁ జేరునేకాని కరుణరసములోఁ జేరవని నాయభిప్రాయము. ఇఁక "శ్లో॥ శృఙ్గారం క్షితినన్దనీవిహరణే వీరం ధనుర్భఞ్జనే కారుణ్యం బలిభోజనే" ఇత్యాద్యనేకప్రయోగములు సేయువారికేమి యాశయమన్న చో దుఃఖ ప్రహాణేచ్ఛారూపము దయగావున నది నియతముగ దుఃఖజ్ఞానములేక యుదయింపదు. అట్టిదయ

* మకరముచే గ్రసింపఁబడి పుత్రమిత్రకళత్రాదులచే విడువఁబడి యతిదీనమైనగజేంద్రమును వేగముగ విచ్చేసి యేమహానుభావుండు రక్షించెనో యాతండు నాకు శరణ్యుండు.

దుఃఖరూపమగు కరుణరసములోఁ జేరునని యాశయముండునని తోఁచుచున్నది. అట్టివారిమతమందును ఇష్టజనవియోగాదిజన్యవైక్లబ్యాఖ్య చిత్తవృత్తిరూపమగు శోకము దయాఘటితము గాదుగావునఁ గరుణమునకుమాఱుగ దయ కరుణ యని ప్రయోగించుటకుఁ బ్రమాణంబు చింత్యంబె. "నను దయావీరోఽపి కరుణరస ఏవ కథన్నాన్తర్భవతి, నిరుపాధి పరదుఃఖ ప్రహాణేచ్ఛా దయా, సాచ కరుణేనవినాన సంభవతీతి చేన్న. కరుణస్య స్థాయిభావ శ్శోకః దయావీరస్య స్థాయిభావ ఉత్సాహ ఇతి స్థాయిభావభేదేన భేదాత్" ఇత్యాది రసతరంగిణీతద్వ్యాఖ్యానౌకాదులవలన నేతద్విస్తరంబు దెలియు. ఇటఁ బూర్వపక్షాశయము, దయావీర రసము కరుణరసమం దేల యంతర్భవింపదు, నిర్నిమిత్తముగాఁ బరదుఃఖమును బోఁగొట్టవలయు నను నిచ్ఛ గదా దయ, అది కరుణములేక సంభవింపనే సంభవింపదు గదా! యని. అనఁగాఁ బరదుఃఖమును బోఁగొట్టవలె నను నిచ్ఛ పరులదుఃఖము తెలిసినచోఁ గదా కలుగును. అట్లు నియతముగ దుఃఖజ్ఞానము లేక దయకు సంభవము లేనప్పు డది కరుణములోఁ జేరఁ గూడదా? దయావీర మతిరిక్త మేల యని యాశయము. ఇఁక సిద్ధాంతాశయము. కరుణరసమునకు స్థాయిభావము శోకము. దయావీరమునకు స్థాయిభావ ముత్సాహము. అనఁగాఁ ద్వైవిధమున భేదమేర్పడక పోయినను స్థాయిభావముల భేదమును బట్టి రసభేదమేర్పడుచున్నదని తెలియవలయు.

కొంద, ఱిప్పట్టున నివి లేఖకులదోషములై యుండవచ్చును, లేనిచోమూర్తికవికీర్తికిఁ గళంకము గలుగఁజేయు, ఇంతమాత్రము లింగభేజ్ఞానమె లేకున్న నతం డట్టు గ్రంథము వ్రాయునని కొందఱాక్షేపింతురు, తాళీదళసంపుటములలో నట్లు వ్రాయఁబడియున్నదో తెలియదు. పద్యము నిట్టుమార్చుట శ్రేయము, "క. కరుణ భయానకబీభ। త్సరస

మ్ములు శోకభీత్యు ♦ దారజుగుపాన్," అని. ఇట్లు "సీ॥ కరుణవిద్రుమ వర్ణ ♦ గౌరవచ్ఛలమున" ననువానిని, "కరుణంబు విద్రుమ ♦ గౌర వచ్ఛలమున" అనియు, "యమునియందు దయామ ♦ యత్వంబు ఘటి యించు" ననుదాని "యమునిపైఁ గరుణమ ♦ యత్వంబు ఘటియిం చు" ననియు మార్చినఁ గొంతవఱకు దోషరహితముగ నుండునని వక్కాణించిరి. మఱికొందఱు మహాశయులు, కరుణశబ్దమున కీగ్రంథ మునం గనుపట్టు స్త్రీలింగమును, శోకమునకు బదులుగా నింపుఁ గల దయాశబ్దప్రయోగమును ఇట్లు సవరింపవచ్చును, "కరుణము వీరము భయానకము," అనియు, "కరుణభయానకబీభత్సరసంబులుశోక భీతి ♦ సారజుగుప్స," అనియు, "కరుణంబువిద్రుమ ♦ గౌరవ చ్ఛలమున" అనియుఁ బఠింప వచ్చును. "యమునిపై శోకమ♦య త్వంబు ఘటియించు" నని పఠించి దయా శబ్దమును దొలఁగింప వచ్చును. అని వ్రాసిరి. నాకుందోఁచినదిట్లు. ఈ పొరపాటులు ముద్రణకర్తలవి గాని లేఖకులవి గాని యనుట యుక్తి మంతము గాదు. ఎందేని నొకవిషయమందు ననేకస్థలముల నేకాకారమైన పొరపాటు లేఖకిని గలుగుట స్పష్టము గాదు. కవియును లింగ జ్ఞానము లేనివాఁ డనుట యంగీకార్యము గాదు. మఱి యేమన్నఁ బూ ర్వపండితులు గొందఱు దయావీరకరుణరసముల విషయములో విశేష విచారము చేయక యభిన్నముగా వ్యవహరించిరి. ఎట్లన, అమరుఁడు, నాట్యవర్గములో రసనామములను "శ్లో॥ శృఙ్గారవీరకరుణాద్భుతహాస్య భయానకాః। బీభత్సరౌద్రౌ చరసాః" అని తెలిపి. తల్లక్షణములను శృఙ్గారశ్శుచిరుజ్జ్వలః। ఉత్సాహవర్ధనో వీరః కారుణ్యంకరుణాఘృణా। కృపాదయానుకమ్పాస్యా దనుక్రోశః," అనిశోకస్థాయికమైన కరుణ రసముయొక్క స్వరూపమును నిరూపించునపుడు కేవలదయా పర్యాయ శబ్దములతో నిరూపించుటయు, "శ్లో॥ కథితో వికాసమూల శ్శృఙ్గారో

విస్తారోపధి ర్వీరః। క్షోభోపధిస్తు రౌద్రో బీభత్సః॰ శేషమూ లకః
పూర్వైః। హాస్యాశ్చర్యభయానకదయా వికాసాదిమూలకాః క్రమశః॥
అనియు, “ ఏతన్మూలా హాస్య చిత్రభయానక దయాః క్రమాత్ ” అ
నియు, మఱికొందఱు పూర్వులు కరుణరసస్థానమందు దయాశబ్దమును
బ్రయోగించుటయు లోనగువానిని బట్టి కవి బ్రయోగించినవాఁడేకాని
వేఱు గాదని. ఇంతమాత్రమునఁ గవినింద్యుఁడనియు నాతలఁపుగాదు.
ప్రాచీన నవీన విచారవిశేషములను బ్రాచీన వ్యవహారమునందుఁ గల
లోపమును బాలుర కుపకారార్థము దెలుపుట మాముఖ్యోద్దేశ్యమ
గుటం జేసి యిట్లు విమర్శింపఁబడియె.

స్థాయిభావములు.

క. రతిహాస (శోకయత్న) శుగుత్సాహము
లతిభీతి జుగుప్స రోష ♦ మచ్చెరువు శమం
బతులక్రమమున నివి సాం
ప్రతము రసస్థాయిభావ ♦ భావనఁ జెందుఁ. 7

టీ॥ రతి హాసము శోకము ఉత్సాహము భీతి జుగుప్స రోషము ఆశ్చర్యము శమము ఇవి తొమ్మిది క్రమముగ శృంగారాది నవరసములకు స్థాయిభావంబు లనంబడు నని యర్థము.

§ శ్లో॥ రతిర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా
జుగుప్సా విస్మయ శ్చైవ స్థాయిభావాః ప్రకీర్తితాః॥ అని భరతముని మొదలుగ నలంకార శాస్త్రగ్రంథకర్త లందఱు వీరరసస్థాయిభావముత్సాహమనియే చెప్పియున్నారు. ఆయుత్సాహమునకు మాఱుగానిందు యత్నమని వచింపఁబడినది. ఆయత్నము స్నానభోజన గమనాదులగు సర్వకార్యములయందు సాధారణముగాఁ గలుగు నాత్మధర్మము. అది·

రతిహాసాదులయందును గల్గును గానఁ గొంత ఉత్సాహము యత్నవిశేషరూపముగఁ జెప్పియుండినను యత్నమని చెప్పఁగూడదు. "శ్లో॥ వికారో మానసో భావః" అని యనుటచే భావములన్నియు మనోవృత్తిరూపములే యని రతిహాసశోక మనోవృత్తులనవచ్చునా? అట్లు యత్నమనుటయుఁ బొసఁగదు. "రతిహాసశుగుత్సాహము" లనుట యుక్తముగాఁ దోఁచెడిని.

క. రసములకుఁ దొమ్మిదింటికిఁ
బొసఁగిన యాస్థాయిభావ ♦ ములకు నొనర్తున్
రసికత లక్షణలక్ష్యము
లసదృశ రసశాస్త్రవేత్త ♦ లౌ నౌ ననఁగన్.

టీ॥ రసములకున్...భావములకున్=శృంగారాదినవరసములకు నొప్పిన స్థాయిభావములకు; అసదృశ.. అనఁగన్=సాటిలేనిరసశాస్త్రజ్ఞులు మెచ్చునట్లుగా; రసికతన్=రసికత్వముచేత; లక్షణలక్ష్యములు=లక్షణములను లక్ష్యములను; ఒనర్తున్=రచియింతును.

శృంగారాది నవరసములస్థాయిభావము లగు రత్యాదులకు లక్షణమును లక్ష్యమును రసజ్ఞులు మెచ్చునట్లు చెప్పెద నని తాత్పర్యము.

రతిలక్షణము.

క. తరుణీమణులకు (బురుషుల) దరుణుల
కరయఁగ సంభోగవిషయ ♦ మగునభిలాష
స్ఫురణము మనములఁ బొడమిన
ధరలో నది రతి యనంగ ♦ దగు నెట్లన్నన్.

టీ॥ తరుణీమణులకున్ = యౌవనవతులగు స్త్రీరత్నములకు; పురుషులకున్ = యౌవనవంతులగు పురుషులకనుట, అరయంగన్ = విచారింపంగా, సంభోగ... స్ఫురణము – సంభోగవాంఛయనుట; మనములంబొడమినన్=మనస్సులయందుఁ గలిగినయెడ; ధరలోన్=భూమియందు,అది=అయభిలాషము;రతియనంగన్;తగున్=ఒప్పును.ఎట్లన్నన్.

§ శ్లో॥ యూనోరన్యోన్యవిషయాస్థాయినీచ్ఛా రతిర్భవేత్ " దీనికి యౌవనవంతులైన స్త్రీపురుషులకు నితరేతరులయందుఁ గలుగు స్థాయీచ్ఛావిశేషమె రతియనియర్థము. ఇందువలనఁ దరుణీమణులకుఁ దరుణులకు" ననుటయుక్తంబు

తరుణీతరుణుల కితరేతరాలంబనమగు ప్రేమయనెడు చిత్తవృత్తి రతియని తాత్పర్యముఁ జెప్పుట యుక్తమంబు. ఏలయన, రతియనునది ప్రేమమని ప్రీతియని చెప్పఁబడు నొకచిత్తవృత్తియే, అది గురుదేవతాపుత్రమిత్త్రకలత్రాదివిషయకమైయుండును. దానిం బెద్దలు స్త్రీపుంసుల కన్యోన్యవిషయకమైనపుడు శృంగారస్థాయిగను గురుదేవతాపుత్రాదివిషయకమైనపుడు వ్యభిచారిభావముగను జెప్పుదురు. అట్టి రతి స్థాయిభావం బగునపుడు సంభోగవిషయకేచ్ఛారూపమనియు, పుత్రాదివిషయకమైనపుడు ప్రేమరూపమనియు నొక రతికి రెండు లక్షణములు చెప్పుటకన్న రతియంతయుఁ బ్రేమాఖ్య చిత్తవృత్తిరూపమే యనుట యుక్తంబని నవీనాలంకారికసిద్ధాంతము. సంభోగేచ్ఛారూపము శృంగారస్థాయి రతియనిచెప్పి సంభోగపదమునకు, శ్లో॥ అనుకూలౌ నిషేవేతే యత్రాన్యోన్యం విలాసినౌ । దర్శనస్పర్శనాదీని స సంభోగ ఇతీరితః॥ అని లక్షణాంతరము సేయుప్రయాసకన్న నిదియే యుక్తతమంబు. పై శ్లోకమునకు విలాసవంతులగు తరుణీతరుణులు పరస్పరానుకూల్యము గలవారై యొనరించుదర్శనము స్పర్శనము ఆలాపనము.

ఆలింగనము మొదలగునవి సంభోగ మనఁబడును కాని ఘూష్ట్యాదులు గలయవు డొసరించుదర్శనాదు లట్లు గా వని యాశయము. ఇట్లు రసగంగాధరమున "తత్ర స్త్రీపుంసయోరన్యోన్యాలమ్బనః ప్రేమాఖ్యశ్చిత్తవృత్తివిశేషో రతిః స్థాయిభావః - గురుదేవతాపుత్త్రాద్యాలంబనస్తు వ్యభిచారీ" యని వ్రాయఁబడినది. స్త్రీలకుఁ బురుషులకుఁ బరస్పరాలంబనమై ప్రేమమని చెప్పఁబడుచిత్తవృత్తి విశేషము రతి, అది స్థాయిభావ మగును. గురు దేవతా పుత్త్రాద్యాలంబన మైనరతి వ్యభిచారియగును. అని దీనియర్థము. కావ్యప్రకాశ తాత్పర్యము నింతె. ఈరతి యంకుర పల్లవాద్యవస్థలు గలదయి యుల్లసిల్లు. అందు అంకురావస్థయందుఁ బ్రేమమనునామమును, పల్లవావస్థయందు మానమనుపేరును, కలికావస్థయందు ప్రణయమనునాఖ్యను, పుష్పావస్థయందు స్నేహమను నభిఖ్యను, ఫలావస్థయందు రాగమనునభిధానమును, భోగావస్థయందు అనురాగమను నాహ్వాయమును జెంది తేజరిల్లు. ఈఫలాంతావస్థాపంచకము పూర్వానురాగరూపమగు నభిలాషజన్యవిప్రలంభమునందును, భోగావస్థయనునది సంభోగశృంగారమునందుం జేరియుండును. శ్లో॥ అఙ్కురపల్లవకలికాప్రసూనఫలభోగభాగియం క్రమశః । ప్రేమా మానః ప్రణయస్స్నేహో రాగోఽనురాగశ్చ ॥ ఇయమఙ్కురితా ప్రేమ్ణా మానాత్పల్లవితా భవేత్ । సకోరకా ప్రణయతస్స్నేహాత్కుసుమితా భవేత్ ॥ రాగాత్ఫలవతీ సేయ మనురాగేణభుజ్యతే ॥ ఇత్యాది ప్రమాణము లనువంధించునది. ఇందు రతి, అంకుర పల్లవ కలికా ప్రసూనఫలభోగములను నా అవస్థలనుబొంది, వరుసగ, ప్రేమము మానము ప్రణయము స్నేహము రాగము అనురాగము అనునామములను బొందునని మొదటిదాని కర్థము. ఈరతి, ప్రేమచేత అంకురితము, మానముచేత పల్లవితము, ప్రణయమువలన కోరకితము, స్నేహమునఁ గుసుమిత

ము, రాగమువలన ఫలితమై, అనురాగమువలన భుజింపఁబడు నదియై యమరు నని రెండవదానియర్థము. ఈయంకురిత త్వాద్య వస్థల వలనఁ బూర్వానురాగరూపవిప్రలంభమునందుఁ బదియవస్థలు, కొందఱి మతమునం దఁ బది రెండవస్థలు నుదయించుచున్నవి. శ్లో॥ చక్షుః ప్రీతిః ప్రథమంచిన్తాసజ్గ స్తతోఽథ సంకల్పః। నిద్రాచ్ఛేద స్తనుతా విషయ నివృత్తి స్త్రపానాశః। ఉన్మాదో మూర్ఛామృతి రిత్యేతేస్మరదశాదశైవస్యుః॥ అనునదియు, శ్లో॥ అవస్థా ద్వాదశ మతాః కామశాస్త్రానుసారతః॥ అనునదియు లోనగువానిచే నిది తెలియును. ప్రతాపరుద్రీయములో "కామశాస్త్రానుసారతః" అనుటవలన నలంకారశాస్త్ర సమ్మతములు పదియవస్థలనియే తద్వ్యాఖ్యాత. ఈయవస్థలు విరహప్రవాసాదిజన్యవిప్రలంభాంతరములయందు నుదయించుచున్నను బ్రాచీనులుపూర్వానురాగమందేయుదయించునట్లునుడివిరి. "అయోగో విప్రయోగశ్చ సంభోగశ్చేతి సత్రిధా। తత్రాయోగోఽనురాగేపి నవయోరేకచిత్తయోః॥ పారతన్త్ర్యేణ దైవాద్వా విప్రకర్షాదసజ్గమః। దశావస్థ స్సతత్రాదౌ" అనిదశరూపకము. "సింగభూపాలీయమందును అయోగశృంగార ప్రకరణమునందే" తథాపిప్రాక్తనై రస్య దశావస్థా స్సమానతః। ప్రోక్తా స్తదనురోధేనతాసాం లక్షణముచ్యతే " అని చెప్పఁబడియున్నది. ఈవిషయమై ప్రతాపరుద్రీయ వ్యాఖ్యాత "తత్రశృఙ్గార స్యాఙ్కురితత్వ పల్లవితత్వకోరకితత్వ పుష్పితత్వ ఫలితత్వ హేతవో దశావస్థాభవన్తి" అనుమూలముపై " శృఙ్గార స్యేత్యస్యఅర్థాత్ అయోగశృఙ్గార స్యేత్యర్థః" అని పూర్వానురాగముననే యవస్థాదశకమును వ్రాసెను. ఇట్లితర గ్రంథములయందును జూడవలయు.

రతి కుదాహరణము.

ఉ. చల్లఁదనంబె చంద్రునకుఁ ♦ జక్కఁదనంబె ప్రసూనధన్వికిన్
నల్లలితోరుసౌరభమె ♦ దైతుృన కొక్కని కొక్క మేలిమే

తెల్లము గాక నాపతి యు ♦ దీర్ణగుణాఢ్యుఁడు నారసింహభూ
వల్లభుఁ డట్లు సర్వగుణ ♦ వైభవ మెవ్వరి కైనఁ గల్గునే. 10

టీ॥ చంద్రునకున్ = సుధాంశునకు; చల్లఁదనంబె=చల్లనివాఁడై యుండుటయె. ప్రసూనధన్వికిన్=మన్మథునకు; చక్కఁదనంబె=సౌందర్యమే. చైత్రునకున్=వసంతునకు; సత్...సౌరభమె, సత్=శ్రేష్ఠమైనట్టి, లలిత=మనోజ్ఞమైనట్టి, ఉరు=గొప్పదగు, సౌరభమె=పరిమళమే. ఒక్కనికిన్ ఒక్కకేలిమే=ఒకనికొకయతిశయంబే. తెల్లము గాక=ప్రసిద్ధము కాని. నాపతి=నాభర్తయగు; నారసింహభూవల్లభుఁడు =నరసభూపాలుఁడు; ఉదీర్ణగుణాఢ్యుఁడు = ఉత్కటగుణాభిరాముఁడు. అల్లు=ఆవిధముగ ; సర్వగుణవైభవము=సకలగుణసంపద ; ఎవ్వరికైనన్; కల్గునే=సంభవించునా? కల్గదనుట.

ఇచట నాయిక సేయు నరసభూపాలగుణనుతిచేత నామె కాభూపాలునియందు రతి వ్యజ్యమాన మగుచున్నది గనుక నిది రతి కుదాహరణము.

హా స ల క్ష ణ ము.

క. చేకొని (యక్రూరములగు) యతివికృతములగు
(నాకారవికారచేష్ట ♦ లాలోకింపన్) నాకారాలాపచేష్టి ♦ తాదులు
గైకొనుమనోవికాస [చూడన్
స్వీకారము హాస మయ్యె ♦ విను మెట్లన్నన్. 11

టీ॥ చేకొని=ఆదరించియనుట; అక్రూర...చేష్టలు= భయంకరములుకాకున్న ఆకృతులను వికృతచేష్టలను; ఆలోకింపన్=చూడఁగా; కైకొనుమనో వికాసస్వీకారము=పొందునట్టి వికాసరూపమగు మనో

వృత్తినిస్వీకరించుట; హాసమయ్యెన్=హాసమను స్థాయిభావమాయెను. ఎట్లన్నన్ ; వినుము = ఆకర్ణింపుము.

అప్రకారములగు నాకారవికారచేష్టలు చూచుటచేఁ గలిగెడు మనోవికాసము హాస మనితాత్పర్యము.

§. ఇట నప్రకారము లనుటచే, "సౌమ్యంబులగు నాకారములను చూచినం గలిగెడు హర్షరూప మనోవికాసాదులును హాసములోఁ జేర వచ్చునా?" యని యాశంకదోఁచును. మఱియు వికృతాభాషణము చేతను హాసము చెప్పఁబడియున్నది. అది లేమియన్యూనతయుఁదోఁచును. కావ్యాలంకారచూడామణియందు "క. అతివికృతదర్శనాభా, షితచేష్టా గతులచేతఁ ♦ జేపడుహాస। ప్రతిపాదన మెఱుఁగందగు" ననియున్న ది. ఆరీతినిందు; "క. చేకొని యతి వికృతములగు, నాకారాలాప చేష్టి ♦ తాదులు చూడన్" అనియుండినచో నీదోషంబులు దూరం బులగు నని తోఁచెడిని.

హాసోదాహరణము.

చ. అదె యిదె వచ్చె వచ్చె నర ♦ సాధిపుదాడి య టంచుఁ బాళెము
లైదరి బరీదుఁ డేగునెడఁ ♦ బెంపఱి ఖానులు వెన్క ముందుగాఁ
గదిసి హయాళి నెక్కి హయ ♦ కంధరము ల్పొడగాన కప్పుడే
చదిపిరి వాజివ_స్త్రముల ♦ శత్రు లటంచు భ్రమింతు రెంతయున్.

టీ॥ నరసాధిపుదాడి=నరసభూపాలునిదండయాత్ర ; అదెఇదె వచ్చెన్ వచ్చెన్ అటంచున్=అదిగోఇదిగో వచ్చెనచ్చెననుచు; పాళెముల్=సేనలు; బెదరి=భయపడి; బరీదుఁడు=బరీదుఁడను నొకశత్రు రాజు; ఏగునెడన్=పోవుసమయమున; ఖానులు=తురుష్కులు; పెంపఱి

=గర్వముడిగి; హయాళిన్=గుఱ్ఱములసమూహమును; వెన్క-ముందు గాఁగదిసి=వెనుకటిభాగము ముందగునట్లుగాఁ జేరి; ఎక్కి=ఆరోహించి; హయకంధరముల్=అశ్వములకంఠములను; పొడగానక=చూడక; శత్రులు=ప్రతిపక్షులు; వాజిమస్తములన్=గుఱ్ఱములతలలను; అప్పుడేచదివిరటంచున్=అపుడే త్రుంచిరని; ఎంతయున్=మిక్కిలి; భ్రమింతురు=భ్రమనొందుదురు.

ఇచట ఖానుల యక్రూరచేష్టలఁ జూచువారికి హాసము గలుగునని తాత్పర్యము.

§. ఈయుదాహరణము * "శ్లో॥ దూరాదాకర్ణ్యవిశ్వప్రసృమర మహసో వీరరుద్రస్య జైత్ర ప్రస్థానారమ్భ భేరీనినద మరిన్నృపాః పూర్ణకర్ణజ్వరార్తాః। ఆరుహ్యాద్రీన్ విశన్తో గహన మతిమహాత్కణ్టకాకృష్టకేశా స్త్రాయధ్వమ్మిశ్చతేతి ప్రణిన్నృపతిధియా పాదపాన్ ప్రార్థయన్తే।" అనుప్రత్యపరుద్రీయ భయోదాహరణమునకు, "చ. అనఘన్మసింహ నీయరివ ♦ నావళి కేగి గుహాగ్రసుప్తుఁడై। యని మరలం గలం గని భ ♦ యంపడిపాఱుచు నాజికాదుకా। దనిసతి దెల్పి నందెలియఁ ♦ ఘోర నిషాదులఁ జాపహస్తులం। గని విపినేభపంక్తి గని ♦ క్రమ్మఱ నాజియకాఁ దలంచుచున్." అనునేతద్గ్రంథస్థభయోదాహరణమునకు, భిన్నముగఁదోఁపదు. ఉదాహరణత్రయమందును నాయకప్ర

---

* లోకమంతయు వ్యాపించుచున్నకీర్తిగల ప్రతాపరుద్రునియొక్క జైత్రయాత్రారంభసూచకమగు భేరీధ్వనిని శత్రురాజులు దూరముననుండి విని పూర్ణమగు కర్ణజ్వరముచే బీడితులై పర్వతములనెక్కి యరణ్యముఁజొచ్చుచు మిక్కిలి గొప్పలగు కంటకములచే నాకర్షింపఁబడు కేశములుగలవారై పగతురు తమవెంట్రుకలు పట్టి రను భ్రాంతిచే వృక్షములనుగూర్చి రక్షింపుఁడు వదలుఁడు అని ప్రార్థించుచున్నారని యర్థము.

తాపక్షితులైన ప్రతినాయకవీరుల వ్యత్యస్తచరితంబులు పరిహాస విషయంబగుటయుం డించుకేని భేద మేర్పడదుగదా!

§. కావున † శ్లో॥ బిభ్రాణాః కబరీర్ధృతాఞ్జనదృశః కృత్వాకుచాకృతిమ్మా శ్రీవేషాన్నిశి కాకతీన్ద్రనగరే ప్రచ్ఛన్నరూపాన్నృపాన్ । దృష్ట్వా క్షౌమ మపాస్యవఞ్చసికుచా వాకృష్యనీవీన్స్పృశో హీ హీ స్తమితి త్యజన్తి విపణిశ్రేణీషు ధూర్తావిటాః ॥ అను ప్రతాపరుద్రీయమునందలి హాస్యోదాహరణమువలె భయోదాహరణమునుబోలని. హాస్యోదాహరణ మూహింపవలయు.

శోకలక్షణము.

క. హితజనవిర (హవ్యథచే) హేతులచే
నతిశయమై జనులమానస ♦ సాంభోజమునన్
బ్రతిదినము పొడముదుఃఖం
బతిభూమి వహింప శోక ♦ మగు నెట్లన్నన్. 13

టీ॥ హితజనవిరహవ్యథచేన్=ఇష్టజనవియోగదుఃఖముచేత; అతిశయమై=అధికమై; జనులమానసాంభోజమునన్=జనులకమలమువంటి మనస్సునందు; ప్రతిదినముపొడముదుఃఖంబు=ప్రతిదినముదయించెడు దుఃఖము; అతిభూమివహింపన్=అతిశయముపొందఁగా; శోకమగున్=శోకమనుస్థాయిభావమగును. అదియెట్లన్నన్.

† ప్రతాపరుద్రునినగరమందుఁ గొందఱు శత్రురాజులు కొప్పులుపెట్టుకొని కాటుకధరించి కృత్రిమస్తనములను దాల్చికొని స్త్రీవేషములతోఁ బ్రచ్ఛన్నరూపులై చరించుచుండఁగా విటులు ముసుఁగులు దొలఁగించి స్తనములఁ బట్టుకొని నీవిబంధమును స్పృశించినవారై భయాకులై నవ్వివదలి రని తాత్పర్యము.

ఇష్టజనవిరహాదులవలన నుదయించు దుఃఖము శోకమని తాత్పర్యము.

§. ఇందు "వ్యథచేఁ గలుగుదుఃఖముశోక" మనుట, "పీడాబాధావ్యథాదుఃఖ" మ్మనుకోశముచే, వ్యథాదుఃఖశబ్దములు సమానార్థకములుగావున ననన్వితంబు. మఱియు, "శ్లో॥ ఇష్టజనస్య వినాశాచ్ఛాపాత్ల్కేశాచ్చ బన్ధనా ద్వ్యసనాత్। ఏతై రర్థవిశేషైః కరుణాఖ్యరసస్సముద్భవతి" అనుభరతవచనము ఇష్టజనవినాశము, శాపము, క్లేశము, బంధనము, వ్యసనము లోనగునర్థవిశేషములచేఁ గరుణరస ముద్భవించుచున్నదని చెప్పుచున్నది. కావున నిందు "హితజనవిరహాదులచే" ననుట యుక్తతమము. వెండియు "ప్రతిదినము నతిశయమ్మై యతిభూమి వహింప" ననుటవలన శోకముయొక్క పరమోత్కృష్టదశ బోధింపఁబడుచున్నది. "శోకస్యపరిపోషఃకరుణః" అనురసతరంగిణిమొదలగు గ్రంథములవలన నట్టిపరమోత్కృష్టదశ నొందిన శోకమే కరుణరసమనంబడును. కావున నీశోకలక్షణము కరుణలక్షణమును బోలకుండునట్లు సవరింపఁదగినది. ఇట్లు "పతుల నృసింహశౌర్యశిఖి ♦ పాలుగఁజేసిన," యనుపై శోకోదాహరణమును. * "శ్లో॥ హామాత స్త్వరితా

* హామాత స్త్వరితాసి యనునది, కాలినయింటనుండి మృతిఁ జెందిన తల్లిని గూర్చి యేడ్చుచున్న పౌరాంగనల శోకముఁ జెప్పినది, దీనియర్థము. మాతః=తల్లీ! కుత్ర=ఎచట; త్వరితాసి=త్వరపడిపోయినదానవై తివి? హా=ఖేదము! దేవతాః=వేల్పులారా! కిమిదమ్=ఇదియేమి? హా=ఖేదము! క్వాశిషః-పెద్దలయాశీర్వాదము లెచట? ధిక్ప్రాణాః=ఈపోకచిక్కినప్రాణములు వ్యర్థములు! అశనిః=పిడుగు; పతితః=పడినదిగదా. తే=నీయొక్క; అఙ్గేషు=అవయవములయందు; హుతవహః=అగ్ని వ్యాపించినది. ఇత్థమ్=ఈలాగు; గద్గదమధ్యరుద్ధకరుణాః=గద్గదాయమానములు, దానం జేసి మధ్యకాలమున రుద్ధములు కరుణములు అనఁగా శోకావహములునగు; పౌరాఙ్గనానాం=పురస్త్రీలయొక్క; గిరః=వాక్కులు; కుడ్యే

సి కుత్ర కుమిదం హా దేవతాః క్వాఽఽశిషః ధిక్ప్రాణాః పతితోఽశని
ర్హుతవహ స్తేఽఙ్గేషు దగ్ధేదృశౌ । ఇత్థం గద్గదమధ్యరుద్ధకరుణాః పౌ
రాఙ్గనానాంగిరః కుడ్యస్థానపి రోదయన్తి శతధా కుర్వన్తి భిత్తీరపి ॥
† అపహాయ సకలబాన్ధవచిన్తా ముద్వాస్య గురుజనప్రణయమ్ । హాతన
యవినయశాలిన్ కథమివ పరలోకపథికో భూః॥” అను కావ్యప్రకాశ
రసగంగాధరధృత కరుణరసోదాహరణములకన్న భిన్నముగఁ దోఁపదు.

§. ఇందు మొదటియుదాహరణమున మాతృవియోగదుఃఖిత పౌరాంగనాశోకమునకు, రెండవదానియందు పుత్త్రవియోగదుఃఖిత మాతాపితృదుఃఖమునకు, పతులన్నసింహ యనుదానియందు భర్తృవియోగదుఃఖిత శత్రువనితాదుఃఖమునకు, నేమియుభేదముఁ జెప్పుటకు వలను పడదుగదా ! శ్లో॥ ఇష్టనాశాదనిష్టాప్తే శ్శోకాత్మా కరుణోమతః॥ అను దశరూపకాదిలక్షణమునుబట్టి యిష్టనాశము అనిష్టప్రాప్తి రెండును గరుణమునుగూర్చి హేతువులె గాన ప్రకాశకారా ద్యుదాహరణములయందుఁ గేవలేష్టనాశప్రయుక్తశోకము, పతులయనుదానియందుఁ బతులవియోగదుఃఖ మొకటియే కాక ఆత్మనర్థప్రాప్తిదుఃఖము నధిక

స్థానపి=గోడలయందు వ్రాయఁబడినవారలనైనను ; రోదయన్తి=ఏడ్చునట్లు చేయుచున్నవి. భిత్తీరపి=గోడలనుంగూడ; శతధాకుర్వన్తి = నూఱుబ్రద్దలగునట్లు చేయుచున్నవి. అని

† అపహాయయనునది ప్రమీతపుత్రునిగూర్చి ప్రలాపించువారల విషయమైనది. వినయశాలిన్=వినయవంతుఁడవైన ; తనయ=పుత్త్రుఁడా! సకలబాన్ధవచిన్తామ్=సమస్తబంధుజనచింతను ; అపహాయ=వదలి ; గురుజనప్రణయమ్=పెద్దలైనవారలయందు ప్రీతిని ; ఉద్వాస్య=త్యజించి ; కథమివ=ఏరీతిగా ; పరలోకపథికః=లోకాంతరమును గూర్చి పోవువాఁడవు; అభూః=అయితివి ? హా=కష్టము ! అని యర్థము.

ముఁగఁ గరుణరసహేతువుగా నున్న దన్న భేద మగపడుచున్నది. ఇంత మాత్రమున, శ్లో॥ విరహజ్వరమూర్ఛయా పతన్తీం నయనే నాశ్రుజలేన సిచ్యమానామ్ । సమవేక్ష్య రతిం వినిశ్వసన్తీం కరుణా కుట్మలితా బభూవ శమ్భోః ॥ అనురసతరంగిణీకారధృత శ్లోకోదాహరణమందు విరహజ్వరమూర్ఛచే భూమియందుఁ బడుచున్నదియుఁ గన్నీటిచేఁ దడుపంబడినదియు, వెక్కిళ్ళి యూర్చుచున్నదియు నగురతీ దేవిని జూచి యీశ్వరునకుఁ గరుణ యంకురించె ననుటచే శోకప్రాదుర్భావము చెప్పఁబడు నట్లు, పత్నులయనుదానియందుఁ గాదు గదా! కావున నిది కరుణరసోదాహరణమే యగుఁ గాని శోకోదాహరణము గాఁ జాలదు.

§ క్రింద శ్రీ యుదాహరణమున శత్రువనితలకుఁ బతివియోగ దుఃఖము గలిగి యరణ్యములో నంగలార్చుచుండుతఱి దావానలము చేత నాత్మమరణమును ఘటించిన బ్రహ్మను, వారలు, కరుణాశాలివగు నో బ్రహ్మదేవుఁడా! యిట్లు దుఃఖితలై నమా యెడ నేఁటికిఁ గరుణ వచ్చి మాశోకానల మార్ప నుకట్టితివి గదా! ఇదియె సుదిన మని మరణమునకు సంతసింపక తమమరణమునకు వెఱచి యెంతో దుఃఖమనుభవించుచునైనఁ బతివియోగోత్తరము జీవింప నుత్సహించి బ్రహ్మను నిందింపఁదొడంగుట పతివ్రతాశిరోమణులధర్మము గాదు గదా యని యందురు.

§ ప్రతాపరుద్రీయమునందును, “ఇష్టజనవిరహాదినా ఆత్మని దుఃఖాతిభూమి శ్శోకః” అనులక్షణమును, * “శ్లో॥ ధాతర్నిష్కరు

---

* ధాతర్నిష్కరుణో౽సి యనుదానికర్థము. ధాతః = బ్రహ్మదేవుఁడా! నిష్కరుణో౽సి = దయాహీనుఁడవైతివి. వన్యామ్ = వనమునఁబుట్టిన ; శరీరస్థితిః = శరీర

ణోఽసి శిక్షయసి కిం వన్యాం శరీరస్థితిం తత్తాదృగ్విభవా గృహాః క్వను గతాః స్థానమ్మరుః కల్పితమ్ । హా నాథాః పతితాః ప్రతాప నృపతేః క్రోధార్చిషీతి ద్విషద్యోషాణాం తదనూప మశ్రుభి రహో జాతం స్థల మ్మారవమ్'' అను లక్ష్యమును, కరుణలక్షణతదుదాహరణములకన్న భిన్నములుగాఁ దోఁపవు.

ఇట్లు మఱికొన్ని స్థాయిభావముల లక్షణములు లక్ష్యములు వ్యాకీర్ణములుగా నున్నవి, స్వయ మూహింపఁ దగినయవి.

కావ్యప్రకాశరసగంగాధరములందు రసలక్ష్యములు చెప్పఁబడినవి కాని స్థాయిలక్ష్యములు వేఱుగఁ జెప్పఁబడలేదు. రసతరంగిణీ రసచంద్రికాదులందు రసములకు స్థాయులకు లక్ష్యలక్షణములు వేర్వేఱుగ వ్రాయఁబడియున్నవి. కావ్యాలంకారచూడామణి యనునాంధ్రగ్రంథమునను వేర్వేఱుగ వ్రాయఁబడియున్నవి. ప్రతాపరుద్రీయమందు రతికి

మర్యాదను ; శిక్షయసికిమ్=శిక్షించుచున్నావా యేమి ? తత్తాదృగ్విభవాః=ప్రసిద్ధ వైభవముగల ; గృహాః=గృహములు ; క్వనుగతాః=ఎచటఁబోయినవి ? మరుః=మరుప్రదేశము ; స్థానమ్=నివాసస్థానముగా ; కల్పితమ్=చేయఁబడినది. నాథాః=పతులారా ! ప్రతాపనృపతేః=ప్రతాపరుద్రునియొక్క ; క్రోధార్చిషి=క్రోధజ్వాలయందు ; పతితాః=పడినవారై తిరిగరా ! హా=కష్టము ! ఇతి=ఇటని ; ద్విషద్యోషాణామ్=శత్రురాజ స్త్రీలయొక్క ; అశ్రుభిః=కన్నీళ్ళచేత ; మారవమ్=మరుసంబంధియగు ; తత్ స్థలమ్=ఆప్రదేశము ; అనూపమ్=జలప్రాయభూమిగా ; కల్పితమ్=చేయఁబడినది. అని.

శృంగారమునకు మాత్రము, * "శ్లో॥ శృఙ్గారైకరసః స్మరోఽస్తు జగదానన్దైకనిష్యన్దభూ రిన్దు స్తిష్ఠతు విభ్రమైకవసతి ర్జాగర్తు పుష్పాకరః। సన్త్వన్యేపిగుణప్రసాదితదృశః కింతై రశేషోన్నతో జాతః కాకతివల్లభో మమపతిః కామస్యకామోత్సవః॥" † "శ్లో॥ రహఃప్రత్యాసన్నే హృదయదయితే రుద్రనృపతౌ నిష్క్రాన్తా మానాజ్ఞా విరళమపి లజ్జావిలసితమ్। కిమన్యత్తే గోప్యం బహిరబహి రానన్దమసృణః స్మరావేశః కోపి ప్రియసఖి నృపేణైకయతి మామ్" అని వేర్వేఱుగ నుదాహరణములు వ్రాయఁబడియె.

---

* శృంగారైకరసః=శృంగార ప్రధానుఁడగు; స్మరః=మదనుఁడు; అస్తు=ఉండుఁగాక. జగదానన్దైక నిష్యన్దభూః = లోకానందమునకు ముఖ్యమగు నుత్పత్తిస్థానమైన; ఇందుః=చంద్రుఁడు; తిష్ఠతు=ఉండుఁగాక. పుష్పాకరః=కుసుమాకరమగువసంతము; జాగర్తు=ప్రకాశించుఁగాక. గుణప్రసాదితదృశః=గుణములచేతఁ బ్రసన్నములుగాఁ జేయఁబడిన పరుల దృష్టులుగల; ప్రసాధితదిశః అను పాఠమందు, అలంకరింపఁబడిన దిక్కులుగల; అన్యేపి=మఱికొందఱును; సన్తు=ఉందురుగాక. కింతైః=ఒక్కొక గుణముగలవారలచేత నేమిప్రయోజనము? అశేషోన్నతః=సర్వగుణములచే నధికుఁడును; కామస్యకామోత్సవః=కామునకుఁగామోత్సవప్రాయుఁడునగు; కాకతివల్లభః=ప్రతాపరుద్రుఁడు; మమ=నాకు; పతిః=భర్త; జాతః=అయినవాఁడు అనియర్థము.

† ప్రియసఖి = చెచ్చెలీ! హృదయదయితే = ప్రాణవల్లభుఁడగు; రుద్రనృపతౌ = ప్రతాపరుద్రుఁడు; రహః = ఏకాంతమందు; ప్రత్యాసన్నే=సమీపించినవాఁడగుచుండఁగా; మానాజ్ఞా=మానముయొక్క యాటంకము; నిష్క్రాన్తా=తొలఁగినది. లజ్జావిలసితమపి=లజ్జాప్రకాశము గూడ; విరళమ్=అల్పమైనది. తే=నీకు; అన్యత్=మఱియొకటి; గోప్యమ్=దాఁపఁదగినది. కిమ్=ఏమికలదు? బహిరబహిః=శరీర బహిర్భాగమందు నంతర్భాగమందును; ఆనన్దమసృణః=ఆనందసాంద్రమగు; కోపిస్మరావేశః=చెప్పనలవిగాని కామావేశము; నృపేణ=ప్రతాపరుద్రునితోడ; మామ్=నన్ను; ఏకయతి=ఒకటిగాఁజేయుచున్నది అనియర్థము.

§. ఇట్లు నరసభూపాలీయమందును రతికిశృంగారమునకుమాత్రము

చ. చల్లదనంబె చంద్రునకుఁ ♦ జక్కఁదనంబె ప్రసూనధన్వికిన్ । సల్లలితోరుసౌరభమె ♦ చైత్రున కొక్కని కొక్కమేలిమే। తెల్లముగాక నాపతి యు ♦ దీర్ణగుణాఢ్యుఁడు నారసింహభూ । వల్లభుఁ డట్లు సర్వగుణ♦ వైభవ మెవ్వరికైనఁ గల్గునే ॥ మ. మరుఁ డాచార్యుఁడుగా విశీర్ణకబరీ♦ మాల్యాళి పుష్పాంజలి। స్ఫురణల్ గాఁ దదుపేత భృంగనినద♦ స్తోమంబు గానంబుగా। వరమంజీరరవంబు తాళగతిగా♦ వర్ధిల్లుశాతోదరీ। సురతవ్యత్యయ వేగతాండవ మొన♦ ర్చుం జింతితాభీష్టముల్ ॥ అని వేర్వేఱుగ వ్రాయఁబడినవిగాని యట్టితరరసస్థాయులకు వ్రాయఁబఁడవయ్యె. వ్రాయఁబడిన స్థాయ్యుదాహరణములైన రసోదాహరణములను బోలకుండునటులు వ్రాయఁబడినవికావు. రసతరంగిణ్యాదులయందు వ్రాసినలక్ష్యలక్షణభేదవిమర్శ మిచ్చట సవిస్తరముగ వ్రాయునెడ గ్రంథవిస్తరమగుననియు, కల్లెని నిందలిలక్ష్యలక్షణ దోషము తొలఁగింపనలవి గా దనియు విరమించితి.

శోకోదాహరణము.

చ. పతుల నృసింహశౌర్యశిఖి♦ పాలుగఁ జేసినయట్టిపాపపు
న్సతధృతి కంతటం జలము ♦ జాఱదు మమ్మును దావపావక
ప్రితతులపాలు చేసె నని ♦ పల్మఱు రోదన మందువిద్విష
త్సతులకు బాష్పపూరములె ♦ చాలు వనానలముల్ హరింపఁగన్.

టీ॥ పతులన్=తమభర్తలను; నృసింహ...పాలుగన్-నృసింహ=నరసభూపాలునియొక్క, శౌర్యశిఖి=పరితాపమనునగ్నికి, పాలుగన్=అధీనమగునట్లు; చేసిన...శతధృతికిన్ = కావించిన పాపాత్ముండగు బ్రహ్మకు; అంతటన్=అంతమాత్రమున; చలముజాఱదు=వైరముడుగ

డు. మన్నును : దావ...పాలు= దావాగ్ని సమూహములకధీనము ; చేసెన్ = ఒనరించెను. అని ; పల్మఱున్ = మాటిమాటికి ; రోదన... సతులకున్ = రోదనముచేయుశత్రుభార్యలకు; బాష్పపూరములె = కన్నీటి వఱదలె ; వనానలమున్ = దావాగ్నిని ; హరింపఁగన్ = ఆర్పుటకు ; చాలున్ = పర్యాప్తములు.

ఇందు శత్రువనితలకుఁ బ్రియవియోగముచేత దుఃఖోదయమ యినట్లు చెప్పినందున నిది శోకోదాహరణమగునని తాత్పర్యము. ఏత దుదాహరణ సామంజస్యా సామంజస్యములనుగూర్చి వెనుకఁ జర్చించితిమి.

ఉత్సాహలక్షణము.

క. అత్యున్నతలోకోత్తర
కృత్యంబులు సేయ వేఁడి ♦ కృతకృత్యు లిలన్
నిత్యము దలఁచుప్రయత్నం
బత్యంతోత్సాహ మయ్యె ♦ నది యొట్లన్నన్. 15

టీ॥ ఇలన్ = భూమియందు ; కృతకృత్యులు = కృతార్థులు; అత్యున్నత...కృత్యంబులు = మిక్కిలిగొప్పలగు లోకోత్తరకార్యములను ; చేయన్ = చేయుటకు ; వేఁడి = కోరి ; నిత్యము = ఎల్లప్పుడు ; తలఁచు ప్రయత్నంబు = చింతించుయత్నము ; అత్యంతోత్సాహము = మిక్కిలి యుత్సాహమనునది ; అయ్యెన్. అది యెట్లన్నన్.

లోకోత్తరకార్యముల నుద్దేశించి చేయుస్థిర తరప్రయత్న ము త్సాహ మని తాత్పర్యము.

ఇందు లోకోత్తరకార్యము లనఁగ దానదయాయుద్ధము లని యు, దానింబట్టి వీరరసము దానవీరము, దయావీరము, యుద్ధవీరము,

అని ముక్తైలంగు లనియు, ప్రాచీనాలంకారికులు వ్రాసిరి. నవీనాలంకారికు లగు రసగంగాధరకారాదులు దానదయా యుద్ధములవలెె సత్యము క్షమ బలము పాండిత్యము మొదలగునవియు ననేకలోకోత్తర కార్యములు సంభవించుచున్నవి గాన శృంగార రసమునకువలె వీరరసమునకు ననేక భేదములు గలుగుచున్నవి యని వ్రాసిరి. శృంగారమున కనేకభేదములైనందున గణింప శక్యముగామి నేకభేదమే చెప్పినయట్లు వీరమును నొకవిధమే యనుట యుక్తమని తద్గ్రంథాశయము. నాకు నిదియే యుక్తముగఁ దోఁచుచున్నది.

ఉత్సాహోదాహరణము.

మ అసిఁ జెండాడి విపక్షవృక్షముల శౌ ♦ ర్యాగ్నిచ్ఛటం బేల్చి శ
స్త్రసరత్సీరములన్ రణోర్వితలమున్ ♦ సంక్షుణ్ణముం జేసి వై
ర్యసృగార్ద్రం బొనరించి ప్రోది గొన కు ♦ ద్యత్కీర్తిసస్యౌఘము
ల్వెస సిద్ధించున యంచుఁ బల్కు నరసా ♦ ర్వీనాథుయోధావళుల్.

టీ॥ నరస...ఆవళుల్=నరసభూపాలుని భటులసమూహములు; విపక్షవృక్షములన్ = శత్రువులనువృక్షములను; అసిన్ = ఖడ్గముచేత; చెండాడి=ఖండించి; శౌర్యాగ్నిచ్ఛటన్=ప్రతాపమను నగ్నిసమూహముచేత; పేల్చి=కాల్చి; శస్త్రసరత్సీరములన్—శస్త్ర = బాణములనెడు, సరత్=ప్రసరించుచున్న, సీరములన్ = నాఁగేళ్ళచేత; రణోర్వితలమున్=యుద్ధభూమిప్రదేశమును; సంక్షుణ్ణమున్=మెదిగినదానిఁగా; చేసి=ఒనరించి; వైర్యసృగార్ద్రంబున్=శత్రువులయొక్క రక్తముచేఁదడిసినదానిఁగా; ఒనరించి=చేసి; ప్రోదిగొనక = పెంపుఁబొందకున్నయెడ; ఉద్యత్కీర్తిసస్యౌఘముల్=ప్రకాశించుచున్న కీర్తియనెడు పైరులగుంపు

క్త—సమూహములు ; వెసఁ సిద్ధించునె = వేగముగసిద్ధించునా ! అం చున్=ఇటనుచు ; పల్కెన్.

ఇచట నరసభూపాలభటులకు యుద్ధమునలోకోత్తరకార్యము నందు స్థిరప్రయత్నము చెప్పఁబడినదిగాన నుత్సాహమున కుదాహరణ మగునని తాత్పర్యము.

దానవీరుఁడు దధీచి, దయావీరుఁడు శిబిచక్రవర్తి, యుద్ధవీరుఁడు హమ్మీరుఁడు, సత్యవీరుఁడు హరిశ్చంద్రుఁడు, ఇత్యాదు లూహించునది. " శ్లో॥ దధీచి ర్దానవీరోఽభూ ద్దయావీర శ్శిబిర్నృపః । హమ్మీరో యుద్ధవీరోఽభూ న్నిదర్శన మమీత్రయః॥ " అని ప్రబోధచంద్రిక యందుఁ గలదు.

భయమునకు లక్షణము.

క. క్రూరాకా (రము చూచిన) రాదికమున
నారయ (నే) (గా జనునిహృదయ ♦ మందు ననర్థాం
కూరాశంకన మగు నది
ధారుణిలో భయ మనంగఁ ♦ దగు నెట్లన్నన్. 17

టీ॥ క్రూరాకారము = భయంకరాకృతిని ; చూచినన్ = చూచుటవలన ; ఆరయన్=విచారింపఁగా ; ఏజనునిహృదయమందున్=ఏ నరునిమనస్సునందు ; అనర్థాంకూరాశంకనము—మరణాద్యనర్థకార్యములయొక్క శంకయనుట; అగున్=అగునో; అది—ఆయనర్థాశంకనము నుట; ధారుణిలోన్=భూమియందు ; భయమనంగఁదగున్ = భయమను స్థాయి భావమనఁనొప్పును. ఎట్లన్నన్.

సంచారిభావములలో నుండుత్రాసమునకు, స్థాయిభావముల లో నుండుభయమునకు, "దరత్రాసౌభీతిర్భీస్సాధ్వసంభయ" మ్మను కోశమునందుఁ బర్యాయత చూపట్టిన నిందింతియె భేదము. వ్యాఘ్రాదిదర్శనమువలన నుదయించుమరణాది పరమానర్థాశంక భయము. తదితరభయ హేతువులవలన నుదయించు మరణాదివ్యతిరిక్త సాధారణానర్థాశంక త్రాసము. ఇట్లు రసగంగాధరమున, "వ్యాఘ్రదర్శనాదిజన్మాపరమానర్థవిషయకో వైక్లబ్యాఖ్యస్సభయమ్ ॥ పరమానర్థవిషయకత్వాభావేతు సఏవ వ్యభిచారీ" అనియున్నది.

§. "శ్లో॥ దూరాదాకర్ణ్య విశ్వప్రస్యమరమహాసః" అను పూర్వోదాహృతప్రతాపరుద్రీయభయోదాహరణపద్యమునందుఁ గ్రూరశబ్దశ్రవణము చేత భయము చెప్పఁబడినదిగాన నిందు "క్రూరాకారాదికము ననారయు" ననుట యుక్తమనితోఁచెడి. వెండియుఁ బ్రాణిమాత్రసాధారణంబగుభయమిందు "నేజనుని" యని జనునియందు మాత్రము వ్రాయఁబడినది. కావ్యాలంకార చూడామణియందు "అది, నియతంబగుచుండుఁ బ్రాణి ♦ నికరంబులకుఁ" అని ప్రాణిమాత్రమునకుఁ జెప్పఁబడినదె కాని యిట్లులేదు. మఱియునేజనునియనుచోటి యచ్ఛబ్దమునకు నుత్తరవాక్యమునందుఁ దచ్ఛబ్ద ప్రయోగము లేమి "శ్లో॥ మీలితంయదభిరామతాముఖే సాధుచన్ద్రమసిపుష్కరైః కృత" మ్మనుపద్యమునఁ గావ్యప్రకాశమునందుఁ జెప్పఁబడిన సాకాంక్షత్వదోషముదుర్నివారము, అది యనునది యనర్థాశంకను బోధింపవలెనుగావునఁ బూర్వోక్తాకాంక్షను బూరింపఁజాలదు. క్రూరదర్శనాదిజన్యమగు ననర్థాశంక భయమనియె లక్షణముండఁగ నేజనునియనుట యవ్యావర్తకవిశేషణమనియుఁ దెలియవలయు,

§. కొందఱీ సాకాంక్షత్వదోషమును బరిహరించుటకై -క. క్రూ రాకారముఁజూచిన నారయఁగా జనునిహృదయ॰ మం॰ను ననిమార్పు చేయవచ్చుననిరి. క్రూరాకారము చూడఁగా జనునిహృదయమం దనర్థా శంకయగునని తాత్పర్య పర్యవసాన మగుచున్నది. కొందఱికి వ్యాఘ్రాది క్రూరాకారములు చూడఁగా ననర్థాశంక లేమియుఁగలదు. కావ్యప్రకాశమున "వ్యాఘ్రాదయో విభావా భయానకస్యేవ వీరా ద్భుతరౌద్రాణామ్" అనఁగా వ్యాఘ్రాదిక్రూరాకారసత్వములు భయా నకరసమున కగునట్లుగానే,వీరాద్భుతరౌద్రరసములకుఁ గూడ విభావము లగును. వ్యాఘ్రమును జూచినపుడు సామాన్యజనునకు భయముగలిగి నయట్లు, వీరునకు పరాక్రమముచే నుత్సాహము, అన్యునకుఁ గుతూల ముచే నాశ్చర్యము, మఱియొకనికి మత్సరముచేక్రోధము కలుగునని భావము. కావునఁ గ్రూరాకారముచూచిన జనునిహృదయమం దనర్థా శంకని మగునని సామాన్యముగఁ జెప్పఁగూడదు. ఏజనునిహృదయ మం దనర్థాశంకన మగునో యనుటయే మేలుగాని పై సాకాంక్షత్వదో షము. బాధించు. అయినను అదియనుతచ్ఛబ్దముచేయుచ్ఛబ్దాకాంక్ష కా వచ్చునుగావున, క్రూరాకారాదికము చూచుటమొదలగు వానివలన జనుని హృదయమం దేయనర్థాశంక కలుగునో అదిభయమగునని యర్థ మేర్పడుటవలన, సంభవమాత్రాభిప్రాయమున, నుక్తదోషము ప్రస రింపదనియంద్రు.

ఈభయము స్వనిష్ఠము పరనిష్ఠమని రెండు తెఱంగులు, అందుస్వ నిష్ఠములగు నపరాధాదులవలన నుదయించునది స్వనిష్ఠము. పరనిష్ఠము లగు క్రూరధ్వనులు క్రూరాకారములు మొదలగు వానివలనఁ గలుగు నది పరనిష్ఠమని తెలియునది,

భయోదాహరణము.

చ. అనఘ నృసింహ నీయరి వనావళి కేఁగి గుహాగ్రసుప్తుఁడై
యని మరలం గలం గని భయంపడి పాఱుచు నాజి కాదు కా
దని సతి దెల్పినం దెలియఁ డౌర నిషాదులఁ జాపహస్తులం
గని విపినేభపంక్తిఁ గని క్రమ్మఱ నాజియ కాఁ దలంచుచున్. 18

టీ॥ అనఘ = అకలంకుఁడా! నృసింహ = నరసభూపాలుఁడా! నీయరి=నీశత్రువు; వనావళికిన్=అరణ్యసమూహమునకు; ఏఁగి=పోయి; గుహాగ్రసుప్తుఁడై = గుహయొక్క ముందటిభాగమున నిద్రించినవాఁడయి; కలన్=స్వప్నమందు; మరలన్; అనిన్=యుద్ధమును; కని = చూచి; భయంపడి=భీతుఁడయి; పాఱుచున్=పరుగిడుచు; సతి=భార్య; ఆజి కాదుకాదని తెల్పినన్=యుద్ధముకాదు కాదు పరుగెత్తకుమని తెలియఁ జేసినను; చాపహస్తులన్=ధనుస్సుచేతులంగల; నిషాదులన్=బోయలను; కని=చూచి; విపినేభపంక్తిన్=అడివియేనుఁగుల సమూహమును; కని=చూచి; క్రమ్మఱన్=మరలను; ఆజియ కాఁ దలంచుచున్=యుద్ధమని యెతలంచుచు; తెలియఁడు=నిజము తెలిసికొనఁజాలఁడు. ఔర—ఆశ్చర్యము!

ఇందు క్రూరాకారములగు యుద్ధములను జూచుటచే శత్రువు హృదయమందు మరణరూపానర్థశంక జనియించినది కావున భయమున కుదాహరణమని తాత్పర్యము.

§ "ఒకరిభయ మింకొకరికి హాసము పుట్టించుటయుం గలదు గావున భయోదాహరణములయందు హాసము తోఁపకుండుట మేలు" అని కొందఱి లేఖమునుబట్టి చూడఁగా నిందు వ్యత్యస్తరిపు చరితము

చేత హాసోదయ మగుటంజేసి యిది భయమునకు మేలైన యుదాహరణము గాదని యేర్పడును.

జు గు ప్సా ల క్ష ణ ము.

క. పలలాస్థిశోణితాదులఁ
బలుమాఱును జూడ నరుచి ♦ భావము లోనం
దళుకొత్తు నిగర్హణ మది
తలపోయ జుగుప్స యనఁగఁ ♦ దగు నెట్లన్నన్. 19

టీ॥ పలలాస్థిశోణితాదులన్=మాంసము ఎముక రక్తము మొదలగువానిని; పలుమాఱును = మాటిమాటికిని; చూడన్ = అవలోకింపఁగా; అరుచిన్ = అసహ్యతచేత; భావములోనన్=హృదయమందు; తళుకొత్తునిగర్హణము=ఉదయించునింద యేదికలదో; అది = ఆనింద; తలపోయన్ = విచారింపఁగ; జుగుప్సయనఁగఁదగున్ = జుగుప్సయను స్థాయిభావమగును. ఎట్లన్నన్.

అహృద్యపదార్థదర్శనముననే కాక శ్రవణముననను జుగుప్స గ్రంథాంతరమునఁ జెప్పఁబడినది కావున మాంసశోణితాదిదర్శనాదులచేనుదయించు నేవగింత జుగుప్స యని తాత్పర్య మనవలయు.

§ మాంసాదులు చూచిన నరుచి కొందఱికిఁ దోఁపదుగానఁ బురీషాద్యసహ్యవస్తుదర్శనముచేత నుదయించుగర్హణమే జుగుప్స యనఁ దగునందురు. ఇందుఁ బ్రతాపరుద్రీయ సింగభూపాలీయ లక్షణములు, "అర్థానాం దోషదర్శనాదిభి ర్గర్హణాజుగుప్సా॥ అహృద్యానాంపదార్థానాం దర్శనశ్రవణాదిభిః । సంకోచనం యన్మనసస్సాజుగుప్సాప్రకీర్తితా" అనునవి. దోషముగనిపించుట లోనగుదానిచే వస్తువులగర్హణ, అనఁగా

ఏవగింత జుగుప్స; మనోహరములు కాని పదార్థములఁ జూచుట వినుట మొదలగువానిచేఁ గలుగుమనస్సంకోచము జుగుప్సయనఁబడినది. అని వీనియర్థము. * శ్లో॥ ఉత్కృత్యోత్కృత్య కృత్తిం ప్రథమ మథ పృథూత్సేధభూయాంసి మాంసా న్యంసస్ఫిక్పృష్ఠపీఠా ద్యవయవసులభా న్యుగ్రపూతీనిజగ్ధ్వా। ఆత్తస్నాయ్వాన్త్రనేత్రః ప్రకటితదశనః ప్రేతరఙ్కః కరఙ్కా దఙ్కస్థా దస్థిసంస్థం స్థపుటగతమపి క్రవ్యమవ్యగ్ర మత్తి॥ † అంహశ్శ్లేషైరివ పరివృతో మక్షికామణ్డలీభిః పూయక్లిన్నవ్రణ మభిమృశ

---

* ఉత్కృత్యోత్కృత్య అనుదానికి ఇట్లు అర్థము. ప్రేతరఙ్కః=కృపణమయినపిశాచము; ప్రథమమ్=మొదట; కృత్తిమ్=చర్మమును; ఉత్కృత్య ఉత్కృత్య=ఒలిచియొలిచి; అథ=పిమ్మట, పృథూత్సేధభూయాంసి=గొప్పదేహపుష్టిచే మిక్కిలి ప్రచురములయినవియు; ఉగ్రపూతీని= అధికదుర్గంధముగలవియు; అంస... సులభాని, అంస=మూఁపులును, స్ఫిక్=కటిప్రదేశములును, పృష్ఠపీఠ=వీఁపును ఆది=మొదలుగాఁగల, అవయవ=అవయవములయందు, సులభాని=అధికముగానుండుటచేసులువుగాఁ బొందఁదగినవియునగు, మాంసాని=మాంసములను; జగ్ధ్వా=భక్షించి; ఆత్తస్నాయ్వాన్త్రనేత్రః= గ్రహింపఁబడినవసయును నాడులును కన్నులును గలదై, ఆభాగములందలి మాంసమును భక్షించినదై యనుట; అఙ్కస్థాత్ = సమీపమునందున్న; కరఙ్కాత్= మాంసములేని యస్థిపంజరమునుండి; అస్థిసంస్థమ్=ఎముకలయందున్నదియు; స్థపుటగతమపి=విషమప్రదేశమునందున్నదియునైనను; క్రవ్యమ్=మాంసమును; ప్రకటితదశనః=విషమప్రదేశగతమయిన మాంసమును గ్రహించుటకై వెల్లడిచేయఁబడిన దంతములు గలదై; అవ్యగ్రమ్= సావధానముగా; అత్తి=భక్షించుచున్నదని.

† అంహశ్శ్లేషైరివ = పాపలేశములచేతంబోలె; మక్షికామణ్డలీభిః=మక్షికా పుంజములచేత; పరివృతః=చుట్టఁబడినవాఁడును; పూయక్లిన్నవ్రణమ్- పూయ=చీము చేత, క్లిన్న=తడుపఁబడిన, వ్రణమ్= పుండును; వాససః=గుడ్డయొక్క; ఖణ్డకేన=తునుకచేత; అభిమృశన్=స్పృశించుచున్నవాఁడును; దద్రురోగీ=దద్రురోగము

న్యాపసరి ఖణ్డకేన। రథ్యాప్రాన్తే విరచితఘృణం సంకుచన్నేత్రకోణం ఛన్నఘ్రాణం త్వరయతి జనం దద్రురోగీ దరిద్రః॥" అను కావ్య ప్రకాశరసార్ణవ సుధాకరోదాహరణములు మొదలగునవి సర్వసాధారణములుగఁ దోఁచుచున్నవి. ఇందు పూతిగంధి మాంసాదనాదులచేతను, మక్షికావ్యతిపూయక్లిన్న వ్రణాభిమర్శనాదులచేతను సకల సహృదయులకు సమముగ జుగుప్స తోఁచుచున్నది గావున నిట్టివి యుదాహర్యంబులనితదాశయము.

భయమువలె నిదియు స్వనిష్ఠము పరనిష్ఠము అని రెండుభేదములు గలదిగాఁ దెలియునది.

జుగుప్సోదాహరణము.

చ. తలలు సరోజము ల్మెదడు ♦ తండము క్రొన్నురు వంత్రజాలముల్
జలఘను లస్థిఖండములు ♦ శంఖములై తగు నెత్రు టేర్లలోఁ
గలభకపాలనౌచయము ♦ గ్రక్కున నెక్కి చరించు సంగర
స్థలుల నృసింహనిర్దళిత ♦ శత్రువసారసమత్తభూతముల్. 20

టీ॥ నృసింహ...భూతముల్, నృసింహనిర్దళితశత్రు=నరస భూపాలునిచే ఖండింపఁబడిన శత్రువులయొక్క, వసా= క్రొవ్వుయొక్క, రస=రసముచేత, మత్త=మదించినట్టి, భూతముల్=పిశాచములు; సంగరస్థలులన్=యుద్ధభూములయందు; తలలు=శత్రుశిరస్సులు; సరోజముల్=పద్మములును; మెదడు తండము=క్రొవ్వుయొక్క సమూహము;

గలవాఁడునగు; దరిద్రః=దీనుఁడు; రథ్యాప్రాన్తే=రాజవీథిచెంతను; విరచితఘృణమ్=చేయఁబడిన దయగలుగునట్లుగా; సంకుచన్నేత్రకోణమ్=మూయఁబడిన నేత్రాంతములుగలుగునట్లుగా; ఛన్నఘ్రాణమ్=ఆచ్ఛాదింపఁబడిన నాసికగలుగునట్లుగా; జనమ్= వీథిలోఁబోవుజనమును; త్వరయతి= త్వరగఁబోవునట్లు చేయుచున్నాఁడు.

క్రొన్నురువు=క్రొత్తనురుఁగును; అంత్రజాలముల్=ప్రేగులగుంపులు; జలఘనములు=నీరుపాములును; అస్థిఖండములు=ఎముకలతునుకలు; శంఖములు=శంఖములును; ఐ; తగునెత్తు టేఱ్ఱలో౯=ఒప్పునట్టిరక్తనదులలో; కలభ...చయము=ఏనుఁగుపుత్తెలనెడు పడవలగుంపులను; గ్రక్కున౯=శీఘ్రముగా; ఎక్కి; చరించు౯=తిరుగును.

ఇందు వర్ణింపఁబడిన మాంసాస్థిమజ్జాదులు గర్హాస్పదములుగాన నిది జుగుప్సోదాహరణమని తాత్పర్యము.

క్రో ధ ల క్ష ణ ము.

క. అపకారకారు లగునరు
లపరాధ మొనర్ప (నే)ఁ గా మ ♦ హామహానిమనం
బు పరిజ్వలితం బగు నది
యపరిమితక్రోధ మయ్యె ♦ నది యెట్లన్న౯.

టీ॥ అపకార...నరులు = అపకారముచేయునట్టి మనుష్యులు, శత్రులనుట; అపరాధమొనర్ప౯=అపరాధముసేయఁగా; ఏమహామహానిమనంబు=ఏమహాత్ముని మనస్సు; పరిజ్వలితంబగు౯=జ్వలియించునో; అది—ఆజ్వలనమనియాశయము; అపరిమితక్రోధము=అపరిమితమయిన క్రోధమనుస్థాయిభావము; అయ్యె౯. అదియెట్లన్న౯.

శత్రువు లపచారముచేసినచో నుదయించు మనః ప్రజ్వలనము క్రోధమని తాత్పర్యము. "శత్రుకృ తాపచారేణ మనః ప్రజ్వలనం క్రోధః" అని ప్రతాపరుద్రీయము.

§ ఇం దపరిమితపదమనర్థకము. మఱియును, "సర్వనామ్నా ముత్సర్గతః ప్రధానపరామర్శకత్వ" మ్మనున్యాయముచేత అది

యనుతచ్ఛబ్దము పరిజ్వలిత మగుమనస్సునే పరామర్శించుఁ గాని మనోగతజ్వలనమును బరామర్శింపదుగాన నిది దోషము. ఏమహామహునియనుచోటి యచ్ఛబ్దమున కుత్తరవాక్యమున నామహామహుని యని తచ్ఛబ్దప్రయోగము లేనందున భయలక్షణములోఁ జెప్పిన సాకాంక్షత్వదోషము దుర్నివారము. కొందఱు క. అపకారకారులగునరు । లపరాధముసర్పఁగా మ ♦ హామహుని యనుమార్ప్వ నవలంబించి యీసాకాంక్షత్వదోషమును దొలంగించిరి. మఱియు, యథాశ్రుతపాఠమున, యచ్ఛబ్దగృహీతం బగుమనస్సునే తచ్ఛబ్దము పరామర్శించుటంజేసి, మనఃపరిజ్వలనము క్రోధము అనువివక్షితార్థము సంభవింపదు. ఉక్తరీతిని యచ్ఛబ్దనిర్బంధము లేమిచే, తచ్ఛబ్దము మనఃపరిజ్వలనమును బరామర్శింపఁజాలుటవలన నాదోషముం బరిహృతమగు ననియు వచించిరి. తన్మతము నాకు సమ్మతమైనదియె.

క్రోధోదాహరణము.

చ. స్థిరభుజవిక్రమక్రమనృ ♦ సింహ నృసింహ భవత్కరాగ్రభీ
కరకరవాలసిద్ధుఁ డతి ♦ గాఢయశోరససిద్ధిఁ గోరి బం
ధురహయసింధురావళుల ♦ తోఁ రణదుర్గ కనర్గళోన్నతి
న్నరబలి వెట్టు దుర్మదన ♦ నాథరిపుక్షితినాథయూథముల్. 22

టీ॥ స్థిర...సింహ=స్థిరమగు భుజపరాక్రమమందు నృసింహస్వామితుల్యుఁడవగు; నృసింహ=నరసభూపాలుఁడా! భవత్...సిద్ధుఁడు=నీయొక్క కరాగ్రమునందుండు భయంకరమగుఖడ్గ మనుసిద్ధ పురుషుఁడు; అతి...సిద్ధిన్=మిక్కిలిగాఢమగు యశస్సనురససిద్ధిని; కోరి; రణదుర్గకున్=రణకాళికి; బంధుర...ఆవళులతోన్=దట్టములగు అశ్వములయొక్కయు గజములయొక్కయు సంఘములతో; దుర్మద...

యూథాన్=చెడుకావరముతోఁగూడిన శత్రురాజులగుంపును; అనర్గళోన్నత్యా=అడ్డములేనియౌన్నత్యముచేత ; నరబలీన్=నరబలినిగా ; పెట్టున్=ఇచ్చును.

ఇందు మదించిన శత్రురాజులను బలిపెట్టుననుటవలన వారు చేసిన యపరాధమునకు మనస్సు జ్వలించినట్లు తోఁచునుగానఁ గ్రోధోదాహరణ మగునని తాత్పర్యము.

§ ఈక్రోధలక్షణమునకు నీయుదాహరణము సరిగాఁ దోఁపదు. ఏలయన, ఇందు "యశోరససిద్ధిఁగోరి" యనుటవలన "యశస్సేవిజిగీషూణా" మ్మనులక్ష్యమందువలె వీరస్థాయియగు నుత్సాహమే ప్రధానముగ నున్నదిగాని శత్రుకృతాపచారముచేతఁ గలుగునునని ప్రజ్వలనరూప క్రోధము ప్రధానముకాదు, * "శ్లో॥ రేరేసేవణ కస్తవాయ మనిదంపూర్వోఽద్యగర్వోమహా నుత్తీర్ణాకిల యేన గౌతమనదీ ప్రాప్తోఽసిమృత్యోర్ముఖమ్ । ఏషా కాకతివీరరుద్ర ఇతి కిం నాశ్రావి సప్తాక్షరీ ప్రత్యుభ్యత్ప్రతిపక్షపార్థివమహాభూతగ్రహోచ్చాటనీ" అనుప్రతాపరు

* రేరేసేవణ=ఓరోరి సేవణుఁడా! సేవణుఁ డనఁగఁ బ్రతాపరుద్రునిశత్రువు గోదావరియావల నుండువాఁడు; తవ=నీకు; అనిదంపూర్వః=క్రొత్తదైన; మహాన్=గొప్పదైన; అయంగర్వః=ఈగర్వము; అద్య=ఇపుడు; కః=ఎచ్చటిది? యేన=ఏగర్వముచేత; గౌతమ నదీ=గోదావరి; ఉత్తీర్ణాకిల=దాఁటఁబడినదో. మృత్యోః=మృత్యువుయొక్క; ముఖమ్=వక్త్రమును; ప్రాప్తోసి=పొందినవాఁడవైతివి. ప్రత్యుభ్యత్ప్రతిపక్షపార్థివమహాభూతగ్రహోచ్చాటనీ, ప్రత్యుభ్యత్=గర్వించుచున్న, ప్రతిపక్షపార్థివ=శత్రురాజులనెడు, మహాత్=అధికమగు, భూతగ్రహ=భూతములకు గ్రహములకు, ఉచ్చాటనీ=నివారకమగు; కాకతివీరరుద్రఇతి=కాకతివీరరుద్రుఁడని; ఏషాసప్తాక్షరీ = ఈసప్తాక్షరమంత్రము ; కింనాశ్రావి=వినఁబడలేదాయేమి? అని యర్థము.

ద్వితీయోదాహరణము, † "శ్లో॥ కృతమనుమతం దృష్టం వాయైరిదంగురుపాతకం మనుజపశుభి ర్నిర్మర్యాదై ర్భవద్భి రుదాయుధైః। నరకరిపుణా సార్ధం తేషాం సభీమకిరీటినా మయమహ మసృఙ్మేదోమాంసైః కరోమి దిశాంబలిమ్॥" అనుకావ్యప్రకాశోదాహరణము యుక్తరూపముగ నున్నవి.

ఇందు మొదటిదానియందు గోదావరీతరణరూపము, శత్రుకృతాపచారము, దానివలనఁ దదీయభటులకు మనఃప్రజ్వలనము స్పష్ట మగుచున్నది. యశోఁ సస్సిద్ధిఁ గోరి యనుటచే శత్రుకృతాపచారము లేనట్లు స్పష్ట మగుచున్నది గాన నయ్యుదాహరణ మిట్టిది కాదు. రెండవదానియందును శత్రుకృతాపచారము అందువలన నశ్వత్థామ మనఃప్రజ్వలనము స్పష్టము. ప్రస్తుతోదాహరణ మిట్లుండు నెడనుదాహరణతాసంత్తి గలుగును.

---

† కృత మనుమత మనునది ద్రోణాచార్యమరణోత్తర మశ్వత్థామవాక్యము; ఇదమ్గురుపాతకమ్ = ఈగురువ్యాపాదనరూప పాతకము, లేదా, యీమహాపాతకము; మనుజపశుభిః = వివేకశూన్యులగు; యైః = ఏధృష్టద్యుమ్నాదులచేత, సన్న్యస్తశస్త్రుండగు నాచార్యుని వధించుటచే మనుజపశుతాసమర్థనము; కృతమ్ = చేయఁబడినదో. నిర్మర్యాదైః = అతిక్రాంతధర్మసేతువులగు; యైః = ఏనరకరిపువు మొదలగువారలచేత; అనుమతమ్ = సమ్మతింపఁబడినదో; ఉదాయుధైః = గొప్పయాయుధములుగల; యైః భవద్భిః = ఏమీచేత; దృష్టమ్ వా = చూడఁబడినదో, ఉదాయుధులయ్యు నట్టిదురాత్ము లగుధృష్టద్యుమ్నాదుల వారింపక చూచుచుండుట యపరాధమని యెఱుఁగవలయు. సభీమకిరీటినామ్ = భీమార్జునులతోఁగూడిన; తేషామ్ = వారలయొక్క; అసృఙ్మేదోమాంసైః = నెత్తురు మెదడు మాంసములచేతను; దిశామ్ = దిక్కులకు; బలిమ్ = బలిని; అయమహామ్ = ఈనేను; కరోమి = చేయుచున్నాను. అని యర్థము.

విస్మయలక్షణము.

క. వివిధాపూర్వము లగువ
స్తువులు గనుంగొనినయెడల ♦ సుజనునిమది (లో) కిం
దవిలిన (ప్రమోదవిస్తర) విస్తారంబది
(మ) యు విరళవిస్మయమనంగ ♦ నగు నెట్లన్నన్.

టీ॥ వివిధ... యెడలన్=నానావిధలోకోత్తర వస్తువులఁజూచిన చో; సుజనునిమదిలోన్=సహృదయునిచిత్తమునందు; తవిలినప్రమోదవిస్తరము=ఉదయించినసంతోషాతిశయము; అవిరళవిస్మయమనంగన్=దట్టమైనవిస్మయమనుస్థాయిభావమనఁగ; అగున్=ఒప్పును. ఎట్లన్నన్.

"అపూర్వదర్శనాచ్చిత్తవిస్తారో విస్మయోమతః" అనుప్రతాపరుద్రీయముచొప్పున నపూర్వవస్తుదర్శనాదులవలనఁ గలుగుచిత్తవిస్తారము విస్మయ మని తాత్పర్యము.

§ చిత్తవిస్తర మనుదానికిఁ బ్రమోదవిస్తరమనుట సమార్థకముగాదు. మనస్సులోఁగలుగుప్రమోదవిస్తరము హర్షరూపసంచారియగును గాని యాశ్చర్యరూపవిస్మయములోఁ జేరదు. ఆశ్చర్యము చిత్తవిస్తరరూపము గావున దానికి హర్షమునకుఁ గలభేదము స్పష్టమగుటచే వేఱువ్రాయ నక్కఱలేదు. మఱియు "విస్తారో విగ్రహోవ్యాసస్సతు శబ్దస్యవిస్తరః" అనుకోశముచేత శబ్దప్రపంచమునందు విస్తరమనియు, తదితరవిషయమందు విస్తార మనియుఁ బ్రయోగింప వలసినదిగా నుండఁగా, నిందుశబ్దేతరప్రపంచమునందు విస్తార మని ప్రయోగింపక వి

స్తర మని ప్రయోగించుట చింత్యము. ప్రతాపరుద్రీయమున "చిత్త విస్తారోవిస్మయో మతః" అనియే యున్నది.

§ కొందఱు "తవిలినవిస్తారం బది యవిరళవిస్మయ మనంగ నగునెట్లన్నన్" అని పఠించిన నన్నియాక్షేపములు దొలంగుననిరి. ఈ మార్పునందు "మదిలోఁదవిలినవిస్తారం బది" యనిపాఠముండునుగదా. మదిలో భయక్రోధోత్సాహాద్యనేకభావముల సంకోచవిస్తారములు గలుగుట సహజమైనందున, నీపక్షమున, మదిలోఁ దవిలినవిస్తార మెద్ది యని నిర్ణయింప వచ్చును. కావున నీమార్పు చాలదు. "మదికిం దవిలిన విస్తారం బది" యనియు నింకఁ గొంతమార్చినచో మదియొక్క విస్తారమని యర్థపర్యవసానమైనందున "చిత్తవిస్తారో విస్మయో మతః" అనులక్షణమున కనుసారియై యిది యొప్పు ననఁ దగు.

ఈవిస్మయమును స్వనిష్ఠవిభావజన్యమగునప్పుడు స్వనిష్ఠమనియు, పరనిష్ఠవిభావజన్య మయినప్పుడు పరనిష్ఠమనియు రెండు తెఱంగులు.

విస్మయోదాహరణము.

చ. ధరణి నృసింహభూవరుప్ర ♦ తాపమహాతప మబ్జజాండక
ర్పరములునిండి తీవ్రగతిఁ ♦ బర్వ నఖర్వసగర్వవైరిభూ
వరులు పడంక సాగుదు ర ♦ వార్యనవవ్యజనాతపత్రవై
ఖరులు దొలంగఁ జేయుదురు ♦ కన్నులఁ జీఁకటి గప్పుచుండఁగన్.

టీ॥ ధరణిన్=భూమియందు ; నృసింహ...ఆతపము=నరసభూపాలునియొక్క ప్రతాపమనెడు గొప్పయెండ; అబ్జజాండ కర్పరములు=బ్రహ్మాండములనెడుచిప్పలు ; నిండి ; తీవ్రగతిన్=తీక్ష్ణవిధముచేత ; పర్వన్=వ్యాపించుచుండ ; అఖర్వ...వరులు=అధికులై గర్వముతోఁ

గూడుకొన్న శత్రుభూపాలురు ; వడంకసాగుదురు. అవార్య...వైఖరులు, అవార్య=నివారింపశక్యముగానట్టి, నవ=నూతనమయినట్టి, వ్యజన=సురటీలయొక్కయు, ఆతపత్ర=గొడుగులయొక్కయు, వైఖరులు=రీతులను; కన్నులన్ = నేత్రములయందు; చీఁకటిగప్పుచుండఁగన్=అంధకారమావరించుచుండఁగా; తొలంగన్=తొలఁగునట్లు; చేయుదురు.

ఇందు నరసభూపాలప్రతాపాతపకృత లోకోత్తరచర్యవలన శత్రువులకు చిత్తవిస్తారరూపమగు నాశ్చర్య ముదయించినట్లు చెప్పినందున విస్మయోదాహరణ మని తాత్పర్యము.

శ మ ల క్ష ణ ము.

క. నిరుపమవైరాగ్యాదుల
కిరవై నిశ్చలత పూని ♦ హృదయము దిరమై
నరులకుఁ బరిణతిఁ జెందిన
ధరలో నది శమ మనంగఁ ♦ దగు నెట్లన్నన్. 25

టీ॥ నరులకున్ = మనుష్యులకు; నిరుపమవైరాగ్యాదులకున్= అసదృశములైన వైరాగ్యము మొదలగువానికి; ఇరవై=ఆశ్రయమై; నిశ్చలత=చాంచల్య రహితత్వమును; పూని=వహించి; మనము=మనస్సు; తిరమై=ఏకాగ్రమై; పరిణతిన్=పరిపాకమును; చెందినన్=పొందినయెడ; ధరలోన్=భూమియందు; అది=ఆపరిణామము; శమము నంగన్=శమమనుస్థాయిభావమనఁగా; తగున్=ఒప్పును. ఎట్లన్నన్.

వైరాగ్యాదులచే కామాదివికారము లుడిగియుంట శమమని తాత్పర్యము. "వైరాగ్యాదినా నిర్వికారచిత్తత్వంశమః" అని ప్రతాపరుద్రీయలక్షణము.

శమోదాహరణము.

సీ. ఘోరభవాదిదుఃఖములఁ ♦ గుందఁగ నీక నృసింహుఁ డౌర దు
ర్వారఫలప్రదం బగువి ♦ రక్తిసుఖం బొనరించె నంచు నీ
వైరులు మౌనులై విపిన ♦ వాటిని నీవ గురుండ వంచు నీ
పేరిటి యక్షరంబులె జ ♦ పింతురు శ్రీనరసింహభూవరా. 26

టీ॥ శ్రీనరసింహభూవరా = సంపదతోఁగూడిన నరసభూపాలుఁ డా! నీవైరులు=నీశత్రువులు; ఘోరభవాదిదుఃఖములన్ = భయంకరములగు సంసారాదిదుఃఖములచేత; కుందఁగనీక=దుఃఖపడనీయక; నృసింహుఁడు=నరసభూపాలుఁడు; ఔర=ఆశ్చర్యము! దుర్వార...సుఖంబు=అనివార్యమగు మోక్షఫలమునిచ్చు వైరాగ్యసుఖమును; ఒనరించెనంచున్=చేసెననుచు; మౌనులై=తాపసులై; విపినవాటిని=అరణ్యప్రదేశమునందు; నీవగురుండవంచున్=నీవెగురువనుచు; నీపేరిటియక్షరంబులె=నీనామాక్షరములనె; జపింతురు=జపముసేయుదురు.

ఇచట నరసభూపాలుని శత్రువులు దారపుత్త్రాదులను వదలి యరణ్యముఁ జెందిరని విరక్తిని వర్ణించినందున శమమున కుదాహరణ మని తాత్పర్యము.

§ శత్రురాజులు సంసారపరిత్యాగముఁ జేసి వనవాసముఁ జేయుట వాస్తవవిరాగమునఁగాక నరసభూపాలునివలనఁ బ్రాణాపాయము లేకుండుటకై యని స్పష్టమగుట వలనను, శత్రువగున్నృసింహునందు భక్తి యనుచితమగుటవలనను, శమమునకుఁదగినట్టి * " శ్లో॥ అహౌవా హారేవా కుసుమశయనేవా దృషదివా మణౌవా లోష్టేవా

* శివశివశివేతి=శివశివశివయని; ప్రలపతః=మిక్కిలిపఠించునట్టియు; అహౌవా=సర్పమందైనను; హారేవా=పుష్పాదిహారమందునైనను; కుసుమశయనేవా=పుష్ప

బలవతి రిపౌ వా సుహృది వా। తృణే వా స్త్రైణే వా మమ సమదృశో యాన్తు దివసాః క్వచిత్పుణ్యే ఽరణ్యే శివశివశివేతి ప్రలపతః" ఇత్యాదు లుదాహార్యములు. దీనియందు "కదా వారాణస్యా మమర తటినీరోధసి వసన్, ప్రాప్తాశ్శ్రియస్సకలకామదుహా స్తతః కిమ్" ఇత్యాదులయందువలె సముచిత వాస్తవవిరాగముచేత నిర్వికారచిత్తత స్పష్టముగ నగపడుచున్నది గదా!

§ ఇచ్చటఁ గొందఱు "శత్రురాజవిరాగము కపటికో వాస్తవ విరాగముగానే పరిణమించినదని కవిహృదయముగాఁ గొనఁదగుననిరి. అందుకు నాముక్తమాల్యదలోని ఖాండిక్యకేశిధ్వజోపాఖ్యానము నిదర్శనముగా నుదాహరించిరి. ఎట్లైన నిది యుదాహరణార్హంబు గాఁ జాలదు. ఏమనిన, ఈపద్యమున శత్రురాజులు రాజ్యము వదలి యరణ్యావాసముఁ జేసి నరసింహునియందుభక్తి గలిగి యాతనినామమంత్రమును జపించుచున్నారని కదా చెప్పఁబడియున్నది. వైరియైన నృసింహునందా రాజులకు భక్తిభావముగలుగుట యనుచితంబు గావున నిదియాభాసం బగును. ఇట్లు కువలయానందమందు రసవదాద్యలంకారఘట్ట

లపాన్వనందైనను; దృషదివా = పాషాణమందైనను; మణౌవా - మణియందైనను; లోష్టేవా=మృత్పిండమందయినను; బలవతిరిపౌవా = బలవంతుఁడైనశత్రువునందయినను; సుహృదివా=మిత్రునందయినను; తృణేవా=కసవునందయినను; స్త్రైణేవా=స్త్రీసమూహమందయినను; సమదృశః=సమదృష్టిగలిగినట్టి; మమ=నాకు; క్వచిత్పుణ్యేరణ్యే=ఒకానొకపుణ్యారణ్యమున; దివసాః=దినములు; యాన్తు=కడచుఁగాక.

మున నూర్జస్విదలంకారమునకు * శ్లో॥ త్వయి లోచనగోచరం గతే సఫలం జన్మ నృసింహభూపతే। అజనిష్ట మమేతి సాదరం యుధి విజ్ఞాపయతి ద్విషాం గణః॥ ” అనునది యుదాహరణమిచ్చి “అత్ర కవేః ప్రభువిషయస్య రతిభావస్య తద్విషయ ద్విషద్గణ రతిరూపో భావాభాసోఙ్గమ్ ” అనియు, తద్వ్యాఖ్యయగు చంద్రికయందు “ అత్ర శత్రువిషయకత్వరూపానౌచిత్యేన ప్రవర్తితత్వాద్భావ స్యాభాసత్వమ్ ” అనియు, వ్రాయఁబడినది. ఇదియుక్తంబె “అనౌచిత్యాదృతేనాన్య ద్రసభఙ్గస్య కారణమ్। ప్రసిద్ధౌచిత్యబన్ధస్తు రసస్యోపనిషత్పరా” అనునభియుక్తోక్తివలన శత్రువిషయక రతిభావ మనుచితమైనందున నాభాస మగుట కేమి సందియము? కావున నిది యుదాహరణార్హంబుగాదని నాయెన్నిక.

§ అట్లు “బహునాయక విషయాయాం మునిగురుపత్నీగతాయాంచ। ఉపనాయకవిషయాయాం రతౌ తథా నుభయనిష్ఠాయామ్॥” ఇత్యాదులచే తారావిషయక శశాంకరతి, అహల్యావిషయక సురపతిరతి లోనగువానికిఁ బ్రసక్తించినయాభాసత పురాణేతిహాసాదులయందు తత్తదుపాఖ్యానంబు లుండుటం జేసి తొలంగదు. రతి బహుపురుష విషయకమయినను, ఋషి గురుపత్నీ ప్రభృతి పూజ్యస్త్రీ విషయకమయినను,

---

* త్వయిలోచనగోచరమ్మను దానికి—నృసింహభూపతే = నరసింహరాజా! త్వయి=నీవు; లోచనగోచరమ్=నేత్రవిషయమగుటను; గతే=పొందినవాఁడవుకాఁగా; మమ=నాయొక్క; జన్మ=పుట్టువు; సఫలమ్=ఫలముతోఁగూడినది; అజనిష్ట=అయ్యెను. ఇతి=అని; ద్విషాంగణః=శత్రువులసమూహము; యుధి=యుద్ధమునందు; సాదరమ్=ఆదరముతోఁగూడినట్లుగా; విజ్ఞాపయతి=నీతో విన్నవించుచున్నది. అని యర్థము.

ఉపపతి విషయక మయినను, స్త్రీపురుషులలో నొకరికి మాత్రమె కలిగి మఱియొకరికి లేకున్నను, ఆభాసమగునని పై శ్లోకమున కర్థము. లోకమున ననేకప్రకారము లగుప్రవృత్తు లుండుటయు నవి పురాణేతిహాసాదులయందుఁ దెలుపఁబడి యుండుటయుఁ గనియే ఇది గ్రాహ్య మిది యగ్రాహ్య మని శాస్త్రకారులు వ్యవస్థ చేసిరి. ఆది కావ్య రత్నంబై సకల శ్లాఘ్యతముంబైన శ్రీమద్రామాయణమందుఁ జెప్పిన సీతావిషయకమైన రావణరతి యనుభయనిష్ఠరతి యైనందున దానికి సంభవించిన యాభాసత కవిమహిమంబునఁగాని కావ్యమహిమంబునఁగాని తొలంగి యదిరసముగఁబరిణమించునా? రసగంగాధరమందు రసాభాసప్రకరణమున విప్రలంభాభాసమున కుదాహరణముగా,

* "శ్లో॥ వ్యత్యస్తం లపతి క్షణంక్షణ మథో మౌనం సమాలమ్బతే సర్వస్మిన్విదధాతి కించ విషయే దృష్టింనిరాలమ్బనామ్। శ్వాసందీర్ఘ మురీకరోతి న మనాగఙ్గేషు ధత్తే ధృతిం వైదేహీ కమనీయతాకబలితో హాహన్త లఙ్కేశ్వరః" అనుదాని వ్రాసి "అత్ర సీతా విషయే యం లఙ్కేశ్వరగతా విప్రలమ్భరతి రనుభయనిష్ఠతయా జగద్గురుపత్నీ విషయకతయా చాభాసతాం గతా" అని వ్రాసిరి. కావున ననుభయ

---

* రసగంగాధరోదాహరణశ్లోకమున కర్థము. వైదేహీకమనీయ తాకబలితః= సీతా సౌందర్యగ్రస్తుఁడగు, తత్సౌందర్యముచేఁ బరవశుఁడగునను; లఙ్కేశ్వరః= రావణుఁడు; క్షణమ్=కొంచెము సేపు; వ్యత్యస్తమ్=తాఱుమాఱుగా; లపతి=పలుకు చుండును అథో=అంత; క్షణమ్=కొంత కాలము; మౌనమ్=మాటాడకుండుటను; సమాలమ్బతే=అవలంబించును. కించ=మఱియు; సర్వస్మిన్ విషయే=సమస్తమయిన విషయమందును; నిరాలమ్బనామ్=లక్ష్యశూన్యమయిన; దృష్టిమ్=చూపును; విదధాతి=ఉంచును. దీర్ఘంశ్వాసమ్=నిట్టూర్పును; ఉరీకరోతి=అధికము చేయును. అఙ్గేషు=అవయవములందు; మనాక్=కొంచెమయినను; ధృతిమ్=ప్రీతిని; నధత్తే= ధరింపఁడు. హాహన్త=కష్టము.

నిష్ఠరత్యాదులాభాసములను నాక్షేపమువచ్చినప్పుడు రామాయణాదుల యందున్న సీతావిషయకరావణరత్యాదు లుదాహరణముగాఁ జెప్పుట యుత్తరము గానట్లు శత్రువిషయకరతి యాభాస మనుదానికి నాముక్త మాల్యదలోని ఖాండిక్య కేశిధ్వజోపాఖ్యాన ముత్తరముకాదు. కావున నిది యాభాసము కాక మానదు. భావోదాహరణ ప్రసంగమునందు భావాభాసము నుదాహరించుట యుచితముకాదని వేఱుగా విస్తరించి వక్కాణింపవలసినది లేదుగదా!

స్థాయిభావ కారణనిరూపణము.

క. ఈరసముల కుత్పాదన
కారణము విభావ మనఁగఁ ♦ గల దది ద్వివిధం
బై రంజిలు నాలంబన
మానయు నుద్దీపనంబు ♦ ననఁ (గ ధరిత్రిన్) గారతికిన్. 27

టీ॥ ఈరసములకున్ —ఈస్థాయిభావములకనుట; "రసముల కుఁ దొమ్మిదింటికిఁ, బొసఁగిన యీస్థాయిభావ ♦ మునకు నొనర్తు"నని స్థాయిలక్ష్యలక్షణముల నుపక్రమించినందునను, రసము నిత్యము గావునఁ దత్కారణనిరూపణము సంభవింపమివలనను, నిట్లు తాత్పర్యమూహించునది. ఉత్పాదనకారణము=ఉత్పత్తి హేతువగుకారణము; విభావ మనఁగన్; కలదు. అది=ఆవిభావము; అరయన్=విచారింపఁగా; ఆలంబనంబు=ఆలంబన విభావము; ఉద్దీపనంబు=ఉద్దీపనవిభావము; అనఁగన్; ద్వివిధంబై=రెండుతెఱంగులై; ధరిత్రిన్=భూమియందు; రంజిలున్=ప్రకాశించును.

రత్యాదిస్థాయి భావముల కుత్పాదన కారణము విభావమనఁబడు. అది యాలంబన మనియు నుద్దీపనమనియు రెండువిధము లగునని తాత్పర్యము.

§ ఆంధ్రగ్రంథములందు స్వర్గపాతాళలోకవ్యావృత్తికో, లేక పద్యకుత్పత్తిపూర్తికో, లేక కవితాసామగ్రీదారి ద్య్రమునమో, ధరణీధారుణీయిల ధరిత్రి మొదలగుశబ్దములు ప్రయోగించుట వాడుకగ నున్నను, "శ్లో॥ కారణా న్యథ కార్యాణి సహకారీణి యానిచ। రత్యాదేః స్థాయినో లోకే తానిచే న్నాట్యకావ్యయోః। విభావా అనుభావాశ్చకథ్యన్తే వ్యభిచారిణః॥" అనుకావ్యప్రకాశమువలనను, "విగలితదుష్యన్తరమణీత్వాదిభి రలౌకికవిభావాదిశబ్దవ్యపదేశైః శకున్తలాదిభి రాలమ్బనకారణైః శ్చన్ద్రికాదిభిరుద్దీపనకారణైః రశ్రుపాతాదిభిః కార్యైశ్చిన్తాదిభి స్సహకారిభిశ్చ" అనురసగంగాధరమువలనను, రత్యాదిస్థాయికారణకార్య సహకారులకుఁ గావ్యనాట్యములయందే విభావాను భావవ్యభిచారినామము లగుఁగాని లోకసాధారణముగఁ గలుగ వని యేర్పడుచున్నందున నీపద్యమునందు "ధరిత్రికిన్" అనిప్రయోగించుట యుక్తంబుగాదని తోఁచుచున్నది. కావున నేతద్దోషనివారణార్థము నుత్తరపద్యార్థసాంగత్యము కొఱకును "అనఁగా రతికిన్" అని సవరింపవలెను. యథాశ్రుతపాఠముచే నుత్తరపద్యమునందు వనితాపతులు రత్యాదులు తొమ్మిదింటికి నాలంబన విభావములగునని విపరీతార్థము తోఁచును.

విభావస్వరూప నిరూపణము.

క. వనితయుఁ (బతియును) బురుషుఁడు నాలం
బనమగు నుద్దీపనంబు ♦ ప్రాయంబును సా

మ్మును జేష్టయు మదనాదులు
నన(దగు నేర్పఱతు వీని ♦ కగులక్ష్యంబుల్. 28

టీ॥ వనితయు(బతియును—స్త్రీపురుషు లిరువురును ; ఆలంబన
మగుట, శృంగారస్థాయి యగురతి కాలంబన మగునని తాత్పర్యము.

§ ఇందు(బతిశబ్దము పురుషబోధకముగా(బ్రయోగింప(
బడినది. ఇది కోశాదిప్రమాణములచే భర్తృబోధక మగు(గాని
పురుషబోధకము గాదు. అట్లు భర్తృబోధక మయినపుడు నిరూప
కాంశమునందు నిత్యసాకాంక్ష మగు. వనితాశబ్దము తదాకాంక్షా
శామకంబుగాదు. మఱియేమన్న, పిత్రాదిశబ్దంబులు పుత్రాదిశబ్దంబు
లతో(బోలె(బత్యాదిశబ్దమ్ములు పత్న్యాది శబ్దంబులతోనే నిరాకాం
క్షంబులగు(, గావున, “ వనితయు(బురుషు(డు నాలంబన” మనుట
యుక్తము.

ప్రాయంబును=ఆయాలంబనముయొక్క- యౌవనమును; సొమ్ము
ను=ఆభరణమును; చేష్టయుట = వ్యాపారమును, మదనాదులును=కా
మాదులును; అనట్=అన(గా; ఉద్దీపనంబు=ఉద్దీపన విభావము;తగుట్=
ఒప్పును. వీనికగులక్ష్యంబుల్=ఈవిభావములకు యుక్తంబులగు నుదా
హరణంబులను; ఏర్పఱతుట్=వివరింతును.

స్త్రీ పురుషులు, రత్యాలంబనములు, ఆయాలంబనముల యౌ
వనాభరణ వ్యాపారములును మదనాదులు నుద్దీపనవిభావంబు లగు నని
తాత్పర్యము.

ఇందునకు(బ్రమాణము, “ శ్లో॥ విభావరీ కథ్యతే తత్ర రసో
త్పాదనకారణమ్। ఆలమ్బనోద్దీపనాత్మా స ద్వేధా పరికీర్తితః॥ ఆలమ్బ

నగుణా శ్చైవ తచ్చేష్టా తదలంకృతిః। తటస్థ శ్చేతి విజ్ఞేయ శ్చతుర్ధోద్దీపనక్రమః। ఆలమ్బనగుణో రూపయౌవనాది రుదాహృతః। తచ్చేష్టా యౌవనోద్భూతహావభావాదికా మతా। నూపురాఙ్గదహారాది తద లంకరణ మ్మతమ్। మలయానిలచన్ద్రాద్యా స్తటస్థాః పరికీర్తితాః॥" అని ప్రతాపరుద్రీయము. వీనియర్థము. పైఁజెప్పినవిభావానుభావసాత్త్విక వ్యభిచారులలోఁ రసోత్పాదన కారణ మగునది విభావమనఁబడును. అది యాలంబనము ఉద్దీపనము అని రెండు తెఱంగులుగాఁ జెప్పఁబడినది. ఆలంబనగుణము, తచ్చేష్ట, తదలంకృతి, తటస్థము, అనియుద్దీపనవిభావము నాలుగువిధములగును. అం దాలంబనగుణము రూపయౌవనాదికము. యౌవనమువలనుదయించినహావభావాదు లాలంబనచేష్టలు. నూపురము అంగదము హారము మొదలగునవి యాలంబనాలంకారములు. మలయానిలచంద్రాదులు తటస్థములు. అని.

§ ఇందు మలయానిలచంద్రాదు లుద్దీపనకారణములని చెప్పఁబడియుండఁగా మదనాదులని యీగ్రంథమునందు వ్రాయఁబడినది. శృంగారస్థాయి యగురతికిఁ గామాదు లుద్దీపకము లని దీనియర్థ మగుచున్నది. ఇది సకలాలంకారిక సరణికి దూరముగ నున్నది. ఏలాగనిన, "ఋతుమాల్యాలఙ్కారైః ప్రియజనగాన్ధర్వ కావ్యసేవాభిః। ఉపవనగమనవిహారై శ్శృఙ్గారరస స్సముద్భవతి॥" అని నాట్యశాస్త్రమందు భరతముని "శ్లో॥ తత్ప్రబోధాయ మాల్యర్తుచన్దనే న్దూదయాదయః। ఉద్దీపనవిభావా స్తే నతై స్స్మరతిగచ్ఛతి. మాల్యవస్త్ర విభూషణాదయో మాల్యాదయః। ఋతువయోమదాదయో ఋత్వాదయః। చన్దనస్నానభూపాదయ శ్చన్దనాదయః। చన్ద్రోదయో ఘనధ్వని రుపకారస్మరణ మిత్యాద్యా శ్చన్ద్రోదయాదయః" అని సరస్వతీ కంఠాభరణ

ముదు భోజనరేంద్రుండు " ఉద్దీపనవిభావా స్తే రస ముద్దీపయ న్తియే। ఆలమ్బనస్య చేష్టాద్యా దేశకాలాదయ స్తథా। చేష్టాద్యా ఇత్యాదిశబ్దా ద్రూపభూషణాదయః కాలాదీత్యాదిశబ్దాత్ చన్ద్రచన్దన కోకిలాలాపభ్రమర ఝఙ్కారాదయః " అని సాహిత్యదర్పణమందు విశ్వనాథపంచానన భట్టాచార్యుండును, " తటస్థా శ్చన్ద్రికా ధారాగృహా చన్ద్రోదయా వపి। కోకిలాలాపమాకన్ద మన్దమారుతషట్పదాః। లతామణ్డపభూ గేహదీర్ఘికాజలదారవాః। ప్రాసాదగర్భసంగీత క్రీడాద్రి సరిదాదయః। ఏవ మూహ్యా యథాకామ ముపభోగోపయోగినః " అని రసార్ణవసుధాకరమందు సింగభూపాలుండును నిరూపించిరి. ఇట్లితరసకలాలంకారగ్రంథములయందు నుద్దీపనవిభావములు చెప్పఁబడినవి. ఒకండైన మదనాదులు రత్యుద్దీపకములని చెప్పినవాఁడు కాఁడు. కావున మదనాదులనుట సకలగ్రంథవిరుద్ధంబైనది, " ఏవ మూహ్యా యథాకామ ముపభోగోపయోగినః" అనుటవలన భోగోపయోగిగానిదాని కుద్దీపనవిభావత గలుగదనుట సువ్యక్తంబు.

§ మఱియు రత్యుద్దీపకములగు మలయానిలచంద్రాదులు కామోద్దీపకములుగా సకలకవివరులు వర్ణించియున్నారు. ఎట్లన, * "శ్లో॥ అఙ్కురితః పల్లవితః కోరకితః పుష్పితశ్చ సహకారః। అఙ్కురితః పల్లవితః కోరకితః పుష్పితశ్చ హృదిమదనః॥" అని ధ్వన్యాలోకము "శ్లో॥ † ఈషదఙ్కురిత విభ్రమచారా దేహపల్లవితకాన్తి నితన్వ్యాః। యౌ

---

* తియ్యమామిడి యంకురితత్వాదులను బొందఁగా దానిననుసరించి మన్మథుఁడు యువజనహృదయమునందు క్రమక్రమముగా నభివృద్ధిఁబొందెనని భావము.

† తన్వ్యాః=స్త్రీయొక్క; యౌవనే=జవ్వనము; ఈషదఙ్కురితవిభ్రమచారా=కొంచెమంకురించిన విలాసములుగలదియగుటచేసుందరమును; దేహపల్లవితకా

వసే ముకులిత స్తనమాత్రే పుష్పితశ్చ ఫలితశ్చ మనోభూః" అని ప్రతాపరుద్రీయము, ‡ "శ్లో॥ రమ్యం హర్మ్యతలం నవా స్సునయనా గుఞ్జద్ద్విరేఫా లతాః ప్రోన్మీలన్నవమల్లికా సురభయో వాతా స్సచన్ద్రాః క్షపాః। య ద్యేతాని జయన్తి హన్త పరితః శ్శస్త్రాణ్యమోఘాని మే తద్భోః కీదృ గసౌ వివేకవిభవః కీదృక్ప్రబోధోదయః" అని ప్రబోధ చంద్రోదయము, $ "శ్లో॥ఇద మసులభవస్తుప్రార్థనాదుర్నివారం ప్రథమమపి మనో మే పఞ్చబాణః క్షిణోతి। కిముత మలయవాతో న్మా

స్తిని=దేహమునందు చిగిరించిన కాంతిగలదియు; ముకులిత స్తనమాత్రే=ముకుళీభవించిన స్తనములుగలదియగుచుండఁగా; మనోభూః=మన్మథుఁడు; పుష్పితశ్చ=పుష్పించినవాఁడును; ఫలితశ్చ=ఫలించినవాఁడును ఆయెను. అని. అనఁగా వనితకు యౌవనారంభము కాఁగానే మన్మథుఁడు వృద్ధినొందెనని భావము.

‡ రమ్యం హర్మ్యతల మ్మనునది మన్మథుని వాక్యము, దానియర్థము—రమ్యం=మనోహరమయిన; హర్మ్యతలమ్=మేడయును; నవాః=నూతనలయిన; సునయనాః=స్త్రీలును; గుఞ్జద్ద్విరేఫాః=ధ్వనించుచున్నతుమ్మెదలుగల; లతాః=తీఁగెలును; ప్రోన్మీలన్నవమల్లికాసురభయః = వికసించుచున్న క్రొత్తమల్లెపూలచేమంచి వాసనగల; వాతాః=గాడ్పులును; సచన్ద్రాః=చంద్రునితోఁగూడిన; క్షపాః=రాత్రులును; ఏతాని=ఈ; మే=నాయొక్క; అమోఘాని=వ్యర్థములుకాని; శస్త్రాణి=ఆయుధములు; పరితః=అంతటను; జయన్తి యది=సర్వోత్కృష్టములుగానుండునేని; హన్త—ఇది హర్షార్థకము. తత్=అప్పుడు; అసౌ=ఈ; వివేకవిభవః=వివేకునిసంపద; భోః కీదృక్=ఎట్టిది? ప్రబోధోదయః=ప్రబోధుని యుత్పత్తి; కీదృక్=ఎట్టిది? అని. రమ్యమైన హర్మ్యము మొదలగునవి నాకు (మన్మథునకు) అధికబలము గలిగించునని భావము.

$ ఇద మసులభేత్యాది పురూరవను వాక్యము. దానియర్థము. పఞ్చబాణః=మన్మథుఁడు; అసులభవస్తుప్రార్థనాదుర్నివారమ్=పొందరానివస్తువును (ఊర్వశిని) కోరుటయందు అడ్డగింపరానియట్టి; మే=నాయొక్క; ఇదం మనః=ఈ మనస్సును; ప్రథమమపి=మొదటఁగూడ, వసంతోదయమునకు ముందేయనుట; క్షిణోతి=హింసించు

లితాపాణ్డుపత్రై రుపవనసహకారైర్దర్శితేష్వఙ్కురేషు॥" అని విక్రమోర్వశీయనాటకము. * "శ్లో॥ పాణిపల్లవవిధూననమన్తస్సీత్కృతాని నయనార్ధనిమేషాః। యోషితాం రహసి గద్గదవాచామస్త్రతా ముపయయుర్మదనస్య॥" అని రసార్ణవసుధాకరము. ఇవి మొదలగువానిలో నాలంబనగుణచేష్టాతదలంకృతి మలయానిలచంద్రాదులు రత్యుద్దీపకములుగాఁ జెప్పఁబడినవన్నియుఁ గామోద్దీపకములుగా వర్ణింపఁబడినవి. కావున మదనాదులని చెప్పినచోఁ గామంబునకే కామం బుద్దీపకం బనినయట్లు పర్యవసితంబై యసంగతం బగును.

§ వెండియు రతికామములకు నామభేదంబు దప్ప స్వరూపభేదంబు గాన్పింపదు. ఎట్లన, "తత్త్రిసంభోగవిషయక ఇచ్ఛావిశేషో రతిః" అను రసమంజర్యాదులవలనను, "శ్లో॥ యూనో రన్యోన్యవిషయా స్థాయినీచ్ఛా రతి ర్భవేత్" అను గ్రంథాంతరమువలనను, "క. అరయఁగ సంభోగవిషయ మగునభిలాష, స్ఫురణము రతి"

చున్నాఁడు. మలయవాతోన్మాలితాపాణ్డుపత్రైః=మలయానిలముచే రాల్పఁబడిన పండుటాకులుగల; ఉపవనసహకారైః=ఉద్యానవనమునందలి తియ్యమామిడి చెట్లచేత; అఙ్కురేషు=మొలకలు; దర్శితేషు=చూపఁబడినవి యగుచుండఁగా; కిముత=హింసించునని చెప్పవలసిన దేమి?

* పాణిపల్లవేతి శ్లోకమునకర్థము—రహసి=ఏకాంతమునందు; గద్గదవాచామ్=డగ్గుత్తిక పడుమాటలుగల; యోషితామ్=స్త్రీలయొక్క; పాణిపల్లవవిధూననమ్=చిగురువంటిహస్తమును విదిర్చుటయు; అన్తస్సీత్కృతాని=లోపలి సీత్కారములును; నయనార్ధనిమేషాః=కన్నులసగము మూఁతలును; మదనస్య=మన్మథునకు; అస్త్రతామ్=ఆయుధములగుటను; ఉపయయుః=పొందెను. అని. నాయికలపాణిపల్లవవిధూననాదులచే మన్మథునకభివృద్ధియయ్యెననఁగా నాయకులకు రతి యతిశయించె నని భావము.

యనునీగ్రంథమువలనను, రతియనునది ఇచ్ఛాభిలాషాదిరూపమైనట్లు వ్యక్తం బగుచున్నది. "ఇచ్ఛాకాంక్షా స్పృహా ఈహా తృట్ వాంఛా లిప్సా మనోరథః। కామో౽భిలాషః" అనుకోశమునుబట్టియు ఇషు లషకము ధాతువులు సమానార్థకములగుటంబట్టియు ఇచ్ఛాభిలాష కామశబ్దములకర్థభేదంబులేమి సిద్ధమగుచున్నది. ఇట్లు రతికామము లకు స్వరూపముచేతను గార్యముచేతను పైచెప్పినప్రకారము భేదము సిద్ధింపనపుడు రతికిం గామముద్దీపకంబనుట చెల్లదు.

§ మఱియు, "శ్లో॥ ధ్యాయతో విషయాన్ పుంసస్సఙ్గస్తేషూపజాయతే। సఙ్గాత్సంజాయతే కామః కామాత్క్రోధో౽భిజాయతే॥" అనుగీతావచన తద్భాష్య తద్వ్యాఖ్యలవలన, రతి వలనం గామముదయించుననియు, రతి యాసక్తిరూపము కామం బుత్కటాసక్తిరూపం బనియు, వ్యక్తంబగుచున్నది. ఎటులన, "ధ్యాయతశ్చిన్తయతో విషయాన్ శబ్దాదివిషయవిశేషానాలోచయతః పుంసః పురుషస్య సఙ్గ ఆసక్తిః ప్రీతిః తేషు విషయేషూపజాయతే ఉత్పద్యతే ప్రీతేస్సంజాయతే సముత్పద్యతే కామస్తృష్ణా" అనిభాష్యము, "ప్రీతిరాసక్తిరితి సాధారణాసక్తిమాత్రం గృహ్యతే తృష్ణేత్యుద్రిక్తాసక్తిరుక్తా" అనియానందగిరిటీక, "తేషు సఙ్గ ఆసక్తిర్భవతి ఆసక్త్యాచ తేష్వధికరికామో జాయతే" అనిస్వామిటీక. ఇట్లు శాస్త్రాంతరములందును "జానాతి ఇచ్ఛతి యతతే" యని వ్యాపారక్రమము చెప్పుటవలన, "ఇదమ్మనోజ్ఞ" మితిజ్ఞానరూపంబగు ప్రీతి దొలుత నుదయించిన వెనుక "ఇదమ్మే భూయాత్" అను నిచ్ఛాత్మకంబగు కామ ముదయించు ననియు, నావలదానికై యత్నించుననియు నేర్పడుచున్నది. మహాకవులు రతిపోషకములుగాం దగిన మలయమారుతాదులు కామపరిపోషకములుగా వర్ణించుట, రతి కామములు రెండు నాసక్తిరూపములే గావున

నుత్కటత్వానుత్కటత్వములు గణియింపక యభిన్నములుగా నెంచి యని యెఱుంగునది. మఱియు రతియవస్థ లగు ప్రేమాద్యనురాగాంతములలో నుత్కటత్వానుత్కటత్వభేద ముండినను భేద మెంచక వ్యవహరించినట్లు రతియన వలసినచోటఁ గామపర్యాయములు చెప్పుటయుఁ గలదు, ఇట్లు నైషధమున, శ్లో॥ ఇతి ప్రియాకాకుభి రున్మిష న్భృశం దిగీశదూత్యే నహృది స్థిరీకృతః। నృపం స యోగేపి వియోగమన్మథః క్షణం సముద్భ్రాంత మజీజన త్పునః" అనియు, "దర్శనలక్షణే యోగే సత్యపి నలస్య భైమీవిషయో వియోగమన్మథః" అనితద్వ్యాఖ్యయందును జెప్పఁబడినది. వియోగకాలికరతియె కదా వియోగమన్మథము. ఇట్లనంగదశలు స్మరదశలు లోనగునవి దెలియునది.

§ ఇటఁ గొందఱు నామలింగానుశాసనమందు మదనపర్యాయములను దేవవిశేషవాచకములనడుమను, అభిలాషపర్యాయములను నాట్యవర్గములోను జెప్పినందునఁ గామునికిని గామమునకును భేద మేర్పడును గాని యభేదము సిద్ధింపదు. కావున మదనాదిపదములను దేవతామాత్రవాచకములుగానే కొన వలసి యున్నది. మనోభవవాచకములనుగాఁ గొన వలఁబడదు. "అఙ్కురితః పల్లవితః కోరకితః పుష్పితశ్చ హృది మదనః" ఇత్యాదిగా మదనునికి వృద్ధిక్షయములు చెప్పినచోట లక్షణచేఁ దద్వ్యాపారముల వృద్ధిక్షయములు తెలియవలయు, కామము మనోభావమైనచో, "ధనుః పౌష్పమ్మౌర్వీ మధుకరమయీ" ఇత్యాది వ్యవహారము లనుపపన్నము లగును. కావున మదనాది శబ్దములకు మనోభావార్థకతఁ జెప్పుకొనుట దుర్ఘట మగుచున్నది. రసచంద్రికాది గ్రంథములయందుఁ జెప్పిన యుద్దీపనవిభావలక్షణముచే మదనుని కది సంభవింపమి నిర్వివాదమె కాని యతనికి సర్వసమ్మతములు నైసర్గికములు నగురత్యుద్దీపకతయు రత్యుత్పాదకతయు దుర్ని

వారములు. అతనికి జ్ఞాయమానత్వము లేమిచే విభావత్వము గలుగ దని శాస్త్రకారుల మతముగా నున్నను ప్రస్తుతకవి రత్యుద్దీపకతను మాత్రమె లక్షణముగాఁ దలంచి మదనుని సయితము విభావముగా వచించినాఁ డనియు స్వతంత్రించి మతభేదము గల్పించినాఁ డనియుఁ జెప్ప వచ్చును. విభావ శబ్దమున కేతదను గుణముగ వ్యుత్పత్త్యర్థము మార్ప వలసి యుండును. జ్ఞాయమానాజ్ఞాయమానభేదముచే నుద్దీపన విభావములు ద్వివిధములుగాఁ జెప్పుకొనవలయు. ఇట్టిది యెల్లసితని మతముగా నుండును గాక యని నిర్వచించిరి.

§ ఇట్లు కాముఁడు మనోభావమాత్రుఁడే గాఁడను ప్రబోధచంద్రోదయమున "సంభూతిః ప్రథమమిహేశ్వరస్యసఙ్గా న్మాయాయా మ్మన ఇతి విశ్రుత స్తనూజః। త్రైలోక్యం సకల మిదం విసృజ్య భూయ స్తే నాథో జనిత మిదం కులద్వయ మ్నః॥ ఇత్యాదిగాఁ గామునికి మనోజనితత్వము వివేకాది సహోదరత్వముఁ జెప్పఁబడిన దసంగత మగును. రతిపతి యై రతితోడఁ బ్రవేశించిన యాతండేకదా "పుష్పధన్వారతిపతిః" అనియమరుఁడు చెప్పినవాఁడు. ఇట్లు "ధనుః పౌష్పమ్మౌర్వీ మధుకరమయీ చఞ్చలదృశాం దృశాంకోణో బాణః సుహృ దపి జడాత్మాహిమకరః। స్వయం చైకోనఙ్గ స్సకలభువనం వ్యాకులయతి॥ ప్రజాపతి స్స్వతనయాం యదా కామితవాన్ పురా। మృగరూపధరం తం చ బిభేద భగవాన్ హరః॥ ఇత్యాది కావ్యపురాణముల యందు మదనునికిఁ జెప్పఁబడిన యవి యెల్ల ననుపపన్నములగు ననుశంకయు, "అళియది విశిఖా శ్శరాసనం వా కుసుమమయం ససురాసురం తథాపి। మమ జగ దఖిలం వరోరు నాజ్ఞా మిద మతిలఙ్ఘ్య ధృతి మ్మహూర్త మీతి॥ తథాహి॥ అహల్యాయై జార స్సురపతి రభూ దాత్మతనయాం ప్ర

జానాథోఽయమాసీ దధజత గురో రిస్థిరబలామ్ । ఇతి ప్రాయశ్శోవా నవదమపథేఽకార్యత మయా శ్రమోమద్యానాం కఇవ భువనోన్మాథవిధిషు । రమ్యం హర్మ్యతల" మిత్యాదిప్రబోధచంద్రోదయము వలననే యుత్తరితం బగు నని తలంచెద. పురాణాదులయందుఁ జెప్పినయుమేయశక్తియే యిచటను మనోభావరూపుఁడగువానికిఁ జెప్పఁబడినది గదా! ఇట్టిమనోభావమునకే యెద్ది యెద్ది మనోజ్ఞవస్తు వుద్దీపకంబో అయ్యది యంతయు కామసామగ్రిగా మహాకవులువ్యవహరించినవారు, కాకున్నఁ బుష్పబాణుండు పంచబాణుండు ననిపేర్కొనఁబడినయనంగునకు, "చక్షుశ్చలదృశాం స్మరశాంకోణో బాణాః, అస్త్రితా ముపయయుర్మదనస్య, య ద్యేతాని జయన్తి హన్త పరిత శ్శస్త్రాణ్యమోఘానిమే" ఇత్యాదిగా నానావిధాస్త్రవత్తయు, "కౌసుమాః పుష్పకేతోః, వృద్ధింవా ఝష కేతనస్య కురుతే నాలోకమాత్రేణ కిమ్, తదిహ మకరకేతో రిన్ద్రజాలం ప్రతిమః" ఇత్యాదిగా పుష్పమీన మకరాది కేతనత్వముం జెప్పుటయు, ఇక్షుధన్వుఁడనియు కుసుమధన్వుండనియు నుచ్చావచంబుగఁ జెప్పుటయు లోనగునవి యెట్లుపపన్నములగును ? కావున ఋతుమాల్యాలంకార ప్రియజనగాంధర్వ కావ్యోపవనాదులు హృదయంగమములై హృదయస్థభావమును బోధించునవి యెల్ల మనసిజజయసాధనములుగాఁ జెప్పుట కవిసమయ సిద్ధంబైనది. దీనింబట్టియే సాహిత్యదర్పణకారుండు " మౌర్వీ రోలమ్బమాలా ధను రథ విశిఖాః కౌసుమాః పుష్పకేతో ర్భిన్నం స్యా దస్య బాణై ర్యువజనహృదయం స్త్రీకటాక్షేణ తద్వత్ ! ఇత్యా ద్యన్నేయమన్యత్కవిసమయగతం సత్కవీనాం ప్రబన్ధే॥" అని వచించె. మఱియు "మదనమాద్యవిచ్ఛేదనమ్ । జ్వలయతి మనోభవాగ్నిమ్ । కుసుమవిశిఖం జాగరయతి । నవ మహోకితరోస్స్మరదీపనమ్ । కుసుమచాప మతేజయ

దంశుభిః। అనఙ్గసందీపన మాశు కుర్వతే। రసాయన మిదం కుసుమా యుధస్య” ఇత్యాదిస్థలములయందు మదనమనోభవకుసుమ విశిఖస్మర కుసుమచాపానఙ్గాదిశబ్దములకు మనోభావార్థము గాక దేవతార్థకతఁ జెప్పినపుడు చంద్రాదులకు దేవతోద్దీపకత యెట్లు? “సవిభ్రమైః సస్మితజిహ్మవీక్షితై ర్విలాసవత్యో మనసిప్రవాసినామ్। అనఙ్గసందీపనమాశు కుర్వతే। కుసుమమేవ న కేవలమార్తవం నవమశోకతరోః స్మరదీపనమ్। కిసలయప్రసవోఽపి విలాసినామ్” ఇత్యాదుల స్మరానంగ పదబోధ్య దేవతకు ప్రవాసివిలాసిసంబంధిత్వ మేరీతి ఘటిల్లు? “మత్తాళియూథ విరుతం నిశి శీధుపానం సర్వం రసాయనమిదం కుసుమాయుధస్య” ఇత్యాదులయందు శీధుపానాదులు కుసుమాయుధ దేవతకు సంభవించుటయెట్లు? కాముకకృతశీధుపానముచే మదనదేవతకు వృద్ధియనుట యుపపన్నమగునా? ఇట్లు కాముకగోచరంబులైన మలయానిలచంద్రాదులచే ననంగ దేవతోద్దీపనమగుననుటయు, నెట్లుపపన్నమగును? మఱియు, “దిగీశదూత్యేన హృది స్థిరీకృతః నృపం సయోగేఽపి వియోగమన్మథః” అని వెనుక వ్రాసిన నైషధమందు మన్మథదేవతకు నలహృదయమందు స్థిరీకరణము ప్రియాకాకువులచే ముహుర్ముహురున్మేషములోనగున విఘటిల్లవుగదా! బహిరింద్రియ సంబంధమున్నను విప్రలంభరతియే కలిగిన దనక మార్గాంతరమేమి? శ్రీనాథుండును వియోగమన్మథ శబ్దమునకు విప్రలంభ వేదనాభరంబు అని యాంధ్రీకరించినవాఁడు. ఇట్లు “అఙ్కురితః పల్లవితః కోరకితః పుష్పితశ్చ హృది మదనః” ఇత్యాదులయందును యువజనహృదయమందు శ్రీపుత్రునకు అంకురితత్వపల్లవితత్వాదులు ఘటిల్లమి తెలియునది. మేఘుఁడు వసంతుఁడు అని యమహదర్థకములను మహదర్థకములనుగఁ బ్రయోగించునట్లు కాముఁడు మన్మథుఁడని మహదర్థకముగాఁ బ్రయోగము గావచ్చును. కావున దేవతార్థకతా పక్షము ననుపపాదము. చంద్రాదులవలన కాము

కమనోవికార ముజ్జృంభించుఁ గావున భావార్థకతాపత్తియు నుపపన్నమై నయది. ఇఁక మదనవృద్ధిక్షయాదులు చెప్పినచోట లక్షణచేతఁ దదీయవ్యాపారములు గ్రహింపవలసియుండు నన్నది పరికింపవలయు ముఖ్యార్థబాధాదిత్రయము లేక లక్షణ యెట్లు? ఒకానొకచో ముఖ్యార్థబాధ నెట్లో యొకయట్లుపపాదనము చేసినను, మదనాదిపదఘటితస్థలములయం దెల్లనట్లు గాదుగదా! ప్రయోజన మెచ్చటను సుఘటముగాదు. రూఢి యనుటయుఁ బొసఁగదు. రూఢి ప్రయోజనాన్యతరము లేక, లక్షణయే దుర్లభమైనది. మదనాది శబ్దప్రయోగస్థలములలో నెవ్వరేని పూర్వపండితులు లక్షణ నంగీకరించి తద్వ్యాపార పరముగా వ్యాఖ్యలయందు వ్రాసియున్నవారు కారుగదా! ఒకవేళ నిది యపూర్వకల్పన యని యందు రేమో అట్ల యగుంగాక. "దృశాదగ్ధం మనసిజంజీవయన్తి దృశైవ యాః" ఇత్యాదిస్థలములయందు దాహజీవనములు కామదేవునకా? తద్వ్యాపారములకా? కామదేవునకు హరనేత్రాగ్నిచే దాహ భస్మీభవనాదులు తద్వ్యాపారములకుఁ గామినీకటాక్షమువలన జీవన మన్నచో మృతుఁడొకండు జీవించినది మఱియొకటి యనుట యసంగతముగాదా! ఇట్లు కామశబ్దము తక్కఁ దక్కిన మదనాదిశబ్దములు దేవతామాత్రవాచకములు గానే గొనవలయు ననుటయు, నిరుక్తయుక్తిజాతంబునను "లజ్జా విజితమన్మథా। లజ్జామన్మథమధ్యస్థా। స్మరమస్తీకృతప్రీడా। ముగ్ధా నవనయఃకామా। స్మరాస్థాగాఢతారుణ్యా। స్మరస్మేరాక్షీ। మనసిజసహస్రాణి సృజతః। సమానల జ్ఞాయనా" ఇత్యాదులయందు దేవతార్థముపయుక్తము గానందునను, తద్వ్యాపారపరముగా వివరణములు లేనందునను, లక్షణ ప్రసంగ నందునను, సంభవింపదు. ఇంతమాత్రాన దేవతావాచకతయే మదనాదిశబ్దములకు లేదనుటకాదు. మఱియేమన్న, అగ్ని

వాయ్వాదిశబ్దములు దేవతావాచకములై దేవవర్గములోనె పఠింపఁబడి యున్నను, అగ్ని దహించె వాయువు విసరె నిత్యాదిప్రయోగములయందు ద్రవ్యవిశేష వాచకతవానికిఁ జెప్పుచున్నయట్లును, బ్రహ్మవైవర్తదేవీ భాగవతాదులలో నిద్రాశ్రద్ధామేధాభాషాదులు దేవతా విశేషములని చెప్పినను, "నిద్రాం భగవతీం విష్ణో రతులాం తేజసః ప్రభుః। మేధే సరస్వతి బలే" యని తదీయప్రార్థనావాక్యములు సప్తశత్యాదులయందుండినను వృత్తివిశేషములుగా వానిని గ్రహించినట్లును, కామమున కధిష్ఠాన దేవత యుండినను భావవిశేషరూపతయే యీ ఘట్టమున సూపపన్నమని నాయెన్నిక.

§ ఇంతియుగాక, మదనాదిశబ్దములకు దేవతామాత్ర వాచకతయె యగుం గాక, అయినను శాస్త్రకారోక్తోపపత్తిలేనందున మదనదేవతాదులు తటస్థోద్దీపనవిభావము లనఁట వలనుపడదు. రత్యాదివిభావములనఁగా రత్యాద్యుత్పాదనకారణములుగదా! కారణమాత్రము కార్యనియతపూర్వవర్తియై యుండవలయుఁ గదా! ఇట రత్యాదికము కార్యము. అది మనోధర్మము, దానికిఁ గారణభూత మగువిభావము మనస్సునందుఁ దత్పూర్వకాలమున నుండినంగాని యీరత్యాది కార్యము జనింపదు. అరణ్యస్థదండాదులును ఘటాదులంగూర్చి కారణములు గావలసివచ్చునని కార్యకారణములకు సామానాధికరణ్యము నియతముగా నుండవలసిన దని సకలశాస్త్రకార సిద్ధాంతము జాగరూకమైయున్నది గదా! కావున కామినీకాముకరూపాలంబనములకు, ఆలంబనగుణచేష్టాతదలంకార మలయానిల వసంతసమయాద్యుద్దీపనములకు, రత్యాదికారణతానిర్వాహమునకై యేదో యొకరూపముగ మనస్సునందుఁ బ్రవేశముగలుగఁ జేయవలయు. జ్ఞానమునకు జ్ఞేయమునకు విషయవిషయిభావసంబంధము క్లృప్తమైనది గావున నాలంబనోద్దీప

నములు జ్ఞానవిషయములై రత్యాదిస్థాయులనుగూర్చి కారణము లనఁదగి యున్నది. కాఁబట్టియే, విభావలక్షణముఁ జెప్పఁ దొడంగినభరతముని "విభావఇతి కస్మాదుచ్యతే. విభావ ఇతి విజ్ఞాతార్థః, విభావితం విజ్ఞాత మిత్యనర్థాంతరమ్" అని నిర్వచించె. దశరూపకమందును, "శ్లో॥ జ్ఞాయమానతయా తత్ర విభావో భావపోషకృత్" అనియు, అవలోకాఖ్య యగు తద్వ్యాఖ్య యందును, ఏవ మయ మేవ మియ మిత్యతిశయోక్తిరూపకావ్య వ్యాపారాహిత విశిష్టరూపతయా జ్ఞాయమానో విభావ్యమానస్సన్నాలమ్బనత్వేనోద్దీపనత్వేన వా యో నాయకాది రభిమత దేశకాలాది ర్వా స విభావః, యదుక్తం "విభావ ఇతి విజ్ఞాతార్థ ఇతి" అనియు, నిర్వచింపఁబడినది. "ఉద్దీపనవిభావో జ్ఞాయమాన ఏవ గమకః" అని రసతరంగిణియందున్నది. ఇఁక రసచంద్రికయందు, "తత్రరసోత్పత్తికారణంవిభావః, విశేషేణ భావయ త్యుత్పాదయతీతివా, విశేషేణభావ్యతే ఉత్పాద్యతేఽనేనేతివా వ్యుత్పత్తేః తత్రాలమ్బనస్థలే కార్యతావచ్ఛేదక సంబన్ధ స్సాక్షాద్విషయతా, ఉద్దీపనస్థలే తు స్వజనకజ్ఞాన విషయతా, కారణతావచ్ఛేదకసంబన్ధ శ్చోభయత్రాపి తాదాత్మ్యమేవ. విషయతాసంబన్ధేన యత్రరసః తత్ర తాదాత్మ్యే నాలమ్బనవిభావః, స్వజనకజ్ఞానవిషయతాసంబన్ధేన యత్రరస స్తత్ర తాదాత్మ్యేనోద్దీపనవిభావ ఇతిచనియమాత్॥ తథాచ విషయతా ఘటితసామానాధికరణ్యప్రత్యాసత్త్యాఆలమ్బనవిభావస్యేవ స్వజనకజ్ఞానవిషయతా ఘటితసామానాధికరణ్యప్రత్యాసత్త్యా ఉద్దీపనవిభావస్యాపి జనకత్వ మవిశిష్ట మితి విషయతాస్వజనకజ్ఞానవిషయతాన్యతరసంబన్ధావచ్ఛిన్నరత్యాదిస్థాయిభావనిష్ఠకార్యతానిరూపితతాదాత్మ్యసంబన్ధావచ్ఛిన్న కారణత్వం విభావసామాన్యలక్షణం భవతి. లోకే యన్నాయకాద్యాలమ్బనకారణం విశిష్ట

దేశకాలాద్యుద్దీపనకారణంచ తదేవ కావ్యనాట్యముఖేన సామాజికా న్తఃకరణప్రతిబిమ్బితతయా సామాజికనిష్ఠంస త్కారణత్వపరిహారేణ సామాజికనిష్ఠం రత్యాదికం భావం భావయతీత్యాదివ్యుత్పత్త్యా ౽లౌకిక విభావనాఖ్యవ్యాపారవత్త్వా దలౌకికవిభావ పదవ్యవహార్య మాలమ్బన విభావ ఉద్దీపనవిభావ ఇతిచ కథ్యతే" ఇత్యాదిగా నిరూపింపఁబడినది. ఇట్లు శాస్త్రప్రవర్తకుఁడగు భరతముని మొదలుకొని నేటివఱకుఁగల సకలాలంకారికశిరోమణులు రత్యాదులనుగూర్చి యభిమతనాయికావిశిష్ట దేశకాలాదులు జ్ఞాయమానములై, యనఁగా ఆహా! ఈరమణి యెంత రమణీయ! ఈదేశమెంత మనోజ్ఞము! ఈకాలమెంత హృద్యము! ఈమలయానిలం బెంతమంజులము! ఈచంద్రికయెంత మనోహరమైనది! అని తత్తద్రూపముగా చిత్తవృత్తిని బొందినవై తద్గతరత్యాదిభావము నుద్బోధించు నని వచించిరి. ఈవిధముగ జ్ఞాయమానములకేగాక యజ్ఞాయమానములకును గారణత్వము ఘటిల్లునెడ మనోజ్ఞ కామిన్యాదులు స్వవిషయకచింత లేని యుదాసీనునికి సయితము స్వరూపసత్తచేత రత్యుత్పాదకములు గావలసి వచ్చును. అట్లు కావనుటకు సకలసహృదయహృదయంబులె సాక్షులు. కాఁబట్టి రతిమంతుల కగోచరుండైనందున, ఆహా ఈమదనుండెంత మనోహరుండు అని జ్ఞానవిషయము కాకున్న మదనుఁడు రత్యుద్దీపకుఁడగుట యెట్లు ఘటిల్లును? కామునికి రతితో సామానాధికరణ్య మేరీతి? సామానాధికరణ్యము లేక కార్యకారణభావ మమరునా? రసతరంగిణియందు "నను కటాక్షాదయః కథ ముద్దీపనవిభావా నభవన్తి దృష్టే కటాక్షే కామినో మనోవికారః పరిపూర్ణో భవతి అనుభవసిద్ధత్వే నాపహ్నోతు మశక్యత్వాత్ । సత్యమ్ కటాక్షాదీనాంకరణత్వే నానుభావత్వమ్ విషయత్వేనోద్దీపనవిభావత్వమ్. తథాచనాయికాత్మని రసావభాసక

త్వేన నాయకం ప్రతి కటాక్షాదయోఽనుభావాః, తేచ దృష్టిగోచరీభూతాః కామినో మనోవికారం కారయన్తో విషయత్వేనోద్దీపనవిభావాఇతి" అని కామినీగోచరములగు కటాక్షాదులకే యుద్దీపనవిభావత చెప్పఁబడినది.

§ ఇట్లు సకలగ్రంథవిరోధము నుపపత్తివిరోధము జాగరూకములై యుండఁగా మదనునకుద్దీపనవిభావతఁ జెప్పుట నిరాలంబనమై "నహి కస్యచి ద్గ్రన్థకృతో విపరీతలేఖనం యుక్తిబలాద్వా ప్రసిద్ధా బాధకా" మను గదాధరభట్టాచార్యవాక్యమ్మునకు లక్ష్యకోటిప్రవిష్టం బగుచున్న దనుట నిర్వివాదము.

§ ఒకవేళఁ గవి సకలగ్రంథసరణీవిభిన్నముగా నొకనూతనమతము గల్పించునుగాక. అది యుపపన్నముగా నుండవలయునా? ఎట్లుండిన నంగీకార్యంబా? ఎట్లుండిన నంగీకార్యంబె యన్నచో నెట్టివాఁడును ప్రామాణికగ్రంథవిరోధమును బరికింపక తనమతికిఁ దోఁచిన దేదో యొకటి చెప్పినం దాని నంగీకరింప వలసివచ్చును. కుకవిప్రబంధములన్ని యుజ్జీవితంబులగును. సదసత్కావ్యంబుల విభాగము నేటికి దత్తజలాంలియగును. శాస్త్రకారసిద్ధాంతమర్యాద లన్నియు నుత్పన్నములయి లోకము వ్యాకులీభవించును. ఉపపత్తి లేదనుటయిదివఱకె నిరూపింపఁబడినది. మఱియు, ప్రస్తుతకవి రత్యుద్దీపకతనుమాత్రమె లక్షణముగాఁ దలంచి మదనునిసయితము రత్యుద్దీపకునిఁగా వచించినాఁడనుట గోవునకు గోత్వము లక్షణం బన్నట్లసంగతమగును. రత్యుద్దీపక లక్షణకుక్షిలో నుద్దీపకాదిపదములు చేర్చినచో నాత్మాశ్రయదోషంబు ప్రసరింపదా?

§ మఱియుఁ గవులు వర్ణించునంతమాత్రమునఁ బదార్థసిద్ధి గాఁజాలదు. వారు వస్తుస్థితిని బట్టి వర్ణింపవలయునను నిర్బంధము పెట్ట

కొన్ని వారు కారు. కావుననే "నియతికృత నియమరహితామ్. కవేర్హార్యవర్ణనమ్ । నిరఙ్కుశాః కవయః । ఉద్దామగిరాం కవీనా ముచ్చావచప్రియసౌన్దర్యగుణా మృషోద్యాః" ఇత్యాదులు పెద్దలు చెప్పిరి. కావునం గవులు మదనుని నుద్దీపకత్వాది నానాధికారములు గలవానిఁ గావర్ణించి నంతమాత్రన నా లక్ష్యములనుజూచి వస్తుతంత్రమయిన శాస్త్రమునం దతని కుద్దీపకత గాఁ దగునని తలంప రాదు.

ఆలంబనవిభావోదాహరణము.

చ. అలరుగరతిన్ రతీశు దమ ♦ యంతి నలు న్నలువొంద ముందుగా
నలువ సృజించి యందుకత ♦ నం దనచేయళు కెల్లఁదీఱి నే
ర్పలవడ నీలతాంగి నర ♦ సాధిప నిన్నును గూర్చి ప్రేమసం
కలితముగాఁగ దంపతులు ♦ గా నొనరింపఁగఁ బోలు నెంతయున్.

టీ॥ నరసాధిప=నరసభూపాలుఁడా! నలువ=బ్రహ్మ; అలరు రతిన్=ఒప్పుచుండెడిరతీదేవిని; రతీశున్=కాముని; దమయంతిన్=దమయంతీదేవిని; నలున్=నలచక్రవర్తిని; నలువొందన్=సౌందర్యమొప్పునట్టుగా; ముందుగాన్=మొదల; సృజించి=నిర్మించి; అందు కతనన్=ఆహేతువుచేత; తన...ఎల్లన్=తనచేతిజంకంతయు; తీఱి=పోయి; నేర్పలవడన్=చాతుర్యముకలుగఁగా; ఈలతాంగిన్=ఈసుందరిని; నిన్నును; కూర్చి=సంఘటించి; ప్రేమసంకలితముగాఁగన్=ప్రేమతోఁ గూడునట్లుగా; దంపతులుగాన్=జాయాపతులుగా; ఎంతయున్=మిక్కిలి; ఒనరింపఁగఁబోలున్=ఒనరించినవాఁడు గాఁబోలు.

ఇందు నరసభూపాలునకు రత్యాలంబనవిభావము లతాంగియు, లతాంగికి రత్యాలంబన విభావము నరసభూపాలుండునుగా వర్ణించుటుజేసి, ఇది శృంగారాలంబనవిభావోదాహరణమని తాత్పర్యము.

ముద్రితపుస్తకములలో నోలతాంగి యనుపాఠమున్నది. అప్రస్తుతనాయికాసంబోధన మసంబద్ధమైనందున దాని మాని యీలతాంగి ననుద్వితీయాంతపాఠము స్వీకరింపఁబడినది.

ఇఁక శృంగారాలంబనవిశేషభూతులైననాయికానాయకుల యొక్క భేదనిరూపణంబు ప్రస్తుతంబు. అది ద్వితీయాశ్వాసమున నాయకప్రకరణమునఁ జెప్పఁబడిన దైన నిందు సందర్భశుద్ధినిబట్టి యుదాహరింపఁబడుచున్నది. ఎట్లన్న ——

నాయకభేదనిరూపణము.

తే-గీ. మఱియు శృంగారలీలాస•మగ్రయోగ్య
తానిశవిచక్షణులు దక్షి•ణానుకూల
ధృష్టశఠు లనఁ గాంతు ల•భీష్టమతులు
గలరు తల్లక్షణంబులు • తెలియఁబఱతు. 30

టీ॥ మఱియుఁ = వెండియు; శృంగార . . . విచక్షణులు, శృంగారలీలా = శృంగారక్రియయందు, సమగ్ర = సంపూర్ణమగు, యోగ్యతా = యోగ్యతయందు, అనిశ = ఎల్లపుడు, విచక్షణులు = విద్వాంసులయినట్టి; అభీష్టమతులు = సమీచీనబుద్ధిగలయట్టి; కాంతులు = నాయకులు; దక్షిణ . . శఠులు = దక్షిణుఁడు, అనుకూలుఁడు, ధృష్టుఁడు, శఠుఁడు; అనఁ = అనఁగా; కలరు = ఉన్నారు. తల్లక్షణంబులు = వారిలక్షణములను; తెలియఁబఱతుఁ = తెలియఁజేయుదును.

శృంగారాలంబనము లగునాయకులు దక్షిణానుకూలధృష్టశఠభేదముచేత నలువురు గల రని తాత్పర్యము.

§ తక్కినవిశేషణము లుపయుక్తములు గావు. మఱియు నిందుఁ గాంతు లనుశబ్దము, పురుషు లనునర్థమును గాని నాయకు లనునర్థమును గాని, బోధించుతాత్పర్యముతోఁ బ్రయోగింపఁబడినది. అది తదర్థబోధకము గాదు, మఱియేమన్న, ప్రియు లనునర్థమును బోధించును. ఆయర్థ మిం దుపయోగింపక యెవరిప్రియు లనిసాకాంక్షమై యుండును.

దక్షిణాదినాయకలక్షణములు.

చ. చెలఁగుబహుప్రియాసదృశ♦శీలుఁడు దక్షిణుఁ డొక్కకాంతనే
వలచి గుణాభిరాముఁడగు ♦ వాఁ డనుకూలుఁడు సాపరాధుఁడై
యలుకనివాఁడు ధృష్టుఁడు ప్రి♦యాశయమాత్రనివేద్యవిప్రియుం
డల శఠుఁ డండ్రు వీరల కు♦దాహరణంబులు నిర్ణయించెదన్. 31

టీ॥ చెలఁగు...శీలుఁడు = ఒప్పుచున్నవాఁడును బహునాయికల యందుఁ దుల్యవృత్తిగలవాఁడునగునాయకుఁడు; దక్షిణుఁడు = దక్షిణనాయకుఁడు. ఒక్కకాంతనే=ఒకనాయికనే; వలచి = మోహించి; గుణాభిరాముఁడగువాఁడు = సౌశీల్యాదిగుణములచేనొప్పినవాఁడు; అనుకూలుఁడు=అనుకూలనాయకుఁడు; సాపరాధుఁడై = నాయికాంతరగమనాది రూపాపరాధముతోఁగూడినవాఁడై; అలుకనివాఁడు=జంకనివాఁడు; ధృష్టుఁడు = ధృష్టుఁడను నాయకుఁడు. ప్రియా...విప్రియుండు = ప్రియురాలియొక్క హృదయమునకుమాత్రమె తెలియఁదగిన యపరాధము గలవాఁడు ; అలశఠుఁడు = ప్రసిద్ధుఁడగు శఠుఁడనునాయకుఁడు. అండ్రు=అనిచెప్పుదురు. వీరలకున్=ఈనాయకులకు; ఉదాహరణంబులు=లక్ష్యములను; నిర్ణయించెదన్=నిరూపించెదను.

దక్షిణనాయకున కుదాహరణము.

ఉ. సాగరమేఖలాసతికిఁ ♦ జారుభుజాపరిరంభ మిచ్చె వా
ణీగగనావలగ్నకును ♦ నేర్పుమెయి న్మొగమిచ్చె వీరల
క్ష్మీగజరాజగామిని క♦మేయభుజాంతర మిచ్చె సంతత
త్యాగి నృసింహభూవిభుఁడె ♦ దక్షిణనాయకుఁ డెన్ని భంగులన్. 32

టీ॥ సాగరమేఖలాసతికిన్ = భూమియను స్త్రీకి ; చారు...పరిరంభము = మనోజ్ఞమగుచేతికౌఁగిలిని; ఇచ్చెన్. వాణీగగనావలగ్నకున్=సరస్వతీదేవికి; నేర్పుమెయిన్ = చాతుర్యముచేత; మొగము= ముఖమును; ఇచ్చెన్. వీరలక్ష్మీగజరాజగామినికిన్ = వీరలక్ష్మియను స్త్రీకి; అమేయభుజాంతరము=విశాలమగువక్షఃస్థలమును; ఇచ్చెన్. ఎన్నిభంగులన్ = ఎన్నివిధములచేతనైనను; సంతతత్యాగి = నిరంతరదాతయగు; నృసింహభూవిభుఁడె = నరసభూపాలుఁడె; దక్షిణనాయకుఁడు= దక్షిణుఁడనునాయకుఁడగును.

ఇందు భూమివాణీవీరలక్ష్ములయందు నరసభూపాలునకు సమానమైనవృత్తి వర్ణింపఁబడెను గాన నిది దక్షిణనాయకోదాహరణ మగు నని తాత్పర్యము.

కొన్నిగ్రంథములలో స్త్రీకి బహునాయకాసక్తియందువలెఁ బురుషునకు బహునాయికాసక్తియందును దుల్యయుక్తిచేత రసాభాసత గావచ్చు నని చెప్పి దక్షిణనాయకునివిషయమై "శ్లో॥ వ్యానమ్రాశ్చ లితాశ్చైవ స్ఫారితాః పరమాకులాః। పాణ్డుపుత్త్రేషు పాఞ్చాల్యాః పతన్తి ప్రథమం దృశః॥" అనుక్తప్రస్థలమునందుఁ బ్రసక్తించినరసాభాసత వారించుటకై అపరిణేతృబహుపురుషాసక్తియే రసాభాస మని

నిర్ణయించినట్లు, పురుషునకు అపరిణీతబహునాయికాసక్తియే రసాభాసతానియామక మని పరిష్కరించిరి. వేశ్యావైశికులయొక్క రతి రసాభాసమే యని వీరియభిప్రాయము. ఇందలి విశేషంబులు రసాభాసప్రస్తావములో వ్రాయంబడు.

§ ఇటఁగొంచెఁ భూమివాణీ వీరలక్ష్ములు పరమార్థమున నాయికలు కావు కావున వానియందుఁదుల్యవృత్తి గలుగుటచే నరసభూపాలుండు దక్షిణనాయకుండగునా? "అథనాయికాత్రిధాస్వాన్యాసాధారణస్త్రీతి। నాయకసామాన్యగుణైర్భవతియథా సంభవైర్యుక్తా। అనియు, "స్వాన్యాసాధారణస్త్రీతి తద్గుణానాయికాత్రిధా" అనియు, "సంపత్కాలే విపత్కాలే యానముఞ్చతివల్లభమ్। శీలార్జవగుణోపేతాసాస్వీయాపరికీర్తితా" అనియుఁ జెప్పఁబడిన నాయికా సామాన్యగుణములుగాని, తద్విశేషగుణములుగాని, భూమ్యాదులయందు లేనపుడు వానికి నాయికాత్వ మెట్లు ఘటిల్లును? మఱియు "ఆభాసతా భవేదేషా మనౌచిత్యప్రవర్తనాత్। అసత్యత్వాదయోగ్యత్వాదనౌచిత్యస్త్రిధామతమ్। అచేతనగతంయత్స్యాదసత్యత్వకృతం హితత్" అను ప్రమాణమునుబట్టి భూమ్యాద్యచేతనగతమగు భావమునకు "కస్త్వం భోఃకథయామిదైవహతకమ్మాంవిద్ధిశాఖోటకమ్॥" అనుచో శాఖోటకవృక్షగతనిర్వేదమునకుఁబోలె నాభాసత దుర్నివారము. తిర్యఙ్మ్లేచ్ఛగత భావమునకే విభావపరిపూర్తిలేనందున నాభాసత చెప్పియుండఁగా నచేతనగతమైనదాని కాభాసతయరిది కాదుగదా? మఱియు "దేవాద్యభావానిపతేః" అనునది భవానికి పత్యంతరప్రతీతికారియగుటంబట్టి దుష్టమని గ్రంథకర్తలు చెప్పినందున నిదియు భూమివాణీలక్ష్ములకు వర్ణనీయ నరసాంగత్యప్రతీతికారి యగుటచే దుష్టము గాకమానదు. ఇట్లు "కనకములంబరంబులు, కనుఁగవఁ బాఱఁజూచెదవు,

అమృతమువంటి సద్గుణము, పారసీక క్షమాపతుల" ఇత్యాదులయందు నూహింపవలయు నాయికాత్వ తద్గుణాద్యారోపమున నిర్వాహము సుందరముగాదనివక్కాణించిరి. ఇదియెల్ల సత్యంబ. "అత్యుత్తమ దేవతాదివిషయిణీ రతిస్తు న వర్ణనీయా తద్వర్ణనం హి పిత్రోరతివర్ణ నమివాత్యన్త మనుచితమ్" అను కావ్యప్రకాశమువలన కాపురుషులైన యాధునికులందు వాణీలక్ష్మ్యాది వల్లభత్వప్రతీతికరములైన యిట్టిప్రయోగములు రమణీయములు గావనియు నాతలంపును. అయినను ఇట్టి సందర్భములయందుఁ బ్రతాపరుద్రీయ వ్యాఖ్యాత భూమ్యాదిపదములు తన్నామక నాయికాపరముగ సమన్వయించి యుదాహరణతా నిర్వాహము చేసినందున నిటను బరిహారక్రమ మట్లే తెలియఁదగునని తోఁచెడి.

అనుకూలనాయకోదాహరణము.

చ. కనకము లంబరంబులును ♦ గ్రామము లుజ్జ్వలదివ్యరత్నమం
డనములు వాజివారణఘ♦టల్ ఘనసారసుగంధసారము
ల్దనివి దలిర్ప వేఁడినకొ♦లంది నొసంగుచు నోబభూపనం
దనుఁడగు నారసింహుఁ డిల ♦ దానరమాప్రియుఁ డయ్యె నెంతయున్.

టీ॥ ఓబభూప...సింహుఁడు = ఓబరాజపుత్త్రుండగు నరస భూపాలుండు; కనకములు = సువర్ణములను; అంబరంబులును=వస్త్రంబులను; గ్రామములు= అగ్రహారంబులను; ఉజ్జ్వల...మండనములు= ప్రకాశించుచున్నదివ్యరత్నాభరణంబులను; వాజివారణఘటల్ =తురంగములయొక్కయు గజములయొక్కయు సమూహములను ; ఘన... సారముల్ = పచ్చకర్పూరమును శ్రీచందనమును; తనివిదలిర్పన్=తృప్తి అతిశయించునట్లు; వేఁడినకొలందిన్=యాచించినంతయు; ఒసంగుచున్ =

ఇచ్చుచు; ఎంతయుఁ = మిక్కిలి ; దానరమాప్రియుండు=దానలక్ష్మికిఁ ప్రియుండు; అయ్యెఁ.

ఇందు నరసభూపాలుండు దానలక్ష్మి కొక్కదానికే ప్రియుఁ డయినట్లు చెప్పినందున ననుకూలనాయకున కిది యుదాహరణమని తాత్పర్యము.

ధృష్టనాయకోదాహరణము.

చ. ఉరమున నున్నకుంకుమ మదుజ్జ్వలరోషకషాయవీక్షణ
స్ఫురదరుణాంశుపుంజ మని ♦ బొంకితి కన్గవ కెంపు భాగ్యబం
ధురసహజారుణత్వ మని ♦ నూల్కొన నాడితి వెట్లు దాఁచె దీ
పరిమళవాసనాలహరి ♦ పర్వెడు మేన నృసింహభూవరా 34

టీ॥ నృసింహభూవరా = నరసభూపాలుఁడా ! ఉరముననున్నకుంకుమ=ఎదనంటినకుంకుమ; మదుజ్జ్వల...పుంజము, మత్ = నాయొక్క, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, దీనికి వీక్షణమందన్వయము, రోష=కోపముచేత, కషాయ=ఎఱ్ఱనైన, వీక్షణ=దృష్టియొక్క, స్ఫురత్ = ప్రకాశించుచున్న, అరుణాంశుపుంజము = ఎఱ్ఱనికాంతులసమూహము. అని బొంకితి=అనిదబ్బఱలాడితివి. కన్గవకెంపు=రెండుకన్నుల యెఱ్ఱఁదనము; భాగ్య...అరుణత్వము = భాగ్యసూచకమును దట్టమును స్వభావసిద్ధమునైనయెఱ్ఱఁదనము. అని ; నూల్కొనఁ = ఒప్పునట్లుగా ; ఆడితివి = పలికితివి. మేనఁ=శరీరమునందు; ఈపరిమళవాసనాలహరి= ఈపరిమళగంధప్రవాహము; పర్వెడుఁ = వ్యాపించెడు. ఎట్లు=ఏరీతిగ; దాఁచెదు?

ఇందు నరసభూపాలుండు సాపరాధుం డయ్యె నంక కుండుటవలన ధృష్టుం డగును. * "శ్లో॥ నవనఖపద మఙ్గం గోపయ స్యంశుకేన స్థగయసి పునరోష్ఠం పాణినా దన్తదష్టమ్। ప్రతిదిశ మపర స్త్రీసఙ్గశంసీ విసర్ప న్నవపరిమళగన్ధః కేన శక్యో వరీతుమ్॥" అనుమాఘప్రయోగము నిందు సంవాదంబుగాఁ దెలియునది.

శఠున కుదాహరణము.

చ. కనుఁగవఁ బాఱఁ జూచెదవు ♦ గాని మనంబునఁ జూడ వుక్తులం
దనిపెదు గాని భావమునఁ ♦ దన్ప వొకప్పుడు నీప్రవీణత
ల్వనుపడ వింక నీసటలు ♦ బచ్చెనచేఁతలు చాలుఁ జాలు నన్
జెనకకు కీర్తికాంతయె నృ♦సింహ ప్రియాంగన నీ కెఱుంగుదున్.

టీ॥ నృసింహ = నరసభూపాలుఁడా! కనుఁగవన్ = నేత్రయుగ్మముచే; పాఱఁజూచెదవుగాని = బాగుగఁజూచెదవుగాని; మనంబునన్ = మనస్సుచే; చూడవు—స్మరింపవనుట. ఉక్తులన్ = మాటలచేత; తనిపెదుగాని = తృప్తినొందించెదుగాని; భావమునన్ = హృదయముచే; ఒకప్పుడున్ = ఒకసారియైనను; తన్పవు = తృప్తినొందింపవు. ఇంకన్ = ఇఁకమీఁద; నీప్రవీణతల్ = నీచాతుర్యములు; పనుపడవు = ఉపయోగింపవు. నీసటలు = నీనడకలు; బచ్చెనచేఁతలు — మాయాచేష్టలు. చాలుఁజా

* నవనఖపదమ్ = క్రొత్త నఖక్షతముల గుర్తులు గలిగినట్టి; అఙ్గమ్ = శరీరమును; అంశుకేన = వస్త్రముచేత; గోపయసి = దాఁచుచున్నావు. దన్తదష్టమ్ = దంతక్షతయుక్తంబగు; ఓష్ఠంపునః = పెదవినో; పాణినా = హస్తముచేత; స్థగయసి = ఆచ్ఛాదించుచున్నావు. అపర స్త్రీసఙ్గశంసీ = మఱియొక యువతియొక్క సాంగత్యమును జెప్పుచున్నదియు; ప్రతిదిశమ్ = సర్వదిక్కులయందు; విసర్పన్ = వ్యాపించుచున్నదయునగు; నవపరిమళగన్ధః = నూతనసుగంధము; కేన = ఏసాధనముచేత; వరీతుమ్ = ఆవరించుటకు; శక్యః = వశము?

లుఁ. నన్=నన్ను; చెనకకు=ముట్టకుము. కీర్తికాంతయె=కీర్తియనువని తయె; నీకున్; ప్రియాంగన = ప్రియురాలు. ఎఱుంగుదుఁ = తెలి యుదును.

ఇందు నాయికాంతరంగమాత్రవేద్య మగుభావవైషమ్యరూప విప్రియమును నరసభూపాలుఁడు చేసినట్లు చెప్పినందున శఠనాయకో ద్ధాహరణమని తాత్పర్యము.

నాయకసహాయనిరూపణము.

క. ప్రకటీకృతు లగునీనా
యకులకు విటపీఠమర్ద ♦ లనఁ జేటవిదూ
షకు లనఁ గలరు ప్రియాకే
ళికలాసంఘటనపటిమ ♦ లీలాచార్యుల్.

టీ॥ ప్రకటీకృతులగునీనాయకులకున్ = ప్రకటింపఁబడిన యీ దక్షిణాదినాయకులకు; ప్రియా...ఆచార్యుల్, ప్రియా = ప్రియురాండ్ర యొక్క, కేళికలా = క్రీడానైపుణ్యముయొక్క, సంఘటన = కూర్పుట యందు, పటిమ=సామర్థ్యమునందు, లీలాచార్యుల్= విలాసగురువులు; విటపీఠమర్దులనన్=విటుండుపీఠమర్దుండుఅనియు; చేటవిదూషకులనన్= చేటుండువిదూషకుండుఅనియు; కలరు.

దక్షిణానుకూల ధృష్టశఠనాయకులకు విటుఁడు పీఠమర్దుఁడు చేటుఁడు విదూషకుఁడు అని నలుగురు శృంగారక్రియాసహాయులు గలరని తాత్పర్యము.

విటాది విశేష లక్షణములు.

చ. వసుమతి నేకవిద్య గల♦వాఁడు విటుం డనఁ బొల్చు నాయకో
ల్లసనముకన్నఁ గొంతగుణ♦లక్షణహీనుఁడు పీఠమర్దకుం

యసదృశ బాలికాసుఘట♦నాదిరహస్యవిదుండు చేటకుం
డనఁగ నజస్రహాస్యరస♦హేతువు వాఁడు విదూషకుం డగున్. 37

టీ॥ వసుమతిన్ = భూమియందు; ఏకవిద్యగలవాఁడు=శృంగారోపయుక్తములగుగాంధర్వాదులలో నొకవిద్యగలవాఁడు, "శ్లో॥ ఋతుమాల్యాలఙ్కారైః ప్రియజనగాన్ధర్వకావ్యసేవాభిః। ఉపవనగమనవిహారైశ్శృఙ్గారరస స్సముద్భవతి ॥" అని భరతవచనము; దీనియర్థము వెనుక వ్రాయంబడియె. విటుండనఁబొల్చున్ = విటుఁడననొప్పును. నాయకోల్లసనముకన్నన్ — నాయకునికన్నననుట; కొంత.. హీనుఁడు =గుణములచేతను లక్షణముచేతను గొంచెముతక్కువయైనవాఁడు; పీఠమర్దకుండు = పీఠమర్దకుఁడనువాఁడగు. అసదృశ...విదుండు = సాటిలేనట్టుగా స్త్రీసంఘటనము మొదలగు వాని రహస్యమును దెలిసినవాఁడు; చేటకుండు=చేటుఁడనువాఁడగును. ఎసఁగన్=ఒప్పునట్లు; అజస్ర.. వాఁడు=మిక్కిలిహాస్యరసమునకు హేతువైనవాఁడు; ఇలన్=భూమియందు; విదూషకుండు = విదూషకుఁడనువాఁడగును.

ఇఁక నాయికానిరూపణమున స్వీయాలక్షణము.

క. ఈమతమున స్వీయాఽన్యా-
సామాన్య లనంగఁ గలరు♦ సతులందుఁ ద్రపా
సామగ్రీశీలార్జవ
కోమల కమనీయ స్వీయ♦గుణములఁ జెలఁగున్. 38

టీ॥ ఈమతమునన్ =ఈశృంగారమతమునందు; సతులు=నాయికలు; స్వీయాఽన్యాసామాన్యలనంగన్ = స్వీయ పరకీయ సామాన్య అనఁగ; కలరు=ఉన్నారు. అందున్ = వారలయందు; స్వీయ = స్వీయ

HYDERABAD

యనునది; త్రపా...కోమల, త్రపానామగ్రీ=లజ్జాసంపూర్ణత చేతను, శీల=సత్స్వభావముచేతను, ఆర్జవ=అకుటిలత చేతను, కోమల=మృదుల స్వభావయై; కమనీయ=మనోజ్ఞయై; గుణములన్=ఉత్తమగుణముల చేత; చెలఁగున్=ఒప్పును.

లజ్జాశీలసంరక్షణార్జవక్షమాదులు స్వీయకుగుణము లని తాత్పర్యము. స్వామియందే యనురాగము గలది స్వీయయని రసమంజరి లక్షణము.

పరకీయాసామాన్యల లక్షణములు.

క. అన్య యనఁగ నన్యోఢయుఁ
గన్యయు సామాన్య యనఁగ ♦ గణికామణి యీ
మాన్యల కుదాహరణము ల
నన్యాదృశవిశదఫణితి ♦ నాపాదింతున్. 39

టీ॥ అన్యయనఁగన్=పరకీయయనఁగా; అన్యోఢయున్=అన్యునిచే వివాహితయు; కన్యయున్=అవివాహితయు; సామాన్యయనఁగన్=సామాన్యానాయికయనఁగా; గణికామణి= వేశ్యారత్నము. ఈమాన్యలకున్=ఈనాయికలకు; ఉదాహరణములు= లక్ష్యములను; అనన్యాదృశ...ఫణితిన్ = అసదృశమువిశదమునగువాక్కుచేత ; ఆపాదింతున్ = నిరూపింతును.

§ ఇట్లన్యయొక్క భేదములు చెప్పఁబడినవి, లక్షణముగాని గుణములుగాని చెప్పఁబడలేదు. ఇంతియె లక్షణ మన్నచోఁ బతివ్రతయునన్యోఢయే యనియతివ్యాప్తివచ్చుఁగాన“అప్రకటపరపురుషానురాగ పరకీయ” యని దీని లక్షణము దెలియునది. గూఢమైన పరపురుష విషయకా

నురాగము గలదిపరకీయ యనిదీని యర్థము. ఇట్లుసామాన్యకుఁ జెప్పిన లక్షణమును బరిణీతయయిపతివ్రతయయిన గణికయందును గణికేత రయగు స్వైరిణియందు నతివ్యాప్త్యవ్యాప్తిదోషగ్రస్తముగాన విత్త మాత్రోపాధికపురుషానురాగసామాన్యయని లక్షణము తెలియునది. ధనమే నిమిత్తముగాఁగల పురుషానురాగముగలది సామాన్యయని దీని యర్థము.

స్వీయ కుదాహరణము.

చ. అమృతమువంటిసద్గుణము ♦ నంచితచంద్రకలావిలాసభా
వము శివగోత్రభూతియు న♦వారణఁ దాల్చి యశఃపురంధ్రి దాఁ
గమలవనీహితాన్వయశి♦ఖామణి యైననృసింహమేదినీ
రమణున కేకపత్ని యన ♦ రంజిలు లోకము లెల్ల మెచ్చఁగన్.

టీ॥ యశఃపురంధ్రి=యశస్సనుపతివ్రత;అమృతమువంటిసద్గుణము =అమృతతుల్యమగునుత్తమగుణమును, తెల్లఁదనమనితోఁచును; అంచిత...భావము=ఒప్పుచున్న చంద్రకలలతో సమానమగు శృంగారచేష్టా విశేషమును, తెల్లఁదనమును; శివగోత్రభూతియున్=మంగళకరమైనవం శసంపదను, కైలాససంపదను, అనఁగా తెల్లఁదనమును; అవారణన్= నిరర్గళముగ; తాల్చి=ధరించి; తాన్; కమల...రమణునకున్=సూర్య వంశశ్రేష్ఠుఁడగునరసభూపాలునకు; ఏకపత్ని యనన్=పతివ్రతయనునట్లు; లోకములెల్ల మెచ్చఁగన్=సమస్తలోకములు మెచ్చునట్లుగా; రంజిలున్ =ప్రకాశించును.

ఇందు నమృతమువంటిలజ్జాశీలార్జవాదిసద్గుణములు, చంద్రక లలవలె నాహ్లాదకర మగువిలాసము, సత్కులప్రసూతియు, యశః పురంధ్రియందుఁ జెప్పినందున స్వీయోదాహరణమని తాత్పర్యము.

పరకీయోదాహరణము.

సీ. పారసీకక్షమా♦పతులచొ ప్పడఁగించి
నేర్పు మీఱఁగ మోహ♦నిద్ర పుచ్చి
యవనసేనాధినా♦యకులదో స్తంభసం
భరితప్రతాపదీ♦పంబు లడఁచి
యభిభూతఖానమ♦ల్కావిష్కృతాయశో
ధ్వాంతసంతతి కాత్మ ♦ సంతసిల్లి
సమరపుష్కరతురు ♦ ష్కప్రాప్తసీమల
నడుగు మోవఁగ నీక ♦ యరుగుదెంచి

తే. ప్రాజ్యసామ్రాజ్య యగువారి♦రాజ్యలక్ష్మి
కదనసంకేతమున జార ♦ కాంతయగుచు
నంచితస్ఫూర్తి నిను వరి♦యించె నౌర
వైరిగజసింహ యోబయ ♦ నారసింహ.

టీ॥ వైరిగజసింహ = శత్రువులను నేనుఁగులకుసింహమా! ఓబయ నారసింహ = ఓబయకుమారుఁడైన నరసభూపాలుఁడా! పారసీక... చొప్పు=పార్సీదేశపురాజులయొక్క భంగిని; అడఁగించి = తగ్గించి; నేర్పు మీఱక్ = చాతుర్యమతిశయించునట్టుగా; మోహనిద్ర = మూర్ఛ యనునిద్రను; పుచ్చి=పొందించి; యవన...దీపంబులు, యవనసేనాధి నాయకుల = యవనసైన్యాధిపతులయొక్క, దోస్తంభ = స్తంభముల వలెనుండుబాహువులయందు, సంభరిత=నిండిన, ప్రతాపదీపంబులు= ప్రతాపమను దీపములను; అడఁచి=ఆర్చి; అభిభూత...సంతతికిన్, అభిభూత = పరాభవమునుజెందిన. ఖానమల్క = ఖానమల్క యనునామ

ముగలశత్రువుయొక్క, ఆవిష్కృత = ప్రకటితమైన, అయశోధ్వాంత సంతతికిన్ = అపకీర్తియను నంధకారసమూహమునకు; ఆత్మన్=హృదయమందు; సంతసించి = సంతోషించి; సమర...సీమలన్, సమర = యుద్ధమునందు, ముష్కర = మూర్ఖులగు, తురుష్క = తురకలచేత, ప్రాప్త = పొందఁబడిన, సీమలన్ = ప్రదేశములయందు; అడుగు=పాదమును; మోవఁగనీక=ఆననీయక; అరుగుదెంచి = వచ్చి; ప్రాజ్య... లక్ష్మి=బహుళమైన సామ్రాజ్యముగల శత్రురాజ్యలక్ష్మి; కదనసంకేతమునన్ = యుద్ధమనుసంకేతస్థానమందు; జారకాంతయగుచున్ = జారస్త్రీయగుచు; అంచితస్ఫూర్తిన్ = శ్రేష్ఠమైన ప్రకాశముచేత; నిన్నున్; వరియించెన్.

ఇందు శత్రురాజ్యలక్ష్మి పారసీకరాజులనుపతుల నిద్రవుచ్చి ప్రతాపదీపముల నార్చి యపకీర్తి యను నంధకారమునకు హర్షించి జనభూయిష్ఠప్రదేశముల నడుగిడక నరసభూపాలునిఁ జేరెనని చెప్పినందున గూఢవ్యాపారములు గలిగినపరకీయ కుదాహరణమని తాత్పర్యము.

§ అయిననిందు రాజ్యలక్ష్మి గూఢ వ్యాపారములు బహునాయక విషయములుగా నుండుటంజేసి యిది పరకీయాభేదములలో నధమయగు కులటకుదాహరణముగాఁ దోఁచుచున్నది. గుప్తావిదగ్ధాముదితాలక్షితాకులటాప్రభృతులకుఁ బరకీయయందే యంతర్భావమని రసమంజరియందున్నది.

కన్యోదాహరణము.

శా. ఆజానేయము నెక్కి యోబయనృసింహస్వామి వాహ్యాళి రా
నోజం గాంచనసౌధవీథికఁ దదీయోల్లాసముం జూచి మా
తేజోవిభ్రమధన్య కన్య మదనార్తిం జెంది ప్రాసాదపా
ళీజాగ్రన్మణిపుత్రికానియతిఁ దాల్చెన్ దద్గతస్వాంతయై 42

టీ॥ ఓబయనృసింహస్వామి = ఓబయకుమారుఁడైన నరసభూపాలుఁడు; అజానేయమున్ = ఉత్తమాశ్వమును; ఎక్కి = అధిష్ఠించి; వాహ్యాళిరాన్ = విహారార్థమైరాఁగా; ఓజన్ = ఉత్సాహముచే; కాంచన సౌధవీథికన్ = బంగరు మేడయొక్క ప్రదేశమందు; తదీయోల్లాసమున్ = ఆరాజుదైనవిలాసమును; చూచి; మా... ధన్య = లక్ష్మీదేవియొక్క తేజోవిలాసమువంటి తేజోవిలాసముచేత ధన్యయగు; కన్య = అవివాహితస్త్రీ; మదనార్తిన్ = కామబాధను; చెంది = పొంది; తద్గతస్వాంతయై = ఆనృసింహునిబొందినమనస్సుగలదై; ప్రాసాద... నియతిన్, ప్రాసాదపాళీ = మేడలపజ్క్తియందు, జాగ్రత్ = ఉండునట్టి, మణిపుత్త్రికా = మణిమయమైనబొమ్మయొక్క, నియతిన్ = నియమమువంటి నియమమును; తాల్చెన్ = ధరించెను.

కవి నరసభూపాలునిగూర్చి యనధరింపుమనియుపక్రమించి సంబోధ్యుఁడగు నరసభూపాలుని "తదీయోల్లాసము, తద్గతస్వాంతయై" అని తటస్థునిఁబోలెఁ జెప్పుట యసంగతముగాఁ దోఁచుచున్నది. ఇట్లున్యంబులు పెక్కులు గలిగియున్నవి.

సామాన్యోదాహరణము.

క. ఏరీతివారు చెందిన
నారీతిఁ దదీయరాగ ♦ మందెడి నేరా
వారాంగన యది సాత్త్వి
త్కారఫుఁ బటికంపుబొమ్మ ♦ గాఁబోలుఁ జుమీ. 43

టీ॥ వారాంగన = వేశ్యాంగన; ఏరీతి వారుచెందినన్ = ఏవిధమువారుపొందినను; ఆరీతిన్ = ఆప్రకారముగ; తదీయరాగమున్ = వారి

సంబంధియైనయనురాగమును; అందెడిన్ = పొందును. ఔర=ఆశ్చర్యము! అది=ఆవారాంగన; సాక్షాత్కారపుఁబటికంపుబొమ్మ = ప్రత్యక్షమైనస్ఫటికపుప్రతిమ; కాఁబోలుఁజుమీ = కావచ్చునుజుమీ.

స్ఫటికపుప్రతిమ తనయొద్దనుంచిన పదార్థముల రంగును పొందునట్లు వారాంగనయు ఘటిల్లిన పురుషులయనురాగము పొందుననుట. ఇదివిత్తమాత్రోపాధిక సకలపురుషానురాగ సామాన్య యను లక్షణమునకే సరియైనలక్ష్యంబగుఁ గాని యేతద్గ్రంథోక్తలక్షణమునకు సరియైనదిగాదు.

ముగ్ధాదిభేదంబులు.

క. ఈమగువల కాద్యయ ము
గ్ధామధ్యాప్రౌఢ లనఁగఁ ♦ దగు నవ్యవయో
వ్యామిశ్రితయోగ్యము లగు
నామములు తదీయలక్ష ♦ ణము లేర్పఱతున్. 44

టీ॥ ఈమగువలకున్=ఈనాయికలకు; ఆద్యయ = మొదటిదగు స్వీయయె; ఇందు "ఆద్యయు" ననుపాఠమున సముచ్చయార్థకయుశబ్దము, పరకీయాసామాన్యలకు ముగ్ధాదిభేదమ్ములు లేనందున నన్వయింపదు, కాన "నాద్యయ" యనుపాఠమే యుక్తముగాఁ దెలియునది, ముగ్ధామధ్యాప్రౌఢలనన్=ముగ్ధమధ్యప్రౌఢయనిమూఁడుప్రకారములుగ; తనరన్=ఒప్పను. నామములు=పేరులు, ముగ్ధాదులనుట; నవ్య... యోగ్యములు, నవ్య=నూతనమగు, వయః=యౌవనముచేత, వ్యామిశ్రిత=మిశ్రితములుకావున, యోగ్యములు=ప్రశస్తములు; అగున్. తదీయలక్షణములు=ఆముగ్ధాదులయొక్క లక్షణములను; ఏర్పఱతున్=నిరూపింతును.

§ ఇందు, "స్వీయ, ముగ్ధ మధ్య ప్రౌఢయను భేదములు గలదియగు, వాని లక్షణము లేర్పఱతు" నని యుండుట మాత్రము యుక్తంబు. అతిరిక్తంబగు నవ్యవయోవ్యామిశ్రిత యోగ్యములను విశేషణము నిరర్థకము అనన్వితంబునని తోఁచుచున్నది. ఎట్లన, నామములు శబ్దాత్మకములు గాన నందు నవ్య వయోవ్యామిశ్రితములను విశేషణ మన్వయింపదు. వయస్సు, పదార్థధర్మముగాని శబ్దధర్మము కాదనుట స్పష్టము. వయఃపదము లక్షణచేత నవ్యవయ ఆదిబోధకపదపర మని తాదృశపద ఘటితనామములని యర్థమన్నచో, నట్టినామములు, నవనవకామ యౌవనేత్యాదిలక్షణముల కన్న వేఱుగఁ జెప్పనందునను, లక్షణము లన్నమాత్రముననే చరితార్థమైనందునను, నిది యుక్తముగాఁ దోఁప లేదు. వెండియు "సర్వాసామపినారీణాం యౌవనం తు చతుర్విధమ్। ప్రతియౌవనమేతే 'సాక్షాచ్చేష్టితానిపృథక్పృథక్" అని ప్రథమద్వితీయతృతీయచతుర్థభేదములచే నాలుగు తెఱంగులుగ స్త్రీలయౌవనము పూర్వులు నిరూపించియు, "తత్ర శృఙ్గారయోగ్యత్వం రసాహ్లాదనకారణమ్। ఆద్యద్వితీయయోరేవ నతృతీయచతుర్థయోః" అని ప్రథమ ద్వితీయములే రసోపయుక్తములుగాని తృతీయచతుర్థములు గావని చెప్పిరి. ఇఁక నవ్యవయస్సే మధ్యాప్రౌఢలందుండునని చెప్పుట కలవికాదు. మఱియుఁ బ్రథమద్వితీయ యౌవనములు మాత్రము నవ్యభిప్రేతములగు నేని, యట్లు బోధించుటకు నవ్యవయఃపదము సమర్థమును గాదు. యుక్తాయుక్తములు సూరివర్యు లూహించునది.

ముగ్ధాదిలక్షణములు.

చ. నవనవకామయౌవనస♦నాథయు నల్పరతంబు గల్గున
య్యువిదయె ముగ్ధ మధ్య సదృ♦శోదితయౌవనకామయై రతాం

తవివశ యౌవలతాంగి సత ♦ తప్రథితోల్బణకామయౌవనో
త్సవయు రతాది మోహమును ♦ దాల్చుతలోదరి ప్రౌఢ దా నగున్.

టీ॥ నవ...సనాథయున్ = అతినూతనమగుకామమును యౌవ
నమునుగలదియు; అల్ప...ఉవిదయె = స్వల్పరతము గలుగునట్టియౌ
వనితయె; ముగ్ధ = ముగ్ధయగును. సదృశ...కామయై = తుల్యమగు
నట్లుగా నుదయించిన యౌవనముకామముగలదై; రత.. లతాంగి=
రతాంతసమయమందుఁ బరవశయగునట్టిస్త్రీ; మధ్య=మధ్యయగును.
సతత.. ఉత్సవయున్=నిరంతరము నుప్పొంగు కామయౌవనాతిశయము
గలదియు; రత...తలోదరి=సురతాదియందుఁ బరవశతనుఁజెందునట్టి
వనిత; తాన్=తాను; ప్రౌఢ = ప్రౌఢయనునది; అగున్ = అవును.
తాత్పర్యము స్పష్టము.

ముగ్ధకుదాహరణము.

శా. ఆలాపంబున కుత్తరం బొసఁగ దా♦యాసంబునం గాని తా
నాలోకింపదు పాటలాధరమరం♦దాస్వాదసమ్మర్దముం
దాళం జాలదు కౌఁగి లియ్యదు తనూ♦తాపంబు చల్లాఱఁగా
నేలజ్జావతి తద్రతంబు దయితా ♦ భీష్టంబు గా కుండునే. 46

టీ॥ ఏలజ్జావతి = లజ్జగలయేస్త్రీ; ఆలాపంబునకున్=పలుకున
కు; ఉత్తరంబు=బదులుపలుకును; ఒసఁగదు=ఇయ్యదో; తాన్; ఆయా
సంబునన్ గాని=శ్రమవలననేగాని; ఆలోకింపదు=చూడదో; పాటల...
సమ్మర్దమున్, పాటలాధర=ఎఱ్ఱనిపెదవియొక్క, మరంద=రసముయొ
క్క, ఆస్వాద=పానముయొక్క, సమ్మర్దమున్=సంబాధమును; తా
ళంజాలదు=ఓర్వఁజాలదో; తనూతాపంబు=శరీరసంతాపము ; చల్లాఱఁ

గాన్=శమించునట్లుగా ; కౌఁగిలియ్యదు=ఆలింగనముచేయదో; తద్రతంబు=ఆస్త్రీసురతము; దయితాభీష్టంబు=ప్రియునకిష్టమయినది; కాకుండునే ? అగుననుట.

ఇందు నాయికకు లజ్జాన్వితత్వము అల్పరతము చెప్పినందున నిది ముగ్ధకుదాహరణమని తాత్పర్యము.

మ ధ్య కు దా హ ర ణ ము.

ఉ. మానితవైఖరి న్మణిత ♦ మంత్రములం గబరీవినిర్గళ
త్సూనములం బ్రసూనశర ♦ శూరునిపూజ లొనర్చి తా రతి
న్మానిని యొప్పె నప్పు డస ♦ మానమనోంబుజవీథి నాతనిన్
ధ్యానము సేయుకైవడి ర ♦ తాంతనితాంతనిమీలితాక్షియై. 47

టీ॥ మానిని=స్త్రీ; రతిన్=సురతమందు; మానితవైఖరిన్=మంచిరీతిచేత ; మణితమంత్రములన్ = రతికూజితములను మంత్రములచేతను; కబరీ. . .సూనములన్=తలవెండ్రుకలనుండి జాఱుచున్న పువ్వులచేతను; ప్రసూన. . .పూజలు = మన్మథునియొక్క పూజలను; ఒనర్చి=చేసి; తాన్; అప్పుడు=ఆసమయమందు; రతాంత. . .అక్షియై= సురతాంతమందు మిక్కిలిమూయఁబడిన కన్నులుగలదై; అసమాన. . .వీథిన్ = సాటిలేనిమానసపద్మముయొక్క ప్రదేశమునందు; ఆతనిన్=ఆమన్మథుని; ధ్యానముసేయుకైవడిన్ = ధ్యానముచేయునట్లు; ఒప్పెన్=ప్రకాశించెను.

ఇందు రతాంతమునందు మోహమును జెప్పినందున నిది మధ్యకుదాహరణమని తాత్పర్యము.

ప్రౌఢ కుదాహరణము.

మ. నటదుత్తుంగపయోధరంబు జితమం ♦ దాక్షక్రియోదార మ
స్ఫుటవాగంకుర మక్షికోణనివస ♦ త్పుష్పేషుదర్పంబు సం
ఘటితాలింగనవామనీకృతకుచా ♦ గ్రప్రౌఢరోమాంచమై
విటుఁ జొక్కించెఁ బ్రఫుల్లపద్మనయనా ♦ పీరాయితం బెంతయున్.

టీ॥ ప్రఫుల్లపద్మనయనా పీరాయితంబు=వికసించిన పద్మములవంటినేత్రములుగల స్త్రీయొక్క ఉపరిరతము; నటత్...ధరంబు =చలించుచున్నట్టి యున్నతమైన స్తనములుగలది; జిత...ఉదారము=జయింపఁబడిన లజ్జావ్యాపారము గలదగుటచే నధికమైనది; అస్ఫుటవాగంకురము = అవ్యక్తమగు వాక్కులయొక్క యావిర్భావము గలది; అక్షి...దర్పంబు, అక్షికోణ=కడకంటియందు, నివసత్=వసించునట్టి, పుష్పేషు = మన్మథునియొక్క, దర్పంబు = గర్వము గలది; కటాక్షము మిక్కిలి మదనోద్దీపకమయిన దనుట ; సంఘటిత...రోమాంచమై, సంఘటితాలింగన = బాగుగఁగూర్పఁబడిన యాలింగనముచేత, గాఢాలింగనముచేతననుట, “శ్లో॥ గాఢాలిఙ్గనవామనీకృతకుచప్రోద్భిన్నరోమోద్గమా” అని యమరుకము, వామనీకృత=కుఱుచలుగాఁ జేయఁబడిన, కుచాగ్ర=స్తనాగ్రములయందు, ప్రౌఢ=అతిశయించిన, రోమాంచమై=పులకలుగలదై; విటున్ = ప్రియుని; చొక్కించెన్ = ఆనంద పెట్టెను.

ఇది జితమందాక్షక్రియోదారత్వాదులు వచించుటచేత “శ్లో॥ స్మరమన్దీకృతవ్రీడా ప్రౌఢా సంపూర్ణయౌవనా” యను ప్రాచీనలక్షణము ననుసరించిన ప్రౌఢోదాహరణమని తాత్పర్యము.

§ ఇందు విటశబ్దము పురుషసామాన్యమునుగాని తద్విశేష మగు పతినిగాని బోధింపఁదగిన శక్తిగలదిగాదు. మఱి యేమన్న " వేశ్యాపతిర్భుజఙ్గస్స్యాత్ షిద్గః పల్లవికోవిటః " అనుకోశమునను, మహాకవి వ్యవహారమునను, జారుని బోధింపఁదగిన శక్తిగలది. వివాహమాడిన పతియందె పరమ ప్రీతిగలిగి పతివ్రతయనంబరఁగుచున్న స్వీయ జారునిఁ జొక్కించుట స్వీయాలక్షణ విరుద్ధమయినదిగావున, నిది స్వీయాప్రౌఢోదాహరణముగాఁదగదు. లజ్జాకామతారుణ్య తారతమ్యములనుబట్టి యేర్పఱుపఁబడిన ముగ్ధామధ్యా ప్రౌఢాభేదములు, స్వీయకే గాని పరకీయాసామాన్యలకు లేవనుట ప్రామాణిక బహుగ్రంథ సమ్మతము. ప్రకృతగ్రంథకర్తయు "స్వకీయాపరకీయాచసామాన్యా చేతిసాత్రిధా। సాచస్వీయాత్రిధాముగ్ధామధ్యా ప్రౌఢేతికథ్యతే" ఇద్యాదిగా, "స్వీయాత్రయోదశవిధా ద్వివిధాతుపరాఙ్గనా । వేశ్యైకై వంషోడశధా తాశ్చావస్థాభిరష్టభిః। ప్రత్యేకమష్టధాతా సాముత్తమాదిప్రభేదతః। త్రైవిధ్యమేవంసచతురశీతి త్రశతంభవేత్" అనిచెప్పిన సింగభూపాలీయరసమంజర్యాది గ్రంథవిభాగము ననుసరించియె "క. ఈమతమున స్వీయాన్యాసామాన్యలనంగఁ గలరుసతులు, ఈమగువలకాద్యయ ముగ్ధామధ్యాప్రౌఢలనఁగఁదగు" అని యుపక్రమించి, "కావున స్వీయత్రయోదశ భావంబువహించు, నన్యపరఁగుద్వివిధమై । యావారాఙ్గన యేకవిధావహాయిక్లిన్నఁగాఁబదార్వురు సుదతుల్॥ తే. మఱియు శృంగారశంభు సంభావితాష్ట తనువులన నీమృగాక్షులు వినుతిఁ గాంతురష్ట విధభేదముల" అనిచెప్పి "క. ఈయెనిమిదిభేదంబులఁ శ్రేయసులుపదార్వురుం బ్రభిన్నాత్మికలై యాయతగతినిలఁనూటిరువై యెనిమిది భేదములను వఱలుదురెలమిన్. క. ఇలనీసంఖ్యలఁదగు సతు। లలయుత్తమ మధ్యమాధమాభిఖ్యలఁజె। న్నలరఁగమున్నూటెనుబది। నలువుగ నాయిక లటంౘ్రునవరసరసి

కుల్" అని యుపసంహారము చేసినవాఁడు. కావున నీకవిమతమునను బరకీయాసామాన్యలకు ముగ్ధాది భేదత్రయములేదనుట స్పష్టమగుచున్నది. ఇట్లుండిన నితఁడు రసమంజర్యాది మతమువాఁడు కాఁడనియు నీతని మతమునఁ బరకీయా సామాన్యలకు ముగ్ధాది భేదత్రయము గలదనియు నూహించుట నిరాకరంబయగును. ఒకవేళఁ బ్రాచీనానురోధముగ నట్లువ్రాసినను నీతనిమతమదిగాదను నమ్మకమున నీపద్యము పరకీయాప్రౌఢకేనియు, సామాన్యాప్రౌఢకేనియు నుదాహరణమగునన్నచో, ఈ మగువలకివిమొదలుకొని కావున స్వీయయను వఱకు నుపక్రమోపసంహారములచే నిర్ణీతమగు స్వీయాప్రకరణముయొక్క మధ్యమున, పరకీయా సామాన్యోదాహరణ మసంగత మగుటయు స్వీయాప్రౌఢోదాహరణంబు వ్యంగ్యమగుటయుఁ బ్రసక్తించునని తోఁచుచున్నది.

ధీరాది భేదములు.

క. ధీర యధీరయు ధీరా
ధీరయు నగు నందు మధ్య ♦ ధీరాఽధీరా
ధీరాధీరాహ్వయముల
ధారుణిఁ బ్రౌఢయుఁ జెలంగుఁ ♦ దల్లక్షణముల్. 49

టీ॥ అందున్=అముగ్ధామధ్యాప్రౌఢలయందు ; మధ్య=మధ్య యనునది; ధీర అధీరయున్ ధీరాధీరయున్=ధీర అధీర ధీరాధీర అనునది ; అగున్. ప్రౌఢయున్=ప్రౌఢనాయికయు ; ధీరా...ఆహ్వయములన్=ధీర అధీర ధీరాధీర యనునామములచేత ; ధారుణిన్=భూమియందు; చెలంగున్=ప్రకాశించును. తల్లక్షణముల్=అధీరాదిలక్షణములు. చెప్పఁబడున్ అనుక్రియ యధ్యాహార్యము.

మధ్యధీరాదిలక్షణములు.

తే. తప్పు గలభర్త మ్రోల సో ♦ త్ప్రాసఫణితిఁ
గేరడము లాడుసతి మధ్య ♦ ధీర సాశ్రు
పరుషవచన యధీర స ♦ బాష్పకుటిల
హారివచన ధీరాధీర ♦ యనఁగఁ జెలఁగు. 50

టీ॥ తప్పుగలభర్త మ్రోలన్=అపరాధియగునాథుని యెదుట; సోత్ప్రాసఫణితిన్=పరిహాసముతోఁ గూడినపలుకుచేత; కేరడములాడుసతి=వంకరమాటలాడుస్త్రీ; మధ్యధీర=మధ్యధీరయగును. సాశ్రు... వచన=కన్నీటితోఁగూడిన కఠినవాక్కులుగలది; అధీర=మధ్యాధీరయగును. సబాష్ప...వచన=కన్నీటితోఁగూడినట్టియు, వంకరలయినట్టియు, మనోహరములైనట్టివాక్కులుగలది; ధీరాధీరయనఁగన్=మధ్యధీరాధీరయనఁగా; చెలఁగున్=ఒప్పును.

ప్రౌఢధీరాదిలక్షణములు.

తే. కాంతుఁ డపరాధి యైన నా ♦ కారగుప్తిఁ
బరఁగి రతివేళ నలయించుఁ ♦ బ్రౌఢధీర
తాడనోగ్ర యధీర యు ♦ దగ్రకుటిల
ఫణితి యుభయాఖ్య వీరి నే ♦ ర్పఱతు వరుస. 51

టీ॥ ప్రౌఢధీర =ప్రౌఢధీరయనునది; కాంతుఁడు =ప్రియుఁడు; అపరాధియైనన్=పరస్త్రీసంభోగాద్యపరాధవంతుఁడుగాఁగా; ఆకారగుప్తిన్=అభిప్రాయవిశేషాదుల మఱుఁగుపఱచుటచేత; పరఁగి=ఒప్పి; రతివేళన్=సురతసమయమందు; అలయించున్=ఆయాసపెట్టును. అధీర = ప్రౌఢాధీర; తాడనోగ్ర=తాడనముచేత భయంకర

యందు; తెలియఁగన్ = విచారింపఁగా; తప్పులేమికిని=అపరాధములే కుంటనుబట్టి; నిన్ననఁజాలక=నిన్నుఁజెప్పఁజాలక; ఊరకుండినన్=మిన్నకుండినను; పలుమఱున్=సారెకు; సాపరాధుగతిన్ = అపరాధముచేసినవానిభంగి; పల్కెదు=వచించెదవు. నీయెడన్=నీయందు; ఎన్నఁడున్=ఎప్పటికిని; తప్పుగలుగునె = అపరాధముండునా ! అంచున్ ; లతాంగి = స్త్రీ; తెలిగన్నులన్ = తెల్లనినేత్రములయందు; అంతటన్=పూర్ణముగ ; నీరునించెన్ = బాష్పమునిండించెను.

ఇందు నాయిక ధీరత్వమువలనఁ దనయభిప్రాయము బయలుపడకుండఁ గొంతవఱకుఁగుటిలోక్తు లాడి పిమ్మట యధీరత్వమువలన నశ్రువులు నించుటంజేసి మధ్యధీరాధీర యగునని తాత్పర్యము.

ప్రౌఢధీర కుదాహరణము.

చ. హితమతి ధూర్తభర్తకెదు ♦ రేగడునేర్పున నేకపీఠసం
గతి హరియించి పల్కుటయు ♦ గ్రక్కున నెచ్చెలి కూడిగంబులం
జతురత నేర్పుచందమున ♦ జాఱఁగఁ ద్రోచి యతిప్రగల్భ యా
సతి యుపచారగౌరవము ♦ సల్పుచునట్లు వహించెఁ గోపమున్. ౫౫

టీ॥ హితమతిన్=అనుకూలబుద్ధిచేత; ధూర్తభర్తకున్ = మోసకాఁడగుప్రియునకు; ఎదురేగడునేర్పునన్ = ఎదురుగాఁబోవుచాతుర్యముచేత; ఏకపీఠసంగతిన్ = ఏకాసనోపవేశసంబంధమును ; హరియించి=పరిహరించి; గ్రక్కునన్=శీఘ్రముగా; నెచ్చెలికిన్ = స్నేహితురాలికి; ఊడిగంబులన్=పనులను; చతురతన్=చాతుర్యముచేత; నేర్పుచందమునన్= చెప్పువిధమున; పల్కుటయున్ = మాటలాడుటనుగూడ; జాఱఁగఁద్రోచి = తప్పించి ; అతిప్రగల్భయాసతి = మిక్కిలిప్రౌఢ

యగునాయిక; ఉపచారగౌరవమునఁ జెప్పినట్లు = ఉపచారాతిశయము సేయురీతిగా; కోపముగ్; వహించెఁ = తాల్చెను, నిర్వహించెననుట.

సంభాషణసహాసనాది కార్యములను జాతుర్యముచేతఁ దప్పించి కోపమును జెల్లించుకొన్నందునఁ బ్రౌఢధీరయని తాత్పర్యము. * "శ్లో॥ ఏకత్రాసనసంగతిః పరిహృతా ప్రత్యుద్గమాద్దూరత స్తాంబూలాహరణచ్ఛలేన రభసాశ్లేషోఽపి సంవిఘ్నితః। ఆలాపోఽపి న మిశ్రితః పరిజనం వ్యాపారయన్త్యాన్తికే కాన్తం ప్రత్యుపచారత శ్చతురయా కోపః కృతార్థీకృతః॥" అనునమరుకపద్యమున నేకాసనసంగతిపరిహారాదులవలనఁ గోపము కృతకృత్యముగఁ జేయఁబడె నని యర్థ మగుచున్నది. కోపమువలనఁ జేయవలసినకృత్యము లుపచారముచేయుభంగి నొనరించె నని తత్తాత్పర్యము. ఇందు "వహించెఁగోపముగ్" అనుటవలనఁ గోపకృత్యములను జేసె నని యర్థముగాక కోపవహనము మాత్రము చేసినట్లభిప్రాయ మగుచున్నది. కావున వహించె ననుదానికి నిర్వహించెననునర్థ ముచితము.

---

* దూరతః = దూరముననుండియె; ప్రత్యుద్గమాత్ = ప్రత్యుత్థానమువలన; ఏకత్ర = ఒకపీఠమందు; ఆసనసంగతిః = ఉపవేశనరూప సంబంధము; పరిహృతా = త్యజింపఁబడినది. తాంబూలాహరణచ్ఛలేన = తాంబూలము తెచ్చునెపముచేత; రభసాశ్లేషోపి = వేగముచేఁ గలుగు నాలింగనమును; సంవిఘ్నితః = విఘ్నసంతముగాఁ జేయఁబడినది. అంతికే = సమీపమందు; పరిజనమ్ = పరివారజనమును; వ్యాపారయన్త్యా = కార్యములయందుఁ బ్రేరణము చేయుచున్నదానిచేత; ఆలాపోపి = సంభాషణమును; నమిశ్రితః = కలియఁజేయఁబడలేదు. చతురయా = ఈప్రకారముగా నేర్పుగలయువతిచేత, కాన్తంప్రతి = ప్రియునిగూర్చి; ఉపచారతః = ఉపచారములు చేయుభంగిని; కోపః = ఈర్ష్యామానము; కృతార్థీకృతః = సఫలీకృతమైనది.

ప్రౌఢాధీర కుదాహరణము.

చ. వరునిఁ గృతాపరాధుని న♦వారణ వారణయాన యీసునం
గెరలి భుజాగుణంబున బి♦గించి వతంసితసారసంబునం
గరము దమింపఁగాఁ దొడఁగెఁ ♦ గాంతుని సాంత్వనశీతలోక్తు లాం
తరనిజకోపతప్తఘృత ♦ ధార లకారణవారిధారగాన్. 56

టీ॥ వారణయాన = ఏనుఁగునడకవంటినడకగలస్త్రీ; కృతాపరాధునిన్=సాపరాధుఁడైన; వరునిన్ = ప్రియుని ; కని = చూచి; అవారణ=అడ్డములేనిదై ; ఈసునన్ = కోపముచేత ; కెరలి=విజృంభించి; కాంతుని...ఉక్తులు = ప్రియునియూఱడింపుచల్లనిమాటలు; ఆంతర...ధారకున్=హృదయమందుండు తనకోపమనెడు వేఁడినేతిధారకు; అకారణ...ధారగాన్ = నిష్కారణజలధారయగుచుండఁగా; భుజాగుణంబునన్ = బాహువనెడుపగ్గముచేత; బిగించి=దృఢముగబంధించి; వతంసితసారసంబునన్ = శిరోభూషణముగఁ జేయఁబడిన పద్మముచేత ; కరము=మిక్కిలి; దమింపఁగాన్=కొట్టుటకు; తొడఁగెన్ = ప్రవర్తించెను.

ఇందు నాయిక ప్రియుని తాడనముచేసినట్లు చెప్పుటవలనఁ బ్రౌఢాధీరయగు నని తాత్పర్యము.

ప్రౌఢధీరాధీర కుదాహరణము.

చ. బొమముడిపాటుజంకె నలు ♦ పూని పురంధ్రులు సాపరాధు లా
రమణులు వేఁడుకొన్న నను♦రాగము దాల్పుదు రట్లు గాదు మ
త్క్రిమ మపరాధలేశమును ♦ దాల్పని నీ విపు డెంత మ్రొక్కినం
దెమలదు శాంతిఁ బొందదు మ♦దీయమనం బికఁ జాలుఁ బ్రార్థనల్.

టీ॥ బొమముడిపాటుజూకేఁ = భ్రూభంగములను బెదిరింపును; అటు; పూని = వహించి; పురంధ్రులు = సచ్చరిత్రలౌనాయికలు; సాపరాధులౌరమణులు = తప్పిదముఁజేసినప్రియులు; వేఁడుకొన్నన్ = ప్రార్థనచేసినచో; అనురాగము = ప్రీతిని; తాల్పుదురు = పొందుదురు. మత్ప్రియము=నాప్రియుఁడా; అట్లుగాదు=అవిధముగాదు. అపరాధ...నీవు= కొంచెమైననపరాధముచేయనినీవు; ఇపుడు; ఎంతమ్రొక్కినన్=ఎంతన మస్కరించినను; మదీయమనంబు = నామనస్సు; తెమలదు = చలింపదు. శాంతిఁబొందదు = కోపమాఱుటనుజెందదు. ఇఁకన్; ప్రార్థనల్ = వేఁడుటలు; చాలున్.

ఇందపరాధిని నిరపరాధి యనుకుటిలోక్తియు, నామనము శాంతిఁ బొంద దను పరుషోక్తియుఁ, గలుగుటవలన నాయిక ప్రౌఢధీరాధీర యగునని తాత్పర్యము.

జ్యేష్ఠాకనిష్ఠాభేదములు.

క. ధారుణి మధ్యయుఁ బ్రౌఢయు
ధీరాధీరాదిభేద ♦ దీపితలై వే
ర్వేరను జ్యేష్ఠ కనిష్ఠయు
నై రంజలి ద్వాదశాఖ్య ♦ లగుదురు వరుసన్. 58

టీ॥ ధారుణిన్=భూమియందు; మధ్యయున్ = మధ్యనాయికయు; ప్రౌఢయున్=ప్రౌఢనాయికయు; ధీరా...దీపితలై =ధీరఅధీరధీరాధీరఅనుభేదములచేతఁ బ్రకాశింపఁజేయఁబడినవారై; వేర్వేరన్ = వేరువేరుగా; జ్యేష్ఠకనిష్ఠయునై =జ్యేష్ఠయనియు కనిష్ఠయనియు భేదములుగలవారై; రంజిలి=ప్రకాశించి; వరుసన్=క్రమముగా; ద్వాదశాఖ్యలగు

దురు=మధ్యధీరజ్యేష్ఠ మధ్యధీరకనిష్ఠ, మధ్యాధీరజ్యేష్ఠ మధ్యాధీరకనిష్ఠ, మధ్యధీరాధీరజ్యేష్ఠ మధ్యధీరాధీరకనిష్ఠ, ప్రౌఢధీరజ్యేష్ఠ ప్రౌఢధీరకనిష్ఠ, ప్రౌఢాధీరజ్యేష్ఠ ప్రౌఢాధీరకనిష్ఠ, ప్రౌఢధీరాధీరజ్యేష్ఠ ప్రౌఢధీరాధీరకనిష్ఠ, యని పండ్రెండు నామములు గలవా రగుదురు.

స్వీయాదిభేదనిరూపణము.

క. కావున స్వీయ త్రయోదశ
భావంబు వహించు నన్య ♦ పరఁగు ద్వివిధయై
యావారాంగన యేకవి
ధావహ యిట్లెన్నఁగాఁ బ♦దార్వురు సుదతుల్. 59

టీ॥ కావునన్=మధ్యాప్రౌఢలు పండ్రెండు భేదములుగలవారగుటవలన; స్వీయ=స్వీయయనునాయిక; త్రయోదశభావంబువహించున్=పదుమూఁడు భేదములుగలదగును, ముగ్ధ యొక్కటి, మధ్యాప్రౌఢలు పండ్రెండు, చేరి స్వీయ పదుమూఁడు భేదములు గల దగు ననుట. అన్య=పరకీయ; ద్వివిధయై=అనూఢకన్యయను రెండుభేదములుగలదై; పరఁగున్=ఒప్పును. ఆవారాంగన=ప్రసిద్ధయగుసామాన్యనాయిక; ఏకవిధావహ=ఒకటేభేదముగలది. ఇట్లెన్నఁగాన్ = ఈరీతిగణింపఁగా; సుదతుల్ = నాయికలు; పదార్వురు=పదునాఱుగురు. "శ్లో॥ స్వీయా త్రయోదశవిధా ద్వివిధాతు పరాఙ్గనా । వేశ్యైకైవం షోడశధా॥" అని ప్రాచీనులు నిట్లే విభజించిరి.

ఇఁక నష్టవిధనాయికానిరూపణము.

తే. మఱియు శృంగారశంభుసం ♦ భావితాష్ట
తనువు లన నిమ్మృగాక్షులు ♦ వినుతిఁ గాంతు

రష్టవిధభేదముల వీరి ♦ యాహ్వయములు
లక్షణము లేర్పరించెద ♦ లలితఫణితి. 60

టీ॥ మఱియుఁ=వెండియు; ఈమృగాక్షులు = ఈనాయికలు ; శృంగార...అనఁ = శృంగారరస మనెడు శివునకు సంభావితము లగు నెనిమిదిశరీరము లనునట్లు, ఈశ్వరుండు పృథివ్యాది శరీరాష్టకము గలవాఁడు గాన ఈయెనమండ్రు శృంగార మను నీశ్వరుని శరీరములుగా భావింపఁ దగినవారనుట; అష్టవిధభేదములఁ=ఎన్మిదివిధములయిన భేదములచే; వినుతిఁగాంతురు=ఖ్యాతినొందుదురు. వీరి యాహ్వయములు=వీరినామములను; లక్షణములు=స్వరూపములను; లలితఫణితిఁ=మృదువాక్కుచేత; ఏర్పరించెదఁ=నిరూపింతును.

స్వాధీనపతికాది లక్షణములు.

సీ. వరుఁడు కైవసమైన ♦ వనిత స్వాధీనభ
ర్తృక ప్రియాగమవేళ ♦ గృహముఁ దనువు
సవరించునింతి వా ♦ సకసజ్జ పతిరాక
తడవుండ నుత్కంఠఁ ♦ దాల్చునింతి
విరహోత్క సంకేత ♦ మరసి నాథుఁడు లేమి
వెస నార్తయగుకాంత ♦ విప్రలబ్ధ
విభుఁ డన్యసతిఁ జెంది ♦ వేకువ రాఁ గుందు
నబల ఖండిత యల్క ♦ నధిపుఁ దెగడి

తే. యనుశయముఁ జెందు సతి కల ♦ హాంతరిత స
జేశుఁడు విదేశగతుఁడైనఁ ♦ గృశతఁ దాల్చు
నతివ ప్రోషితపతిక కాం ♦ తాభిసరణ
శీల యభిసారికాఖ్యయై ♦ చెలువు మెఱయు. 61

టీ॥ వరుఁడు=ప్రియుఁడు; కైవసమైనవనిత = స్వాధీనుఁడుగాఁ గలస్త్రీ; స్వాధీనభర్తృక = స్వాధీనపతికయనఁబడు. ప్రియాగమవేళన్=ప్రియుఁడువచ్చు సమయమందు; గృహముఁ=కేళీగృహమును; తనువున్=శరీరమును; సవరించునింతి = అలంకరించునాయిక; వాసకసజ్జ = వాసకసజ్జయనఁబడును. పతి. . .ఉండన్ = ప్రియునిరాకవిలంబపడఁగా; ఉత్కంఠన్ = ఔత్సుక్యమును; తాల్చునింతి = వహించు నాయిక; విరహోత్క=విరహోత్కంఠితయనఁబడు. సంకేతమరసి=సంకేతస్థానమును వెదకి; నాథుఁడు లేమిన్=ప్రియుఁడు లేకుండుటవలన; వెసనార్తయౌ కాంత=శీఘ్రముగాదుఃఖితయగునాయిక; విప్రలబ్ధ=విప్రలబ్ధయనునదియగును. విభుఁడు=ప్రియుఁడు; అన్యసతిన్=అన్యకాంతను; చెంది=పొంది; వేకువన్=ప్రాతఃకాలమందు; రాన్=రాఁగా; కుందునబల=దుఃఖించుకాంత; ఖండిత=ఖండితయనఁబడు. అల్కన్=కోపముచేత; అధిపున్=భర్తను; తెగడి=నిందించి; అనుశయముఁజెందుసతి=పశ్చాత్తాపమునొందునాయిక; కలహాంతరిత=కలహాంతరితయనఁబడు. నిజేశుఁడు=తనప్రియుఁడు; విదేశగతుఁడైనన్=దేశాంతరముఁబొందినవాఁడైనప్పుడు; కృశతన్=కృశత్వమును; తాల్చునతివ=వహించుస్త్రీ; ప్రోషితపతిక = ప్రోషితపతికయనఁబడు. కాంత. . .శీల=ప్రియునిగూర్చి సంకేతస్థలమునకుఁబోవుట స్వభావముగాఁగలది; అభిసారికాఖ్యయై=అభిసారికయను నామముగలదయి; చెలువుమెఱయున్=అందమై ప్రకాశించును.

కవి ప్రతిజ్ఞా వాక్యము.

క. ఈరీతిఁ జెలఁగునశేషశృం
గారకలాకలితనాయికామణులకు వే

ర్వేర నుదాహరణంబులు
భూరిమధురవచనరచన ♦ ముల నేర్పుఅతుఁగా. 62

టీ॥ ఈరీతిఁగా=ఈవిధమున; చెలఁగు. . .మణులకుఁగా = ఒప్పుచున్న శృంగారవిద్యా ప్రవీణలగు నాయికారత్నములకు; నేర్వేరఁగా=నేఱువేఱుగ; భూరి. . .రచనములఁగా=అధికమైన తీయని పలుకులయొక్క కూర్పులచేత ; ఉదాహరణంబులు=లక్ష్యంబులను ; ఏర్పుఅతుఁగా=నిరూపింతును. ఈయష్టవిధనాయికలకు నుదాహరణములు చెప్పుదుననుట.

స్వాధీనభర్తృకోదాహరణము.

ఉ. శ్రీనిధి యోబభూవరున్ను ♦ సింహుఁడు కైవసమై చెలంగఁగా
భూనుతవైభవస్ఫురణఁ ♦ బొల్చుయశోజలజాక్షి నిత్యస
మ్మానితశీలయై ధవుని ♦ మన్నన నౌదల యెక్కి నట్టివై
మానికవాహిని న్నగు న ♦ మందనిజాతిశయంబు పేర్మికిఁగా. 63

టీ॥ శ్రీనిధి. . .నృసింహుఁడు = సంపన్నిధియునో బయరాజకుమారుఁడునైన నరసభూపాలుఁడు; కైవసమైచెలంగఁగాఁగా = స్వాధీనుఁడై యొప్పఁగా; భూనుతవైభవస్ఫురణఁగా = భూమియందుఁగొనియాడఁబడినవిభవాతిశయముచేత ; పొల్చుయశోజలజాక్షి = ఒప్పుచున్నకీర్తియనెడుస్త్రీ ; నిత్యసమ్మానితశీలయై = నిరంతరమును పూజింపఁబడిన స్వభావముగలదియై; ధవునిమన్ననఁగా =ప్రియునిలాలనముచేత ; ఔదల . . . వాహినిఁగా=శిరముమీఁదనెక్కినగంగను ; అమంద. . . పేర్మికిఁగా=తక్కువకానితనఆధిక్యముయొక్క గౌరవముచేత ; నగుఁగా= పరిహసించును.

ఇందు యశోజలజాక్షికి వరుఁడగునరసభూపాలుఁడు కైవసమైనందున యశోజలజాక్షి స్వాధీనభర్తృక యగునని తాత్పర్యము.

వాసకసజ్జోదాహరణము.

చ. యవనచమూసమూహముల ♦ నాజి జయించి యుదగ్రదిగ్జయో
త్సవవిభవాభిరాముఁ డయి ♦ సారెకు నోబయనారసింహభూ
ధవుఁ డరుదెంచులగ్నమునఁ ♦ దత్పురలక్ష్మి విభూషితోల్లస
ద్భవనవిశేషయై మృగమ♦దద్రవవాసనఁ దాల్చు నిచ్చలున్. 64

టీ॥ ఓబయనారసింహభూధవుఁడు = నరసభూపాలుఁడను ప్రియుండు; ఆజిన్ = యుద్ధమందు; యవనచమూసమూహములన్ = యవనసైన్యచక్రములను; జయించి = గెలిచి; ఉదగ్ర...అభిరాముఁడయి = అధికమగుదిగ్విజయోత్సవవైభవముచేతఁ బ్రకాశించువాఁడయి; అరుదెంచులగ్నమునన్ = వచ్చెడుముహూర్తమునందు ; తత్పురలక్ష్మి = ఆరాజునగరసంపదయనునాయిక; సారెకున్ = మాటికి ; విభూషిత...విశేషయై = అలంకరింపఁబడినవిగనుకనే ప్రకాశించుచున్న మేడలు మొదలగుగృహవిశేషములుగలదై, అలంకరింపఁబడిన కేళీగృహముగలదై యనుట; మృగ...వాసనన్ = కస్తూరినీటివాసనను; నిచ్చలున్ = నిత్యమును; తాల్చున్ = ధరించును.

ఇందుఁ బురలక్ష్మి యనునాయిక తనభర్తయగునరసభూపాలుండు దిగ్విజయశాలియై వచ్చుసమయమందు గృహమును తనువును నలంకరించికొనినట్లు వర్ణించినందునఁ బురలక్ష్మి వాసకసజ్జయగునని తాత్పర్యము.

విరహోత్కంఠిత కుదాహరణము.

ఉ. నెచ్చెలి లీనృసింహధర♦ణీవరుఁ డెచ్చెద మంచుఁ బోయి రా
రిచ్చట నీవునుం గరుణ ♦ యించుక లేకలరంపగుంపులన్
గ్రుచ్చెద వేల మత్ప్రియుని ♦ గూర్పుము మన్మథ నీకుఁ దద్విభుం
దెచ్చుటకై యొసంగెద మ♦దీయకటాక్షము లస్త్రయూస్త్రముల్.

టీ॥ మన్మథ=ఓమదనుఁడా! సచ్చెలులు=సఖులు; ఈనృసింహ ధరణీవరుఁ=ఈనరసభూపాలుని; తెచ్చెదమంచుఁబోయి=తీసికొనివచ్చెదమనిచని; రారు=రారైరి. ఇచ్చటఁ = ఈస్థలమందు ; నీవునుఁ ; కరుణయించుక లేక= దయకొంచెమైనను లేక ; అలరంపగుంపులఁ = పుష్పబాణసమూహములచేత; గుచ్చెదవేల= బాధించెదవేటికి ? మత్ప్రియునిఁ=నావల్లభుని; కూర్పుము = కూడఁజేయుము. తద్విభుఁ = ఆవల్లభుని; తెచ్చుటకై ; మదీయ...అస్త్రముల్=నాకేగంటిచూపులను జయసాధనములగునస్త్రములను; ఒసంగెదఁ=ఇచ్చెదను.

ఇందు నాయిక పతిరాక తడవుండ మదనార్త యైనట్లు చెప్పినందున నిది విరహోత్కంఠిత యగునని తాత్పర్యము.

విప్రలబ్ధ కుదాహరణము.

చ. ఎనయఁగ నీనివాసమున ♦ కే నరుదెంచెద నంచు నాపయిం
గనుఁగొని నిక్కపుంబ్రియము ♦ గల్గినవాఁడును బోలెఁ బల్కియీ
మనికికి రాక తక్కినను ♦ మానెడుఁ గాక మదీయదృష్టికిం
బనుపడి మ్రోల నున్నగతి ♦ మాయలు సేయఁగ నేల భర్తకుఁ.

టీ॥ ఎనయఁగఁ = పొందుటకు ; ఈనివాసమునకుఁ=ఈసంకేతస్థానమునకు; ఏనరుదెంచెదనంచుఁ=నేనువచ్చెదననుచు; నాపయిఁ= నామీఁద; కనుఁగొనఁ=చూచుటగు; నిక్కపుం...బోలెఁ = యథార్థప్రేమగలవాఁడువలె ; పల్కి = వచించి ; ఈమనికికిఁ = ఈనివాసమునకు; రాకతక్కిననుమానెడుఁగాక = రాకున్ననుండుఁగాక. మదీయదృష్టికిఁ=నాచూపునకు; పనుపడి = నాటి ; మ్రోలనున్నగతిఁ=ఎదుటనున్నయట్లు; భర్తకుఁ=ప్రియునికి; మాయలుసేయఁగనేల= మాయలుసేయుటకేమిప్రయోజనము? అట్లుసేయుటతగదనుట.

ఇందు నాయిక సంకేతస్థాన మరసి ప్రియుఁడు లేనందున మన్మథార్తయయి ప్రియునంతట నవలోకించుచున్నట్లు వర్ణించినందున నిది విప్రలబ్ధ యగునని తాత్పర్యము.

ఖండితోదాహరణము.

చ. నృపులకు నెల్లవారల భరించుట యోగ్యము గాన నేఁటిరే
యపరిమితోత్సవంబునఁ బ్రియాసదనంబుల కేఁగి యేగి యా
నెపమున మద్గృహంబునకు నీ వరుదేరఁ బ్రభాత మయ్యెఁ గా
కిపుడు నృసింహ నీపయి నొకించుక వంచన లే దెఱుంగుదుల్. 68

టీ॥ నృపులకున్=రాజులకు; ఎల్లవారలభరించుట=సర్వజనులఁ బోషించుట; యోగ్యముగానన్ = ఉచితముగాన; నేఁటిరే = ఈదిన పురాత్రి; అపరిమితోత్సవంబునన్=అత్యంతోత్సవముచేత; ప్రియాసదనంబుల కేఁగియేగి = ప్రియురాండ్రయిండ్లకుఁబోయిపోయి ; ఆనెపమునన్ = ఆవ్యాజముచేత ; మద్గృహంబునకున్ = నాయింటికి ; నీవరుదేరన్ =నీవువచ్చుటకు ; ప్రభాతమయ్యెన్= నిశావసానసమయమాయెను. కాక=కాని ; నృసింహ=నరసభూపాలుఁడా ! ఇపుడు=ఈసమయమందు; నీపయిన్ = నీయందు ; ఒకించుకవంచనలేదు = కొంచెమైన వంచనలేదు; ఎఱుంగుదున్=తెలియుదును.

ఇందు నాయిక తనపిభుఁడగు నరసభూపాలుఁ డన్యసతులఁ జెంది వేకువ రాఁ గుందుటం జేసి ఖండితయని తాత్పర్యము.

కలహాంతరిత కుదాహరణము.

ఉ. అనఁగ రాని కోపమున (నప్పుడు కాం)నా నతుఁగాంతునిధిక్కరించుచో
నూనమరాగ్రహగ్రహము మానుప లేకపు డుండుఁ బోయెనో

యీననవింటిదంట యిపు ♦ డేఁపఁ దొడఁగె భవిష్యదర్థము
ల్గాననినామనంబునకుఁ ♦ గానలె నిట్టి విషాదవేదనల్. 69

టీ॥ అనఁగరానికోపమునన్ = అడంపరానియాగ్రహముచేత ; కాంతునిన్ =ప్రియుని ; ధిక్కరించుచోన్ =తిరస్కరించునెడ ; మాన దురాగ్రహాగ్రహమున్ =మానమనెడుదురాగ్రహముగల పిశాచమును; మానుపలేక = మానుపఁజాలక ; ఈననవింటిదంట = ఈకుసుమాయుధుఁడు ; అపుడెందుఁబోయెనో=ఆకాలమందెచటికిఁబోయెనో ; ఇపుడేఁపఁదొడఁగెన్ = ఇప్పుడు బాధింపసాగెను. భవిష్యదర్థములన్=కాఁబోవుకార్యములను ; కాననినామనంబునకున్ = తెలియనినామనస్సునకు; ఇట్టివిషాదవేదనల్=ఈపశ్చాత్తాపబాధలు; కానలెన్=కాఁదగినవి.

ఇందు నాయిక ప్రియుఁడు సమీపమునకు వచ్చిన పుడాగ్రహముచే నాతని ధిక్కరించి వెనుకఁ బరితపించుచున్నది గాన కలహాంతరితయగు నని తాత్పర్యము.

§ "అప్పుడు కాంతుని"ననుపాఠముపక్షమున, "నపుడెందుఁబోయెనో" యనుచోట "అపు" డనుదానికిఁ బునరుక్తి గలుగుచున్నయది గాన "నప్పుడుకాంతుని" ననిపాఠముఁ గల్పించి, యావిధంబుగఁ బాదములమీఁదఁ బడునట్టికాంతు నని యర్థము సేయుట యుక్తమని తోఁచుచున్నది.

§ కొందఱు, ప్రకృతపద్యమున అప్పుడు చోన్ అపుడు అనునీమూఁడు పదములు సమానార్థకములే, చోన్ అనునదియు నిటఁగాలవాచకమె. ఇందు రెండు ఎక్కువ. అప్పుడు అను సవరణ సమర్థకముగానున్నను పదమందలి యితర పద్యముల మార్దవమునుబట్టి చూడఁగా

"ఆనతుఁ" అని కవి ప్రయోగించియుండఁబోలునని తోఁచుచున్నది. "ఆనఁగ రానికోపమున నానతుఁగాంతుని ధిక్కరించు నామానన దురాగ్రహ గ్రహము" అని పఠించినచో రెండు క్రియా విశేషణములు కాలబోధకములు సమయును అనియంద్రు.

ప్రోషితభర్తృక కుదాహరణము.

చ. స్థిరయశ యోబభూవరున్ప ♦ సింహ భవద్రిపుభామ కాననాం
తరమున కేగి(యందు) యుండు నిజ♦నాథునిఁ గానక మన్మథార్తయై
వరుని సరోజపత్త్రమున ♦ వ్రాయు నెడం గరము ల్చెమర్పఁగా
నరయ నిజాంగకంబె పగ ♦ యయ్యె నటంచుఁ దలంచు దైవమున్.

టీ॥ స్థిరయశ=శాశ్వతకీర్తి గలవాఁడా ! ఓబ...సింహ=ఓబభూపునిపుత్త్రుఁడవగునరసభూపాలుఁడా ! భవద్రిపుభామ=నీశత్రుభార్య ; కాననాంతరమున కేగి=వనమధ్యమునకుఁబోయి; అందునిజనాథునిఁగానక=అచటఁదనప్రియుఁగానక ; మన్మథార్తయై=కామపీడితయై ; వరునిన్=ప్రియుని; సరోజపత్త్రమునన్=కమలదళమందు;వ్రాయునెడన్=లిఖించునప్పుడు ; కరముల్=హస్తములు; చెమర్పఁగాన్=చెమటపట్టఁగా; అరయన్=విచారింపఁగా ; నిజాంగకంబె=తనశరీరమే; పగయయ్యెన్=శత్రువాయెను. అటంచుఁదలంచుదైవమున్=అనిచెప్పుచు దైవమునుదలంచును.

ఇందు నాయిక తనవిభుఁడు దేశాంతరగతుఁడైనందున మదనార్తయయి కృశించినట్లు వర్ణించినందున నిది ప్రోషితభర్తృక యగుననితాత్పర్యము.

§ ఇది విప్రలబ్ధనాయికోదాహరణముగఁ గానఁబడుచున్నది. రిపువనావళి కేగినఁ దత్కాంత మదనార్తయైనట్లు వర్ణించినచో యు

క్తముగ నుండును. ప్రోషితపతికయనునది, "శ్లో॥ దేశాంతరగతే కాన్తే ఖన్నా ప్రోషితభర్తృకా" యని ప్రియుండు దేశాంతరగతుండు కాఁగా ఖేదము నొందునది యని చెప్పఁబడినది గాని తాను దేశాంతరమునకుఁ బోయి దుఃఖించునది యని కాదు. తన పెనిమిటి నరసరాజు వాడికి వెఱచి పలాయితుఁడగునపుడు తాను బోక నిలిచియుండుట పిదపఁ బురుషసాహాయ్యములేక యేనిఁ బరపురుష సాహాయ్యముననేని నొంటిగనేని నడవికిఁ బోవుట లోనగునది రాజపత్నియందు సంభావితమునుంగాదు. ఇదియెల్లఁబరికించియె రిపుకాననాంతరమునకేగినఁ దత్కాంతమదనార్తయైనట్లు వర్ణించినచో యుక్తముగనుండుననుట. ఏతదనుగుణముగఁ బద్యమున "భవద్రిపు భామకాన నాంతరమునకేగియుండు నిజనాథునిఁగానక" యనియేని, "ఏగినట్టి నిజనాథునిఁగానక" యనియేని మార్చుట మంచిపనియె కాని ప్రకారాంతరముగ నిర్వాహాద్యమము మంచిపని గాదని తలంచెద.

అభిసారికోదాహరణము.

ఉ. నాతి మదిం బ్రియాభిసర ♦ ణంబొనరింపఁ దలంచె దీవు చం
ద్రాతపసాంద్రదీధితు ల ♦ జాండకటాహము నిండఁ బర్వఁగా
నీతలఁ బెట్లు గూడు రమ ♦ ణీ వలెనే నొకవన్నెగాఁగ ము
క్తాతతులుం బ్రసూనములుఁ ♦ దాల్పు మలందుము గంధసారముల్.

టీ॥ నాతి=ఓచిన్నదానా! ఈవు=నీవు; మదిన్=బుద్ధియందు; ప్రియాభిసరణంబు=ప్రియునిగూర్చి సంకేతస్థలమునకుపోవుటను; ఒనరింపన్=చేయుటకు; తలంచెదు=తలఁచుచున్నావు. చంద్రా...దీధితులు = వెన్నెలయొక్క-దట్టమైనకాంతులు; అజాండకటాహము = బ్రహ్మాండభాండము; నిండన్=నిండునట్లు; పర్వఁగాన్ = వ్యాపింపఁగా;

నీతలఁపు=నీకోరిక; ఎట్లుగూడుఁ=ఏరీతిఘటిల్లును? రమణీ=ఓవనితా! వలెనేఁ=కావలసివచ్చినయెడ ; ఒకవన్నెగాఁగ=ఒకతీరంగగునట్లు ; ముక్తాతతులుఁ = ముక్తాహారములను; ప్రసూనములుఁ = పువ్వులను, తెల్లనిపువ్వులననుట ; తాల్పుము = ధరింపుము. గంధసారముఁ = శ్రీగంధమును; అలందుము=పూసికొనుము.

ఇందు ప్రియాభిసరణము చెప్పఁబడినదికావున నాయిక యభిసారికయని తాత్పర్యము

ఈయుదాహరణములయందు నరసభూపాలునినామము కొన్నింటిలో లేకున్నను, యథాసంభవముగఁ దత్తద్విభక్తులతో నధ్యాహారముచేసికొని యన్వయ మూహించునది యని కవి తలంచియుండు.

నా యి క ల స ం ఖ్య.

క. ఈయెనిమిదిభేదంబులఁ
ప్రేయసులు పదార్వురుం బ్ర ♦ భిన్నాత్మికలై
యాయతగతి నిల నూటిరు
వై యెనిమిది భేదములను ♦ వఱలుదు రెలమిన్. 72

టీ॥ ప్రేయసులు=నాయికలు; పదార్వురుఁ=పైఁజెప్పినరీతి స్వీయ పదుమూఁడు తెఱంగులు పరకీయ రెండువిధములు సామాన్య యొకవిధమునగుటచే పదునాఱుగురును; ఈయెనిమిదిభేదంబులఁ=ఈస్వాధీనపతిక మొదలగు నెనిమిదిభేదములచేత; ప్రభిన్నాత్మికలై = భిన్నస్వరూపముగలవారై ; ఆయతగతిన్=విస్తృతవిధముచే, గుణకారముచేననుట; నూటి. . .భేదములను=నూటయిరువదియెనిమిదిభేదములచే; ఎలమిన్=అతిశయముచే; వఱలుదురు=ఒప్పుదురు.

§ ఇందుఁ బ్రేయసీశబ్దము శృంగారాలంబననాయికాపరముగఁ బ్రయోగింపఁబడినది. ఇది ప్రియురాండ్రనునర్థమును బోధించునుగాని యీయర్థమును బోధింపదు. ప్రియురాండ్రనునది, "ఎవరిప్రియురాం" డ్రని నిత్యసాకాంక్షము గావున నిటప్రేయసీశబ్ద ప్రయోగ మయుక్త మని తోఁచుచున్నది.

ఉత్తమాదిభేదములు.

క. ఇల నీసంఖ్యలఁ దగుసతు
లలయుత్తమమధ్యమాధ ♦ మాభిఖ్యలఁ జె
న్నలరఁగ మున్నూటెనుబది
నలువురు నాయిక లటండ్రు ♦ నవరసరసికుల్ 73

టీ॥ ఇలన్=భూమియందు; ఈసంఖ్యలన్=ఈభేదములచేతనను టు; తగుసతులు=ఒప్పుచున్ననాయికలు; అల. . .అభిఖ్యలన్=ప్రసిద్ధములగు ఉత్తమమధ్యమ అధమయను భేదములచేత; చెన్నలరఁగన్=ఒప్పఁగా; మున్నూటెనుబదినలువురు = పూర్వము చెప్పినరీతి గుణింపఁగా మున్నూటయెనుబదినలువురు నాయికలగుదురు ; అటండ్రు నవరసరసికుల్=అటని నవరసజ్ఞులగునాలంకారికులు వచింతురు. ఇది నాయికానాయకప్రకరణము.

ఈప్రకరణమందుఁ గొన్ని విశేషములు దెలియఁదగినవి.ఏవన— స్వీయ పదుమూఁడు భేదములు గలది, పరకీయ రెండుభేదములు గలది, సామాన్య మొకభేదము గలది, ఇట్లు పదునాఱుభేదములు గలనాయికలు స్వాధీనపతికాద లగునెనిమిదిభేదముల చేత నష్టావింశత్యుత్తరశతమితభేదములు గలవారై యుత్తమాదిభేదములచేఁ జతురశీత్యుత్తరత్రిశతమితభేదములు గలవారగుదు రని యేతద్గ్రంథకారాభిప్రాయసారము. రస

మంజర్యాదులు నీయభిప్రాయమునే యిచ్చుచున్నయవి. అయినను, "ఏతే ధీరాదిభేదాః స్వీయాయా ఏవ న పరకీయాసామాన్యయోః ఇతి ప్రాచీనలేఖన మాజ్ఞామాత్రమ్, యతో ధీరత్వ మధీరత్వం వా మాననియతమ్. మానశ్చేత్పరకీయాసామాన్యయో ర్ధీరాదిభేదానాం తయో రప్యావశ్యకత్వాత్" అని రసమంజరీకారుఁడు వ్రాసినందున ధైర్యాధైర్యములను బట్టి కలుగుధీరాదిభేదములు స్వీయకే యనుట నిర్యుక్తికముగా నున్నదనియు, పరకీయాసామాన్యల కట్టి ధైర్యాధైర్యములున్నపు డాభేదములు కలుగ వనుట సాహసమాత్రము గాన వారికిని గలుగ వచ్చు ననియు, తాను స్వీయకే యని వ్రాయుట ప్రాచీనులయభిప్రాయముననే కాని స్వాభిప్రాయమునఁ గాదనియు, వ్యక్తమగుచున్నది. అట్లు పరకీయాసామాన్యలకును ధీరాదిభేదముల నంగీకరించినచో స్వీయ పదుమూఁడు భేదములు కలది, పరకీయ యాఱుభేదములు గలది, సామాన్య మూఁడు భేదములు కలది, గాననిరువదిరెండు భేదములు గలిగిననాయికలు స్వాధీనపతికాది భేదము లెనిమిదింటిచే నూటయెబ్బదియాఱు భేదములుకలవారై యుత్తమమధ్యమాధమ భేదంబుల నష్టావింశత్యుత్తర పంచశత భేదిలగుదురు, ఇట్లు ప్రాచీన మతమునందు ధీరాదిభేదములతోఁ బదునాఱుభేదంబులు గలవారికిఁగాని, రసమంజరీకారాదుల ముఖ్యమతమునందు ఇరువది రెండుభేదంబులు గలవారికిఁ గాని, నాయికలకు, స్వాధీనపతికాది భేదాష్టకముచేతను నుత్తమాదిభేదత్రయముచేతను ఇవ్విధమున భేదములుగలుగుచున్నవి.

ఇటఁ గొందఱు, ముగ్ధాదిభేదత్రయంబును ధీరాదిభేదత్రయంబు నుబ్రాచీనాలంకారికు లెల్లరును స్వీయకు మాత్రమే చెప్పియున్నారు. రసమంజరీకారుండు పరకీయకును ధీర దిభేదములకు మూల మగుమానము గలుగు నని తద్భేదత్రయము చెప్పవచ్చు నని యుపన్యసించినాఁ

ఘు. రసరత్నహారకారుఁడు “ధీరాదిభేదా స్స్వీయాయా ఇతి ప్రాచీన లక్షణమ్। నవ్యైస్తు పకీయాయా అపి తే స్యు రి తీరితమ్ ” అని సంక్షిప్తముగా వచించినాఁడు కాని యీమత ముపాదేయముగా నగపడదు. పరకీయకు తనగుట్టు (తనదురాచారము) ఎవ్వరికేని తెలిసిపోవునో యని భయపడుచుండుదానికి నాయికాంతరరతుఁడైన జారునిపైఁ జిట్టలుక కవకాశ ముండునేమో కాని కట్టలుక కెడము చింత్యము. ఈవిషయంబున గ్రంథవిస్తరభీతిచే విశేషించి యుపపాదింపక విరమించినాఁడను. పరకీయ జారవంచితయై యుండు నని యంగీకరింపఁ దగును గాని అలుగును తిరస్కరించు ననుట యంగీకార్యము గాదు. లోకవృత్తాను భవనిష్ణాతు లగుసహృదయులకు సూక్ష్మవిచారముచేత నీవిషయము తేట తెల్లము గాక మానదు. ఏకదేశమం దెట్టు లున్ననుబ్రాయికంబుగుదానిం గదా లక్షణరచనయందు గ్రహింపవలయును. అనిపరకీయాసామాన్యలకుధీరాదిభేదత్రయమును వారించి వారికిని రసమంజరీకారాదులు వారించినముగ్ధాదిభేదత్రయ ముండ వచ్చునని స్థాపించిరి. వారికా భేదత్రయములేదన్నప్రాచీనులకు నొకటియేనియు రెండేనియుంగూడ లేవని యభిప్రాయము గా దనియు రసమంజరీకారుఁడు తత్తాత్పర్య మెఱుంగక ప్రగల్భాలక్షణములో పతిమాత్రవిషయ అనిమాత్రపదము నుంచినాఁడనియు, స్వీయేతరలయందు ముగ్ధత్వమధ్యత్వ ప్రగల్భత్వ ధర్మములుండవనుట యనుభవసమ్మతము గాదు ధర్మము లుండఁగా తన్మూలముగా ధర్మిభేదముం జెప్పవచ్చు ననియు జ్ఞాతయౌవనా జ్ఞాతయౌవనాదిభేదములు గూడఁ బరకీయలోఁ జేరినకన్యకుఁ దగు ననియు దీని కంతకు వాగ్భటాలంకారశాస్త్రోక్తవిభాగము పుష్పబాణవిలాసవ్యాఖ్యాకారోపదర్శితప్రమాణములు ప్రతాపరుద్రీయము సాహిత్య రత్నాకరము తద్వ్యాఖ్యయుఁ బ్రమాణము లని వ్రాసిని విపులముగ నుపన్యసించిరి.

పరకీయాసామాన్యలకు ధీరాదిభేదత్రయము లేమికి, ప్రాచీనులట్లు చెప్పకుండుట, ఉపపత్తి లేమియు, సహృదయానుభవవిరోధము, అనుకారణత్రయ ముపన్యస్త మైనది. వాత్స్యాయనుండు భరతుఁడు లోనగుమునులు చేసిననాయికా విభాగమునకు, సరస్వతీ కంఠాభరణకారాది ప్రాచీనులు చేసినవిభాగమునకు, దశరూపాది గ్రంథములకు నీవలిగ్రంథములకుఁ గ్రమక్రమముగ నెంతో భేద మగపడుచున్నను నవీనమతములయందుపపత్తినిబట్టి తత్సిద్ధాంతము లంగీకరింపఁబడుచున్నవి గాన నుపపత్తినిగూర్చియే ముఖ్యముగ విచారింపఁదగును. తరుణీతరుణు లొండొరులపై నలుగుటయు తన్మూలముగా వక్రోక్తితర్జనతాడనాదు లొనరించుటయుఁ దదుపశమనమునకై యనునయాదులును ఏకాంతమున నుచితములా? ఎందేనిఁ గర్హ్యములా? శీలసంరక్షణార్జవక్షమాదులతోఁ జేరినస్వీయమైనఁ బ్రకటముగఁ బరులయెదుటఁ బతి దురాచారము నుగ్గడించి తిరస్కరించు ననుట యంగీకార్యము గాదు గదా! ప్రియసఖిసమక్షమున నట్లు చేయు నన్నఁ బరకీయయు వీథిలో నుపపతిని దిరస్కరింపమి ప్రియసఖీ సమక్షమున నట్లొనరించుటయు సమ మని నా తలంపు. దాని కుపపతియం దీర్ష్యయే గలుగదనుట యుక్త్యనుభవములకు దూరము. మఱియు నిట్లు చెప్పినచోఁ బరకీయాసామాన్యలకు ఖండితాదిభేదములు చెప్పిన ప్రామాణికగ్రంథము లన్నియు నిరాలంబనములు కావలసి వచ్చును. దీనింగూర్చి యామోదమందు "యత్తు పరస్త్రియాతు కన్యోఢే ప్రియసంకేతాత్పూర్వం విరహోత్కణ్ఠితే పశ్చాద్విదూషకాదినా సహాభిసరన్త్యా అభిసారికే కుతోఽపి సంకేతస్థాన మప్రాప్తే నాయకే విప్రలబ్ధే ఇత్యవస్థాత్రయమేవానయోరస్వాధీనప్రియయో రవస్థాంతరాయోగా దితి. తచ్చిన్త్యమ్. అవస్థాత్రయ

స్వప్రాయికత్వే ఇతరావస్థానా మపిసంభవాత్, అస్వాధీనప్రియత్వమాత్రే ణావస్థాంతరానంగీకారే స్వీయాదే రపికదాచి దస్వాధీనప్రియత్వేన ఖండితాద్యవస్థాభావ ప్రసక్తాత్. సర్వదా అస్వాధీనప్రియత్వంచ న పరకీయాయాః * "వ్యథయతి వృథా మౌనం తన్వి ప్రపఞ్చయ పఞ్చమం తరుణి మధురాలాపై స్తాపం వినోదయ దృష్టిభిః। సుముఖి విముఖీభావం తావ ద్విముఞ్చ న ముఞ్చ మాం స్వయ మతిశయస్నిగ్ధో ముగ్ధే ప్రియో౽య ముపస్థితః। ఇత్యాదౌ రాధాయాః పరకీయాయాః స్వాధీన శ్రీకృష్ణత్వదర్శనాత్" అని వ్రాయఁ బడినది. దీనివలనఁ బరకీయాదులకు ధీరాదిభేదములు చెప్పుటయందు సహృదయానుభవము లేదనుటయు, సామాన్యముగా పూర్వులు చెప్పిననాయికాభేదాష్టకములో కొన్నిభేదములు స్వీయాదులలోఁ గొందఱకు సంభవింపమి విదితమే కదా అని పరకీయాసామాన్యలకు ముగ్ధాదిభేదత్రయస్థాపనావసరమున వ్రాసినదియు సమాహితంబు లగును. జయదేవున కన్న నిప్పటివారు సహృదయు లని కాని లోకవృత్తానుభవనిష్ణాతు లని కాని యెట్టివారుచెప్పరని తలంచెద.

---

* ఇది యలిగిన రాధనుగూర్చి కృష్ణుని వాక్యము. దీని యర్థమిట్లు. తన్వి=ఓసుందరీ! వృథా=నాయెడ నపరాధము లేకయే; మౌనమ్=నీవుమాటాడకుంట; వ్యథయతి=దుఃఖముగలుగఁ జేయుచున్నది. తరుణి=ఓపడుచుదానా! మధురాలాపైః=తీయనిమాటలచేత; పంచమమ్=పంచమస్వరమును; ప్రపంచయ=విస్తరిల్లఁ జేయుము. దృష్టిభిః=చూపులచేత; తాపమ్=సంతాపమును; వినోదయ=పోఁగొట్టుము. సుముఖి=అందమైనమోముగలదానా! విముఖీభావమ్=వైముఖ్యమును; తావత్=అంతయు; విముఞ్చ=వదలుము. మామ్=నన్ను; నముఞ్చ=వదలకు; ముగ్ధే=మూఢురాలా! అతిశయస్నిగ్ధః=మిగుల స్నేహముగల; అయమ్=ఈనేను; స్వయముపస్థితః=అనాహూతుఁడనయ్యు నాయంత నేనువచ్చితిని. కావున నిట్టిగౌరవమునుబట్టి మానాదులు మాని ననుఁ బ్రేమతో గారవింపుమనుట.

ఇఁక ముగ్ధాదిభేదత్రయము స్వీయాదినాయికాత్రయమునకుఁ గలుగుననుటకుఁ బ్రమాణము "అనూఢాచస్వకీయాచ పరకీయాపణాఙ్గనా అనురక్తా నురక్తేన స్వయం యా స్వీకృతా భవేత్ సానూఢేతి యథా రాజ్ఞో మత్స్యస్తస్య శకున్తలా" అను వాగ్భటవచనము, పుష్పబాణవిలాసవ్యాఖ్యానమునవ్రాసిన సాహిత్యచింతామణికార వచనములును. అవి యెవ్వి యన, "రూపయౌవనలావణ్య లజ్జామాధుర్యశాలినీ। సౌభాగ్యౌదార్యసంపన్నా నాయికా సా పునస్త్రిధా ॥ స్వాన్యా సాధారణ స్త్రీతి తత్ర స్వీయా పరిగ్రహాత్ । సాధ్వీ వినయసంపన్నా కుల శీలార్జవాన్వితా। ముగ్ధా మధ్యా ప్రగల్భేతి స్వకీయా త్రివిధా మతా॥ అన్యాన్యదీయా సాకన్యా పరోఢా ద్వివిధా మతా । రూపాదిగుణసంపన్నా కన్యా ముగ్ధాచ మధ్యమా। సాధారణీతు గణికా రూపసౌభాగ్యశాలినీ। కళావతీ చార్థపరా సా ప్రగల్భైవ వర్ణ్యతే॥ ఏతాః పున రవస్థాభి రష్టధాస్యు ర్యథోచితమ్"అని. ఇట్లు "సంక్షేపేణ నాయికాత్రివిధా ముగ్ధా మధ్యా ప్రగల్భాచేతి" అను ప్రతాపరుద్రీయములో స్వీయా యనక నాయికా అనుటయు సాహిత్యరత్నాకరములోఆదిలో నాయికాభేదములుగా అష్టవిధనాయికలను జెప్పి వెంబడి "ఏతాశ్చ ముగ్ధామధ్యాప్రగల్భాభేదేన త్రివిధా భవన్తి" అనుటయు,ఏతద్వ్యాఖ్యాత యగుమల్లాది లక్ష్మణసూరి "ఏవన్నాయికాస్సామాన్య తోష్టవిధా నిరూప్య తాసామేవ ప్రత్యేకం త్రైవిధ్యేన చతుర్వింశతిసంఖ్యా భవన్తీత్యాహ,ఏతాశ్చేతి, ముగ్ధాస్వాధీనపతికామధ్యాస్వాధీనపతికాప్రౌఢాస్వాధీనపతికేత్యేవంప్రకారేణావస్థాత్రయయుక్తాశ్చతుర్వింశతిసంఖ్యాకాభవన్తీతిభావః" అని వ్రాయుటయు, ప్రమాణము లని వ్రాసి, ఇట్టివి యెల్లం బరికింపఁగా వాగ్భటానుగుణముగా కన్యను బరకీయలోఁ జేర్పక వేఱు చేయుటయు సాహిత్యచింతామణీమతానుసారముగఁ గన్యయందుముగ్ధామధ్యా

భేదంబులను బరకీయాసామాన్యలయందుఁ బ్రగల్భాభేదమాత్రంబును ఒప్పుకొనుట యుచితంబుగా నగపడుచున్నది. సాహిత్యచింతామణికారుఁడు కన్యయందు మధ్యాభేదమును గూడఁ జెప్పినను అది విశేషించి ప్రాయికము గానందుననేని కన్యయం దాభేదమును వర్ణించుట యంత గౌరసవంతము గానందున నేని కన్యయందు ముగ్ధాభేదమును మాత్రమే గ్రహించువారిమతమున "పదార్వురు సుదతుల్" అనులెక్క కు భంగము రాదు, ఎట్లన, స్వీయలుపను ముగ్గురు పరకీయలు కన్య (ముగ్ధ) ప్రౌఢ (ప్రగల్భ) యు నని యిద్దరు. సామాన్య ప్రౌఢ యొకతెయె. ఇదియె ప్రాచీనాలంకారికులమతముగా నుండ నోపు. అని నిర్ణయించిరి.

ఇందు పష్టంభములుగా వ్రాసిన ప్రమాణముల కేకవాక్యతయే తొలుత దుర్ఘటము. అందును ప్రకృత సిద్ధాంతానుగుణ్యము వీనికిసంభవించుట మిగుల దుర్ఘటము "పదార్వురు సుదతుల్" అను మతమును రక్షించుటగదా కర్తవ్యంబు. అది "స్వీయాత్రయోదశవిధా ద్వివిధాతు పరాఙ్గనా, వేశ్యైకైవం షోడశధా" అనుమతము నవలంబించినఁగాని చేకూఱదు. "సంక్షేపేణ నాయికాత్రివిధా" అని చెప్పుప్రమాణములు దీని కెట్లనుగుణములు? ముగ్ధాదిభేదత్రయము స్వీయాదిభేదత్రయమందుఁ బ్రత్యేకమన్వయించును గదా! స్వసమభివ్యాహృత పదార్థతావచ్ఛేదకవ్యాప్యమిథో విరుద్ధయా వద్ధర్మబోధనము విధాపదార్థముగా శాస్త్రకారులు చెప్పిరి. మల్లాదిలక్ష్మణసూరియు, "తాసామేవ ప్రత్యేకం త్రైవిధ్యేన చతుర్వింశతిసంఖ్యా భవన్తి" అని తదనుగుణముగనె వ్రాసె. ఇట్లుండఁగా ముగ్ధాది భేదత్రయము కావలసినచోట మాత్ర మన్వయించి తక్కినచోటఁ బరిహరించుట కూడదు. శ్రీమదప్పయదీక్షితులవారు శివపురాణతామసత్వనిరాకరణమునఁ పురాణములలో

గొన్ని ప్రమాణములు కొన్ని యప్రమాణము లనువారినిగూర్చి "నహి ప్రమాణాని చతుర్ధా ప్రత్యక్షాదిభేదేన, తత్ర ప్రత్యక్షంద్వివిధమ్ లౌకికాలౌకిక భేదేన త్యుక్తేకించి త్ప్రత్యక్ష మప్రమాణీ భవితు మర్హతి॥" అని వ్రాసియున్నారు. అట్లు నాయికలు స్వీయాది భేదములచే మూఁడురనియు, వారు ముగ్ధాది భేదములచేఁ ద్రివిధలనియు చెప్పి యాత్రైవిధ్యము కించిదంశమున నన్వయించును కించిదంశమున లే దనుటకుఁ దరమా? ప్రతాపరుద్రీయసాహిత్య రత్నాకరమతముల నీయనుపపత్తి చేత నాని సాహిత్యచింతామణిమతమునె యవలంబించినను కన్యయందు మధ్యాభేద ముండినందునఁ బదార్వ రనుసంఖ్యకుపపత్తి కాదు. దానిఁ ద్రోసి వేయుట కామతము ప్రమాణముగా నెత్తికొనుటయె చింత్యము.

ఒకవేళ నిరుక్తజయదేవకవిప్రయోగము ఆమోదగ్రంథపంక్తికయుఁ బరకీయకు స్వాధీనపతికాద్యవస్థాష్టకముండు ననుటకు సాధకముగనున్నను, ధీరాదిభేదము లుండుననుటకు గమకములు గావుగదా యని యాశంక దోఁచును. అయినను ధీరాదిభేదములు ఖండితాదిభేదములకన్న నతిరిక్తములుగాఁదోఁపవు, మానావస్థయందుఁగదా ధీరత్వాదులు గలుగుట. మాన మనునది ప్రియాపరాధసూచకచేష్టయేయని చెప్పఁబడినది. ఇట నపరాధము నాయికాంతరగమనాదిరూపమే కాని వేఱొండు గాదు కావున ఖండితాభేద మంగీకరించినపుడు ధీరాదిభేదము లిచ్ఛ లేక పోయిన నంగీకరింప వలయు. దీనిం గూర్చి యామోదమున "నను ఖండితామానవత్యోః ధీరాదీనా మన్యసంభోగదుఃఖితాయాశ్చ ప్రియాపరాధనిమిత్తకేర్ష్యామానధారణేన పరస్పరం కథం భేద ఇతి చేత్సత్యమ్ । ఖండితాయా అన్యవనితోపభోగ చిహ్నితప్రియదర్శనజన్యేర్ష్యావత్త్వమ్ । మానవత్యాః ప్రణయేర్ష్యాసాధారణమానవత్త్వమ్ । ధీరాదీ

నాంచ ప్రియమాత్రవ్యఙ్గ్య కోపప్రకాశత్వాదికమ్। అన్యసంభోగదుః ఖితాయాస్తు ప్రియోపభుక్తదూత్యాద్యుద్దేశకసదుఃఖభావన మితి లక్షణ భేద స్సిద్ధ్యతి, అయంభావః, ఏకైవ ప్రథమం ప్రియాపరాధజ్ఞానజన్యే ర్ష్యావస్థాయాం ఖండితేతి మానాదిరూప మానావస్థాయా మ్మానవతీతి మానస్య వక్రోక్త్యాదిఫలోపహితత్వే ధీరత్వాదివిశిష్టేతి ప్రియోపభు క్తదూత్యాద్యుద్దేశేన దుఃఖితత్వే అన్యసంభోగదుఃఖితే త్యపి వ్యవహ్రి యతే" ఇత్యంతముగాఁ జెప్పఁబడినది. ఇట్లు పరకీయకుఁ బ్రియాప రాధ జ్ఞానజన్యేర్ష్యావత్త్వము సంభవించి ఖండితాభేదము కలుగునపు డు ప్రియమాత్రవంగ్యకోప ప్రకాశ వత్త్వరూపము లగుధీరత్వాదు లు సంభవింపవనుట యుక్తిమంతము కాదని తలంచెద.

"పరోఢాం వర్జయిత్వాథ వేశ్యాం చాననురాగిణీమ్। ఆల మ్బన న్నాయికా స్స్యుర్దక్షిణాద్యాశ్చనాయకాః" అని సాహిత్య దర్పణము, "పరోఢాతు పరేణోఢా ప్యన్యసంభోగలాలసా। లస్యాస్తు క్షుద్రప్రబన్ధే సా సప్తశత్యాదికే బుధైః" అని సింగభూపాలీ యము, "సామాన్యవనితా వేశ్యా సా ద్రవ్యపర మిచ్ఛతి। గుణ హీనేనచ ద్వేష్టి నానురక్తా గుణి న్యపి। శృఙ్గారాభాస ఏతస్యాన్న శృఙ్గారః కదాచన, అని గ్రంథాంతరము పరిశీలింపఁగాఁ బరకీయాసా మాన్యలకు నాయికాత్వమె దుర్ఘట మని యేర్పడుచుండుటంబట్టి తన్మ తానుసారముగ సాహిత్యరత్నాకరమందు స్వీయనె నాయికగాఁ దలఁచి దానికి బ్రోషితపతికాది భేదములు చెప్పఁబడియుండునని తలంపవచ్చును. లేనిపక్షమందుఁ బ్రోషితపతికాది భేదాష్టకముచే భిన్న యగు స్వీయా పరకీయా సామాన్యారూప యగునాయికకు ముగ్ధాదిభేదత్రయము చెప్పు టయు "ప్రత్యేకం త్రైవిధ్యేన చతుర్వింశతిసంఖ్యాకా భవన్తి" అని తద్వ్యాఖ్యయందుఁ జెప్పుటయు దురుపపాదము లగును గదా! కొన్ని

గలిగి కొన్ని గలుగనపుడు సంఖ్యానియమోపపత్తి గాదని తోఁచుచున్నది. ఇట్లు ప్రతాపరుద్రీయమునకు సాహిత్యచింతామణిలో నగువానికిఁ బగు నుపపత్తు లమరియున్నవి యెల్ల నిటగ్రంథవిస్తరభీతిని నిరూపింపలేదు. గ్రంథములయందు నెన్ని మతభేదము లుండినను దత్తన్మతముల కేయేయుపపత్తు లుండిన నుండుఁగాక. ప్రకృతగ్రంథకర్త సర్వప్రమాణములచే రసమంజరీరసార్ణవసుధాకరాది మతముల ననుసరించినవాఁడని స్ఫుటమగుచుండ నెవ్వి యెట్లున్న నేమి? తన్మతము వాఁడు కాఁడనుటకు నట్టి ప్రమాణంబును దోఁపదు. ఇట్లుండఁగా నటనుత్తుంగయను పద్యములో నివిటపద మొక్కటి మాత్రము ప్రకృతకవి రసమంజరిమతము వాఁడు కాఁడని బోధించు ననియు ముగ్ధాదిభేదములు పరకీయాదులకు నుంగలుగు ననియు, నవియు యథాసంభవముగాఁ గలుగు ననియుఁ, బతిమాత్రవిషయేత్యాదిగాఁ బ్రౌఢాలక్షణమున మాత్రపదము పెట్టినరసమంజరీకారుఁడు దూష్యుఁడనియు మొదలగు విచారముల కవసర మగపడదని దోఁచుచున్నది. మఱియు నచటి విటపదము ప్రమాదము చేతనో లక్షణాద్యవలంబము చేతనో పతిపరగాఁ బ్రయోగించి యుండుననక పరోఢయందుఁ బ్రౌఢాభేదము సూచించుటకే ప్రయోగించినాఁడనియు, కాదేని నాయకానుచరులలో నివిటుని బోధించు తాత్పర్యమునఁ బ్రయోగించినాఁడనియుఁ గల్పించుట యుత్తమకల్పముగాఁ దోఁపదు.

ఇఁక నుద్దీపనవిభావములలోఁ బ్రాయంబు.

మ. వరవక్త్రేందువిలాసకృన్నవవయో ♦ వస్థావసానంబునం
దరుణీశైశవసింధు లింకునెడఁ ద ♦ త్తత్కాలలక్ష్యంబు లా
సరసాంతస్థితగండశైలము లనం ♦ జందోయి యంతంతకుం
బరఁగుం దత్క్రిమశోషరేఖ లనఁ గ ♦ న్పట్టున్వళీపుంజముల్. 74

టీ॥ వర...అవసానంబునన్, వర=శ్రేష్ఠమగు, వక్త్రేందు=ముఖచంద్రునకు, విలాసకృత్=ప్రకాశమునుజేయునట్టి, నవవయోవస్థావసానంబునన్=నూతనయౌవనమనెడు శరత్కాలమునందు ; తరుణీ...సింధులు, తరుణీ=స్త్రీయొక్క. శైశవ=శిశుత్వమనెడు, సింధులు=నదులు ; ఇంకునెడన్=శోషించునపుడు ; తత్తత్కాలలక్ష్యంబులు=ఆయాసమయములయందుఁ గనఁబడుచుండునవి ; ఔ సరస...అనన్, ఔ సరస = అయినఆర్ద్రములగునట్టియు, అంతస్థిత=లోపలనుండునట్టి, గండశైలములనన్=స్థూలోపలములనునట్లుగా ; చందోయి=స్తనయుగ్మము ; అంతంతకున్ = క్రమక్రమముగా ; పరఁగున్=ఒప్పును. వళీపుంజముల్=త్రివళిసమూహములు; తత్క్రమశోషరేఖలనన్=అక్రమక్రమముగనగునట్టి వానియెండుటయొక్క రేఖలనునట్టు; కన్పట్టున్ = చూపట్టును.

ఇందు రత్యాలంబన మగునాయికయొక్క ప్రాయము చెప్పఁబడినది.

సామ్యున కుదాహరణము.

క. వెలఁదికి మణితాటంకము
లలరెన్ దిగ్విజయకాంక్ష ♦ నతనుఁడు చూపుం
జిలుకులు నిశాతములుగా
నలవడ వడిఁ దీడుశాణ ♦ యంత్రము లనఁగన్. 75

టీ॥ వెలఁదికిన్=స్త్రీకి; మణితాటంకములు=రవలకమ్మలు; అతనుఁడు=మదనుఁడు ; దిగ్విజయకాంక్షన్=దిగ్విజయాభిలాషచేత ; చూపుంజిలుకులు = చూపులనెడుబాణాగ్రములు ; నిశాతములుగాన్=తీక్ష్ణములగుటకు ; అలవడన్=తగునట్లు ; వడిన్=వేగముచేత ; తీడు...అనఁగన్=నూఱెడుసానలనునట్లు ; అలరెన్=ప్రకాశించెను.

ఇందు నాయికసామ్యము వర్ణింపఁబడినది.

చేష్ట కుదాహరణము.

చ. సుదతి నృసింహుని న్మరలి ♦ చూచె విలాసవివర్తితాస్యయై
వదలనిప్రేమ వెన్తవిలి ♦ వచ్చె ముఖేందుఁ డటంచు భీతిచేఁ
జెదరి గిరీంద్రదుర్గములు ♦ సేరినచీఁకటి పోలె వాసనా
స్పద మగువాలుఁగొప్పు వలి ♦ చన్నులపై నసియాడుచుండఁగన్.

టీ॥ సుదతి=స్త్రీ ; వదలనిప్రేమన్ = వీడనియభిలాషచేత ; వెన్తవిలి...అంచున్ = ముఖచంద్రుఁడు వెంబడించివచ్చెననుచు ; భీతిచేన్ = భయముచేత ; చెదరి=చలించి ; గిరీంద్ర.. పోలెన్ = పర్వతదుర్గములనుచేరిన యంధకారముపోలె ; వాసనా...కొప్పు=పరిమళయుక్తమగుజాలుకొప్పు ; వలిచన్నులపైన్ = చల్లనిగుబ్బలమీఁద ; అసియాడుచుండఁగన్=చలించుచుండఁగా ; విలాసవివర్తితాస్యయై=విలాసముచేత మరల్పఁబడిన ముఖముగలదై ; నృసింహునిన్=నరసభూపాలుని ; మరలిచూచెన్=తిరిగిచూచెను.

ఇందు విలాసమను నాయికచేష్ట చెప్పఁబడినది.

తటస్థోద్దీపనోదాహరణము.

చ. చిగురుఁగటారితోఁ జెఱకు ♦ సింగిణితో నలరంపగుంపుతో
నిగనిగ మించుచెంగలువ ♦ నేజముతో వడిఁ జిల్కతేజిపై
మగఁటిమి నెక్కి శూరుఁడయి ♦ మారుఁడు కోకిలకంఠ కాహళుల్
నగడ లతాంగిపై వెడలె ♦ నేఁడు నృసింహ యెఱుంగఁ జెప్పితిన్.

టీ॥ మారుఁడు=మదనుఁడు; చిగురుఁగటారితోన్ =చిగురాకనెడుకత్తితోను ; చెఱకుసింగిణితోన్ = చెఱకనెడుధనుస్సుతోను; అ

లరంపగుంపుతోన్ = పుష్పబాణ పరంపరలతోను ; నిగ.. నేజము తోన్ = నిగనిగయని ప్రకాశించు నెఱ్ఱగలువయను చిల్లకోలతోను ; వడిన్=వేగముగ ; చిల్కుతేజిపైన్=చిల్కయనెడుగుఱ్ఱముమీఁద ; మగఁటిమిన్=పౌరుషముచేత ; ఎక్కి=అధిష్ఠించి ; శూరుఁడయి ; కోకిలకంఠ కాహళుల్=కోయిలలగొంతులనెడుతుతారలు; నెగడన్=అతిశయింపఁగా, కోయిలలుకూయుచుండఁగాననుట; లతాంగిపైన్=స్త్రీమీఁదికి ; నేఁడు=ఈదినము ; వెడలెన్=బయలుదేఱెను. కోకిలాలాపాదులచే లతాంగికిఁ గామ మతిశయించె ననుట. నృసింహ=ఓనరసభూపాలుఁడా! ఎఱుంగన్=తెలియునట్లు ; చెప్పితిన్.

ఇందుఁ గోకిలాలాపాదులు తటస్థోద్దీపనములు చెప్పఁబడినవి.

అనుభావనిరూపణము.

క. కారణ మైనవిభావము
చే రస ముత్పన్న మైనఁ ♦ జెలఁగెడిదానం
బ్రారూఢకటాక్షాదిక
మారయ ననుభావ మయ్యె ♦ నది యెట్లన్నన్. 78

టీ॥ రసము=రసస్థాయియగురత్యాదికమనుట ; కారణమైనవిభావముచేన్ = హేతువగునాయికానాయకాదిరూపమయిన విభావముచేత; ఉత్పన్నమైనన్=ఉదయించినపిమ్మట; చెలఁగెడిదానన్=ఒప్పుచున్నదానిచేత ; ప్రారూఢకటాక్షాదికము=ఉదయించినకటాక్షభ్రూవిక్షేపాదికము; ఆరయన్=విచారింపఁగా ; అనుభావమయ్యెన్ = అనుభావమనునదియాయెను. అనుభావ మనఁగ రసము ననుభవగోచరముగఁ జేయునది. అది యెట్లన్నన్.

అనుభావ్యోదాహరణము.

శా. అలసాలోలములై యచంచలములై ♦ యాకేకరాగ్రంబులై
యలఘుబ్రీడములై యనిందితములై ♦ యానందపూర్ణంబులై
సులభాసూయములై సుతీక్ష్ణరుచులై ♦ సువ్యక్తరాగంబులై
చెలువం బొందెడుచూపు లింతి నెఱపెఁ ♦ శ్రీనారసింహేంద్రుపైఁ.

టీ॥ అలసాలోలములై = మందములుగాఁ జెముచలించునవియునై ; అచంచలములై =తొలఁగనివై ; ఆకేకరాగ్రంబులై =ఆకేకరమను దృష్టివిశేషము ముఖ్యముగఁ గలవై ; అలఘుబ్రీడములై =అధికమైనలజ్జ గలవయి ; అనిందితములై =ప్రశస్తములై ; ఆనందపూర్ణంబులై = హర్ష పూరితములయి ; సులభాసూయములై =సులభమగు నీర్ష్యగలవయి ; సుతీక్ష్ణరుచులై =మిక్కిలితీక్ష్ణములగు కాంతులు గలవై ; సువ్యక్తరాగంబులై = మిక్కిలివ్యక్తమగుననురాగముగలవై ; చెలువంబొందెడుచూపులు=సొగసునొందినచూపులను; ఇంతి=స్త్రీ; శ్రీనారసింహేంద్రుపైఁ=సంపదతోఁగూడిన నరసభూపాలునియందు; నెఱపెఁ=వ్యాపింపఁజేసెను.

ఇందు నరసభూపాలునియందు నాయికానురాగము చూపులవలన వ్యక్తం బగుచున్నది గావఁ జూపు లనుభావములుగా వర్ణింపఁబడినయవి.

§ "అలాసాలోలములై సులభాసూయములై సుతీక్ష్ణరుచులై" యనువిశేషణములవలన నలసత అసూయ ఉగ్రత యను వ్యభిచారిభావములు వ్యక్తంబు లగుచున్నవి. అవి విప్రలంభములో నుండఁ దగును గాని సంభోగములోనుండఁదగవు. ఆనందపూర్ణంబులై

యనుటంజేసి విప్రలంభము కాదని తోఁచుచున్నది. కావున నిది విచారణీయము.

§ కొందఱిందు ప్రకారద్వయముగఁ బరిష్కరించిరి. అందుఁ బ్రకృతపద్యమున నాలస్యమనునది సంచారియే కాదని ప్రథమప్రకారము. అదియైనను బాధకముగాదని ద్వితీయప్రకారము. ఎట్లన.—ఇట అలసమనుదృష్టి విశేషము చెప్పఁబడియున్నది గాని యాలస్యమను సంచారి గాదు. "అలసస్తదభీష్టార్థా ద్వ్రీడాద్యైర్యాన్నివర్త్యతే" అని తల్లక్షణము, ఇటువంటి నాయిక నాయకునింజూచు ఘట్టమున మాలతీమాధవములో అలసవీక్షణముంగవి చెప్పినాఁడు. * "అలసవలితముగ్ధస్నిగ్ధ నిష్పన్దమన్దై రధికవికసదన్తర్విస్మయ స్మేరతారైః। హృదయమశరణమ్మే పక్ష్మలాక్ష్యాః కటాక్షైరపహృత మపవిద్ధంపీతమున్మూలితఞ్చ" అని, అమరుకశతకములోను † "అలసవలితైః ప్రేమార్ద్రార్ద్రై

* ఇది సఖుని గూర్చి మాధవునివాక్యము.—అలసవలిత ముగ్ధస్నిగ్ధ నిష్పన్దమన్దైః.—అలస=గుఱినుండిమరలినవియు, వలిత=మరలదానియందుఁ బ్రవర్తించినవియు, ముగ్ధ=సవ్యాజభావ గర్భస్వభావము గలిగినవియు, స్నిగ్ధ=స్నేహములోఁగూడినవియు, శృంగారాలంబనమగు రతితోఁగూడినవనుట, నిష్పన్ద=గుఱినుండియఱ్ఱలికఁదొలఁగనివియు, మన్దైః=విషయాంతర గమనోద్యోగము లేనివియు; అధిక వికసదన్తర్విస్మయస్మేరతారైః.—అధిక=అధికమగునట్లుగా, వికసత్=విస్తరిల్లుచున్న, అన్తర్విస్మయ=అంతఃకరణగతమైన విస్మయమను నద్భుతరసస్థాయిచేత, స్మేర=ఫుల్లములగు, తారైః=నల్లగ్రుడ్లుగలవియునగు; పక్ష్మలాక్ష్యాః=మిగుల దట్టములగు కనురెప్పల వెండ్రుకలుగల మాలతియొక్క; కటాక్షైః=క్రేగంటిచూపులచేత; అశరణమ్=రక్షకములేనిదగు; మే=నాయొక్క; హృదయమ్=చిత్తము; అపహృతమ్=హరింపఁబడినది. అపవిద్ధమ్=కొట్టఁబడినది. పీతమ్=క్రోలఁబడినది. ఉన్మూలితంచ=మూలములేనిదిగఁ జేయఁబడినది.

† ఇది యొకనాయికనుగూర్చి సఖీవాక్యము. హేముగ్ధే=ఓముద్దరాలా! అన్య=ఇపుడు; త్వయా=నీచేత; అలసవలితైః=గుఱినుండి మరలినవియు మరలఁబ్రవ

ర్ముహుర్ముకుళీకృతైః క్షణమభిముఖైర్లజ్జాలోలైర్నిమేషపరాఙ్ముఖైః।
హృదయనిహితంభావాకూతంవమద్భిరివేక్షణైః కథయసుకృతీకోయమ్ముగ్ధే త్వయాద్యవిలోక్యతే॥" అని, మల్లికామారుతములోను "తత్సభ్రూవస్తరళమన్థరముగ్ధమన్దత్ర్యస్రత్రిభంగిమధురాలసదృష్టిపాతమ్। అని యున్నదనిచెప్పి, అమరుకపద్యటీకలో "అత్రాలస్యాదిభిర్భావలేశైరల్పస్యశృఙ్గారస్య సూచితత్వాత్ లేశికీవృత్తేరఙ్గన్నర్మస్ఫోటోను. సంధేయః।నర్మస్ఫోటస్తుభావానాం సూచితోల్పరసోలవైరితీభారతీయే॥" అనియున్నందున నలసదృష్టికెట్టి లక్షణమున్నను దానిచే నాలస్యనామకసంచారివ్యఙ్గ్య మానమగునట్లున్నదిగదా? యనిన "ఆలస్యాదిభిర్భావలేశైః" అను నమరుకటీకా వాక్యగత భావశబ్దమునకు స్త్రీలకలంకారములుగాఁ జెప్పఁబడిన భావహేలాదులలో మొదటిదైన భావ మర్థమనియు, అలసములనఁగా వ్రీడచే మరలిన చూపులని యర్థమనియు "లజ్జాలోలైః" యను విశేషణము మరల్చుటకు వ్యతిరిక్తమైన లజ్జాకార్యములను జెప్పును, అలసపదము లజ్జాకార్యమైన మరల్చుటను జెప్పుననియు, ప్రకృతపద్యమునను "అలఘు వ్రీడములై" యనుచోట నీప్రకారమె దెలియవలయుననియుఁ జెప్పిరి.

"ఆలస్యాదిభిర్భావలేశైః"అనుచోట భావపదమునకుస్త్రీలకలంకారములుగాఁజెప్పినభావహేలాదులలో మొదటిదైన భావమర్థమన్నచో,

---

త్రించినవియు, ప్రేమార్ద్రైః=ప్రీతిచేత మిగుల ద్రవించినవియు; ముహుః=మాటిమాటికి; ముకుళీకృతైః=ముకుళముగాఁజేయఁబడినవియు; క్షణమ్=కొంచెముసేపు; అభిముఖైః=ఎదురైనవియు; లజ్జాలోలైః=సిగ్గుచేతఁగదలుచున్నవియు, నిమేషపరాఙ్ముఖైః=ఱెప్పపాటులేనివియు; హృదయనిహితమ్=మనస్సునను న్న; భావాకూతమ్.— భావ=శృంగార స్థాయియగు రతియనెడు, ఆకూతమ్=అభిప్రాయమును; వమద్భిరివ=గ్రక్కుచున్నట్లున్న; ఈక్షణైః=చూపులచేత; కోయమ్ సుకృతీ=ఏయీ యదృష్టవంతుఁడు; విలోక్యతే=చూడఁబడుచున్నాఁడు? కథయ=చెప్పుము.

దాసికాలస్యాదిత్వము ఘటిల్లునా? "భావోహావశ్చ హేలాచవిభ్రమఃకిలి
కిఞ్చితమ్ । మోట్టాయితంకుట్టమితం బిబ్బోకో లలితంతథా । విహృతం
చేతివిజ్ఞేయా దశహావాస్తుయోషితామ్" అనియు, క. ఇలభావహావ
హేలావిలాసమాధుర్య ధైర్య విభ్రమలీలాకిలికించిత మోట్టాయితలలి
తాదులు చేష్టలగుఁదలంపఁగమఱియు॥ అనియు, చెప్పఁబడిన శృంగార
చేష్టలలో ఆలస్యము పరిగణితముగా లేదుగదా యని శంకదోఁచుచున్న
ది. ఈపద్యమున సంచారులలోనియాలస్యము శృంగార చేష్టలలోనిభా
వములోనగు ననేకములు చెప్పినందున తదాదిత్వము భావమునకు సుఘ
టమనిన, నిట ఆలస్యమను సంచారి భావము చెప్పఁబడలేదు అలసనామ
కదృష్టివిశేషమె చెప్పఁబడినదను నుపక్రమమునకు భంగము ప్రసరించు
ను. పద్యమున నాలస్యమను సంచారిదేనిచే బోధితమగునో భావమను
నది దేనబోధితమగునో కనుపఱుపవలసివచ్చును. ఇట వ్యజ్యమానము
లన్ని భావము లను తాత్పర్యముతో "భావలేశైః" అని ప్రయోగించిన
బహువచనము "నర్మస్ఫోటస్తు భావానాంసూచితోల్పరసోలవైః, అని
తదుపష్టంభముగ వ్రాసిన భరతవచనములోని బహువచనము, ననుప
పన్నంబులగును. శృంగారచేష్టలలో మొదట నొకదానికె గదా భావనా
మము చెప్పఁబడినది. నిరుక్తి యుక్తులవలననె ఆలస్యాత్మకమైన భావ
మనుటలోనగు నవి యెవ్వియుఁబనుపడవు. ఇట్లలసపదమునకు లజ్జచే
త మర్పలఁబడినదృష్టులర్థమని చెప్పి లజ్జాలోలైః అనుదానికి తదన్యకా
ర్యపరముగా నర్థముసేయుటయు ప్రకృతపద్యమున అలఘువ్రీడములై
అనుదానికి నిదేవ్యవస్థయని చెప్పుటయు సుందరముగాఁదోఁపదు. రెండు
విశేషణములు లజ్జారూప భావమునేకదా తోఁపింపవలయు! మఱియు,
రసాభిజ్ఞాన యోగ్యతామాత్రము భావమని అది యీపద్యేష్ట వికార
మైననే హావమగునని యెల్లరు చెప్పియుండఁగా నిట ననురాగవ్యంజక

బహుప్రకార దృగ్వికారములు స్ఫుటములైనందున భావమనుట మస్ఫుటము "కోయమ్ముగ్ధే" అని తత్రత్యముగ్ధాపదము ప్రగల్భాపరమని యు నాయిక పరకీయయనియు తద్వ్యాఖ్యవలననె తెల్లమగు.

ఇంక ద్వితీయప్రకారమిట్లున్నది. ఇట సంభోగ శృంగారమున సంభోగోచితముగా నిదియు విప్రలంభోచితమునైన అలసత అను సంచారి భావముం జెప్పుట దోషమను నాక్షేపము అనేక మహాకవి వ్యవహారములమీఁదికిఁ బ్రాఁకుచున్నది. "అలసవలితైః" అను నమరుక శ్లోకమునకుంగూడ నీ యాక్షేపము దగులుచున్నది. "స్ఫురత్సంశ్లిష్టపక్ష్మాగ్రాసుఖవిశ్రాన్తతారకా। ముకుళాదృష్టిరానన్దాత్ప్ర దృష్టిర్ముకుళీకృతా" అని ముకుళదృష్టిచే నానందోక్తివలన నిట సంభోగ శృంగారమగుట స్పష్టము. "అలసవళితముగ్ధ"యను మాలతీమాధవమందును సంభోగ శృంగారములో అలసాలోకములు వర్ణింపఁబడినవి. ఈ శ్లోకముపై జగద్ధరుని వ్యాఖ్యయందు "మన్దత్వేన సహర్షత్వముక్తమ్" అని యానందము చెప్పుటచేత సంభోగ శృంగారమగుట స్పష్టము. ఇట్లు "తత్ప్రభృతివ స్తరళ" యను మల్లికామారుత శ్లోకమందును సంభోగ శృంగారమందు నాయికకు అలసవీక్షణములు చెప్పఁబడినవి. ఇట సంభోగ శృంగారమనుటకు * "యేధిన్వన్తి జగత్సు శీతమహసః పాదాస్సుధావర్షిణ స్తేసంభూయముఖేన్దు మాయతదృశో లోభాత్ప్రవిష్టా ఇవ।

* జగత్సు=లోకములయందు; శీతమహసః=చంద్రునియొక్క; సుధావర్షిణః=అమృతమును వర్షించెడు; యేపాదాః=ఏకిరణములు; ధిన్వన్తి=ప్రీతినొందించుచున్నవో; తే=ఆకిరణములు; ఆయతదృశః=ఆస్త్రీయొక్క; ముఖేన్దుమ్=ముఖచంద్రుని; లోభాత్=ఆసక్తివలన; ప్రవిష్టా ఇవ=ప్రవేశించినవానివలెనున్నవి. నోచేత్=అటుగానియెడ; అస్య=ఈముఖచంద్రునియొక్క; కటాక్షనాళగళితైః=కటాక్షములను జలమార్గములనుండి జాఱినట్టియు; తనూమ్=శరీరమును; సంజీవయద్భిః=బ్రతి

నోచేదస్యకటాక్ష నాళగళితై స్సంజీవయత్యస్మాం ధారాళై రమృతైః కథంపునరహంతస్మిన్ క్షణేక్షాళితః॥ † పరాగైఃకార్పూరై స్సుహిమసలిలై శ్చాందనరసై స్సుధాభిర్జ్యోత్స్నాభి స్స్నపితమివయః ప్రాగకృతమామ్ । సఏవాశామార్గశ్శివశివ వియోగేమృగదృశః కరాళంకాకోలంక్షిపతిమయికాలానలమివ" అని చెప్పిన నాయికానందము ప్రమాపకము.

•సంభోగమం దలస వీక్షణములం జెప్పిన యీ యభియుక్తవ్యవహార ములకెల్లఁ బూర్వోక్తాక్షేపము వ్యాపించుచున్నది అని.

దీనిపై విచారింపఁగా నమరుక పద్యంపుటీకలో "అత్రచక్షుఃప్రీతిర్నామ ప్రథమావస్థాద్యోత్యతే"ఆదరాద్వీక్షణం యత్రచక్షుః ప్రీతిరితీర్యతే, ఇతి" అని యుండుటవలన సంభోగ శృంగారము కాదనుట నిర్వివాదము. చక్షుఃప్రీతి యనంగదశలలో మొదటిదగుటయు, ఆదశలు "దశావస్థాభవన్త్యేతావిప్రలమ్భేభిలాషజే" ఇత్యాదులవలన విప్ర

కించుననట్టియు ; ధారాళైః=అధికములయినట్టి ; అమృతైః=సుధలచేత ; అహమ్=నేను ; తస్మిన్క్షణే=అదినన్నుఁ జూచుచున్న సమయమందు ; కథమ్క్షాళితః=ఎట్లుకడుగఁబడితిని? దానిచూపులు చంద్రకిరణములే కానియెడ నది చూచునపుడు నాకమృతక్షాళనము ఘటిల్లదు గాన నవి చంద్రకిరణములే యనుట.

† కార్పూరైః=కర్పూర సంబంధులగు; పరాగైః=రేణువులచేతను ; సుహిమసలిలైః=హిమజలములచేతను; చాన్దనరసైః=చందన ద్రవముచేతను ; సుధాభిః=అమృతములచేతను ; జ్యోత్స్నాభిః=వెన్నెలలచేతను ; స్నపితమివ=స్నానముఁజేయింపఁబడినవానివలె ; యః=ఏమన్మథుఁడు; ప్రాక్=పూర్వము; మామ్=నన్ను ; అకృత=చేసెనో. సఏవాశామాగః=ఆ యీమన్మథుఁడే ; మృగదృశః=మల్లికయొక్క ; వియోగే=విరహమందు ; కరాళమ్=భయంకరమగు ; కాకోలమ్=కాలకూటమును; కాలానలమివ=కాలాగ్నివలె ; మయి=నాయందు ; క్షిపతి=ఉంచుచున్నాఁడు. శివశివ=కష్టము.

లంభ భేదములలో మొదటిదానియందుఁగలుగుటయుఁ దెల్లము. మాలతీ మాధవమల్లికామారుత పద్యములును నాయికానాయకప్రథమావలోకన ఘట్టములోనివిగా ననందును "యత్ప్రేమసంగమాత్పూర్వం దర్శన శ్రవణోద్భవమ్ పూర్వానురాగస్సజ్ఞేయః" అనుటను బట్టియు, కావ్యప్రకాశమున "ప్రేమార్ద్రాః ప్రణయస్పృశః" అనుమాలతీ మాధవపద్యము అభిలాష విప్రలంభమున కుదాహరణముగా వ్రాయుటనుబట్టియు, దశరూపకమందు "తత్రాయోగోను రాగేపినవయోరేకచిత్తయోః పారతన్త్ర్యేణదైవాద్వావిప్రకర్షా దసంగమః" అనుకారికవ్యాఖ్యలో "పిత్రాద్యాయత్తత్వా త్సాగరికామాలత్యో ర్వత్సరాజ మాధవాభ్యామివ దైవాద్గౌరీశివయోరివ సమాగమోఽయోగః" అని యుండుటను బట్టియు, సంభోగము కాదనిదోఁచెడిని.

ఒకవేళ "ఆనందపూర్ణంబులై" అనుటంజేసి విప్రలంభముకాదనితోఁచుచున్నది" అనుప్రకృత పద్యపు టీకలోని లేఖమును బట్టి యిట్లు వ్రాసినారందురు కాఁబోలు. అట్లునేనమ్మను. మనోరథావాప్తికిముందు పరిపూర్ణమగు నానందముండదని అట్లు వ్రాయఁబడినది గాని వేఱుగాదు గదా! ఒకవేళ నట్లేవారి యభిప్రాయమగునేని, "శ్రోణీభారాదలసగమనాస్తోకన మ్రాస్తనాభ్యామ్" అనుమేఘసందేశ శ్లోకముమొదలుకొని * "అవిల పయోధరాగ్రం లవలీఫలపాణ్డురానన

* తాని దినాని=ఆదినములయందు; తస్యాః=ఆయూర్వశియొక్క; వపుః=శరీరము; అవిలపయోధరాగ్రమ్=కలుషములైన చనుమొనలుగలదియు; లవలీఫలపాణ్డురాననచ్ఛాయమ్.—లవలీఫల = లవలీఫలములవలె, పాణ్డుర=తెల్లనగు, ఆననచ్ఛాయమ్=ముఖకాంతిగలదియు; కేవలమ్=మిగులను; అలసేక్షణమ్=మందదృష్టులుగలదియు; అభూత్=ఆయ్యెను.

చ్ఛాయమ్। తానిదినానివపురభూత్కేవలమలసేక్షణాంతస్యాః" అను విక్రమోర్వశీయ పద్యమువఱకు కొన్ని పద్యములు వ్రాసి "ఈయలసతలు సంభోగ శృంగారమునందు తొలంగునట్టివి కావు. సంభోగమున కత్యంతోపయుక్తములే కాని విరుద్ధములును గావు" అని వ్రాయుటకు, ఆవిల పయోధరాగ్ర మనుచోట ప్రతి పదోక్తముగ "ఇటను సంభోగ శృంగారంబ యగుట స్పష్టము". అని వ్రాయుటకు నుద్యమింతురా యనితోఁచుచున్నది. మేఘసందేశములో శాపవిప్రలంభమని కొందఱు ప్రవాస విప్రలంభమనియే చెప్పవచ్చునని కొందఱువ్రాసినారు గాని విప్రలంభము గాదని యెవ్వరువ్రాయలేదు. ఇందానందముగూడ నగపడదు. మల్లి కామారుతములోని పద్యమందానంద సమర్థనమునకుఁ బూర్వాపరపద్యములును మాలతీమాధవాదులలో టీకలును పొందుపఱచినవా రాయభిప్రాయమైనచో నిటను జూపుదురు. ఇట్లానందము లేకుండుటయు, గ్రంథ సందర్భము సంభోగమునకు దూరమగుటయు, పై వ్రాసిన వన్నియు ఆనంద పూర్ణంబులై యనుదాని వ్యాఖ్యననుసరించి నవిగావని స్పష్టపఱచుచున్నవి. విక్రమోర్వశీయములోను పురూరవుఁ డూర్వశీ వియుక్తుండైనతఱిఁ జెప్పినపద్యముగాని పరస్పర సమాగమ ఘట్టములోనిది గాదు. సంభోగోచితములె కాని వేఱుగావన్నందున సంభోగ శృంగారోపయుక్తత్వము సంభోగలక్షణముగా వివక్షితమగునేని విప్రలంభవిలయము ఘటిల్లును. "నవినా విప్రలమ్భేన సమ్భోగః పుష్టిమశ్నుతే। కషాయితేహివస్త్రాదౌ భూయాన్రాగోఽనుషజ్యతే" అను సరస్వతీకంఠాభరణమువలనను, "యత్ర స్నేహోభయ స్తత్రయత్రేర్ష్యామదన స్తతః" అను భారతీయనాట్యశాస్త్రమువలనను, * "చరణపతనం సాస్రాలాపా మనోహరచాటవః

* చరణపతనమ్=పాదములపైఁబడుట; సాస్రాలాపాః=కన్నీటితోడి మాటలు; మనోహరచాటవః=మనమున కింపైన ప్రియభాషణములు; కృశతరతనోః=మిక్కి

కృశతరతనోర్గాఢాశ్లేషో హఠాత్పరిచుమ్బనమ్, ఇతి బహు ఫలో మానారమ్భః" అను నమునక పద్యమువలనను, ప్రథమావలోకన ప్రభృతులన్నియు తదనుకూలములే కదా! పూర్వానుభూతార్థస్మృతి ప్రయుక్తానందముచే సంభోగమగుటయు ఘటిల్లదని తలంచెద. అట్లగునపుడు * "ప్రేమార్ద్రాః ప్రణయస్పృశః పరిచయాదుద్గాఢరాగోదయాస్తాస్తా ముగ్ధదృశో నిసర్గమధురాశ్చేష్టా భవేయుర్మయి, యాస్వన్తః కరణస్య బాహ్యకరణవ్యాపారరోధీ క్షణాదాశంసాపరికల్పితాస్వపి భవత్యానన్దసాన్ద్రో లయః!! " అనుభవిష్యదర్థ చింతన సిద్ధానందానుభవమంబుఁగూడ సంభోగ శృంగారమున వలసి కావ్యప్రకాశకారుఁడు దీని ప్రథమానురాగమునకుదాహరణముగా వ్రాయుట యసంగతము కావలసివచ్చును. ఎట్లనిన వ్యాఖ్యలోని భ్రాంతియే దీనికి మూలమైనపుడు తదాక్షేపమునకివి యన్నియుత్తరములుగానట్లు స్ఫుటమగును.

లియుండిగిన యొడలుగల ప్రియుని యొక్క; గాఢాశ్లేషః=దృఢపరిరంభము; హఠాత్=బలాత్కారమువలన; పరిచుమ్బనమ్=ముద్దువెట్టుకొనుట; ఇతి=ఇట్లు; మానారమ్భః=అలుగుటకుద్యమించుట; బహుఫలః=అనేక ప్రయోజనములు గలది.

* ప్రేమార్ద్రాః=ప్రేమచేదడుపఁబడినవియు; ప్రణయస్పృశః=ప్రణయమును స్పృశించినవియు; పరిచయాత్=అలవాటుచేత; ఉద్గాఢరాగోదయాః=అధికమైన రాగప్రాదుర్భావము గలవియు; నిసర్గమధురాః=స్వభావమనోహరములునగు; ముగ్ధదృశః=సుందరమైన చూపుగల మాలతియొక్క; తాస్తాశ్చేష్టాః=ఆయాచేష్టలు; మయి=నావిషయమందు; భవేయుః=కలుగునా? ఆశంసాపరికల్పితాస్వపి=మనోరథమాత్ర కల్పితములైనను; యాసు=ఏచేష్టలయందు; అన్తఃకరణస్య=చిత్తమునకు; బాహ్యకరణవ్యాపారరోధీ=బాహ్యేంద్రియ వ్యాపారములను నిరోధించునట్టియు; ఆనన్దసాన్ద్రః=ఆనందఘనమైనట్టి; లయః=లయము; క్షణాత్=క్షణకాలములో; భవతి=అగుచున్నదో; అట్టి చేష్టలు నాయందుఁ గలుగునా యని యన్వయము.

ఇఁక సుతీక్ష్ణరుచులై యనుచోటియాక్షేపముపై, "ఇటఁ జెప్పఁబడి నది దృగ్రుచి తీక్ష్ణత గాని హృద్గతతీక్ష్ణత గాదు. దృక్తీక్ష్ణతను విప్రలంభంబునందు కవులువర్ణించుట ప్రసిద్ధమె. * "అధరస్య మధురిమాణం కుచ కాఠిన్యం దృశోస్తథా తైక్ష్ణ్యమ్। కవితాయాం పరిపాకాననుభవరసికో విజానాతి" ఇటననుభవరసికః అనియనుభవమును చెప్పుటచేత విప్రలంభంబుగాదని తెలియుచున్నది. "ఇన్దీవరాక్షితవ తీక్ష్ణకటాక్షబాణాఘాతవ్రణైర్ద్వివిధమౌషధమేవమస్యే" అని బిల్హణచరితమందు బిల్హణ వాక్యము. "యస్స్మరస్త్రశ్రవణాస్తరేణ సరళా తీక్ష్ణా కటాక్షచ్ఛటా" అని కర్పూరమంజరీ సట్టకములో నాయకుఁడు తన నాయికఁ జూచుచున్నవిధము విదూషకునితో అపవారించి వర్ణించుచున్నాఁడు. ఇటను విప్రలంభము లేదు. ఇటఁ బ్రకరణము నరసరాజీయమందలి ప్రకృతపద్యమున కెట్లద్దో అట్టిదిగానే యున్నది. మఱియు పూర్వోదాహృతమయిన మల్లికామారుతగత నాయికానాయకాన్యోన్యదర్శనానందానుభవరూప సంభోగవర్ణనఘట్టంబున నాయకుఁడిట్లు వచించుచున్నాఁడు. "తయాగాఢమ్మస్త్రో భ్రువిధనుషి సంధాయ నిశితైః కటాక్షేషుస్తాన్నైస్సహ పరన యోగ్యశ్శరగణైః" అని, ఇట టీకలో "నిశితైః తీక్ష్ణైః" అనియున్నది. మాలతీమాధవమందును ప్రాగుక్తరూప సంభోగవర్ణనఘట్టంబున నాయకుఁడు వల్కిన శ్లోకము. † "యాన్త్యా ముహుర్వలితకన్ధరమాననం తదావృత్తవృన్తశతపత్రనిభం వహన్త్యా। దిగ్ధోమృ

* అధరస్య = పెదవియొక్క; మధురిమాణమ్ = తీయఁదనమును; కుచకాఠిన్యమ్ = చన్నులకాఠిన్యమును; తథా = ఆప్రకారమే; దృశోః = చూపులయొక్క; తైక్ష్ణ్యమ్ = చుఱుకుఁదనమును; కవితాయామ్ = కవిత్వమందు; పరిపాకాన్ = పరిణామములను; అనుభవరసికః = అనుభవముచే రసికుఁడు; విజానాతి = తెలిసికొనుచున్నాఁడు.

† యాన్త్యా = పోవుచున్నదై; వలితకన్ధరమ్ = త్రిప్పఁబడిన మెడగలదిగనుండునట్లు; ఆవృత్తవృన్తశతపత్రనిభమ్ = కుసుమబంధనమునుండి జాఱినకమలములతో సాటియగు

తేనచవిషేణచ పక్ష్మలాక్ష్యాగాఢన్ని ఖాత ఇవమేహృదయే కటాక్షః॥"
అని, దీనివ్యాఖ్యలో "నిఖాత ఇవేతి తీక్ష్ణతయా కటాక్షస్య నారాచత్వ సంభావనాదితి" అని యున్నది. అని వ్రాయఁబడినది.

ఇం దుదాహరించిన బిల్హణ కర్పూరమంజరీ మల్లికామారుత మాలతీమాధవ శ్లోకములు సంభోగ శృంగార ప్రతిపాదకములు గావని వెనుక వ్రాసియున్నాను. సంభోగమునఁ గదా తీక్ష్ణదృష్టులు కనఁబఱుపవలయు ; విప్రలంభమం దుభయవాది సమ్మతము "అనుభవరసికః" అనుటచేత విప్రలంభము గాదనుట యెట్లు? ఇట, సంభోగ రసికుండను నర్థము కవితాపరిపాకవిజ్ఞానానుగుణముగదా? కానఁదత్తదనుభవశాలి దానిదాని నెఱుంగుననవలయు; దృక్తీక్ష్ణతానుభవముగలవాఁడే దృక్తీక్ష్ణత నెఱుంగఁజాలునని యభిప్రాయము, ఆదృక్తీక్ష్ణత విప్రలంభమునందేని గావచ్చును, సంభోగమునందే యనుట కిటవిని గమకము గానరాదు.

"ఆనందపూర్ణంబులై" అనుదాని టీక ననుసరించి వ్రాసినచో ఇచ్చట ఆనందోపపాదన మేరీతిగనైనం జేయక "అనుభవరసికః" అనియనుభవమును జెప్పుటచేత విప్రలంభముగా దని తెలియుచున్న దని వ్రాయరని నానమ్మకము. అట్లయినను మాయాక్షేపమునకుఁ బై చెప్పినవిధముగ నెవ్వియు బాధకములు గా వని యొప్పవలసివచ్చునని తలంతు.

ఆననమ్=ముఖమును ; వహన్త్యా=వహించుచున్నట్టి ; పక్ష్మలాక్ష్యా=మాలతిచేత : అమృతేనచ=సుధచేతను ; విషేణచ=విషముచేతను; దిగ్ధః=ఉపచితమగు; కటాక్షః =నేత్రాంతదృష్టి ; మేహృదయే=నాచిత్తమందు; గాఢమ్=లెస్సగా; నిఖాత ఇవ=గ్రుచ్చఁబడినయట్లున్నది. తీక్ష్ణమైన శరము మరలఁ బెఱుకుట కలవిగా నంతగట్టిగఁ గ్రుచ్చుకొన్నదై బాధించునట్లు మాలతీకటాక్షము మనమున నాటి బాధించుచున్న దనుట.

ఇఁక "సులభాసూయమ్ములై" యను చోటి యసూయ నాయికకుఁ గాదు. దానింజూచి యోర్వలేనియన్యులది గాన దానిఁజెప్పుట వలన నిట బాధ లేదు. ఈనాయిక చూపులతీరు ఈమెవలెనే నరసరాజుం గోరిన యితరనాయికలకు అసూయం బుట్టింపఁ దగినదిగా నున్నదని వక్తృహృదయము నంగీకరించుటయందు ఆతీరునాయికయందే యుండునట్టిది గావున దానికి సూచనీయ మగుభావమునకును సామానాధికరణ్యము గలుగును. అని వ్రాసియున్నారు.

దీనిం బూర్తి పరీక్షింపఁగా నీచూపున కనుభావత్వము దుర్ఘటముగాఁ దోఁచెడిని, ఎట్లన, "భావ మ్మనోగతం సాక్షా త్స్వహేతుం వ్యఞ్జయన్తి యే। తేనుభావా ఇతి ప్రోక్తా భ్రూవిక్షేపస్మితాదయః" అనుటచే మనోగతభావమును దెల్పునది గదా యనుభావము. ఆమనోభావము దీనికి హేతువై యుండ వలయుఁ గదా? ఇతర స్త్రీమనోగత మైనయసూయాభావమును దీని చూపుతీరు తెల్పు నేని యది దీనికి హేతు వగునా? దానికసూయ యుండఁబట్టి యా దీని కీచూపు గలుగుట. "అనుభావస్తు స్వనిష్ఠ ఏవ గమకః తస్యానుభావకత్వేన పక్షవృత్తిత్వనియమాత్" అనురసతరంగిణీవలనను పై యనుభావలక్షణమువలనను నుండవలసిన కార్యకారణములసామానాధికరణ్య మిట్లు చెప్పునపుడు పొసఁగుట యెట్లు? ఆచూపుతీరు నాయికయందే యుండుట ఆయసూయ ప్రతినాయికయందే యుండుట సామానాధికరణ్యబాధకము గాని తత్సాధకముగాదు. అట్లైన సువ్యక్తరాగం బుటైలోనగు వానియందు నన్యులకు రాగముగలుగఁ జేయునది యని యేల చెప్పరు?

ఇట్లనేక క్లేశములకన్న ఇందలి "యానంద పూర్ణంబులై" యను పదమునకు వేద్యాంతరశూన్యమగు పరమానందము వివక్షితము గాదనియు యుత్కించి దానందమె వివక్షితమనియు గ్రహించి "అ

నవలిత్తైః" ఇత్యాదులవలె నీపద్యము విప్రలంభశృంగార ప్రతిపాదకముగా సమన్వయించినచో నలసత్వాదులు తల్లక్షణములు లక్ష్యములు నెట్లున్నను బాధ యుండ దనితోఁచుచున్నది. ఇది యాపద్యమునకు ఛాయారూపమే గాని వేఱుగాఁ దోఁపదు.

సాత్త్వికభావసామాన్యలక్షణము.

క. పరగతసుఖదుఃఖాదుల
నరయఁగ భావించి యట్ల ♦ యలరుట సత్త్వ
స్ఫురణము తద్భవభావము
లరయఁగ సాత్త్వికము లయ్యె ♦ నవి యెట్లన్నన్. 80

టీ॥ పర..ఆదులన్= అన్యులనొందిన సుఖముదుఃఖము మొదలగువానిని; భావించి=ధ్యానించి; అట్లయలరుట=వారివలెనొప్పుట; అరయఁగన్=విచారింపఁగా; సత్త్వస్ఫురణము—సత్త్వమనుట. తద్భవభావములు = ఆసత్త్వమువలన నుదయించినభావములు; అరయఁగన్=విచారింపఁగా; సాత్త్వికములయ్యెన్=సాత్త్వికభావములాయెను. అవి= ఆసాత్త్వికభావములు; ఎట్లన్నన్.

§ ఈసామాన్యలక్షణపద్యమునకును "స్తంభ మచంచలత్వ" మనువిశేషలక్షణపద్యమునకును మధ్యభాగమున, "స్తంభప్రళయాశ్రుస్వేదవిస్వరత్వరోమహర్షణకంపవివర్ణత్వము లని యాసాత్త్వికంబులెనిమిదివిధమ్ములు" అని విభాగవాక్య ముండవలయు. లేనియెడ "స్తంభ మచంచలత్వ"మనునది సమీచీనముగాఁ బూర్వపద్యముతో నన్వయము నొందదు.

సాత్త్వికవిశేషలక్షణములు.

ఉ. స్తంభ మచంచలత్వ మవ ♦ శత్వ మగున్ బ్రళయంబు దృగ్జలో
జ్జృంభణ మశ్రు వౌఁ జెమట ♦ స్వేదము గద్గదవాక్యవైఖరీ

గుంభము విస్వరత్వము త । గుం బులకం బన రోమహర్ష ణా
రంభము కంప మా వడఁకు । రామకుఁ బాండురుచుల్ వివర్ణతల్.

టీ॥ అచంచలత్వము=అవయవచాంచల్యములేమి ; స్తంభము= స్తంభమగును. అవశత్వము = ఇంద్రియపరవశత ; ప్రళయంబగుఁ= ప్రళయభావమగును. దృగ్జలోజ్జృంభణము = కన్నీరుకాఱుట ; అశ్రు వౌఁ=అశ్రువనుభావమగును. చెమట=స్వేదోదకము ; స్వేదము=స్వే దభావమగును. గద్గద...గుంభము = డగ్గుత్తికపడినమాటలకూర్పు, డగ్గుత్తికతోడిమాటలనుట ; విస్వరత్వము=వైస్వర్యమగును. రోమహ ర్షణారంభము=గగుర్పాటుగలుగుట ; పులకంబనఁదగుఁ=పులకమననొ ప్పును. వడఁకు = వడఁకుట ; కంపమౌఁ=కంపమనునదియగును. రా మకుఁ బాండురుచుల్=స్త్రీకిఁదెల్లనికాంతులు ; వివర్ణతల్=వైవర్ణ్యమ నంబడును.

§ ఇందుఁ గవియాశయము రామ కనునది అచంచలత్వాదుల యన్నింటితో నన్వయించు నని యున్నను, వివర్ణత లనుదానితోన యన్వయించు ననియున్నను, తత్ప్రయోగ మిచట సముంజసంబు గాదు. సాత్త్వికభావములు స్త్రీలకే కాక పురుషులకు నుదయించు నట్లు పెక్కుప్రసిద్ధలక్ష్యము లున్నవి, * “శ్లో॥ ఏత త్పరిస్ఫురతి పద్మదృశాం సహస్ర మక్షిద్వయం కథయ కుత్ర నివేశయామి। ఇత్యాకలయ్య నయ నామ్బురుహే నిమీల్య రోమాఞ్చితేన వపుషా స్థిత మచ్యుతేన ॥”

* ఏతత్పద్మదృశాం సహస్రమ్=ఈ స్త్రీసహస్రము; పరిస్ఫురతి=ప్రకాశించు చున్నది. అక్షిద్వయమ్=నేత్రద్వంద్వము ; కుత్రనివేశయామి=ఎవ్వరియందుంతును. కథయ=చెపుమా. ఇత్యాకలయ్య=ఇట్లుభావించి; నయనామ్బురుహే=పద్మములవం టినేత్రములను; నిమీల్య=మూసికొని ; రోమాఞ్చితేన వపుషా=సంజాతరోమాంచ మైన శరీరముతో; అచ్యుతేన=శ్రీకృష్ణునిచేత; స్థితమ్=ఉండుటయయ్యెను.

అనురసమంజరీపద్యములోఁ గృష్ణునకు రోమాంచము వర్ణింపఁబడినది. ఇట్లన్యంబులు నూహించుకొనునది.

§ మఱియు "శ్లో॥ రూపాన్యత్వంవివర్ణతా" యని యొకరూపము మాఱి మఱియొకటి కలుగుటయే వివర్ణతగాఁ బ్రాచీనులు చెప్పినలక్షణమునకును, * "శ్లో॥ కుక్కుటే కుర్వతి క్వాణ మాననం శ్లిష్టయో స్తయోః। దివాకరకరాక్రాన్త శశికాన్తిమి వాదధౌ॥" అనురసతరఙ్గిణీలక్ష్యమునకును, † "శ్లో॥ సంచారిణీ దీపశిఖేవ రాత్రౌ యంయం వ్యతీయాయ పతింవరా సా। నరేన్ద్రమార్గాట్ట ఇవ ప్రపేదే వివర్ణభావం స స భూమిపాలః॥" అనురఘువంశపద్యమునకును, నిందుఁ "బాండురుచుల్ వివర్ణతల్" అనుట విరుద్ధము. ఈయుదాహరణములలో మాలిన్యరూపముగ వైవర్ణ్యము చెప్పఁబడినది. విరహాదులయందుఁ బాండురుచియుఁ గా వచ్చుఁగాని, చౌర్యాదులచే నవమానము గల్గు నపు

---

* శ్లిష్టయోః=కౌఁగిలించుకొని యున్న; తయోః=వారిరువురియొక్క; ఆననమ్=ముఖము; కుక్కుటేకుర్వతిక్వాణమ్=కోడికూఁతనూయఁగా; దివాకర కరాక్రాన్తశశికాన్తిమ్.—దివాకర = సూర్యునియొక్క, కర=కిరణములచేత, ఆక్రాన్త=వ్యాప్తమైన, శశి=చంద్రునియొక్క, కాన్తిమ్ =కాంతిని; ఆదధావివ=ధరించినట్లుండెను. తెల్లవాఱఁగా సుఖభంగమగునని రాధాకృష్ణులముఖము సూర్యకిరణాహతమైన చంద్రునికాంతివంటి కాంతి నొందెననుట.

† పతింవరా సా=పతిని వరియించు నాయిందుమతి; సంచారిణీ దీపశిఖేవ=తిరుగుచున్న దీపజ్వాలవలె; యంయమ్=ఏయేరాజును; వ్యతీయాయ=అతిక్రమించిపోయెనో; సభూమిపాలః = ఆయా భూపతి; నరేంద్రమార్గాట్ట ఇవ=రాజమార్గముననున్న తిన్నెవలె; వివర్ణభావమ్=వైవర్ణ్యమును; ప్రపేదే=పొందెను. ఇందుమతి తమ చెంతకువచ్చువఱకు తమ్ముఁగోరునేమో యను నాసతో విలసిల్లువారాజులముఖములు, ఆమె తమ్మతిక్రమించి పోఁగా దీపశిఖ ముందు ప్రకాశించుతిన్నె అదిదాఁటిపోయిన వెనుక నెట్లు మలినమగునో యట్లాయె ననుట.

దల్లుండదు గానఁ, బాంధవము లనులక్షణము సర్వసాధారణముగఁ జెప్పఁ దగ దని తోఁచుచున్నది.

కవిప్రతిజ్ఞావాక్యము.

క. తలఁపఁగ రసకార్యములై
జలజాక్షులయందుఁ బొడము ♦ సాత్త్వికభావం
బుల కెనిమిదింటి కేర్పడ
నలరింతుం గడఁకతో ను ♦ దాహరణంబుల్. 82

టీ॥ తలఁపఁగన్=విచారింపఁగా; రసకార్యములై=రసజన్యములై; జలజ...ఎనిమిదింటికిన్=స్త్రీలయందుదయించు సాత్త్వికభావముల కెనిమిదింటికిని; ఏర్పడన్=స్పష్టపడునట్లుగా; కడఁకతోన్=పూనికతో; ఉదాహరణంబుల్=లక్ష్యములను; అలరింతున్=ఒనర్తును.

§ ఈపద్యమందు జలజాక్షులయందనుటయు నిరర్థకంబు పైఁ జెప్పిన చొప్పున విపరీతార్థకంబును గాన నీవిశేషణంబు మార్చుట యుక్తము.

స్తంభమున కుదాహరణము.

చ. కలికి నృసింహభూవరునిఁ ♦ గన్గొని నిశ్చలగాత్రవల్లియై
యలరు విలాసచేష్ట లోల ♦ యం గలయంగ నటింపఁ జేయునా
వలపులసూత్రధారుఁ డన ♦ వద్యనృపాకృతిఁ జూచి తాను ని
శ్చలత వహింపఁగాఁ గదలఁ ♦ జాలనిజంత్రపుబొమ్మయో యనన్.

టీ॥ కలికి=సుందరి; నృసింహభూవరునిన్=నరసభూపాలుని; కన్గొని=చూచి; నిశ్చలగాత్రవల్లియై=చలింపనితీఁగవంటి యంగముగలదై; విలాసచేష్టలు=విలాసవ్యాపారములు; ఒలయన్=వ్యాపించునట్లు; కల

యంగ్=కూడునట్టుగా ; నటింపన్ . . . ధారుఁడు=నాట్యముఁజేయించు నామదనుఁడనుసూత్రధారుండు ; అనవద్య . . . చూచి = లోకోత్తరమగు నరసభూపాలునియాకారమును జూచి; తాను; నిశ్చలతన్=కదలకుండుటను; వహింపఁగాన్=పొందఁగా ; కదలన్ . . . అనన్=కదలలేని కీలుబొమ్మయోయనునట్లు; అలరెన్=ఒప్పెను.

ఇందు నాయిక కదలకుండినట్లు వర్ణించినందున స్తంభము చెప్పఁబడెనని తాత్పర్యము.

ప్రళయమున కుదాహరణము.

ఉ. ఇత్తటి నీతలోదరి వ ♦ హించె నచేతనవృత్తి శారదా
చిత్తముఁ జూఱగొన్ననర ♦ సింహుఁడు నేఁడు వియోగపాండువౌ
గుత్తపుగుబ్బలాఁడి పలు ♦ కుంజవరాలివలెం జెలంగఁగా
నిత్తరలాక్షిచిత్తము న ♦ హీనరసోన్నతిఁ జూఱవెట్టెనో. 84

టీ॥ ఇత్తఱిన్=ఇపుడు ; ఈతలోదరి=ఈమగువ ; అచేతనవృత్తిన్=చైతన్యములేనిపాషాణాదుల యునికివంటియునికిని; వహించెన్=ధరించెను. శారదా . . . సింహుఁడు = సరస్వతీహృదయమునుహరించిన నరసభూపాలుండు; నేఁడు . . . గుబ్బలాఁడి=ఇప్పుడువిరహముచేతఁ బాండువర్ణముగలకఠినస్తని ; పలుకుం . . . చెలంగఁగాన్ = సరస్వతివలెఁ బ్రకాశింపఁగా; ఇత్తరలాక్షిచిత్తమును = ఈస్త్రీహృదయమును; అహీనరసోన్నతిన్=తక్కువకానిరాగాతిశయముచేత ; చూఱవెట్టెనో=కొల్లపెట్టినాఁడేమి? అందువలననే యచేతనవృత్తి వహించె నని భావము.

నరసింహునియందు నాయికహృదయము దృఢలగ్నమగుటనది యచేతనవృత్తి వహించె నని వర్ణించినందునఁ బ్రళయము చెప్పఁ

బడెనని తాత్పర్యము. ఇందుత్ప్రేక్ష తద్ధేతున్యాయాయితంబుగ నున్నది. జననీతుల్యయైన యత్యుత్తమదేవతయం దనురాగవర్ణన మత్యంతానుచితమై వర్ణ్యనకుం బశుప్రాయతను దోఁపించు నని వెనుక వ్రాయంబడియె.

అశ్రువున కుదాహరణము.

చ. మగువకు నంగజానలస ♦ మగ్రము లౌనులివేఁడియూరుపుం
బొగ లెగయ జనించు గతి ♦ ముత్తెపుఁజిప్పలఁ బోలుతెప్పల
న్నెగడునుదశ్రుపూరములు ♦ నేత్రసరోరుహనాళచాతురిం
డిగియె నృసింహ యింకఁ దరు ♦ ణీమణిఁ గౌఁగిట నాదరింపుమీ.

టీ॥ మగువకున్=కాంతకు; అంగజ...పొగలు=కామాగ్నిపూరితములగునులివెచ్చనైన యూర్పులనెడుపొగలు; ఎగయన్ = అతిశయిల్లుటచే; జనించుగతిన్=పుట్టునట్లు; ముత్తెపు...పూరములు= ముత్యపుచిప్పలతో సరియౌ తెప్పలయందు దుదయించు నెక్కుడైనకన్నీటిప్రవాహములు; నేత్ర...చాతురిన్= నయనాంబురుహములకాఁడల వలె; డిగియెన్=జాఱెను. నృసింహ=ఓ నరసభూపాలుఁడా! ఇఁకన్= ఇఁకమీఁద; తరుణీమణిన్ = అన్నువిన్నను; కౌఁగిటనాదరింపుమీ= ఆలింగనము చేత సంతోషింపఁజేయుమా.

ఇందు నాయికకుఁ గన్నీరు గలిగినట్లు వర్ణించుటచే నశ్రువు చెప్పఁబడు ననితాత్పర్యము.

స్వేదంబున కుదాహరణము.

చ. సఖికిఁ జెమర్చె మేను జల ♦ జాతదళాక్షి చతుస్సముద్రము
ద్రితవసుధాధురంధరుని ♦ శ్రీనరసింహుని భావవీథిలోఁ

బ్రతిదినము న్వహించు నతి ♦ భారము వంకనొ కాక సంతతా
పతదసమాస్త్రశస్త్రభవ ♦ పావకకీలలవేఁడివంకనో. 86

టీ॥ జలజాతపత్త్రాక్షి = తమ్మికంటి ; చతుః. . .ధరునిన్ = నాలుగుసముద్రములచే గుఱుతుగలదైన భూమియొక్క భారమును వహించునట్టి; శ్రీనరసింహునిన్=సుందరుఁడైన నరసభూపాలుని; భావవీథిలోన్ = మనఃప్రదేశమందు ; ప్రతిదినమున్ =ఎల్లప్పుడును ; వహించునతిభారము వంకనొ = మోయుచున్న యధికమగుబరువుచేతనో; కాక = అట్లుగాక ; సంతత . . . వంకనో, సంతతాపతత్ = ఎల్లప్పుడుఁ బడుచున్న, అసమాస్త్రశస్త్ర=మదనబాణములచేత, భవ=పుట్టినట్టి, పావకకీలల వేఁడివంకనో=అగ్నిజ్వాలలయొక్క వేఁడిచేతనో; సతికిన్=మగువకు; మేను=శరీరము; చెమర్చెన్=చెమ్మగిల్లెను.

ఇందుఁ జెమర్చెననుటచే స్వేదము వచింపఁబడె ననితాత్పర్యము.

వైవర్ణ్యమున కుదాహరణము.

చ. అమరఁ బరాంగనానఖము ♦ ఖాంకితుఁడైన నృసింహభూవరుం
గమలదళాక్షి చూచి తమ ♦ కమ్మున దూఱెద నన్న గద్గద
త్వమునఁ బొసంగ వయ్యె సతి ♦ వాక్యము లాంతరమై చెలంగు నె
య్యము హృదయేశు దూఱవలఁ ♦ దంచునిరోధ మొనర్చెనో యనన్.

టీ॥ అమరన్=ఒప్పునట్లుగా; పరాంగనా. . .భూవరున్, పరాంగనా=ఇతరవనితయొక్క, నఖముఖ=నఖాగ్రములచే, అంకితుఁడైన నృసింహభూవరున్=చిహ్నితుఁడైన నరసభూపాలుని ; కమలదళాక్షి=తమ్మికంటి; చూచి; తమకమ్మునన్=వేగమున; దూఱెదనన్నన్=దూషించెదననఁగా; ఆంతరమైచెలంగునెయ్యము=లోపలనున్నదైనయొప్పుప్రీతి ; హృదయేశున్ =ప్రాణనాథుని ; దూఱవలదంచునిరోధ మొనర్చెనోయనన్=దూషింపఁదగదనియడ్డగించెనాయనునట్లు ; గద్గదత్వమునన్ =డగ్గు

త్రికచే; సతివాక్యములు = నాయికయొక్క వచనములు; పొసంగవయ్యెన్=ఒప్పవయ్యెను. ప్రియుని దూఱుటకు గద్గదత్వ మడ్డ మాయె ననుట.

ఇందు విస్వరత్వము చెప్పఁబడెనని తాత్పర్యము.

రోమాంచమున కుదాహరణము.

చ. కలికి నృసింహునిం దలఁపఁ ♦ గా నెలమిం బులకప్రకాండము
ల్మొలచె మనోజహాలికుఁడు ♦ మోద మెసంగఁ గురంగనాభపం
కిల మగునింతిగాత్ర మను ♦ క్షేత్రమున న్వెలయంగఁ జేయున
స్ఖలితమనోమనోరథని ♦ కాయము లీరిక లెత్తెనో యనన్. 88

టీ॥ కలికి=కాంత; నృసింహునిన్=నరసభూపాలుని; తలఁపఁగాన్=స్మరింపఁగా; ఎలమిన్=మిక్కిలి; పులకప్రకాండముల్=పులకల గుంపులు; మనోజహాలికుఁడు=మదనుఁడనుకర్షకుఁడు; మోదము ఎసంగన్=సంతోషమతిశయిల్లునట్లుగా; కురంగ...క్షేత్రమునన్=కస్తూరిచేత అడుసైననాయిక శరీరమనుపొలమునందు; వెలయంగన్...నికాయములు=వెలయఁగఁజేయునట్టి దృఢములయినకోరికలగుంపులు; ఈరికలెత్తెనోయనన్=మోసులెత్తెనాయనునట్లు; మొలచెన్=ఉదయించెను.

ఇందు రోమాంచ ముదాహృతమయ్యె నని తాత్పర్యము.

కంపమున కుదాహరణము.

ఉ. చెన్నగుశ్రీనృసింహవిభుఁ ♦ జిత్రపటంబున వ్రాసి బింకపుం
జన్నులమీఁదఁ జేర్చుకొని ♦ చాల వడంకఁ దొడంగె బాల దాఁ
గన్నులవింటివాఁడు త్రిజ ♦ గంబు జయించెద నంచుఁ గోరిచే
నున్నకృపాణవల్లిక మ ♦ హోజ్జ్వలత న్దళిపించెనో యనన్. 89

టీ॥ బాల=చిన్నది; చెన్నగు...విభునిన్=సుందరుఁడగు శ్రీనరసభూపాలుని; చిత్రపటంబునన్=చిత్తరువుపటమందు; వ్రాసి=లిఖించి, బింకపుం...కొని=బిగువైన గుబ్బలపై నుంచుకొని; కన్నులవింటివాఁడు=మరుఁడు; తాన్=తాను; త్రిజగంబు...కోరి=ముజ్జగములు గెలిచెదనంచుఁదలంచి; చేనున్నకృపాణవల్లికన్=చేతనున్న తీఁగవంటిఖడ్గమును; మహోజ్జ్వలత=మిక్కిలిప్రకాశముచేత; జళిపించెనోయనన్=కంపింపఁజేసెనాయనునట్లు; చాలన్=మిక్కిలి; వడంకఁదొడంగెన్ = వడఁకసాగెను.

ఇందుఁ గంపము చెప్పఁబడె నని తాత్పర్యము.

వివర్ణత కుదాహరణము

ఉ. మానవతీలలామ యసమానసముజ్జ్వలగాత్రవల్లిపైఁ
గానఁగ నయ్యెఁ బాండుతర కాంతి నిరంతరమై మనంబునన్
శ్రీనరసింహభూవరు ధరింపఁగఁ దద్వదనేందుమండలీ
మానితచంద్రికారససమాజము పైపయిఁ బర్వెనో యనన్. 90

టీ॥ మానవతీ...పైన్, మానవతీలలామ = ఒకయుత్తమస్త్రీయొక్క, అసమాన=సాటిలేనట్టి, సముజ్జ్వల = ప్రకాశించుచున్నయట్టి, గాత్రవల్లిపైన్ = తీఁగవంటిశరీరమందు; పాండుతరకాంతి = మిక్కిలి తెల్లనికాంతి; నిరంతరమై=దట్టమయి; మనంబునన్=మనస్సునందు; శ్రీనరసింహభూవరున్ = శ్రీనరసభూపాలుని; ధరింపఁగన్=తాల్పఁగా; తద్వదన...సమాజము, తద్వదనేందుమండలీ = ఆరాజుముఖమనెడు చంద్రమండలముయొక్క, మానిత = శ్రేష్ఠమయిన, చంద్రికారససమాజము=జ్యోత్స్నాద్రవపుంజము; పైపయిన్= మీఁదుమీఁదుగా; పర్వెనో యనన్= వ్యాపించెనాయనునట్లు; కానఁగనయ్యెన్ = చూపట్టెను.

ఇందుఁ జాంకిమ వర్ణిత మైనది గాన నిది వైవర్ణ్యోదాహర ణమగునని తాత్పర్యము. ఇట్లు సాత్త్వికభావంబులు ముగిసెను.

ఇఁక సంచారిభావలక్షణము.

క. అహరహము రసోత్పత్తికి
సహాయభావంబు లెలమి సంచారు లగుఁ
మహి నవి ముప్పదిమూఁడై
మహితము లగు వీనికిం గ్రమం బేర్పఱతుఁ.

టీ॥ అహరహముఁ = ఎల్లప్పుడును; రసోత్పత్తికిఁ = రసోదయము నకు; ఎలమిఁ = మిక్కిలి; సహాయభావంబులు = సహకారులగుభావమ్ములు; సంచారులగుఁ = సంచారిభావములగును. అవి = ఆభావములు; మహిఁ = భూమియందు; ముప్పదిమూఁడై — ముప్పదిమూఁడుభావములై; మహితములగుఁ = పూజితములగును. వీనికిఁ = ఈసంచారులకు; క్రమంబు = వరుసను; ఏర్పఱతుఁ = నిరూపించెద.

సంచారిక్రమనిరూపణము.

శా. నిర్వేదశ్రమదైన్యజాడ్యములు గ్లానిత్రాసశంకార్తిరు
డ్గర్వావేగధృతిస్మృతు ల్చపలతోగ్రత్వావహిత్థాత్రపాం
తర్వైక్లబ్యమదోత్సుకత్వమతినిద్రామోహబోధాంతము
త్సర్వాలస్యవితర్కసుప్త్యసహతావ్యాధ్యున్మాదపస్మృతుల్. 91

టీ॥ నిర్వేదము, శ్రమము, దైన్యము, జాడ్యము, గ్లాని, త్రాసము, శంక, ఆర్తి, రోషము, గర్వము, ఆవేగము, ధృతి, స్మృతి, చపలత, ఉగ్రత్వము, అవహిత్థ, త్రప, వైక్లబ్యము, మదము, ఔత్సుక

త్యము, మతి, నిద్ర, మోహము, బోధము, అంతము, హర్షము, ఆల
స్యము, వితర్కము, సుప్తి, అసహత, ఆధ్యానము, భ్రమము, అప
స్మృతి, ఇవి ముప్పదిమూఁడు సంచారులుగాఁ దెలియునది.

కవిప్రతిజ్ఞావాక్యము.

క. ఈవరుసఁ ద్రయస్త్రింశ
ద్భావములకు లక్షణము లుదాహరణంబుల్
వావిరి నొనర్తు నీయెడఁ
గేవలశృంగారసూత్ర కీలితఫణితిన్.

టీ॥ ఈవరుసన్=ఈక్రమముగా; త్రయస్త్రింశద్భావములకున్=ముప్పదిమూఁడుభావంబులకు; లక్షణములు ఉదాహరణంబుల్=లక్షణంబులను లక్ష్యములను; వావిరిన్ = వెంబడిగనె; ఈయెడన్ = ఇప్పుడు; కేవల...ఫణితిన్= ఒక్కటైన శృంగారరసమనెడుసూత్రముచేతఁ గూర్పఁబడినవాక్కుచేత; ఒనర్తున్ = రచియింతును.

ఈవ్యభిచారులు సర్వరసములయందు నున్న నొకశృంగారమున కుఁ జేరినవానికే లక్షణంబులు లక్ష్యంబులు రచియించెద నని తాత్ప ర్యముగాని లక్షణములు శృంగారమునకే కాక యితరరసములకును సా ధారణములుగా నున్నవి.

నిర్వేదశ్రమముల లక్షణములు.

క. నిరుపమదురితేర్ష్యాదుల
నిరతము జనియించునరతి నిర్వేద మగున్
సురతగమనాదిసంభవ
సరసస్వేదాంబులహరి శ్రమ మెట్లన్నన్. 94

టీ॥ నిరుపమ...ఆదులన్=సాటిలేనివగదుఃఖము ఈర్ష్య మొదలగువానిచేత; నిరతము=ఎల్లపుడు; జనియించునరతి=పుట్టునట్టియప్రీ

టీ; నిర్వేదమగుఁ=నిర్వేదభావమగును. సురత...లహరి=సురతము గతమనము బరువుమోయుట మొదలగువానివలన నుదయించును త్రమ మగు చెమటనీటిప్రవాహము; శ్రమము=శ్రమమనుభావమగును. ఎట్లన్నఁ=వీనియుదాహరణము లెట్లనఁగా; పైఁ జెప్పినలక్షణదోష ఘంటే తెల్లము.

నిర్వేదమున కుదాహరణము.

క. శిలలు మణిభూషణంబులు
చెలు వగుహారములు జలధిఁ ♦ జందినచినుకుల్
తలిరాకుఁబోఁడి నాకగు
సులభదయానిధి నృసింహుఁ ♦ జూడక యున్నన్. 95

టీ॥ తలిరాకుఁబోఁడి=ఓసఖి! నాకున్; సులభదయానిధిన్ నృసింహున్=సుకరమైనదయకునివాసమగు నరసభూపాలుని; చూడక యున్నన్=చూడనప్పుడు; మణిభూషణంబులు=మణిమయములైన యాభరణములు; శిలలు=రాళ్ళే; చెలువగుహారములు=అందమైనముత్తెపుసరములు; "హారోముక్తావళీ" యనియమరుఁడు; జలధిఁజందినచినుకుల్=సముద్రమందుఁబడిన యుదకబిందువులే; అగున్=అగుచున్నవి.

ఇందు నరసభూపాలునిఁ జూడనిదుఃఖముచే భూషణాదులయం దప్రీతి రూపమగు నిర్వేదము నాయికకుఁ జెప్పఁబడినదని తాత్పర్యము.

శ్రమమున కుదాహరణము.

క. నరసేంద్రుఁ జూడ రయమున
నరుదెంచి లతాంగి శ్రమజ ♦ లాపూరితమై
సరసేందుకిరణపరిణతిఁ
గరఁగిన నెలచట్టుబొమ్మ ♦ కైవడి నమరెన్. 96

టీ॥ లతాంగి=స్త్రీ; నరసేంద్రు౯=నరసభూపాలుని; చూడ౯=చూచుటకు; రయమున౯=వేగముచేత; అరుదెంచి=వచ్చి; శ్రమజలాపూరితయై=శ్రమచేనుదయించిన యుదకముచేవ్యాప్తయై; సరస..పరిణతి౯, సరస=మనోజ్ఞములగు, ఇందుకిరణ=చంద్రకిరణములయొక్క, పరిణతి౯=వ్యాప్తిచేత; కరఁగిన...కైవడి౯=ద్రవించిన చంద్రకాంతమణిప్రతిమవలె; అమరె౯=ఒప్పెను.

ఇందు నరసభూపాలునిఁ జూచుటకు వచ్చిననాయికకు గమనజన్యశ్రమము వర్ణింపఁబడినదని తాత్పర్యము.

§ లక్షణపద్యమున సరసస్వేదాంబులహారి శ్రమ మని శ్రమము స్వేదరూపముగఁ జెప్పియుండఁగా నీలక్ష్యపద్యములో శ్రమజలాపూరితయై యను చోట శ్రమరూపమైన జలముచేత నని యర్థము వ్రాయక శ్రమజన్యమగు నుదకముచేత నని వ్రాయుట "స్వేదాభిన్నము శ్రమ" మను లక్షణము తప్పును నభిప్రాయమునఁ గాని వేఱు గాదు. అదియెట్లన్న, శ్రమము స్వేదరూపమై నపుడు శ్రమమునకు వేఱుగ సాత్త్వికభావములలో, "శ్లో॥ స్తమ్భప్రళయరోమాఞ్చా స్స్వేదో వైవర్ణ్యవేపథూ। అశ్రువైస్వర్యమి త్యష్టౌ సాత్త్వికాః పరికీర్తితాః॥" అని స్వేదమును జెప్పుట కేమికతంబు? వ్యభిచారియైన శ్రమమునకు సాత్త్వికమైనస్వేదమునకు లక్షణములు గాని లక్ష్యములు గాని యెట్లు భేదిల్లును? "చెమట స్వేదము, సరసస్వేదాంబులహారి శ్రమము," అనులక్షణములకు, "సతికిఁజెమర్చెమేను, లతాంగి శ్రమజలాపూరితయై," అనులక్ష్యములకు, నేమి భేదముఁ గల్పింపవచ్చును?

§ ఒకవేళ, "సూక్ష్మరూపమైనస్వేదము సాత్త్వికము, ప్రవాహరూపముగ భూయిష్ఠమగు స్వేదము వ్యభిచారియని భేదము చెప్పవచ్చును. దా

నం జేసియె సాత్త్వికలక్షణము చెమట స్వేదమనియు, వ్యభిచారిలక్షణము స్వేదాంబులహారి శ్రమమనియుఁ జెప్పంబడినది ఇట్లు స్థాయి యగుభయమునకును వ్యభిచారియగుత్రాసమునకునుంబోలె భేదమునిరూపింపవచ్చు" నందు రేమోకాని యదియు ఘటిల్లదు. ఎందువలనననఁగా.

§ రసార్ణవసుధాకరమునందు, "శ్లో॥ నిదాఘహర్షవ్యాయామశ్రమక్రోధభయాదిభిః। స్వేద స్సంజాయతే" అనుస్వేదలక్షణపద్యముక్రిందఁ బుష్పాపచయరూపవ్యాయామజన్య స్వేదమునకు, * "శ్లో॥ గత్వోద్రేకం జఘనపులినే రుద్ధమధ్యప్రదేశః క్రామన్నూరుద్రుమభుజలతాః పూర్ణనాభిహ్రదాన్తః। ఉల్లఙ్ఘ్యోచ్చైః కుచతటభువం ప్లావయన్రోమకూపాన్ స్వేదాపూరోయువతిసరితాం ప్రాప గణ్డస్థలాని॥" అనియు, గీతశ్రమజన్య స్వేదమునకు, †"శ్లో॥ గీతాన్తరేషు శ్రమవారిలేశైః కించిత్సముచ్ఛ్వాసి

* యువతిసరితామ్=ఉవిదలనెడు నదులయొక్క; స్వేదాపూరః=చెమటవఱద; జఘనపులినే=కటిపురోభాగమనెడు నిసుకదీవియందు; ఉద్రేకమ్=విజృంభణమును; గత్వా=పొంది; రుద్ధమధ్యప్రదేశః=అడ్డగింపఁబడిన మధ్యభాగముగలదయి; ఊరుద్రుమభుజలతాః=తొడలనెడుమ్రాఁకులను బాహువులనెడుతీవలను; క్రామన్=ఆక్రమించునదియై; పూర్ణనాభిహ్రదాన్తః=నింపఁబడిన నాభియనెడు హ్రదమధ్యభాగముగలదై; ఉచ్చైః=మిట్టయగు; కుచతటభువమ్=చన్నులను నొడ్డులచోటును; ఉల్లఙ్ఘ్య=అతిక్రమించి; రోమకూపాన్=వెండ్రుకగుంటలనునూతులను; ప్లావయన్=ముంచుచు; గణ్డస్థలాని=చెక్కులనెడు నున్నతప్రదేశములను; ప్రాప=పొందెను.

† గీతాంతరేషు=గానావకాశ సమయములయందు; శ్రమవారిలేశైః=స్వేదోదకకణములచేత; కించిత్=కొంచెముగ; సముచ్ఛ్వాసితపత్రలేఖమ్.—సముచ్ఛ్వాసిత=చెదరినట్టి, పత్రలేఖమ్=మకరికాపత్రముల వ్రాతఁగలదియు; పుష్పాసవాఘూర్ణితనేత్రశోభి.—పుష్పాసవ=పుష్పసంబంధి మద్యముచేత, ఆఘూర్ణిత=త్రిప్పఁబడిన, నేత్ర=కన్నులచేత, శోభి=విలసిల్లునట్టి; ప్రియాముఖమ్=ప్రియురాలిమోమును; కిమ్పురుషః=కింపురుషుండను దేవయోని; చుచుమ్బ=చుంబనముఁజేసెను.

తప_త్త్రిలేఖమ్ । పుష్పాసవాఘూర్ణితనేత్రశోభి ప్రియాముఖం కిమ్పురుష శ్చుచుమ్బ॥" అనియు నుదాహరణములు వ్రాయఁబడినవి. ఇందు శ్రమ వ్యతిరిక్తస్థలమునందు "స్వేదాప్లూరో యువతిసరితాం ప్రాపగణ్డస్థలాని" అని భూయిష్ఠస్వేదరూపముగను, శ్రమస్థలమునందు, "శ్రమవారిలేశైః" అని స్వేదలేశరూపముగను, నుదాహరింపఁబడినది. ఇది పైచెప్పిన శ్రమస్వేద లక్షణములకు వైపరీత్యముగ నున్నది. కావున శ్రమ, మల్ప స్వేదరూప మని గాని యధికస్వేదరూప మని గాని చెప్పుట పొసఁగదు.

§ మఱియు, సాత్త్వికములు శారీరభావములనియు, వ్యభిచారులు మానసభావము లనియు సిద్ధాంతము. ఇట్లు లక్షణము, "శ్లో॥ శ్రమో మానసఖేద స్స్యా దధ్వన్నృత్తరతాదిభిః" అని చెప్పఁబడియున్నది. రోమాంచస్వేదవైవర్ణ్యాదిసాత్త్వికములు శారీరము లగుటయు స్పష్టము. శ్రమము స్వేదరూపబాహ్యభావ మైనయెడ, "శ్రమో మానసఖేద స్స్యాత్," అని యాంతరభావత్వము దాని కెట్లు ఘటిల్లు? * "శ్లో॥ సద్యః పురీపరిసరేషు శిరీషమృద్వీ గత్వా జవా త్త్రిచతురాణి పదాని సీతా । గన్తవ్య మస్తి కియ దిత్యసకృ ద్బ్రువాణా రామాశ్రు

---

* శిరీషమృద్వీ=దిరిసెనపువ్వువలెఁ గోమలయగు; సీతా=సీతాదేవి; సద్యః=తత్కాలమందు; పురీ పరిసరేషు=అయోధ్యయొక్క సమీపదేశములందు; జవాత్=వేగమునలన; త్రిచతురాణి=మూఁడునాలుగు; పదాని=అడుగులు : గత్వా=నడిచి ; గంతవ్యమస్తి కియత్=ఇంకఁబోవలసిన దెంతదూరమున్నది ? ఇతి=ఇటని; అసకృత్=మాటిమాటికి ; బ్రువాణా=పలుకుచున్నదై ; రామాశ్రుణః=రాముల కన్నీటికి; ప్రథమావతారమ్=తొలుతటి ప్రాదుర్భావమును ; కృతవతీ=చేసినదయ్యె.

ణాం కృతవతీ ప్రథమావతారమ్॥” అని సింగభూపాలీయమందును, * శ్లో॥ అలసలులితముగ్ధా న్యధ్వసంజాతఖేదా దశిథిలపరిరమ్భై ర్దత్తసంవాహ నాని। పరిమృదితమృణాలీదుర్బలా న్యఙ్గకాని త్వ మురసి మమ కృత్వా యత్ర నిద్రా మవాప్తా॥” అని దశరూపకమునందును, అధ్వశ్రమోదాహరణములయందు స్వేదప్రవాహము గాని స్వేదలేశముగాని కనఁబడదు గావున నివి స్వేదాంబులహారిరూపశ్రమమున కుదాహరణము లెట్లగును? మఱియు ఆంధ్రనామసంగ్రహమునందును, “అలయిక బడలిక ♦ యలపు సేద యనంగ, శ్రమమున కాఖ్యలౌ ♦ శమనదమన” అని, శ్రమము, స్వేదరూపముగాఁ జెప్పక, బడలికగాఁ జెప్పుట యెట్లు పపన్న మగును? కావున, “సరసస్వేదాంబులహారి శ్రమము” అనుట, ప్రమాదవిలసితంబె యని తెలియునది.

§ ఇట్లు శృంగారచేష్టలలో లలితమున కుదాహరణముగా, † “శ్లో॥ స్వేదక్లేదితకజ్కణాంభుజలతాం కృత్వా మృదఙ్గ శ్రియాం చేటీహ స్తసమ

---

* అధ్వసంజాత ఖేదాత్=మార్గ గమనమునవలనఁగలిగిన శ్రమమువలన; అలస లులితముగ్ధాని.—అలస=గమనా సమర్థములు, లులిత=మృదువులు, ముగ్ధాని=సుందరమైనవియు; అశిథిలపరిరమ్భైః=గాఢాలింగనములచేత; దత్తసంవాహనాని=ఈయఁబడిన యంగమర్దనముగలవియు; పరిమృదిత మృణాళీ దుర్బలాని.—పరిమృదిత=మిక్కిలి మర్దింపఁబడిన, మృణాళీ=తామరతూండ్లవలె, దుర్బలాని=సామర్థ్యహీనములునగు; అంగకాని=దయనీయములగు నవయవములను; త్వమ్=నీవు; మమోరసి=నాయెదయందు; కృత్వా=ఉంచి; యత్ర=ఎచ్చోట; నిద్రామ్=నిద్రను; అవాప్తా=పొందినదాన వైతివో. అట్టిస్థలమును నేనెట్లు మఱవఁ గల నని పూర్వగ్రంథముతో నన్వయము. ఇది యుత్తర రామచరితములో రామవాక్యము.

† తాళావధౌ=తాళావసానసమయమున; తస్థుషీ=నిలిచియున్న, సా=ఆనటి; స్వేదక్లేదిత కజ్కణాన్=చెమటచే నార్ద్రముగాఁజేయఁబడిన వలయములుగల;

ర్పితైకచరణా మఞ్జీరసంధిత్సయా । సా భూయః స్తనకమ్పసూచితరయం నిశ్వాసమాముఞ్చతీ రఙ్గస్థాన మనఙ్గసాత్కృతవతీ తాళావధౌతస్థుషీ॥" యనుశింగభూపాలీయశ్లోకమునకుఁ బ్రతిగాఁ జేసిన, "చవడియుఁ గ్రమంబు తోడిభుజ ♦ వల్లి మృదంగమువీఁదఁ జేర్చి" యనుదానియందు స్వేదపదమునకు మాఱుగా శ్రమపదము పెట్టుటయు నయుక్తంబె. కావున స్వేద మేయేకారణమున నెచటెచటఁ జెప్పియుండిన నది యంతయు సాత్త్వికభావములోఁ జేరునదియే. అది "శ్లో॥ నిదాఘహర్షవ్యాయామశ్రమక్రోధభయాదిభిః" అని పూర్వము వ్రాసినరీతిగా, నిదాఘముచేతను హర్షముచేతను వ్యాయామముచేతను శ్రమముచేతను క్రోధముచేతను భయము మొదలగువానిచేతను జనియించును. అందు శ్రమము మానసఖేదరూపమైనవ్యభిచారిభావంబే కాని వేఱుగాదని తెలియునది.

ఇటఁ గొండఱు కవి యీపొరఁబాటు చేసినందుల కేక్రిందికారణముండ నోపు. ఈకవి యీఘట్టమున నేదో యొక నాగరపుస్తకము వలన మోసపోయి యుండును. అందు "ఖే స్వే" అనునీరెండక్షరములకు వ్రాఁతలో భేద మత్యల్పము. దానంజేసి యితఁడే పొరఁబడినాఁడో పుస్తకమును వ్రాసినలేఖకుఁడు పొరఁబడి ఖేద అనుశబ్దమును స్వేద అని వ్రాసినాఁడో అని సంశయింపఁ దగి యున్న దనిరి.

భుజలతామ్=లతవంటిబాహువును; మృదఙ్గాశ్రయామ్=మృదంగ మాధారముగాఁగలదానిఁగా; కృత్వా=చేసి; మఞ్జీర సంధిత్సయా=వీడినయందెను చక్కఁబఱుపవలెనను వాంఛచేత; చేటీహస్త సమర్పితైక చరణా=చేటియొక్క హస్తమందుంపఁబడినయొకపాదముగలిగినదై; భూయః=మాటిమాటికి; స్తనకమ్ప సూచితరయమ్=చన్నుల కదలికచేత సూచింపఁబడిన వడిగల; నిశ్వాసమ్=ఊర్పును; ఆముఞ్చతీ=విడుచుచున్నదై; రఙ్గస్థానమ్=నాట్యప్రదేశమును; అనఁగా లక్షణచే నందున్నసభ్యుల ననుట; అనఙ్గసాత్=మన్మథాధీనముగా; కృతవతీ=చేసినది.

ఎట్టివానికిఁ బొరఁబాటు గలుగ వచ్చుఁ గావునఁ గవియే పొరఁబడినట్లు చెప్పుట మేలు. కవికి దొరకిన నాగరపుస్తకమును వ్రాసినవాఁడు తనకు దొరకినమాతృకలోని "ఖే" అను నక్షరమునకు బదులుగా "స్వే" యని ఆపుస్తకములో వ్రాసి యుండునేమో అని యూహించినను, గ్రంథనిర్మాతగా నుండినకవి తదర్థపరిభావనము సేయక యున్నదున్నట్లు వ్రాసినాఁడని కవియందు గొప్పతప్పు మోపునపుడు నిరపరాధుఁడైనలేఖకునం దీతప్పు మోపుట మేలుగా దని నాకుఁ దోఁచినది.

దైన్యజాడ్యంబులకు లక్షణములు.

క. బల మఱి యరికిన్ దయ రాఁ
బలుకుట దైన్యం బనంగఁ ♦ బరఁగు న్మదిలోఁ
గల కోరిక చేకూఱిన
నల వెఱఁగక యునికి జాడ్య ♦ మగు నెట్లన్నన్. 97

టీ॥ బలమఱి=సామర్థ్యముడిగి ; అరికిన్=శత్రువునకును; దయరాన్=దయవచ్చునట్లు ; పలుకుట=వచించుట ; దైన్యంబనంగఁబరఁగున్=దైన్యమనుభావమై యొప్పును, మదిలోన్ కలకోరికచేకూఱినన్=మనస్సునందుఁగలిగిన మనోరథంబి డేఱినప్పుడు ; అలవెఱఁగకయునికి =మైమఱచియుండుట ; జాడ్యమగున్ = జాడ్యమనునదియగును, ఎట్లన్నన్.

§ "శ్లో॥ సత్త్వత్యాగా దనౌద్ధత్యం దైన్యంకార్పణ్యసంభవమ్" అని ప్రతాపరుద్రీయలక్షణ ముండఁగా, నిందు దయరాఁబలుకుట దైన్యమని చెప్పఁబడినది. ఈవ్యభిచారులు "వికారోమానసోభావః" అనుటచే మనోభావములు గాన మనస్సునందు దైన్య మనుభావ ముదయించినవెనుక దయరాఁబలుకును గాని యట్లు పలుకుటయే దైన్యము

కాదు. కొన్నిచోటుల ముఖమాలిన్యాదులవలనను దైన్యంబు దెలియ వచ్చుచున్నది. ఇట్లు కావ్యప్రకాశమున "వ్యానమ్రాదయితాననే" యనుపద్యమున "మ్లానాకపోలోదరే" యని దైన్యమున కుదాహరణ మీయఁబడినది. దయరాఁబలుకుటే దైన్య మన్నపు డిట్టిప్రయోగములు విరోధించును. కాన దైన్యకార్య మగుదయరాఁబలుకుట దైన్యముగాఁ జెప్పుట యుక్తమని తోఁచదు.

§ వెండియు "మదిలోఁ గలకోరిక చేకూఱిన నల వెఱఁగక యునికి జాడ్య" మని చెప్పినగుణాలక్షణము. "శ్లో॥ జాడ్య మప్రతిపత్తి స్స్యా దిష్టానిష్టాగమోద్భవా" అనుప్రతాపరుద్రీయులక్షణమునందు నిష్టసిద్ధివలన నేరీతి జడత యుదయించునో యనిష్టప్రాప్తివలనను నారీతి జడత గలుగునట్లు చెప్పినందునను, అట్లనేకలక్ష్యానుభవమువలనను, నవ్యాప్తంబు.

ఇటఁ గొందఱు, "పలుకుటల్ దైన్యంబు" అని విభాగముం జేసి పలుకుటను సప్తమ్యర్థద్వితీయగాఁ గొని పలుకుటయందుఁ గలభావము దైన్యంబని "భేదవైశిష్ట్యయోస్స్ఫూర్తావుస్మీలితవిశేషకా" ఇత్యాది స్థలములయందుం బోలె నిర్వహించుట మేలు. పలుకుటల్ అని పదచ్ఛేదముచే వాక్యపరిపూర్తికై ఏతత్ప్రకరణాధికృత మైనభావము నధ్యాహరించుకొన వచ్చు ననిరి.

"భేదవైశిష్ట్యయో స్స్ఫూర్తౌ, విరోధే తుల్యబలయోః, ఆభాసత్వే విరోధస్య" ఇత్యాది దృష్టాంతములయందు, భేదాదిస్ఫూర్తితుల్యబలవిరోధము లోనగునవియే యలంకారము లగుటయు, దార్ష్టాంతికమందట్లభేదము బాధకముగా నుండుటయు, అనయుములనుపేక్ష యార్తి

ధాతుచలనము దనర నపస్మారము, ఇత్యాదులయందుఁ దనుపీడాధాతు చలనములు మానసభావములుగానిచేతను, "మనం బెరియ రోషము" "మనము కృతార్థత్వము చెందినధృతి" ఇత్యాదులయందు, మనం బెరియుట కృతార్థత్వము చెందుటలే మానసభావము లగుటచేతను, ఈప్రకరణమందు భావపదము నధికృతముగా స్వీకరించుట దురుపపాద మగుటవలన, పలుకుటయందు (కారణముగాఁగలభావము) ఇట్టి లక్షణము నంతయు నధ్యాహృతముగాఁ గొనుట క్లిష్టకల్పనగాఁ దోఁచుచున్నది.

దైన్యమున కుదాహరణము.

క. మదన మదిరాక్షి లక్ష్యమె
మొదలఁ బురాంతకుని నీళ్ళు ♦ మోయించిన నీ
కిది మొదలు కరుణఁ జూడుము
సుదతి న్నరసింహుఁ గూర్పు ♦ సుకృతము గల్గున్. 98

టీ॥ మదన=ఓమన్మథుఁడా! మొదలన్=తొలుత; పురాంతకునిన్=త్రిపురభేదియగు నీశ్వరుని; నీళ్ళుమోయించిననీకున్=నీళ్ళుమోయునట్లుచేసిననీకు, అనఁగా, శివుఁడు గంగనుదలమీఁదనుఁచుకున్నాఁడనుట; మదిరాక్షిలక్ష్యమె=ఆఁడుదివిషయమా? లక్ష్యముకాదనుట. ఇది...చూడుము=ఇదిమొదలుకొనిదయచేనాలోకింపుము. సుదతిన్=నాచెలిని; నరసింహున్=నరసభూపాలుని; కూర్పు=చేర్పుము. సుకృతముగల్గున్=పుణ్యముగలుగును.

ఇందు మరునిఁగూర్చి చెలికత్తె దయరాఁ బలికినందునఁ దత్కారణం బగుదైన్యము వ్యక్తమగుచున్నదని తాత్పర్యము.

జాడ్యమున కుదాహరణము.

క. అదన నృసింహాఖ్యుఁడు వచ్చిన
సుదతి కనుంగొనదు చెలులఁ ♦ జూడదు భాషిం
పదు మిగులఁ జలింపదు త
ద్వదనామృతపారణావ ♦ ధానయుఁ బోలెన్. 99.

టీ॥ సుదతి=ఒకనాయిక; నృసింహాఖ్యుఁడు=నరసభూపాలుఁడు; అదనన్=సుసమయమందు; వచ్చినన్=రాఁగా; తద్వదన...పోలెన్=ఆరాజుముఖామృతముయొక్క యనుభవమందే కాగ్రతగలదోయనునట్లు; కనుంగొనదు=నృసింహునిఁజూడదు. చెలులఁజూడదు=చెలికత్తెల నవలోకింపదు. భాషింపదు=మాటాడదు. మిగులన్=మిక్కిలి; చలింపదు=కదలదు.

ఇందుఁ బ్రియాగమన మనునిష్టసిద్ధివలన నాయికకు జడత చెప్పఁబడినదని తాత్పర్యము.

§ ప్రతాపరుద్రీయమున, *శ్లో॥ సమాయాతే నాథే ప్రమనసి గృహాన్ రుద్రనృపతౌ వపు స్సౌన్దర్య శ్రీవిజితమదనోదారయశసి। వధూ రన్తస్తోషవ్యతికరవశా న్నోపచరితుం పురస్తా దాళీనాం నచలతి

*వపుస్సౌన్దర్యశ్రీవిజితమదనోదారయశసి=మేనియందముచే గెలువఁబడినమరునిగొప్ప యశము గలిగినట్టియు; ప్రమనసి=మంచిమనస్సుగల యట్టి; నాథే=ప్రియుఁడైన; రుద్రనృపతౌ=ప్రతాపరుద్రుఁడు; గృహాన్=గృహమునుగూర్చి; సమాయాతే=వచ్చినవాఁడుకాఁగా; వధూః=స్త్రీ; అన్తస్తోషవ్యతికరవశాత్=చిత్తమందలి సంతోషసంబంధ వశమువలన; ఆళీనాంపురస్తాత్=చెలియలయెదుట; ఉపచరితుమ్=ఉపచారముసేయుటకు; నచలతి=చలింపనిదియు కాదు, తథా=ఆప్రకారముగ; ననోపిరమతి=చాలింపనిదియు కాదు,

తథా నోపిరమతి॥" యనుదాసిలోఁ బ్రియుఁడు వచ్చినంజూచి కలిగిన హర్షాతిశయమున జడత చెప్పఁబడినది. ఇందు వానిం జూడ దనువ్యతిరేకోక్తులు మూర్ఛాదుల కుదాహరణముగా దీనిం జేయుచున్నవి.

గ్లానిత్రాసములకు లక్షణములు.

క. కడు శక్తి యెడలి బడలిక
నడలుట యది గ్లాని యయ్యె ♦ నాకస్మికమై
పొడము భయంబునఁ జిత్తము
తడఁబడు టది త్రాస మనఁగఁ ♦ దగు నెట్లన్నన్. 100

టీ॥ కడుశక్తియెడలి=మిక్కిలిసామర్థ్యముడిగి; బడలికనడలుట=బడలికచేనాయాసపడుటయేదికలదో; అది=ఆయాయాసపడుట; గ్లానియయ్యెన్=గ్లానియనునదియాయెను. ఆకస్మికమై పొడముభయంబునన్=అకారణముగనుదయించినభయముచేత; చిత్తముతడఁబడుట=మనస్సుతడఁబాటునొందుట యేదికలదో; అది= ఆతడఁబడుట; త్రాసమనఁగఁదగున్=త్రాసమననొప్పును. ఎట్లన్నన్.

గ్లాని కుదాహరణము.

క. నిండదె బడలిక మును చను
కుండలబరువు వాఁగలేని ♦ కోమలిమేనం
గొండంత వలపు పుట్టిన
గండరగండాంక యోబ ♦ ఘననరసింహా. 101

టీ॥ గండర...సింహా = గండరగండయనుబిరుదుచేనంకితుఁడవగు నోబయనరసభూపాలుఁడా! మును...మేనన్=తొలుతఁగుచకుంభభారమువహింపఁజాలని కోమలియంగమునందు; కొండంతవలపుపుట్టి

నర్=కొండవలెనధికమైన మోహముదయించినచో ; నిండదెబడలిక= బడలికనిండదా? అవశ్యమునిండుననుట.

త్రాసమున కుదాహరణము.

క. మరుఁ జిత్రలిఖితుఁ గని బి
త్తరి వెఱవఁ బరాగభూతిఁ ♦ దగ నిడి చిగురా
కరయ దిగఁ దుడిచి యలులకు
విరిబోనము వోయఁ దెలిసె ♦ వెఱపు నృసింహా. 102

టీ॥ నృసింహా=ఓనరసభూపాలుఁడా ! బిత్తరి=స్త్రీ ; చిత్రలిఖితుర్=చిత్రరువునందుద్రాయఁబడిన; మరుర్=మదనుని; కని=చూచి; వెఱవర్=భయంపడఁగా ; పరాగభూతిర్=పుష్పాదియనుభస్మను ; తగ నిడి=తగునట్లుంచి ; చిగురాకు...తుడిచి = చిగురుటాకునుబాగుగదిగఁ దుడిచి ; అళులకుర్=తుమ్మెదలకు ; విరిబోనముపోయర్=పువ్వులను అన్నముపోయఁగా ; వెఱపు=భయము ; తెలిసెర్.

ఇందాకస్మికమగుచిత్రలిఖిత స్మరదర్శనమున నాయికచిత్తము తడఁబడినట్లు వర్ణించినందునఁ ద్రాస మగు నని తాత్పర్యము.

§ " శ్లో॥ ఆకస్మికభయాచ్చిత్తవిక్షోభ స్త్రాస ఈరితః " అను ప్రతాపరుద్రీయలక్షణము నింతియె. రసగంగాధరకారాదు లాకస్మికముగ వ్యాఘ్రాది భయహేతువుల దర్శనమువలనఁ జిత్తవిక్షోభము గలుగునపుడు త్రాసముగా వలసివచ్చు నని యూహించి, "వ్యాఘ్రాది దర్శనమునఁ బ్రాణాపాయమగునో యని క్షోభపడుట భయమను స్థాయిభావమగు, తదితరమైనసాధారణవిక్షోభము త్రాస మనుసంచారియగు" నని భయత్రాసములకు భేదము వక్కాణించిరి.

శంకాదులకు లక్షణములు.

క. తనకు ననిష్టం బగునో
యని కొందుకుట శంక హృదయ ♦ మందలి తాపం
బినుమడియై వెలిఁ బర్విన
ననయముఁ దనుపీడ యార్తి ♦ యగు నెట్లన్నన్. 103

టీ॥ తనకున్...కొందుకుట=తనకుఁగీడగునోయని సంశయించుట; శంక=శంకయనుభావంబగును. హృదయమందలి...పర్విన్=హృదయసంతాపము రెండింతలై బయలుపడఁగా; అనయమున్=ఎల్లప్పుడు; తనుపీడ=శరీరబాధ; ఆర్తియగున్=ఆర్తియనునదియగును. ఎట్లన్నన్.

§ ఇందార్తిలక్షణము "హృదయమందలితాపం" బనుట మాత్రమే యుక్తము. తక్కినది శరీరధర్మమును బోధించుఁ గాని మానస ధర్మమును బోధింపదు గాన "వెలిఁబర్విన ననయముఁ దనుపీడ" యను నది యుక్తముగా దని తోఁచుచున్నది.

శంక కుదాహరణము.

క. చిలుకలపలుకో యని విన
నలుకుం జెలిపలుకుఁ దలఁకు ♦ నద్దము చూడం
గలువలచెలికాఁడో యని
చెలువ వియోగంబుకతన ♦ శ్రీనరసింహా. 104

టీ॥ శ్రీనరసింహా=సంపన్నుఁడవగు నరసభూపాలుఁడా! చెలువ=నాయిక; వియోగంబుకతనన్=విరహమువలన; చెలిపలుకున్=చెలికత్తెమాటను; చిలుకలపలుకోయనివిననలుకున్=చిలుకలయొక్కపలుకోయని యూహించివినుటకు వెఱచును. అద్దముచూడన్=అద్దముచూచుటకు; కలువలచెలికాఁడోయని=చంద్రుఁడోయని; తలఁకున్=భయపడును.

ఇందు నాయిక విరహార్తగానఁ జిలుకలపలుకులు వినుటవలనను జంద్రునిఁ జూచుట వలనను దన కనిష్టం బగునో యని కొదికి నట్లు వర్ణించినందున శంక కుదాహరణమగునని తాత్పర్యము.

ఆర్తి కుదాహరణము.

క. బెడిదపుమదనజ్వరమున
మిడిసి పడుఁ హారలతలు ♦ మృగలోచనకుఁ
వెడవిలుతు వింటి కోలల
వడువున సతి నింక నేఁచ ♦ వలదు నృసింహా. 105

టీ॥ బెడిదపుమదనజ్వరమునఁ = ఉగ్రమైనకామజ్వరముచేత; మృగలోచనకుఁ = నాయికకు; హారలతలు = లతలవలెనుండుముక్తాహారములు; మిడిసిపడుఁ=మిట్టిపడును. ఇంకఁ =ఇఁకమీఁద; సతిఁ= స్త్రీని; వెడ...వడువునఁ =మదనధనుర్బాణములవిధమున; నృసింహా= నరసభూపాలుఁడా ! ఏఁచవలదు=బాధింపఁదగదు.

ఇందు బెడిదపుమదనజ్వరమున మిడిసిపడు ననుటచేత హృదయతాపం బినుమడియై వెలిఁ బర్వినట్లు స్పష్టమగుచున్నది కావున నార్తియని తాత్పర్యము.

రోషగర్వములకు లక్షణము లు.

క. ఎందును గృతాపరాధుల
యందు మనం బెరియ రోష ♦ మగు నది యొరుల
న్నిందించి తన్నుఁ బొగడున
మందోన్నతి గర్వ మయ్యె ♦ మహి నిట్లన్నఁ 106

టీ॥ కృతాపరాధులయందుఁ = అపరాధముచేసినవారియందు ; ఎందును=ఎచటనైనను ; మనంబు = మనస్సు; ఎరియఁ=జ్వలింపఁగా ;

అది=ఆమనస్సుజ్వలించుట ; రోషము=అమర్షమనుసంచారి ; అగుఁ. ఒరులఁ...ఉన్నతి = ఇతరులనిందించితన్నుఁబొగడుకొనునధికోన్నతి ; మహిఁ=భూమియందు ; గర్వమయ్యెఁ = గర్వమనునది యాయెను. అదియెట్లన్నఁ.

§ ఈరోషమునకు "అపకారకారు లగునరు, లపరాధ మొనర్ప నేమ • హాసుపహానిమనం। బుపరిజ్వలితంబగు" నని పూర్వము చెప్పి నక్రోధమునకు, "శ్లో॥ అమర్ష స్స్వపరాధేషు చేతఃప్రజ్వలనం మతమ్, శత్రుకృతాపచారేణ మనఃప్రజ్వలనం క్రోధః" అనిప్రతాపరుద్రీయమునందుఁ జెప్పియున్న క్రోధామర్షముల లక్షణములకుంబోలె భేద మేర్పడదు. రసగంగాధరాదులలోఁ బరులయొక్క పరమాపరాధముచే జన్యమై వధపర్యవసాయి యగుమనఃప్రజ్వలనము క్రోధమనియు, అల్పాపరాధజన్యమై యసంభాషణపరుష భాషణాదిపర్యవసాయి యగు నది యమర్షమనియుఁ, క్రోధామర్షములకు భేదము వ్రాయఁబడియున్నది.

§ మెండియు, "క్రోధము కోపము రోషము" అని క్రోధమును త్రైవిధ్యము లగును. అందుఁ గ్రూరజనాశ్రయంబై వధాదిపర్యంతముం డునది క్రోధము. పీరజననిష్ఠంబై ప్రార్థించుపర్యంత ముండునది కోపము. వీనికి రెంటికి శత్రువులు భృత్యులు మిత్రులు పూజ్యులు విషయముగా నుండురు. అందు శత్రువిషయకక్రోధము గలిగినపుడు, పెదవి కొఱుకుట, బొమలుముడివెట్టుట, పండ్లుకొఱుకుట, లోనగుకార్యము లుదయించును. భృత్యునిగూర్చి క్రోధించునపుడు, తర్జనము, తలయూఁచుట, లోనగునవి గలుగును. మిత్త్రునిగూర్చి క్రోధము గలుగునపుడు, నేత్రాంతమందుఁ గ్రమ్ముకన్నీరు, ఊరక ధ్యానించుట, నిట్టూర్పులు, మౌనము, తలవంచుకొనుట, లోనగునవి యగును. పూజ్యులను గూర్చి

నక్రోధమందు, తన్నునిందించికొనుట, తలవంచికొనుట, మాఱుపలుకకుండుట లోనగునవి యగు. ఇఁక శత్రువును గూర్చిన కోపమందు, భావగర్భభాషణము, బొమముడి, అరుణనేత్రములు, లోనగునవియగు. ఇట్లు భృత్యాదికోపత్రితయమందుఁ దత్తద్విషయక క్రోధములయందువలెఁ జేష్టలుదయించు నని తెలియవలయు. ఇఁక రోష మనునది స్త్రీపురుషులకు నొండొరులను గూర్చియే గలుగునది. అది ప్రత్యయావధి యుండునది. ఇందుఁ గుటిలేక్షణములు, పెదవికదలుట, నేత్రాంతమందు రక్తిమ, ఊర్పులు, లోనగునవి యగును. ఈరోషము సపత్నీహేతుకమనియు, తదన్యహేతుకమనియు, రెండువిధములు, మొదటిదానికి మానమని నామాంతరము గలదు. ఇదియు సహేతుక నిర్హేతుకభేదంబున ద్వివిధంబు. తనవల్లభుఁడు నాయికాంతరసక్తుఁడు కాఁగా నీర్ష్యచేతఁ గలుగునది సహేతుక మనఁబడును. దర్శనమువలనను అనుమితివలనను శ్రవణమువలనను గలిగెడు నసహనమే యీర్ష్య యనఁబడు. ఇందు నిర్వేదావహిత్థాగ్లాని దీనతాదులు గలుగును. సాక్షాన్నాయికాంతరరతునిఁ జూచుటదర్శనము. భోగాంకములచేతను, సపత్నీనామోచ్చారముచేతను, స్వప్నమందు దానిపేరుతోఁ గలవరించుటచేతను నాయికాంతరరతుఁడని యూహించుట యనుమితి. ఆప్తలగుసకియలవలన వినుట శ్రవణము. ఈసహేతుకమైనమానము యథాయోగ్యముగ నుపయోగింపఁబడినసామము దానము భేదము నతి ఉపేక్ష రసాంతరము వీనిచేత శమించును. ప్రియవాక్యములు చెప్పుట సామ మనియు, నెపముచే భూషణాదు లిచ్చుట దాన మనియు, సఖీవచనములచే నుపాలంభప్రయోగము సేయుట భేద మనియు, పాదములపైఁ బడుట నతి యనియు, ఆకస్మికము లైనభయాదులఁ గల్పించుట రసాంతర మనియుఁ దెలియవలయు. ఈరసాంతర మనునది ఘనగర్జనాదిరూపము

యాదృచ్ఛికము, చతురుఁ డైనాయకునిచేఁ గల్పిత మగునది బుద్ధిపూర్వకము, అని రెండు తెగలు. ప్రేమపరీక్ష కలుక నిర్హేతుక మదియాలింగనాదులచేఁ దనంతనే శమించును. ఇట్లు కోపక్రోధరోషములకు భేదము, రోషమనునది స్త్రీపుంసులలో నన్యోన్యవిషయక మై యేయుండుటయు, రసార్ణవసుధాకరాదులయందు నిరూపింపఁబడినది. ఇట్లుండఁగా నిట రోషమనిచెప్పుటయు, "తల్లక్ష్యముగా నిలునిలు మనంగ యెచటికి" అని వ్రాయుటయుఁ జింత్యంబు. తరుణీతరుణులలో నొండొరుల యలుక కె రోషమనినామ మమరునపుడు మరునిగూర్చి రోషము చెప్పఁదగదుగదా? "సుప్తం ప్రబోధో మర్షశ్చ;" అనియె భరతసూత్రము. "అమర్ష స్సాపరాధేషు చేతః ప్రజ్వలనమ్మతమ్" అని ప్రతాపరుద్రీయములోనగు గ్రంథములు చూడవలయు. ఇట్లు స్థాయిభావక్రమముఁ జెప్పెడు "రతిహాసశోకయత్న ములతిభీతి జుగుప్సరోష" మనుపద్యమునను క్రోధస్థానమున రోషమనుట చింత్యమని తెలియవలయు.

రోషమున కుదాహరణము.

క. నిలునిలు మనంగ యెచటికిఁ
దొలఁగెదు నరసింహుఁ డింతి ♦ తోఁ గూడినఁ జా
లలరు భవదీయచాపము
కలుగానుగఁ ద్రిప్పి పిప్పి ♦ గాఁ గావింతుర్. 107

టీ॥ అనంగ = ఓమదనుఁడా! నిలునిలుము=తాళుతాళుము. త్వరపడకనుట. ఎచటికిఁదొలఁగెదు = ఎందుఁబోయెదవు? నృసింహుఁడు=నరసభూపాలుండు; ఇంతితోఁగూడినన్ = నాయికతోఁగూడిన వెనుక; చాలు అలరుభవదీయచాపము=సమృద్ధిచే ప్రకాశించుచున్న నీవిఁటిని; కలుగానుగన్ = రాతిగానుగయందు; త్రిప్పిపిప్పిగాఁగావింతుర్=త్రిప్పఁగఁ జేసిపిప్పిఁజేయింతును.

ఇందుఁ గృతాపరాధుఁడగు మదనునిగూర్చి మనఃప్రజ్వలనము చెప్పినందున రోషమగునని తాత్పర్యము.

గర్వమున కుదాహరణము.

క. ప్రతియె కలంకాంకితునకు
సతి యగురోహిణియు నతను ♦ సతి యగురతియుం
జతురు నృసింహునిఁ జెందిన
యతిధన్యకు నాకు ననుచు ♦ నంగన నవ్వెన్. 108

టీ॥ కలంకాంకితునకున్=కలంకముగలచంద్రునకు; సతియగురోహిణియున్=భార్యయగురోహిణీదేవియు; అతనుసతియగురతియున్=అనంగునిభార్యయగురతీదేవియు; చతురున్=చాతుర్యశాలియగు; నృసింహున్=నరసభూపాలుని; చెందినయతిధన్యకునాకున్=పొందినయతిధన్యురాలనైననాకు; ప్రతియె=సరియా; అనుచునంగననవ్వెన్=ఇట్లనుచు మగువ నవ్వెను.

ఇందు నాయిక రతిరోహిణుల నిందించి తన్నుఁ బొగడు కొనుటవలన గర్వమగునని తాత్పర్యము.

ఆవేగధృతులకు లక్షణములు.

క. క్రమమున నిష్టానిష్టా
గమజమనస్సంభ్రమంబు ♦ గన నావేగం
బమరఁగ మనము కృతార్థ
త్వముఁ జెందిన ధృతి యనంగఁ ♦ దగు నెట్లన్నన్. 109

టీ॥ క్రమమునన్=వరుసగా; ఇష్ట...సంభ్రమంబు=ప్రియాప్రియప్రాప్తివలనఁబుట్టిన మనస్సుయొక్క-తొట్రుపాటు; కనన్=చూడఁగా; ఆవేగంబు=ఆవేగమనునదియగును. అమరఁగన్=లెస్సఁగా; మన

ము=మనస్సు ; కృతార్థత్వముఁ జెందినన్=కృతకృత్యతనొందఁగా; ధృతి యనంగఁదగున్=ధృతియనుభావమగును. ఎట్లన్నన్.

ఆవేగమున కుదాహరణము.

క. సతి హారము నిడ నెడ లే
కతనునితనుసిద్ధిఁ గోరి ♦ యలరతి వ్రతసం
గతి నక్షసరము గైకొను
గతిఁ గేలన దాల్చి నృపతిఁ ♦ గనుఁగొన నరిగెన్. 110

టీ॥ సతి=స్త్రీ ; హారమున్=ముత్తెపుసరమును ; ఇడనెడలేక= ధరింపనవకాశము లేక ; అలరతి=ప్రసిద్ధయగురతీదేవి; అతనునితనుసిద్ధిఁ గోరి=అనంగుఁడగుతనభర్తకు శరీరసిద్ధినభిలషించి ; వ్రతసంగతిన్= వ్రతమునవలంబించుట చేత ; అక్షసరముగైకొనుగతిన్=జపమాలధరిం చినభంగి; కేలన=చేతనే; తాల్చి=ధరించి ; నృపతిఁగనుఁగొననరిగెన్= నరసభూపాలునిఁజూడఁజనెను. ఇట నావేగము స్పష్టము.

ధృతి కుదాహరణము.

క. నరసేంద్రుఁడు రా కుండినఁ
బరువడి భావింపఁ గలుగు ♦ భాగ్యమె చాలుం
జరితార్థనైతి మరునకు
గిరునకుఁ బ్రియ మేల పల్కఁ ♦ గీడ్పడి నాకున్. 111

టీ॥ నరసేంద్రుఁడు = నరసభూపాలుఁడు ; రాకుండినన్ = రాక యుండినను ; పరువడి...చాలున్=వరుసగాస్మరింపఁగలిగెడుభాగ్య మేచాలును, విరహమునం దితరములఁ బరిత్యజించి ప్రియస్మరణమె యొల్లఁ పుడు గలుగు ననుట. చరితార్థనైతిన్=కృతార్థనైతిని. మరునకు

గిరునకుఁ = నీచున్నై నమన్మథునకు ; ఇటనిందార్థమునందుగియనునాదేశము ; కీడ్పడి = లోఁబడి ; నాకుఁ = నాకు ; ప్రియము=ప్రియవాక్యమును; పల్కనేల=పల్కుటకేమిప్రయోజనము ? ఏమియుఁ బ్రయోజనము లేదనుట.

ఇందు నాయికమనంబు కృతకృత్యం బైనట్లు చెప్పి నందున ధృతి యని తాత్పర్యము.

స్మృతిచాపలోగ్రతలకు లక్షణములు.

క. స్మృతి యగుఁ బూర్వానుభవ
స్మృతి రాగద్వేషజనిత ♦ చేష్టాద్యనవ
స్థితి చాపల మెగ్గొదవిన
నతిచండత యుగ్రభావ ♦ మగు నెట్లన్నన్. 112

టీ॥ పూర్వానుభవస్మృతి=పూర్వమనుభవించినదానితలఁచుట ; స్మృతి=స్మృతియనుసంచారి ; అగుఁ. రాగ. . .అనవస్థితి = రాగమునఁగాని ద్వేషమునఁగాని పుట్టినచేష్ట మొదలగువానియొక్క యనవస్థ ; చాపలము=చపలతయనునదియగును. ఎగ్గొదవిననతిచండత=అపరాధముచేసినచో మిక్కిలికోపించుట ; ఉగ్రభావముగుఁ=ఉగ్రతయగును. ఎట్లన్నన్.

§ ఇట స్మృతిపదార్థము తెలియుటకుఁ జెప్పినస్మృతిలక్షణములోఁ బూర్వానుభవస్మృతియని స్మృతిపదమును జేర్చుట యాత్మాశ్రయమను దోషమునకు హేతువగుచున్నది.

స్మృతి కుదాహరణము.

క. నాఁటిపరిరంభసౌఖ్యము
నేఁటిబలెం బాయ దాత్మ ♦ నిండి తొలఁకుచున్

బోటి నృసింహునిఁ బాయని
పాటలసుమగంధు లెంత ♦ భాగ్యాధికలో. 113

టీ॥ బోటి=ఓసఖి! నాఁటిపరిరంభ సౌఖ్యము=నాఁడనుభవించి నయాలింగన సౌఖ్యము; నేఁటిబలెన్ = నేఁడనుభవించినదానివలె; ఆత్మన్=చిత్తమునందు; నిండితొలఁకుమన్ = నిండివెల్లిఁబర్వుచు; పాయకు=చనదు. నృసింహునిన్=నరసభూపాలుని; పాయనిపాటలసుమ గంధులు=ఎప్పుడునెడఁబాయనిస్త్రీలు, పాటలసుమమనఁగలిగొట్టుపువ్వు, దానివాసనవంటి దేహవాసనగలవారనుట; ఎంతభాగ్యాధికలో=ఎంత భాగ్యాతిశయముగలవారో.

ఇందు నాయిక తాఁ బూర్వము నరసభూపాలునితో ననుభ వించిన యాలింగనసౌఖ్యమును దలఁచుచున్నందున స్మరణమగునని తాత్పర్యము.

చాపలమున కుదాహరణము.

క. వనిత నృసింహునిఁ గనుఁగొని
చనుగుబ్బలమీఁదివలువ ♦ చక్కఁగ దిద్దున్
జనఁ జూచు మరలుఁ జెలితోఁ
బని లేమియుఁ బలుకు నురము ♦ పయిఁ జెయి సేర్చున్ 114

టీ॥ వనిత=స్త్రీ; నృసింహునిన్=నరసభూపాలుని; కనుఁగొని= చూచి; చను ..వలువ=జాఱునట్టిపైఁటచెఱఁగు; చక్కఁగదిద్దున్= బాగుగసవరించుకొనును. చనఁజూచున్=అతనిచెంతకుఁ జన నాలోచిం చును. మరలున్=వెనుకకుఁదిరుగును. చెలితోన్...పలుకున్=సఖితోఁ గార్యములేకయే మాటాడును. ఉరముపయిన్ చెయిసేర్చున్=ఎదపై హస్తముంచుకొనును.

ఇందు నాయికకు నరసభూపాలునిఁ గనుటచే రాగాతిశయమునఁ గ్రియానవస్థ గలిగినందునఁ జపలతయగునని తాత్పర్యము.

ఉగ్రత కుదాహరణము

క. వలదు వల దేఁచఁ గలువల
చెలికాఁడ నృసింహుఁ గూర్పు ♦ చెలిఁ గాకున్నన్
బొలఁతుకనిట్టూర్పుఁబొగ
ల్వెలువడి నీబింబ మెల్ల ♦ వెస మాయించున్. 115

టీ॥ కలువలచెలికాఁడ = ఓచందురుఁడా! ఏఁచన్=బాధింపఁగా; వలదువలదు=కూడదుకూడదు. చెలిన్=స్త్రీని; నృసింహున్=నరసభూపాలుని; కూర్పు=చేర్పుము. కాకున్నన్=అటుగాకున్నచో; పొలఁతుకనిట్టూర్పుఁబొగల్ = దానిగొప్పయూర్పులనుధూమములు; వెలువడి=బయలుదేఱి; నీబింబమెల్లన్=నీయొక్కబింబమంతయు; వెసన్=వేగముగా; మాయించున్=నశింపఁజేయును.

ఇందుఁ జంద్రుఁ డపరాధముఁ జేసినచో వాని రూపుమాపుట చెప్పినందున నుగ్రత యగునని తాత్పర్యము.

అవహిత్థాత్రపావిషాదములకు లక్షణములు.

క. భువిలో నాకృతిగోపన
మవహిత్థ మనంబు ముడుఁగు ♦ టది త్రప మతికిన్
వివిధోపాయాభావా
ద్వవిరతభంగము విషాద ♦ మగు నెట్లన్నన్. 116

టీ॥ భువిలోన్=భూమియందు; ఆకృతిగోపనము = అభిప్రాయమునుదాఁచుట; ఆకార_స్త్విఙ్గఇఙ్గితమ్మనియమరుఁడు; అవహిత్థ=అవ

హిత్థయనుసంచారియగును. మనంబుముడుఁగుట = చిత్తసంకోచమేది కలదో ; అది = ఆచిత్తసంకోచము ; త్రప = త్రపయనునదియగును. మతికిన్ = బుద్ధికి ; వివిధ...భంగము = ఉపాయాభావమువలననైన నానావిధమైన ఎడతెగనిభంగము ; విషాదమగున్ = విషాదమనునదియగును. ఎట్లన్నన్.

అవహిత్థ కుదాహరణము.

క. హారములు గరఁగ నరస
తుక్ష్మారమణునిఁ బాడి యొక్క ♦ సతి పులకలు మై
నీరిక లెత్తినఁ దాఁచును
సారెకు హారాంబుజనిత ♦ శైత్యం బనుచున్. 117

టీ॥ ఒక్కసతి=ఒకనాయిక ; హారములుగరఁగన్=మణిహారములు ద్రవించునట్లుగా ; నరస క్ష్మారమణునిఁబాడి=నరసభూపాలునిగీతములుపాడి ; పులకలు...ఎత్తినన్=రోమాంచములు శరీరమందంకురింపఁగా ; సారెకున్=మాటికి; హార...అనుచున్=హారోదకమువలనఁబుట్టినచల్లఁదనమనుచు ; దాఁచున్=దాఁగఁజేయును.

ఇందు నాయిక నరసభూపాలునియం దనురాగమువలనఁ బుట్టిన పులకలు శైత్యమునఁ బుట్టినట్లు చెప్పి యనురాగమును దాఁచినందున నవహిత్థ యగు నితాత్పర్యము.

త్రప కుదాహరణము.

క. వనిత నృసింహేంద్రుఁ బరా
కునఁ జేర్కొని శిరము వంచు ♦ కొనుఁ జెలి యెదుటన్
గనిపించె భావ మని మో
మునయము గుచదుర్గవసతి ♦ నాఁగినభంగిన్. 118

టీ॥ వనిత=ఒకస్త్రీ; నృసింహేంద్రుఁ=నరసభూపాలుని; పరాకునన్=పొరపాటుచేత; చెలియెదుటన్=సఖిముందర; పేర్కొని=పేరుపెట్టిపిలిచి; భావము=హృదయాభిప్రాయమును; కనిపించెన్=తెలిపెను. అని=అనుకారణముచే; మోము=ముఖమును; అనయమున్=మిక్కిలి; కుచదుర్గవసతిన్=కుచములనెడు దుష్ప్రవేశమైనస్థలమందలి యునికిచేత; ఆఁగినభంగిన్=అడ్డగించెనో అనునట్లు; శిరమువంచున్=తలవంచుకొనును.

ఇందు నాయిక తలవంచుకొనుటవలనఁ ద్రప యగునని తాత్పర్యము.

విషాదమున కుదాహరణము.

క. అలరులు మరునమ్ములు హిమ
జల మిందుకరోదితంబు ♦ శత్రువు దలఁపం
జలిగాడ్పు శ్రీనృసింహుం
డలిగినవాఁ డెట్లు మాను ♦ నతివకుఁ గాఁకల్. 119

టీ॥ అలరులు = పువ్వులు ; మరునమ్ములు=మదనునిబాణములు; హిమజలము=పన్నీరు ; ఇందుకరోదితంబు = చంద్రకిరణములవలననుదయించునది. చలిగాడ్పు=చల్లనివాయువు ; తలఁపన్=స్మరింపఁగ; శత్రువు=విరోధి. శ్రీనృసింహుఁడు = శ్రీమంతుఁడగునరసభూపాలుఁడు ; అలిగినవాఁడు = కోపించినవాఁడు. అతివకుఁగాఁకల్=చెలికిసంతాపములు ; ఎట్లుమానున్=ఏవిధముగశమించును?

ఇందు సుదతికిఁగాఁకలు మానుట కుపాయములు తోఁపక మనస్సునకు భంగము గలిగినట్లు చెప్పుటవలన విషాదమని తాత్పర్యము.

మదౌత్సుక్యమతులకు లక్షణములు.

క. మదము మదిరాదికృతస
మ్మద మోహవ్యతికరంబు ♦ మఱి యౌత్సుక్యం
బదన సమయాక్షమత్వము
మది నర్థవినిర్ణయంబు ♦ మతి యెట్లన్నన్. 120

టీ॥ మదిరా...వ్యతికరంబు = మద్యపానము మొదలగువానిచేఁ గలిగినహర్ష మోహముల చేరిక; మదము=మదమను సంచారియగును. మఱి=మఱియు ; అదనన్=సమయమునందు ; సమయాక్షమత్వము=విలంబముసహింపఁజాలమి ; ఔత్సుక్యంబు = ఔత్సుక్యమగును. మదిన్=చిత్తమందు ; అర్థవినిర్ణయంబు=అర్థనిశ్చయము ; మతి=మతి యనుభావంబగును. ఎట్లన్నన్.

§ "శ్లో॥ మతి రర్థవినిర్ణయః" అని ప్రతాపరుద్రీయలక్షణములో నర్థనిర్ధారణమె మతి యని యుండఁగా నిందు "మదిలో నర్థవినిర్ణయము మతి" యని యున్నది. మతిపదార్థజ్ఞానమునకుఁ జెప్పినలక్షణములో మదిని బ్రవేశింపఁజేయుట యాత్మాశ్రయదోషహేతు వగునని తోఁచుచున్నది. మది మతులకుంగల భేదమునుబట్టి తత్పరిహార మూహింపవచ్చును.

మదమున కుదాహరణము.

క. అమరున్నృసింహునివనమున
నమితానవరసము లాని యలి ♦ యావతముల్
భ్రమియించు నాడుఁ బాడును
రమణులతోఁ గూడి సాంద్ర ♦ రాగప్రౌఢిన్. 121

టీ॥ అలియావతముల్=తుమ్మెదలగుంపులు; అమరున్నృసింహునివనమువన్=ఒప్పుచున్న నరసభూపాలునియుద్యానమునందు ; అమి

తాసవరసములు=అమితములౌపుష్పరసములను ; ఆని=పానముఁజేసి ; రమణులతోఁగూడి=ప్రియులతోఁగూడి; సాంద్రరాగప్రౌఢిన్=గాఢాను రాగముయొక్క అతిశయము చేత; భ్రమియించున్=తిరుగును. ఆడున్= క్రీడించును. పాడున్=గానముచేయును.

ఇందు భృంగయువతులు మకరందము ద్రావి మోహమును, ప్రియులతోఁ జేరి హర్షమును, జెందినందున మద మనుసంచారి యగు నని తాత్పర్యము.

ఔత్సుక్యమున కుదాహరణము.

క. వరుఁ బిలువఁ బనిచి యెపు డెపు
డరుదెంచునో యనుచుఁ దలఁచి ♦ యభిముఖ యగు బి
త్తరి యింత పరాకై నను
నరయఁ దదాలోకవిఘ్న ♦ మగు ననుభీతిన్. 122

టీ॥ బిత్తరి=స్త్రీ ; వరునిన్=ప్రియుఁడగునరసింహుని ; పిలు వఁబనిచి=పిలువఁబంపి ; ఎపుడు...అనుచున్=ఎపుడెపుడువచ్చునోయ నుచు ; తలఁచి=భావించి ; ఇంతపరాకైనను=ఇసుమంతపరాకుగలిగి నను ; అరయన్=విచారింపఁగా ; తత్...భీతిన్ = ప్రియునిఁజూచుట కువిఘ్నమగునోయనుభయముచేత;అభిముఖయగున్=ప్రియుఁడు వచ్చు దారి కభిముఖ యగును.

ఇందు నాయిక దూతికను బంపి ప్రియుఁడు వచ్చువఱకుఁ దడవు సహింపక యెదురు చూచుటవలన నౌత్సుక్యంబగునని తాత్పర్యము.

మఱి కుదాహరణము.

క. చెలువరొ శ్రీనరసింహుం
దలనాఁటి నృసింహమూర్తి ♦ యగుఁ గాకున్నన్

దలఁచినతావుల నెల్లను
నెలకొని సాన్నిధ్య మొందు ♦ నిపుణత గలదే. 123

టీ॥ చెలువరో=ఓసఖీ ! శ్రీ నరసింహుండు=శ్రీ నరసభూపాలుండు; అల...అగుఁ=ఆనాఁటినృసింహస్వామియగును. కాకున్నఁ=అటు గాకయుండినచో; తలఁచినతావులనెల్లను=స్మరించినచోటులనంతటను; నెలకొని...గలదే=నిలుచుండి సన్నిధానమునొందునిపుణతయుండునా ? ఉండదు గాన నృసింహమూర్తియే యగు నని యర్థనిర్ణయముఁ జేసినందున మతి యనుసంచారి యగుననితాత్పర్యము.

నిద్రా మోహా బోధాంతములకు లక్షణములు.

క. జగతిం జిత్తనిమీలన
మగు నిద్ర యనంగ మూర్ఛ ♦ నందుట మోహం
బగు బోధ మెఱుకఁ జెందుట
యగణిత మృతియత్న మంత ♦ మగు నెట్లన్నన్. 124

టీ॥ జగతిన్=భూమియందు; చిత్తనిమీలనము=మన్మోముకుళనము; నిద్రయనంగన్ = నిద్రయనుసంచారియనఁగ; అగున్. మూర్ఛనందుట=మూర్ఛిల్లుట ; మోహంబు = మోహమనునది ; అగున్. ఎఱుకఁజెందుట=తెలివినొందుట ; బోధము = బోధమనుసంచారియగును. అగణితమృతియత్నము = అధికముగమరణముకొఱకు ప్రయత్నించుట. అంతము=అంతమనునది; అగున్. ఎట్లన్నన్.

నిద్ర కుదాహరణము.

క. కలనైన శ్రీనృసింహునిఁ
గలయం గల నంచుఁ గలికి ♦ కన్నులు మొగిచెం

చెలి బాహ్యేంద్రియపథమున
నలరుమనం బరుగకుండ ♦ నాఁగినభంగిన్. 125

టీ॥ చెలి=స్త్రీ; కలనైనన్=స్వప్నమందైనను; శ్రీనృసింహు నిన్ = శ్రీమంతుఁడగు నరసభూపాలుని; కలయంగలనంచున్=పొందఁగలననుచు; అలరుమనంబు - ఒప్పుచుండెడిమనస్సును; బాహ్యేంద్రియపథమునన్ =చక్షురాదిబహిరింద్రియమార్గమున; అరుగకుండన్=చనకుండునట్లు; ఆఁగినభంగిన్=అడ్డగించినరీతిగ; కలికికన్నులు మొగిచెన్= అందమైనకన్నులుమోడ్చెను.

ఇందు నాయిక కన్నులు మూసినందునఁ జిత్తనిమీలనము స్పష్టము గనుక నిద్ర యగునని తాత్పర్యము.

మోహమున కుదాహరణము.

క. అతనుశరహతుల సొరిగెను
సతి విరహతపస్సమాధి ♦ జనితవ్రతయై
ధృతి శ్రీనృసింహుఁ దలఁపఁగ
మతి తన్మయ మగుచు మేను ♦ మఱచినభంగిన్. 126

టీ॥ సతి=స్త్రీ; విరహ...వ్రతయై = వియోగమనెడుతపోనిష్ఠయందుఁగలిగిననియమముగలదై; ధృతిన్ = ధైర్యముచేత; శ్రీనృసింహుఁదలఁపఁగన్= నరసభూపాలుండను నృసింహమూర్తిని స్మరింపఁగా; మతి=చిత్తము; తన్మయమగుచున్=తద్రూపమగుచు; మేనుమఱచినభంగిన్=శరీరమును మఱచినదో అన్నట్లు; అతనుశరహతులన్=మన్మథబాణప్రహారములచేత; సొరిగెన్=మూర్ఛిల్లెను.

ఇందు నాయిక మదనబాణహతిచేత మూర్ఛిల్లి నట్లుచెప్పఁబడెను గాన మోహ మగునని తాత్పర్యము.

బోధమున కుదాహరణము.

క. తరణికులాధీశయశ
స్తరుణి జడత్వంబు మాని ♦ సంఫుల్లసితాం
బురుహాక్షియు జృంభితయై
చిరగతి మేల్కనియె శ్రీనృ ♦ సింహుఁడు గలుగన్. 127

టీ॥ తరణి...తరుణి = సూర్యవంశపురాజులకీర్తికాంత ; శ్రీనృసింహుఁడుగలుగన్ = నరసభూపాలుండుగలుగఁగా ; జడత్వంబుమాని=జడవృత్తినివదలి ; సంఫుల్లసితాంబురుహాక్షియున్=వికసించినతెల్లదామరలవంటికన్నులుగిలదియు ; జృంభితయై = ఆవలించినదియునై, ప్రకాశించినదియునై ; చిరగతిన్-బహుకాలమునకు; మేల్కనియెన్ = జాగరూకయాయెను.

సూర్యవంశపురాజులకీర్తి నిద్రించినట్లుండినది నరసభూపాలుఁడు దయింపఁగా, బహుకాలమునకుఁ బ్రకాశించెనని ఫలితార్థము.

ఇందుఁ గీర్తికాంతయావలించి యెఱుకఁ జెందినట్లుచెప్పినందున బోధ మగునని తాత్పర్యము.

అంతమున కుదాహరణము.

క. వల పెటేఁగి రాఁకు గాఁగిట
నలమఁడు నరసావనీంద్రుఁ ♦ డని వగవఁ జూమీ
చెలులును జిలుకయు నెవ్వతి
వలనగునో యనుచుఁ గొంత ♦ వగచెద నాత్మన్. 128

టీ॥ నరసావనీంద్రుఁడు=నరసభూపాలుఁడు; నలపెటఁగిరాఁడు =మోహమునఁ దెలిసియే తేరఁడు. కౌఁగిటనలముఁడు = కౌఁగిలీయఁడు. అనివగవఁజుమీ = ఇటనివ్యసనముఁ జెందనుజుమీ. చెలులును=సఖురాండ్రును; చిలుకయుఁ=క్రీడాశుకనును; ఎవ్వతివలనగునో అనుచుఁ=ఎవ్వతెయధీనమగునోయనుచు; ఆత్మన్=చిత్తమందు; కొంతవగచెదన్=కొంచెమువ్యసనపడెదను.

ఇందు నాయిక యెన్నియత్నములు చేసి యెంతకాలము నిరీక్షించినను బ్రియుఁడు రా లేదని యతనిఁబొందునాసవదలి మృతి కుద్యమించినట్లు "చెలులును జిలుకయు నెవ్వతివలనగునో" యనుటవలన వ్యక్తమగుచున్నదిగాన అంత మనునంచారి యగునని తాత్పర్యము.

మదాలస్యవితర్కములకు లక్షణములు.

క. ముద మిష్టలాభభవస
మ్మద మగుఁ గర్తవ్యకార్య • మందోద్యోగం
బది యలసత సందేహా
భ్యుదయబహుత్వము వితర్క • మొగి నెట్లన్నన్. 129

టీ॥ ఇష్టలాభభవసమ్మదము = ఇష్టసిద్ధివలననగుహర్షము; ముదము=ముదమనునది; అగున్. కర్తవ్య...ఉద్యోగంబు=చేయవలసిన కార్యమందుమంద ప్రయత్నంబేదికలదో; అది=ఆమందోద్యోగము; అలసత=అలసతయనునదియగును. సందేహాభ్యుదయ బహుత్వము=సందేహోదయనానాత్వము, అనేక సందేహములుదయించుట యనుట; వితర్కము=వితర్కమగును. ఒగిన్=వరుసగా; ఎట్లన్నన్=ఉదాహరణమెట్లనఁగా.

§ ఉవితర్కలక్షణము, "శ్లో॥ సందేహాత్కల్పనా న్స్యాద్వితర్కః పరికీర్తితః" అను ప్రతాపరుద్రీయలక్షణమునకును, "సంశయాదులవలనఁ గలుగు విచారమువితర్క" మనురసతరంగిణ్యాది లక్షణమునకును, విరుద్ధమై యనేకసంశయరూపమే వితర్క మనునర్థమును జెప్పుచున్నది.

ముదమున కుదాహరణము.

క. అలుకలై కింశుకశిఖలోఁ
జెలఁగుచు మున్నెంత తపముఁ ♦ జేసెనొ చెలివే
నలి నరసింహునియురమునఁ
జెలు వగుచెంగల్వదండ ♦ చేరువ గలిగెన్. 130

టీ॥ చెలివేనలి=స్త్రీయొక్క కొప్పు; అలుకలై =తుమ్మెదలై; కింశుకశిఖలోన్=మోదుగపువ్వులనునగ్నియందు; చెలఁగుచున్=ఒప్పుచు; మున్నెంతతపముఁజేసెనో=పూర్వమెంత తపమునాచరించెనో; నరసింహునియురమునన్=నరసభూపాలుని వక్షమునందు; చెలువగు చెంగల్వదండచేరువగలిగెన్=అందమగు నెఱ్ఱగలువల దండయొక్క సాన్నిధ్యము దానికిఁ గలిగెను.

ఇందుఁ జెలివేనలికి నరసభూపాలుని యురంబునందలి రక్తోత్పలహారసాన్నిధ్యము గలిగిన దని యిష్టలాభంబున హర్షముఁ జెప్పినందున ముద మగునని తాత్పర్యము.

* "శ్లో॥ యత్పూర్వం సరసీషు పద్మముకుళవ్యాజాత్తప స్సంచితం వక్షోజౌ యువయో స్త దద్య ఫలితం జాతౌ కృతార్థౌ యువామ్।

---

* వక్షోజౌ=కుచములారా! కాళరివల్లభేన=కాళతెరుద్రునిచేత; భవతోః=మీకొఱకు; స్వవక్షస్థలీకస్తూరీ ద్విగుణీ భవత్పరిమళా.—స్వవక్షస్థలీ=తనయొదను

దత్తా కాకతివల్లభేన భవతో రేషా స్వవక్షస్స్థలీ కస్తూరీద్విగుణీభవత్పరిమళా కల్హారమాలా యతః॥" అని ప్రతాపరుద్రీయోదాహరణమింతకన్న స్పష్టము.

ఆలస్యమున కుదాహరణము.

క. చెలు లాహారాదులకుం
   బిలిచిన నరగంటఁ జూచుఁ ♦ బ్రియుఁడు నృసింహుం
   డలఘునృపకుంజరుం డని
   యలికుంతల కుంభినీత్వ ♦ మందెనొ తానున్. 131

టీ॥ అలికుంతల=అలినీలవేణియగునొకకర్త; చెలులు=సఖులు; ఆహారాదులకుంబిలిచినన్=భోజనాదులకుఁబిలిచినను; అరగంటఁజూచున్=సగముమూసినకంటితోఁజూచును. ప్రియుఁడు నృసింహుండు=ప్రియుఁడైననరసభూపాలుండు; అలఘునృపకుంజరుండని=గొప్పరాజశ్రేష్ఠుఁడని, గొప్పరాచయేనుఁగని; తానున్=తానును; కుంభినీత్వమందెనొ=ఆఁడేనుఁగుతనమునొందెనాయేమి? లేనియెడ నరగంటఁజూచుట సంభవింపదనుట.

ఇందు నాయిక సఖు లాహారాదులకుఁ బిలిచిన నరగంటఁ జూచుటవలన నలసత యగునని తాత్పర్యము.

న్న, కస్తూరీ=మృగమదముచేత, ద్విగుణీభవత్పరిమళా=రెట్టించినవాసనగల; ఏషాకల్హారమాలా=ఈసౌగంధికదామము; యతః=ఏకారణమున; దత్తా=ఒసంగఁబడినదో; అతః=అందువలన; యువామ్=మీరిరువురు; కృతార్థౌజాతౌ=కృతార్థులైతిరి. సరసీషు=కొలఁకులయందు; పద్మముకుళవ్యాజాత్=తమ్మిమొగ్గలనెపమున; పూర్వమ్=వెనుక; యత్తపః=ఏతపము; సంచితమ్=చేయఁబడినదో; తదద్యఫలితమ్=అదియిప్పుడు సఫలమైనది. పద్మముకుళములే కొలకులయందుఁ దపము నాచరించి కుచములుగా నుదయించినవనుట.

* శ్లో॥ ఆస్తాం మృగాక్ష్యా గృహకృత్యవార్తా స్వాఙ్గోపచారే ష్వపి యత్నమాన్ద్యమ్ । కర్తవ్య మగ్రే దయితస్య యత్స్యా న్నూనం బలా త్కారయతి స్మర స్తత్॥" అను ప్రతాపరుద్రీయోదాహరణ మింతకన్న రమణీయతరంబు.

వితర్కోదాహరణము.

క. చెలు లెఱుఁగ రాదు భావము
చెలు లెఱుఁగక యున్న మరుని ♦ చే రాయిడి యౌఁ
జెలులును మన సొకటైనను
వల పెఱిఁగి నృసింహవిభుఁడు ♦ వచ్చునొ రాఁడో. 132

టీ॥ భావము = హృదయాభిప్రాయము; చెలులెఱుఁగరాదు= సఖులు తెలియఁగూడదు. చెలులెఱుఁగకయున్నన్ = చెలులుదెలియక యున్నచో; మరునిచేన్=మన్మథునిచేత; రాయిడియౌన్=బాధ గలుగును. చెలులునుమనసు ఒకటైనను=చెలులకుఁదెలిసినయెడననుట; వలపు...రాఁడో=నరసభూపాలుండు మోహమెఱిఁగివచ్చునోరాఁడో.

ఇందు సందేహముగఁ జెప్పినందున వితర్కంబగుననితాత్పర్యము.

---

* మృగాక్ష్యాః=లేడి చూపులుగల తరుణికి; గృహకృత్యవార్తా=కేళీగృహమం దొనరింపఁదగిన భోగోపకరణాలంకరణాది సన్నాహరూప కార్యములయొక్క ప్రవృత్తి; ఆస్తామ్=ఉండుఁగాక. స్వాంగోపచారేషు అపి=తనశరీరాలంకారాద్యవహారములయందును; యత్నమాన్ద్యమ్=ప్రయత్నమాంద్యము; భవతి=అగునని యధ్యాహార్యము దయితస్య=ప్రియునియొక్క; అగ్రే=ఎదుట; యత్ కర్తవ్యమ్స్యాత్=ఏదిచేయఁదగినదియగునో; తత్=దానిని; బలాత్=బలాత్కారముగ; స్మరః=మన్మథుఁడు; కారయతి=చేయించుచున్నాఁడు. నూనమ్=నిశ్చయము.

సుప్తిశ్యాధ్యానంబులకు లక్షణంబులు.

క. అతినిద్ర సుప్తి యితరుల
యతిశయము సహింపకుండు • టది యీర్ష్య యగుఁ
హితవస్తువు చేకూడమి
నతులాధ్యానంబు చింత • యగు నెట్లన్నన్. 133

టీ॥ అతినిద్ర=అధికమైననిద్ర; సుప్తి=సుప్తియనునదియగును. ఇతరులయతిశయము సహింపకుండుట=పరులయాధిక్యం బోర్వకుండుట యేదిగలదో; అది=ఆయోర్పులేమి; ఈర్ష్యయగుఁ=ఈర్ష్యయనునది యగును. హితవస్తువుచేకూడమిన్=ఇష్టవస్తువుఘటిల్లనందున; చింత=చింతయనునది; అనఁగా హితవస్తువుచేకూడమిచేఁగలుగు చింత యేదిగలదోయది; అతులాధ్యానంబు=అతులమైన ఆధ్యానమనునదియగునని యన్వయము.

“ నిర్వేదశ్రమదైన్యజాడ్యము ” లనుపద్యములో “ ఆధ్యానభ్రమాపస్మృతుల్ ” అని యాధ్యానము పేర్కొనఁబడుటవలన నిట్లన్వయముచేయఁబడెను. ఈయన్వయమునందు అతులశబ్దము, “అతిభీతి జుగుప్స, అత్యంతోత్సాహమయ్యె, అపరిమిత క్రోధమయ్యె,” ఇత్యాదులయందుంబోలెఁ బ్రసజిత్తని తెలియునది.

సుప్తి కుదాహరణము.

క. లలన నృసింహునికౌఁగిట
నలసియొ పవ లెల్ల నిద్ర • నందెడి నెలమిఁ
నెలపొందున రే ముద్దులు
గులికి పగ ల్నిద్రవోవు • కుముదినివోలెన్. 134

LIBRARY HYDERABAD

టీ॥ లలన=ఒకనాయిక ; నృసింహుని కౌఁగిటన్=నరసభూపాలుని కౌఁగిలిచేత ; అలసిరేయి=బడలియు ; పవలెల్లన్=పగలంతయు ; నెల. . .పూఁటన్=చందురుని సాంగత్యమున రాత్రియుద్దులేమి నిద్రించుకలువతీఁగవలె ; ఎలమిన్=మిక్కిలి ; నిద్రనందెడిన్=అతినిద్ర నొందెడినుట.

ఇందు నాయికకు గాఢనిద్ర చెప్పినందున సుప్తియగునని తాత్పర్యము.

ఈర్ష్యకుదాహరణము.

క. ఈవికొలఁదంతె తనమే
లే వేళను బాండుశోభ ♦ యెనయే నాకున్
వావిరిఁ గీర్త్యంగన యని
శ్రీ నెలయు నృసింహు నొద్దఁ ♦ జిరతరలీలన్. 135

టీ॥ తనమేలు=తనవిభవము ; ఈవికొలఁదంతె=ఈవి ప్రమాణమెంతో అంతమాత్రమేయనుట. ఏవేళను బాండుశోభ=ఎల్లప్పుడుపాండుశోభయనురోగముగలది, తెల్లనిదనుట. కీర్త్యంగన=కీర్తికాంత; వావిరిన్=ఉత్కర్షమునందు; ఎనయేనాకున్=నాకుసరియా? అని=ఇట్లని; శ్రీ=లక్ష్మి; నృసింహునొద్దన్=నరసభూపాలునిసన్నిధియందు; చిరతరలీలన్=బహుకాలపువిలాసముతో; వెలయున్=ప్రకాశించును.

ఇందు రాజ్యలక్ష్మి కీర్తికాంతమేలు సహింపఁజాలక "దానిమేలు ఈవియంతె దాని శరీర మెప్పుడును బాండుశోభ యనుజాడ్యము గలది." యనియిట్లు చెప్పుటవలన నసూయ యగునని తాత్పర్యము.

ఆఖ్యానమునకు నుదాహరణము.

క. సతి చెక్కిటఁ జెయి సేర్పఁగ
నతులకరాంగుళులు సాంజ ♦ నాశ్రుయుతములై

రతిపతి బాసట మించిన
శితపంచశరమ్ము లనఁగ ♦ జెలఁగు నృసింహా. 136

టీ॥ నృసింహా=నరసభూపాలుఁడా! సతి .. చేర్పఁగన్=నాయిక చెక్కిటఁజెయియుంపఁగా ; అతులకరాంగుళులు=సాటిలేనివగు చేతిప్రేళ్లు; సాంజనాశ్రుయుతములై =కాటుకతోఁగూడిన కన్నీరుతోఁగూడినవై ; రతి...అనఁగన్=మన్మథుని సహాయములై యతిశయించినతీక్ష్ణములగుపంచబాణములోయనునట్లు ; చెలఁగున్=ప్రకాశించును.

ఇందు నాయిక చెక్కిటఁ జెయిసేర్చి చింతించునట్లు చెప్పినందున నాధ్యానంబగునని తాత్పర్యము.

ఉన్మాదాపస్మృతులకు లక్షణములు.

క. అనయంబుఁ జేతనాచే
తనసదృశమనోభ్రమంబు ♦ ధర నున్మాదం
బనఁ బొల్చు ధాతుచలనము
దనర నపస్మార మనఁగఁ ♦ దగు నెట్లన్నన్. 137

టీ॥ అనయంబున్=ఎల్లపుడును ; చేతన...భ్రమంబు=ప్రాణులయందును అప్రాణులయందునుసమానమైనచిత్తభ్రాంతి; ధరన్=భూమియందు; ఉన్మాదంబనఁబొల్చున్=ఉన్మాదమనఁదగును. ధాతుచలనము=వాతపిత్తశ్లేష్మధాతువులయొక్కచాంచల్యము; తనరన్=ఒప్పునట్లుగా; అపస్మారమనఁగఁదగున్ = అపస్మారమనుసంచారియగును. ఎట్లన్నన్.

§ ప్రతాపరుద్రీయమునందు "శ్లో॥ ఆవేశో మోహాదుఃఖాద్యైరపస్మారోఽగ్రత వకృత్" అనియు, తద్వ్యాఖ్యయందు " అశుచిత్వధాతువైషమ్యభూతావేశాదిజన్యో భూపాతభ్రమణ భుజాస్ఫోటవికటోక్తిలా

లాఫేనాద్యనుభావక ఆవేశోపస్మార ఇత్యర్థః॥ అనియు, రసతరంగిణియందు "గ్రహాద్యావేశోఽపస్మారః, తత్రవిభావాః అపవిత్రత్వశూన్యస్థితి ధాతువైషమ్యోత్కట దుఃఖభయాదయః, అనుభావాః కమ్పఫేననిశ్వాస భూపాతవిపర్యాసజిహ్వాలోలనాదయః" అనియు, నపస్మారమునకు ధాతువైషమ్యము హేతువుగాఁ జెప్పఁబడినది గాని యాధాతువైషమ్యమే యపస్మార మని చెప్పఁబడలేదు. ఇట్లుండ నిందు ధాతుచలనమే యపస్మారముగఁ జెప్పుట తప్పుగాఁ దోఁచుచున్నయది.

ఉన్మాదమున కుదాహరణము.

క. నినుఁ బ్రార్థించెద భ్రమరమ
చని నరసింహేంద్రుఁ దెమ్ము ♦ చన వలదో హా
చనిన నృపాలుముఖాంబుజ
ఘనవాసనఁ దగిలి నీవు ♦ గ్రమ్మఱవు గదా. 138

టీ॥ భ్రమరమ = ఓభృంగమా! నినుర్=నిన్ను; ప్రార్థించెదర్=వేఁడెద. చని=ఏగి; నరసింహేంద్రుర్=నరసభూపాలుని; తెమ్ము=తీసికొనిరమ్ము. ఓ హా చనవలదు=తెలిసెను! పోవలదు. చనినర్=పోయినయెడ; నృపాలు. . .తగిలి=ఆరాజుముఖపద్మవాసన యందాసక్తమవై; నీవుక్రమ్మఱవుగదా=నీవు మరలిరావుగదా!

§ ఇందుఁ జేతనాచేతనసదృశచిత్తభ్రమమున్మాద మనులక్షణమునకును, జేతన మగుభృంగమందు సంభాషణాదివ్యవహారము జరగించినట్లు చెప్పినలక్ష్యమునకును, సమన్వయంబు దూరంబై యున్నది. ప్రతాపరుద్రీయములో, "శ్లో॥ ఉన్మాద స్తుల్యవర్తిత్వం చేతనాచేతనేష్వపి"

అనులక్షణమునకు * "శ్లో॥ ప్రతాపరుద్రస్య జయప్రయాణభేరీధ్వనౌ మూర్ఛతి దిఙ్ముఖేషు। త్రాసాకులా భ్రాన్తిముపేత్య వృక్షాన్ పృచ్ఛన్తిమార్గం ప్రతిభూమిపాలాః॥" అని యచేతనము లగు వృక్షములను మార్గ మడిగినట్లు వ్రాయఁబడిన యీలక్ష్యమను గుణముగ నున్నది, కాని "చిత్తసమ్మోహ ఉన్మాదః, ఉన్మాద శ్చిత్తవిభ్రమః, ఉన్మాద శ్చిత్తవిభ్రాన్తి ర్వియోగా దిష్టనాశతః, భయసన్నిపాతేష్టనాశాదిభి శ్చిత్తవిభ్రాన్తి రున్మాదః," ఇత్యాది గ్రంథాంతరలక్షణములు, "వియోగజే తు చేష్టా స్స్యాత్ ధావన మ్పరిదేవనమ్। అసమ్బద్ధప్రలపనం శయనం సహసా స్థితిః। అచేతనై స్సహాలాపో నిర్నిమిత్తస్మితాదయః। ఇష్టనాశకృతే త్వస్మిన్ భస్మాదిపరిలేపనమ్। నృత్తగీతాదిరచనా తృణనిర్మాల్యధారణమ్। అత్రోన్మాదే తు సకలాః ప్రాగుక్తా విక్రియా మతాః" ఇత్యాది తత్కార్యములు, "అసూత్థానం సదృశగణనా చేతనాచేతనేషు ప్రౌఢోష్మాణి శ్వసిత మసకృ న్నిర్గతో బాష్పపూరః। నిర్లక్ష్యా వా గ్గతి రవిషయా నిర్నిమిత్తం స్మితేచ్ఛ ప్రాయేణాస్యాః ప్రకటయతితరా మ్భ్రాన్తిదాత్రీ మవస్థామ్॥" ఇత్యాది తల్లక్ష్యములు, పరిశీలింపఁగా నిష్టనాశాదులవలన నుదయించినచిత్తవిభ్రాంతి యున్మాద మనియు, నచేతనాలాపనిమిత్తస్మితాసంబద్ధప్రలాపాదులు తత్కార్యము లనియుఁ దెలియ వచ్చుచున్నది గావున నున్మాదకార్యములలో నొక్కటి యగుచేతనాచేతన సదృశవర్తనము లక్షణముగాఁ జెప్పుట యుక్తముగాఁ దోఁపదు.

---

* ప్రతాపరుద్రస్య=ప్రతాపరుద్రునియొక్క; జయప్రయాణ భేరీధ్వనౌ=జయార్థమైనయాత్రయందలిభేరీనాదము; దిఙ్ముఖేషు=దిగగ్రభాగములయందు; మూర్ఛతి=మూర్ఛిల్లుచుండఁగా; అనఁగా నంతటను వ్యాపింపఁగా; ప్రతిభూమిపాలాః=శత్రురాజులు; త్రాసాకులాః=భయముచేత వ్యాకులులై; భ్రాంతిముపేత్య=చిత్తభ్రమనొంది; వృక్షాన్=వృక్షములను; మార్గమ్=త్రోవను; పృచ్ఛన్తి=అడుగుచున్నారు.

"తుల్యవృత్తిత్వ" మనుదానికిఁ దుల్యవృత్తిత్వ ప్రయోజకీభూత ధర్మమర్థముగా వివక్షిత మని ప్రతాపరుద్రీయలక్షణము యథాకథంచిత్తుగా సమన్వయించినను "చేతనాచేతన సదృశవస్తుభ్రమంబు" అను లక్షణము, మనోభ్రమమనునదిమాత్రము లక్షణపరము తక్కినది కార్యపరమన్నను సమన్వయింపదు. సదృశాంతము కార్యముగాను తక్కినది లక్షణముగా నుండునపుడు మనోభ్రమమను లక్షణములో సదృశయనునది యెట్లన్వయింపవలయు, సదృశము భ్రమము గాదుగదా, సదృశపదము సదృశవస్తుపరమనియు, దానికిఁ బ్రయోజకతాసంబంధముచే మనోభ్రమమం దన్వయ మనియు, జెప్పుదమన్నను నిపాతాతిరిక్తనామార్థములకు సాక్షాద్భేదాన్వయ మవ్యుత్పన్న మను శాస్త్రకారసిద్ధాంతమర్యాదోల్లంఘనము ప్రసరించును. కావున నరసభూపాలీయలక్షణము, తదనుగుణముగా నుండవలయునని చెప్పినలక్ష్యము, పరస్పరానుగుణ్యము లేమిని సమంజసములు గావనితోఁచెడిని. ఇంతమాత్రాన, నిను బ్రార్థించెదననునది యున్మాదలక్ష్యమే కాదగదని నాయుద్దేశము గానెంచఁ దగదు.

అపస్మారమున కుదాహరణము.

క. మదనగ్రహంబు సోఁకెను
సుదతీమణి దీర్ఘదృష్టిఁ జూచెడుఁ జెలులన్
ముద మొదవ గతుఁ గట్టెఁడు
మదవతికి నృసింహనామ మంత్రముకతనన్. 139

టీ॥ మదనగ్రహంబు=మన్మథుఁడనుభూతము; సోఁకెను=ఆవేశించెను. సుదతీమణి=స్త్రీరత్నము ; చెలులన్ = సఖులను ; దీర్ఘదృష్టిన్=నిడివిచూపులచేత ; చూచెడున్=చూచుచున్నది. ముదమొద

వక్=సంతోషమగునట్లు ; నరసింహానామమంత్రముక తెన్ =నరసభూపాలునినామాక్షరమంత్రముచేత ; రక్షఁగట్టుఁడు=రక్షకట్టుఁడు=రక్షకకట్టుబంధింపుఁడు.

ఇందు దీర్ఘ దృష్టిఁ జూచుటచే నపస్మార మగునని తాత్పర్యము.

౪. ఇరవుగ నీభావంబులు

పరఁగెడు ననుభావములు వి ♦ భావములు న
న్యరసంబులకుం గల వవి
విరచింపఁగ నొల్ల నిందు ♦ వి స్తరభీతిన్. 140

టీ॥ ఈభావంబులు - ఈముప్పదిమూఁడుసంచారిభావములు ; పరఁగెడుననుభావములు విభావములున్=ఒప్పుచున్న యనుభావములునువిభావములును ; అన్యరసంబులకున్=శృంగారేతరములగుహాస్యకరుణరౌద్రవీరభయానకబీభత్సాద్భుతశాంతరసములకును ; ఇరవుగన్=స్థిరముగ; కలవు=కలిగియున్నవి. అవి=ఇతరరసములకుఁ గలసంచారి తద్విభావతదనుభావాదులను; విస్తరభీతిన్=గ్రంథమువిస్తరిల్లునను భీతిచే; ఇందున్=ఈగ్రంథమునందు ; విరచింపఁగన్=నిరూపించుటకు ; ఒల్లన్=ఇచ్ఛింపను.

శృంగారాదినవరసములకును దత్తద్రసానుగుణములగు సంచారిభావములుగలవు, ఆసంచారులకు వేఱువేఱుగవిభావములు అనఁగాఁ గారణములు అనుభావములు అనఁగాఁ గార్యములు గలిగియున్నవి వానిలో శృంగారమునకు మాత్రము సంబంధించునవి చెప్పుటకే యింత గ్రంథ మయినది, ఇఁక నన్నిటికిఁ జెప్పునెడ గ్రంథము మిక్కిలి విస్తరిల్లు నని విరమించితి నని తాత్పర్యము.

క వి ప్ర తి జ్ఞా వా క్య ము.

తే. ఇంక శృంగారచేష్టల ♦ నేర్పరింతు
నవియు నష్టాదశాఖ్యలై ♦ యలరుచుండు
లలితగతి వీనినామము ♦ లక్షణములు
క్రమముతోఁ దెల్పి వీనిల ♦ క్ష్యము లొనర్తు. 141

టీ॥ ఇంకన్=ఇఁకమీఁద ; శృంగారచేష్టలనేర్పరింతున్=శృంగారచేష్టలనుజెప్పుదును. అవియున్—ఆచేష్టలును; అష్టాదశాఖ్యలై యలరుచుండున్ = పదునెన్మిది పేళ్లుగలవియైయొప్పుచుండును; వీనినామముల్= వీనియొక్క పేరులను ; లక్షణములు=లక్షణములను ; క్రమముతోన్= వరుసతో; లలితగతిన్=సుందరమైనవిధముచేత; తెల్పి=తెలియఁజెప్పి; వీనిలక్ష్యములొనర్తున్=వీనియుదాహరణములను రచియింతును.

వీనినామక్రమంబును భావలక్షణంబును.

క. ఇల భావహావహేలా
విలాసమాధుర్యధైర్య ♦ విభ్రమలీలా
కిలికించితమోట్టాయిత
లలితాదులు చేష్ట లగుఁ ద ♦ లంపఁగఁ మఱియున్. 142

తే. వెలయు బిబ్బోకవిచ్ఛిత్తి ♦ విహృతచకిత
హసితకుట్టమితకుతూహ ♦ లాదు లనఁగఁ
గలవు మఱి యందు భావంబు ♦ వెలయుచుండు
మహి రసజ్ఞానయోగ్యతా ♦ మాత్ర మగుచు. 143

టీ॥ ఇలన్=భూమియందు ; భావ...ఆదులు=భావము హావము హేల విలాసము మాధుర్యము ధైర్యము విభ్రమము లీల కిలికించిత

ము మోట్టాయితము లలితము మొదలయినవి ; తలంపగన్=విచారింపఁగా ; చేష్టలగున్=శృంగార చేష్టలగును. మఱియున్=వెండియును ; వెలయుబిబ్బోక... ఆదులు=వెలయుచున్న బిబ్బోకము విచ్ఛిత్తి విహృతము చకితము హసితము కుట్టమితము కుతూహలము మొదలగునవి ; అనఁగన్=అనంగా ; కలవు=ఉన్నవి. మఱి=మఱియును ; అందున్=ఆచేష్టలయందు ; భావంబు=భావమనునది ; రస...అగుచున్=రసముదెలియుటకు యోగ్యమగుటమాత్రమగుచు ; మహిన్=భూమియందు ; వెలయున్=ప్రకాశించును.

హావహేలలకు లక్షణములు.

క. అది యీషద్వ్యక్తముగా
సుదతులయెడ హావ మయ్యె ♦ సువ్యక్తంబై
పొదలిన ననవరతంబును
నది యిక్కలి హేల యయ్యె ♦ నది యెట్లన్నన్. 144

టీ॥ అది=ఆభావము ; ఈషద్వ్యక్తముగాన్=అంగవికారాదులచేఁగొంచెముబయల్పడినదికాఁగా ; సుదతులయెడన్=స్త్రీలయందు ; హావమయ్యెన్=హావమనునదియాయెను. అది=ఆహావము ; అనవరతంబును-ఎల్లప్పుడును ; సువ్యక్తంబై పొదలినన్=అతిస్పష్టవికారమైయొప్పఁగా ; హేలయయ్యెన్=హేలయనునదియాయెను. అదియెట్లన్నన్.

భావమున కుదాహరణము.

చ వరుఁడని పేరొకన న్విరము ♦ వాంచుఁదలోదరి సాలభంజికా
పరిణయవేళ నెచ్చెలులఁ ♦ బాయక యెప్పటియట్ల కేళికాం
తర మొనరింపఁ బోదు చనె♦నా యెదఁ బయ్యెదఁ జేర్చి సిగ్గునం
బరఁగుఁ బ్రియాంగనానుకృతి ♦ భావన కేలికిఁ గాఁగ నిచ్చలున్.

టీ॥ తలోదరి=వనిత ; ఎరుడని పేర్కొన్=మగఁడని పేరు చెప్పఁగా ; శిరము వాంచున్=తలవంచుకొనును. సాలభంజికాపరిణయవేళన్=బొమ్మల పెండ్లి సమయమునందు; నెచ్చెలులఁ బాయక=ప్రియసఖులనువదలక, వారితోఁగూడననుట ; ఎప్పటి...పోదు=పూర్వమట్లుండు నొక క్రీడసల్పుంజనదు. చనినా=చనినయెడ; ఎదఁబయ్యెదఁ జేర్చి=ఱొమ్మున మీఁదఁ బైఁటఁ జేర్చి;నిచ్చలున్=ఎల్లపుడు; ప్రియాంగనా...గాఁగన్=ప్రియురాండ్రగు స్త్రీలనుకరించుటను భావించుట క్రీడకుఁగాఁగా; సిగ్గునంబరఁగున్=లజ్జతో నొప్పును.

§ ఇందు "శిరమువాంచు, ఎదఁబయ్యెదఁజేర్చు" నిత్యాదులు "అదియాపద్వక్త్రముగా" ననులక్షణముతో సమన్వయంబున కనువై హావోదాహరణముగ దీనిం జేయుచున్నవి.

* "శ్లో॥ కురఙ్గీవాఙ్గాని స్తిమితయతి గీతిధ్వనిషు యత్సఖీం కాన్తోదన్తం శ్రుతమపి పునః పృచ్ఛతి చయత్ । అనిద్రం యచ్చాన్త స్స్వపితి త దహో వేద్మ్యభినవాం ప్రవృత్తోఽస్యా స్సేక్తుం హృది మనసిజః ప్రేమలతికామ్॥" అనునది యుక్తోదాహరణంబుగాఁ దోఁచెడిని.

* గీతిధ్వనిషు—గానశబ్దములగుచుండఁగ కురఙ్గీవ=ఆడుజింకవలె, అఙ్గాని=అవయవములను ; యత్=ఏకారణమున, స్తిమితయతి=నిశ్చలితముగాఁజేయునో. యత్=ఏకారణమున, శ్రుతమపి=వినఁబడినదైనను ; కాన్తోదన్తమ్=ప్రియునివృత్తాంతమును; పునః=మఱలను, పృచ్ఛతి=అడుగుచున్నదో. యచ్చ=ఏకారణమున, అన్తః=లోపల ; అనిద్రమ్=నిద్రాభావముగ ; స్వపితి=పవ్వళించుచున్నదో. తత్=ఆకారణమున, అస్యాః=ఈసుందరియొక్క ; హృది=చిత్తమందు, మనసిజః=మరుఁడు, అభినవామ్=నూతనమైన, ప్రేమలతికామ్=ప్రేమయనుతీవను; సేక్తుమ్=ఉంచుటకు, ప్రవృత్తః=ఉపక్రమించినవాఁడు, అహో=చిత్రము!

హావోదాహరణము.

చ. పడఁతి నృసింహుగీతములు ♦ పాడెడు వేళ నృసింహునామము
న్నుడువదు సిగ్గుతో గురుజ ♦ ను ల్నరనాథుగుణప్రశంస లే
ర్పడ నొనరించుచో నుచిత ♦ భ క్తిమెయి న్గురుసేవ సేయుకై
వడి వడి నాలకించుఁ దల ♦ వాంచుఁ బరా కగుఁ గొంత వింతగన్.

టీ॥ పడఁతి=ఒకస్త్రీ; నృసింహు... వేళన్=నరసభూపాలునిగీతములుపాడునపుడు; సిగ్గుతోన్ = లజ్జతో; నృసింహునామమున్నుడువదు=నరసభూపాలునిపేరుచెప్పదు. గురుజనుల్ = పెద్దవారలు; నర...చోన్=నరసభూపాలునిగుణప్రశంసలనువివరించిచేయునపుడు; ఉచితభక్తిమెయిన్=ఉచితమగుభక్తిచేత; గురుసేవసేయుకైవడిన్=గురుసేవసేయుభంగి; వడిన్=వేగముగ; ఆలకించున్=వినును. తలవాంచున్=శిరమువంచును. వింతగాన్=చోద్యమగునట్లుగా; కొంతపరాకగున్=కొంచెముపరాకుపడును.

§ ఇందు, వికారంబులు సువ్యక్తంబులుగాఁ జెప్పఁబడుటవలన, నిది హేలకుదాహరణం బనఁదగియున్నది. *"శ్లో॥ అనాకూతైరేవ ప్రియసహచరీణాం శిశుతయా వచోభిః పాఞ్చాలీమిథున మధునా సంఘటయితుమ్, ఉపాదత్తే నో వా విరమతి నవాకేవల మియం కపోలౌ కల్యా

* అధునా=ఇపుడు; శిశుతయా=బాల్యముచేత; అనాకూతైరేవ=అభిప్రాయగర్భములుకానివేయైన; ప్రియసహచరీణామ్=కూరిమిచెలియలయొక్క; వచోభిః=పలుకులచేత; పాఞ్చాలీమిథునమ్=బొమ్మలజతను; సఙ్ఘటయితుమ్=కూర్చుటకు; నోవా ఉపాదత్తే=స్వీకరింపదు; విరమతినవా=ఊరకయునుండదు. ఇయమ్ కల్యాణీ=ఈమంగళరూపమైనసీత; కపోలౌ=చెక్కులను; పులకముకులైః కేవలమ్=గగురుపాటులమొనలచేతమాత్రమే; దన్తురయతి=నిమ్నోన్నతములుగాఁ జేయుచున్నది.

ణీ పులకముకుళైర్దన్తురయతి ॥" అని మురారినాటకమందు సీతావిషయమై చెప్పినపద్యము యుక్తమైనయుదాహరణముగా నున్నది. ప్రతాపరుద్రీయములో "శ్లో॥ రసాభిజ్ఞానయోగ్యత్వం భావ ఇత్యభిధీయతే। ఈషద్దృష్టవికారస్తు భావోహావఃప్రకీర్తితః" అనిలక్షణములుచెప్పి *"శ్లో॥ రుద్రనరేన్ద్రస్య గుణాన్ గాయతి బాలత్వే విస్రబ్ధమ్। లజ్జతే దరపులకితో యువతిజనో యౌవనే గాతుమ్ ॥" అనుభావలక్ష్యములో "దరపులకితః" అనిపులకలువర్ణింపఁబడెను. పులకలు వికారరూపములు గనుక వాని భావలక్ష్యములో వర్ణించుటయె యుక్తము గాదని తోఁచుటంజేసి దానివదలి పై యుదాహరణములు వ్రాయఁబడెను.

హేలకుదాహరణము.

ఉ. మేలము లాడుచుం గడు స ♦ మేలములై చెలు లెల్లఁ గూడి యో
బాలిక శ్రీనృసింహనర ♦ పాలు వరించెదవే య టన్న నీ
లాలక యంగవల్లిఁ బుల ♦ కాంకురము ల్మొన లొత్తె నే మనం
జాలక యూరకుండె నని ♦ శంబు త్రపావృతయై (నరైవడిఁ.)
[చెలంగుచున్. 147

టీ॥ మేలములాడుచున్=పరిహాసములాడుచు; కడున్ సమేలములై—ఒక్కలిమొద్దికగలవారై; చెలులెల్లఁగూడి=సఖులందఱుచేరి; ఓబాలిక=ఓచిన్నదానా! శ్రీనృసింహనరపాలున్ = శ్రీమంతుఁడైన నరసభూపాలుని; వరించెదవే=వలచెదవా? అటన్నన్=అనియనుగఁగా;

* యువతిజనః = స్త్రీజనము; బాలత్వే = బాల్యమందు; విస్రబ్ధమ్ = విశ్వాసముతోఁగూడునట్లు; రుద్రనరేన్ద్రస్యగుణాన్ = ప్రతాపరుద్రునిగుణములను; గాయతి = గానముసేయుచున్నది. యౌవనే = తారుణ్యమున; దరపులకితః = ఈషత్పులకలుగలదై; గాతుమ్=గానముసేయుటకు; లజ్జతే=సిగ్గుపడుచున్నది.

నీలాలక=నల్లనికురులుగలస్త్రీ; అంగవల్లిన్=తీఁగవంటి మేనియందు; పులకాంకురముల్ననలొత్తన్ = పులకల మొలకలు మొలవఁగా; అనిశంబు=ఎల్లపుడు; త్రపావృతయైనకైవడిన్ = సిగ్గుచేనావృతయైనదానివలె; ఏమనంజాలక యూరకుండెన్ = ఏమియుననఁజాలకయిన్నకుండెను.

§ ఇందు భావము మిక్కిలి వ్యక్తము లై నవికారములు గలదిగా వర్ణింపఁబడినందున హేలయగును. ఇచటఁ ద్రపావృతయై యూరకుండఁగాఁ "త్రపావృతయైనకైవడిన్" అనుట యుక్తముగాఁ దోఁపదు. త్రపావృతయై చెలంగుచున్ అనుటయుక్తముగాఁదోఁచినది.

విలాసమాధుర్యములకు లక్షణములు.

క. పతిఁ గనఁ దాత్కాలిక మగు
నతులవికారము విలాస ♦ మగు సొమ్ములు లే
కతిరమ్యత్వము దలఁపఁగ
నతివలకు న్మధురభావ ♦ మగు నెట్లన్నన్. 148

టీ॥ పతిన్=భర్తను; కనన్=చూడఁగా; తాత్కాలికమగునతులవికారము=తత్కాలమందుదయించిన సాటిలేని వికారము; విలాసమగున్=విలాసమనునదియగును. అతివలకున్=స్త్రీలకు; సొమ్ములులేక అతిరమ్యత్వము=ఆభరణములు లేకున్ననుఅతిమనోహరత్వము; తలఁపఁగన్=భావింపఁగా; మధురభావమగున్= మాధుర్యమగును. ఎట్లన్నన్.

విలాసమున కుదాహరణము.

క. ఇరుగడల వెడలి సుడిగొని
తరళములై వెలికి వెలికి ♦ తళతళ మనుచున్
బరఁగురువారపుఁజూపుల
హరిణాక్షి నృసింహవిభుని ♦ గాంచెను వేడ్కన్. 149

టీ॥ ఇరుగడలఁ=ఇరుప్రక్కలను ; వెడలి=బయలుదేఱి ; నుడిగొని = సుడివడి ; తరళములై = చంచలములై ; వెలికిఁ.. చూపులఁ=బయటికిఁ బ్రకాశించి తళతళమని యొప్పుచున్న విలాసవిశేషముగల దృష్టులచే ; హరిణాక్షి=హరిణనేత్ర ; నృసింహవిభునికిఁ = నరసభూపాలునికి ; ఆరతిసేసెఁ=ఆరతిచ్చెను. ఇందు రువారపుఁజూపు లనుచో • నుదారపుఁజూపు లని పాఠాంతరము గలదు, తత్పక్షమునం దుదారములైనచూపులచేత నని యర్థము.

ఇందు నాయిక నృసింహవిభునిఁ జూచునపు డనేకము లైనవికారములు దృష్టులయందుఁగలిగినట్లు వర్ణించినందున విలాస మనుశృంగారచేష్టయగునని తాత్పర్యము.

మాధుర్యమున కుదాహరణము.

చ. కనుఁగవకెంపు సార్ద్రనఖ ♦ గౌరతయుం జెలువొందు నొక్కయుం
గన రతివేగశీర్ణ మణి ♦ కంకణనూపురహారవల్లి యై
మునుపటికన్నఁ బొల్పగుస ♦ ముజ్జ్వలతం దగెఁ బాండుపత్త్రియై
కొనల నిగిర్చి యున్నయతి ♦ కోమలవల్లి మతల్లి యో యనన్. 150

టీ॥ కనుఁగవకెంపు=నేత్రయుగ్మముయొక్క యెఱ్ఱఁదనము; సార్ద్రనఖగౌరతయున్= ఆర్ద్రములైనగోళ్ళపచ్చఁదనమును ; చెలువొందు నొక్కయుంగన=ఒప్పుచున్నయొక స్త్రీ ; రతి... యై=సురత వేగముచేత జాఱినమణికంకణములును గజ్జెలును లతలవంటి ముత్యాహారములునుకలదై ; పాండుపత్త్రియై=పచ్చనియాకులుగలదై ; కొనలఁ... అనన్=కొనలయందుఁజిగిర్చినట్టికోమలమైన మంచిలతయోయనునట్లు ; మునుపటి... తగెఁ=ముందున్నదానికన్న నధికమైన ప్రకాశముచేత నొప్పెను.

ఇందు నాయిక సొమ్ములు లేకపోయినను నతిరమ్యమైనట్లు చెప్పినందున మాధుర్య మగునని తాత్పర్యము.

ధైర్యవిభ్రమలీలలకు లక్షణములు.

క. కులశీలాద్యవిలంఘన
మిల ధైర్యం బొడలఁ దొడవు ♦ లిడఁ దడఁబడినన్
వెలయుఁగ విభ్రమ మధిపుని
యలఘుగుణానుకృతి లీల ♦ యగు నెట్లన్నన్. 151

టీ॥ ఇలన్=భూమియందు ; కులశీలాద్యవిలంఘనము=కులము మంచినడవడి మొదలగువానివదలకునికి; ధైర్యంబు = ధైర్యమనఁబడును. ఒడలన్=శరీరమందు; తొడవులిడఁ దడఁబడినన్=సొమ్ములుంచునప్పుడు దొట్రుపాటునొందినయెడ ; వెలయుఁగన్=ప్రకాశించునట్లు; విభ్రమము= విభ్రమమనఁదగును. అధిపునియలఘుగుణానుకృతి = ప్రియుని యుత్కృష్టగుణములయనుకరణము; లీలయగున్=లీలయనునదియగును. ఎట్లన్నన్.

ధైర్యమున కుదాహరణము.

మ. అతులైశ్వర్యసమగ్రుఁ డైననరసిం♦హాధీశ్వరుం డేడ నీ
పితృవాచాపరతంత్రతన్ వ్రతతతిం ♦ బెంపొందు నేనేడ నా
క్షితిపాలాగ్రణిపైఁ బ్రసక్తము నా♦చిత్తంబు సంధించినాఁ
డతనుం డక్కరో నేఁటనుండి విషమా♦స్త్రాభిఖ్యుఁడౌ నెంతయున్.

టీ॥ అతులైశ్వర్యసమగ్రుఁడు = సాటిలేనివిభవముచేత సంపూర్ణుఁడు ; ఐననరసింహాధీశ్వరుండు=ఐననరసభూపాలుండు ; ఏడన్=ఎక్కడ ? ఈపితృ...ఏడన్=ఈతండ్రిమాటకువశపడి వ్రతసమూహముచే

తఁజెలంగునే నెక్కడ? అక్కరో=ఓ సుకాన్తా! అతనుండు=మదనుఁడు; నాచిత్తంబు=నామనస్సును. ఆక్షితిపాలాగ్రణిపైఁబ్రసక్తముగన్=ఆ రాజశ్రేష్ఠునిపైఁబ్రవర్తించునట్లుగా; సంధించినాఁడు = కూర్చినాఁడు. నేఁటనుండి=నేఁడు మొదలుకొని; ఎంతయున్=మిక్కిలి; విషమాస్త్రాభిఖ్యుఁడౌన్=విషమాస్త్రుఁడనునామముగలవాఁడగును.

ఇందు, నాయిక "నరసభూపాలునికి నాకు నింత తారతమ్య ముండఁగా నతనుండు వానియందు నామనంబు సంధించినాఁడు కావున నేఁటనుండి విషమాస్త్రాభిఖ్యుఁడౌ" నని చెప్పినందునఁ దనకు మరునివలన నెన్ని బాధలు గలిగినను నృసింహునిఁ జేరుతలంపు పోనట్లు ప్రాయముగుటచేఁ గులశీలాదితత్పరత వ్యక్తమగుచున్నది గాన నిది ధైర్యమగునని తాత్పర్యము.

విభ్రమమున కుదాహరణము.

చ. అదన నృసింహభూమిరమణాగ్రణి వచ్చినసంభ్రమంబుతోఁ
సుదతి నభోవలగ్నమునఁ జుక్కలపేరిటికంఠమాలయుం
బొదలుకుచాచలంబుల సముజ్జ్వలమేఖలయున్ ధరింపఁగా
నది క్రమ మయ్యెఁ దొయ్యలికి నక్రమ మయ్యె విలాసవైఖరిన్.

టీ॥ అదనన్=ఉచితసమయమందు; నృసింహ...సంభ్రమంబుతోన్=నరసభూపాలుండువచ్చినసంభ్రమముతో; సుదతి=స్త్రీ; నభోవలగ్నమునన్= ఆకాశతుల్యమగుమధ్యమందు; చుక్కలపేరిటికంఠమాలయున్=నక్షత్రమాలయనుకంఠమాలను; "సైవనక్షత్రమాలాస్యాత్సప్తవింశతిమౌక్తికా" అని యమరుఁడు, గాన నిరువదియేడు ముత్తెములు గలదండ నక్షత్రమాల యనఁబడును; పొదలు...మేఖలయున్=ఒప్పుచుండెడుకుచగిరులయందుఁబ్రకాశించుచున్న యొడ్డాణమును; ధరిం

పంగాఁ = ఉంచుకొనఁగా ; అది=ఆయుంచుకొనుట ; తొయ్యలికిన్ = స్త్రీకి ; క్రమము య్యెన్ = యుక్తమాయెను. విలాసవైఖరిన్ = విలాస రీతిచేత ; అక్రమమయ్యెన్=అయుక్తమాయెను.

అనఁగా, ఆకాశమందు నక్షత్రమాలయు గిరులయందు మేఖల యనఁగా నితంబభూమియునుండుట యుక్తము, విలాసరీతిచేత స్థానోచి తభూషణములుగాఁజేసి యయుక్తమయ్యెననుట. ఇందు విభ్రమము స్పష్టము.

లీల కుదాహరణము.

చ. ధర నకలంకభావమునఁ ♦ దామరసాహితునిన్ జయించు నా
హరిపదసక్తమై వెలుఁగు ♦ నారయఁ బ్రాజ్ఞులకు న్వసుంధరా
సురతరుమాతనాభ్యుదయ ♦ శోభ యొనర్చు యశఃపురంధ్రి యా
వరుఁ డగు శ్రీనృసింహుగుణ ♦ వాసనఁ దానుఁ జెలంగుకై వడిన్.

టీ॥ యశఃపురంధ్రి=కీర్తికాంత ; వరుఁడగు... కైవడిన్=భర్త యగునరసభూపాలునిగుణభావనచేతఁ దానున ట్లేయొప్పుచున్నదో అను నట్లు ; ధరన్ = భూమియందు ; అకలంకభావమునన్ = నిష్కలంక వృత్తిచేత; తామరసాహితునిన్ జయించున్=చంద్రుని గెలుచును. ఆ=ఆ శ్చర్యము ! హరిపదసక్తమై—ఆకాశముతో సంబంధించినదై, రాజపక్ష మందు, విష్ణుమూర్తిపాదాసక్తమై ; వెలుఁగున్=ప్రకాశించును. ఆర యన్=విచారింపఁగా; ప్రాజ్ఞులకున్=విబుధులకు; సుర. . .ఒనర్చున్=క ల్పవృక్షముయొక్కనవీనోదయశోభను జేయును, కోరినకోర్కులొసంగు నని రాజపక్షమందు, సురతరువువలెఁ దెల్లనైన దని యశఃపక్షమునం దుఁ దెలియవలయును.

ఇందు యశశ్శికాంత తనప్రియుఁ డగునరసభూపాలునియొక్క గొప్పవైనగుణముల ననుకరించినట్లు చెప్పినందున లీలయగునని తాత్పర్యము.

§ ప్రతాపరుద్రీయములో "శ్లో॥ ప్రియానుకరణం లీలా వాగ్వేషగత్యాదిభిశ్చేష్టితైః" అనియు, రసతరంగిణ్యాదులలో "ప్రియభూషణ వచనాద్యనుకృతి ర్లీలా" అనియు, నున్నందున దేనిచేతనైనను ప్రియానుకరణము లీల యని వ్యక్తమగుఁగాన, గుణానుకృతి మాత్రమె లీల యని భావింప రాదు.

కిలికించితమోట్టాయితంబుల లక్షణంబులు.

క. అళుకు కలుక ముదము నశ్రువు
  గలిసినఁ గిలికించితంబు ♦ గడు నిష్టకథా
  దుల నింగిత మెఱిఁగించుట
  దలఁపఁగ మోట్టాయితంబు ♦ దగు నెట్లన్నన్. 155

టీ॥ అళుకు...కలిసినన్ _ భయమును కోపమును సంతోషమును కన్నీరును చేరఁగా; కిలికించితంబు=కిలికించితంబనుచేష్టయగును. "శ్లో॥ రోషాశ్రుహర్ష భీత్యాదే స్సంకరః కిలికిఞ్చితమ్" అని ప్రతాపరుద్రీయము. కడున్=మిక్కిలి; ఇష్టకథాదులన్=ప్రియవస్తుప్రసంగాదులయందు; ఇంగిత మెఱిఁగించుట=తనయభిప్రాయమునుదెలుపుట; తలఁపఁగన్ = విచారింపఁగా; మోట్టాయితంబుదగున్ = మోట్టాయితంబనఁనొప్పును. ఎట్లన్నన్.

కిలికించితంబున కుదాహరణము.

చ. పతి రచితాగసుం డదిరి ♦ పాటున వచ్చి దృఢోపగూహన
  స్థితి నధరప్రవాళము గ్రసింప ససంభ్రమలోలహస్తయై

మతకరి చాలుఁ జాలు నిఁక ♦ మాదెస రాకు మటంచు నల్కతో
నతివ బొమల్ ముడించె నయ♦నాంబువు తెప్పల నప్పళించుచున్.

టీ॥ రచితాగసుండు=అపరాధియైన; పతి=ప్రియుండు; అదిరిపాటునవచ్చి=అకస్మాత్తుగావచ్చి; దృఢోపగూహనస్థితిన్=గాఢాలింగనస్థితిచేత; అధరప్రవాళముగ్రసింపన్ = పవడమువంటివాతెరనానఁగా; అతివ=స్త్రీ; ససంభ్రమలోలహస్తయై=సంబరముతోఁగూడునట్టుగాఁజలించుచున్న చేతులుగలదై; మతకరి=వంచకుఁడా! చాలుఁజాలును. ఇఁకన్=ఇఁక,మీఁద; మాదెసరాకుమటంచున్=మాయొద్దకు రాకు మని పలుకుచు; అల్కతోన్=కోపముతో; నయన...అప్పళించుచున్=కన్నీరు తెప్పలచేఁదుడుచుచు; బొమల్ముడించెన్=కనుబొమ్మలుముడిపెట్టెను.

ఇందు నతివకు నధరక్షతపు నలుకయు మొదలగునవి చెప్పినందునఁ గిలికించితం బనఁ దగునని తాత్పర్యము.

మోట్టాయితంబున కుదాహరణము.

చ. చెలులు నృసింహుగీతమును ♦ జేరికగా నపరంజివీణెలోఁ
పలఁ బలికింప నూర్చుచును ♦ బాలిక యూర్పులచేత దీపికా
కలిక చలింప నెచ్చెలులు ♦ గంటిరె మీరమ్మదుగానలక్ష్మికిం
దెలియఁగ మెచ్చుచున్నయది♦దీవియ యంచు హసించు నెంతయున్.

టీ॥ చెలులు=సఖులు; చేరికగాన్=కూడికగా; అపరంజివీణెలోన్ పలన్ = బంగరువీణెలోపల; నృసింహుగీతములు = నరసభూపాలునిపైపాటలను; పలికింపన్=వాయింపఁగా; బాలిక=చిన్నది; ఊర్చుచును=ఊర్పులువిడుచుచు; ఊర్పులచేతన్; దీపికాకలిక=మొగ్గవంటిదీపము; చలింపన్=కదలఁగా; నెచ్చెలులు=ప్రియసఖులారా! తెలియఁగన్=పరి

కీలింపఁగాఁ; మీమృదుగానలక్ష్మికిన్=మీకోమలమైన గానసంపదకు; దీపియ=దీపము; మెచ్చుచున్నయది=శ్లాఘించుచున్నయది. అంచున్= ఇటనుచు; ఎంతయున్=మిక్కిలి; హసించున్=నవ్వును.

ఇందు నాయిక యిష్టుఁడైన నరసభూపాలునియొక్క గీతాలాపప్రస్తావమునందు హర్షామలచేతఁ దనయభిప్రాయము సూచించుటవలన మోట్టాయితం బగునని తాత్పర్యము.

లలితవిచ్ఛిత్తులకు లక్షణములు.

క. భాసురతనువల్లీవి
న్యాసము లలితమ్ము సౌమ్ము ♦ లల్పము లయ్యెన్
భాసిల్లెడుశృంగారవి
కాసము విచ్ఛిత్తి యయ్యెఁ ♦ గన నెట్లన్నన్. 158

టీ॥ భాసురతనువల్లీవిన్యాసము=మనోహరమగునట్లవయవములయొక్క యుంచుట; లలితమ్ము=లలితమనఁబడును. సొమ్ములల్పములయ్యెన్ = భూషణములుకొంచెములయ్యెను; భాసిల్లెడుశృంగారవికాసము=ప్రకాశించుసౌందర్యాతిశయము; కనన్=చూడఁగా; విచ్ఛిత్తియయ్యెన్=విచ్ఛిత్తియనునదియాయెను. అదియెట్లన్నన్. ఇచట "తనువల్లీవిన్యాస" మనుచోఁదనుశబ్దమవయవబోధకమైనను, "శ్లో॥ సుకుమారాఙ్గవిన్యాసోలలితంపరికీర్తితమ్" అని ప్రతాపరుద్రీయములో నవయవవిన్యాసము లలిత మని చెప్పఁబడుటవలన నవయవములయొక్క యుంచుట యని యర్థము వ్రాయఁబడెను.

లలితమునకుదాహరణము.

చ. వడియుప్రశమంబుతోడిభుజ ♦ వల్లి మృదంగముమీఁదఁ జేర్చి కీ
లెడలిననూపురంబు ఘటి ♦ యింపఁగ దూతికరారవిందమం

దడు గిడీ కంపిత స్తనర ♦యంబున నూర్పర దోఁప నింతి యు
ద్యోడ నటియించి నిల్చె సభ ♦యెల్ల ననంగుని పాలు సేయుచున్.

టీ॥ ఇంతి=స్త్రీ ; వడియు శ్రమంబుతోడి భుజవల్లి=స్రవించునట్టి స్వేదముతోఁ గూడిన బాహులతను; మృదంగముమీఁదఁ జేర్చి = మద్దెలపై నుంచి ; కీలెడలిననూపురంబు = కీలువదలినగజ్జెను ; ఘటియింపఁగన్ = కూర్చుటకు; దూతి. . .ఇడి = దూతియొక్క కంకమలమందుఁ బాదమునుంచి; ఇటఁ గరారవిందమం దనుచోఁ గరంబునం దిడియు, అడు గను వోఁ బాదారపందము ననియుఁ బ్రయోగించునెడ రమణీయంబుగనుండు నని దోఁచెడి. కంపిత స్తనరయంబునన్ = కదలుచున్న చన్నులవేగమువలన; ఊర్పరదోఁపన్=నిశ్వాసము తెలియవచ్చుచుండఁగా ; అయ్యోడన్=ఆసమయామందు; సభయెల్లన్ = సభనంతయు; అనంగుని పాలుచేయుచున్ = కామపరవశముగాఁజేయుచు; నటియించినిల్చెన్ = నాట్యముచేసినిల్చెను.

ఇందు నాయిక భుజలతను మృదంగముమీఁదను, పాదమును దూతీహస్తమునందును, మనోహరముగా నుంచినందున సుకుమారాంగవిన్యాసరూప మగులలిత మను శృంగారచేష్టయగునని తాత్పర్యము.

§ సింగభూపాలీయములో "శ్రమోమానసఖేదస్స్యాదధ్వనృత్తరతాదిభిః" అను శ్రమలక్షణమునందు నృత్తశ్రమమున కుదాహరణముగాఁ జెప్పఁబడిన "శ్లో॥ స్వేదక్లేదితకఞ్చుకాం భుజలతాం కృత్వా మృదఙ్గాశ్రయాం చేటీహస్తసమర్పితైకచరణా మఞ్జీరసంధిత్సయా। సా భూయః స్తనకమ్పసూచితరయం నిశ్వాసముఞ్ఛ్వసతీ రఙ్గస్థాన మనఙ్గశాస్త్రాకృతవతీ తాళావధౌ తస్థుషీ॥" అనుశ్లోకమున కీపద్యము భాషాంతరముగ నున్నదనియు, నందున్న స్వేదపదంబునకు బదులుగానిందు శ్రమ

పదంబుఁ బ్రయోగించుట యుక్తము గాదనియుఁ, బూర్వమే వ్రాయఁ బడెను. దీని యర్థంబు గూడ వెనుక వ్రాయఁబడెను. వడియునను దానికి దీనికిఁగల యర్థ తారతమ్యము తెల్లము. "వడియుక్రమంబు నోడి" యనుట యుక్తంబుగాఁ దోఁచెడిననికొందఱు.

విచ్ఛిత్తి కుదాహరణము.

చ. పరిమితభూషణంబులును ♦ ఫాలముపైఁ నెలవంకనామమున్
బరఁగ నొయారియై నయన ♦ పర్వ మొనర్చె వధూలలామ తా
విరళగణేయ తారలు న ♦ వీనత రేందుకలావిలాసము
న్వరుస వెలుంగఁగా విదియ ♦ నాఁటివిభావరి వోల్కికై వడిన్. 160

టీ॥ వధూలలామ=స్త్రీరత్నము ; పరిమితభూషణంబులును= అల్పభూషణములును ; ఫాలముపై నెలవంకనామమున్=నుదుటియందు చంద్రవంకబొట్టును ; పరఁగన్=ఒప్పఁగా ; ఒయారియై=విలాసము గలదై ; విరళగణేయతారలు=అల్పములై లెక్కపెట్టఁదగు నక్షత్రములు ను; నవీనత రేందుకలావిలాసమున్=లేఁతచంద్రకలయొక్క విలాసమును ; వరుసన్ = వరుసగా ; వెలుంగఁగాన్ = ప్రకాశింపఁగా ; విదియ... కై వడిన్=ద్వితీయనాఁటిరాత్రి ప్రకాశించుభంగి ; తాన్=తాను; నయనపర్వమొనర్చెన్=నేత్రోత్సవము చేసెను.

ఇందు నాయిక యల్పభూషణములు గలదయ్యు లోకోత్తరముగఁ బ్రకాశించినట్లు చెప్పినందున విచ్ఛిత్తి యగునని తాత్పర్యము.

బిబ్బోక విహృతములకు లక్షణములు.

క. వరునికథయం దనాదర
మరయఁగ బిబ్బోక మయ్యె ♦ ననుమతిఁ బలుకం

దర మెఱుఁగు వేళల ను
త్తర మొసఁగమి విహృత మనఁగఁ ♦ దగు నెట్లన్నన్. 161

టీ॥ వరునికథయందున్ = ప్రియునిగూర్చి ప్రస్తావమునందు ; అనాదరము=ఉదాసీనత ; అరయఁగన్=విచారింపఁగా ; బిబ్బోకమయ్యెన్=బిబ్బోకమనునదియాయెను. అనుమతిన్=అనుమతితో ; పలుకన్...వేళలన్=పలుకుటకు సాధ్యమగు నుచితావసరములయందు ; ఉత్తర మొసఁగమి=ఉత్తరమియ్యకుంట ; విహృతమనఁగఁదగున్=విహృతమనఁగ నొప్పును. ఎట్లన్నన్.

§ ప్రతాపరుద్రీయములో, "శ్లో॥ విహృతం ప్రాప్తకాలస్య వాక్యస్యాకథనం హ్రియా" అని లజ్జచేత ప్రాప్తకాలవాక్యాకథనము విహృతముగాఁ జెప్పఁబడినది, ఇం దూరక యకథనమే చెప్పఁబడినది. అది గర్వానాదరాదులచేత నకథనముగానుం దోఁచును గాన వ్రీడాది బోధకశబ్దముఁ జేర్చుట యుక్తము. ప్రతాపరుద్రీయములో "హ్రియా", యనునది మానాదుల కుపలక్షణము. అట్లు ముందు సింగ భూపాలీయ లక్షణము వ్రాయఁబడును.

బిబ్బోకమున కుదాహరణము,

చ. అతఁడు గుణాభిరాముఁ డతఁ ♦ డంగజసన్నిభుఁ డంచు నెచ్చెలు
ల్పతి యగుశ్రీనృసింహనర ♦ పాలు నుతింప లతాంగి నీటుతో
శ్రుతులఁ గరాంగుళు ల్సొనిపె ♦ శోభనతచ్చరితాభిపూర్ణమై
యతిశయ మందుకర్ణయుగ♦మం దవకాశ మొనర్చకై వడిన్. 162

టీ॥ లతాంగి=స్త్రీ; పతి...పాలున్=భర్తయగుశ్రీమంతుఁడైన నరసభూపాలుని; నెచ్చెలులు = సఖులు, అతఁడు...నిభుఁడు = అతఁ

డు సుగుణముల చేత నొప్పుచున్న వాఁడు అతఁడు మన్మథునితో సమానుఁడు; అంచున్=ఇటనుచు ; నుతింపన్=ప్రశంసింపఁగా; నీటుతోన్=శృంగారగర్వముతో; శ్రుతులన్=చెవులయందు; శోభన. . .కైవడిన్=మంగళమగు నానరసభూపాలుని చరిత్రము చేత సంపూర్ణమై యొప్పుచున్న కర్ణయుగమునందుఁ జోటుచేయుభంగి; కరాంగుళుల్ పొనిపెన్=చేతివ్రేళ్ళను దూర్చెను. ధాన్యాదులచే నిండినట్టి గోతము మొదలగు వానియందు నవకాశము కలుగుటకై చేతులు మొదలగునవి చొనుపుట లోకప్రసిద్ధము.

ఇందు నాయికకుఁ బ్రియుని ప్రశంసయం దనాదరము వర్ణింపంబడినందున బిబ్బోకమని తాత్పర్యము.

విహృతమున కుదాహరణము.

ఉ. బాలిక యల్కతో మరలి ♦ పల్కక యుండియుఁ బ్రాణనాథుఁడ
వ్వేళ క్షుతం బొనర్పఁ గడు ♦ వేగ చిరాయు వటంచుఁ బల్కఁగాఁ
జాలక రోషముం బ్రణయ ♦ సంభ్రమము న్మది దొమ్ములాడ ని
లాలక కుండలద్వయము ♦ దగ్రగతిన్ ఘటియించె వీనులన్. 163

టీ. బాలిక=చిన్నది; అల్కతోన్ . . . ఉండియున్ = రోషముతోఁ దిరిగి మాటాడకుండియును; అవ్వేళన్=ఆసమయమందు; ప్రాణనాథుఁడు=ప్రియుండు; క్షుతంబొనర్పన్=తుమ్మఁగా; కడు వేగ=మిక్కిలి శీఘ్రముగా; చిరాయువు . . చాలక=చిరాయువు కమ్మని యనఁజాలక; మదిన్=మనస్సునందు; రోషమున్ ప్రణయసంభ్రమమున్=కోపమును ప్రీతిసంభ్రమంబును, దొమ్ములాడన్ = పెనఁగులాడఁగా; నీలాలకన్=నీలకుంతల; ఉదగ్రగతిన్=శీఘ్రముగ; వీనులన్=చెవులయందు; కుండలద్వయము=కమ్మలజతను; ఘటియించెన్=ఉంచెను.

ఇందు నాయిక ప్రియుఁడు క్షుతముఁ జేయఁగాఁ బల్కవలసిన మంగళవాక్యమును మౌనముచేఁ బల్కనందున విహృతం బగును.

§ సింగభూపాలీయములో, * "శ్లో॥ ఈర్ష్యయామానలజ్జాభ్యా మదత్తం యోగ్య ముత్తరమ్। క్రియయా వ్యజ్యతే యత్ర విహృతం త దుదీరితమ్॥" అని లక్షణము వ్రాసి, "శ్లో॥ అద్యాపి తన్మనసి సంపరివర్తతే మే రాత్రౌ మయి క్షుతవతి క్షితిపాలపుత్ర్యా। జీవేతి మఙ్గళవచః పరిహృత్య కోపాత్ కర్ణేఽర్పితం కనకపత్ర మనాలపన్త్యా॥" అను లక్ష్యము వ్రాయఁబడినది. కర్ణములయందు కనకపత్రార్పణము క్షుత మమంగళ మగుట నశ్రావ్యం బని తత్పరిహారమంగళవాక్యప్రతిప్రయోగరూపముగా నున్నది. ఇట్లు పై గ్రంథమునందె లజ్జచేత యోగ్యోత్తరము నియ్య కున్కికి, † "శ్లో॥ అప్యవస్తుని కథాప్రవృత్తయే ప్రశ్నతత్పర మనఙ్గశాసనమ్। వీక్షితేన పరిగృహ్య పార్వతీ మూర్ధకమ్పమయ ముత్తరం దదౌ॥" అని యున్నది చూడవలయు.

---

* రాత్రౌ = రాత్రియందు; మయి = నేను; క్షుతవతి = తుమ్మినవాఁడనుకాఁగ: జీవేతి = చిరంజీవయని; మఙ్గళవచః = శుభవాక్యమును; పరిహృత్య = విడిచి; కోపాత్ = కోపమువలన; అనాలపన్త్యా = మాటాడకున్న; క్షితిపాలపుత్ర్యా = రాజపుత్రిచేత; కర్ణే = చెవియందు; అర్పితమ్ = ఉంపఁబడిన; కనకపత్రమ్ = బంగరు కమ్మపత్రము; అద్యాపి = ఇప్పటికి; మే = నాయొక్క; మనసి = చిత్తమందు; సంపరివర్తతే = పొరలుచున్నది.

† కథాప్రవృత్తయే = సల్లాపప్రవర్తనముకొఱకు; అవస్తున్యపి = అప్రస్తుతార్థమందును. ప్రశ్నతత్పరమ్ = ప్రశ్నాసక్తుఁడగు; అనఙ్గశాసనమ్ = ఈశ్వరుని; పార్వతీ = గౌరి; వీక్షితేన = విలోకనముచేతనే, వాక్కుచేతఁగాదనుట; పరిగృహ్య = స్వీకరించి; మూర్ధకమ్పమయమ్ = శిరఃకంపరూపమగు; ఉత్తరమ్ = ప్రతివాక్యమును; దదౌ = ఇచ్చెను. లజ్జచేత వాగ్రూపమగునుత్తరమునీక శిరఃకంపరూపము నేయిచ్చిన దనుట.

చకితహసితకుట్టమితకుతూహలంబుల లక్షణములు.

క. అలుకుట చకితము నవ్వుచు
నలరుట హసితంబు రతుల ♦ నతిసమ్మర్దో
జ్జ్వల సౌఖ్యము కుట్టమితము
లలనకుఁ జపలత కుతూహ♦లం బెల్లన్నన్. 164

టీ॥ అలుకుట = భయపడుట; చకితము = చకితమగును. నవ్వుచు నలరుట =నవ్వుచుండుట; హసితంబు = హసితమగును. రతులన్ =సురతములయందు; అతిసమ్మర్దోజ్జ్వలసౌఖ్యము=అతిసమ్మర్దమైనను సౌఖ్యాతిశయముగనెంచుట ; కుట్టమితము= కుట్టమితమగు. లలనకున్ - స్త్రీకి; చపలత = చాపల్యము; కుతూహలంబు=కుతూహలమగును. ఎల్లన్నన్.

§ ఇందు హసితాదిలక్షణములు సవరింపఁ దగియున్నవి. ఎట్లన, ప్రతాపరుద్రీయములో, “ శ్లో॥ అకస్మికంతు హసితం యౌవనాదివికారజమ్” అనియున్నది. నిర్హేతుకముగ యౌవనాదివికారముచేతఁ గలుగునవ్వు హసిత మని దీనియర్థము. ఇట్లు * “ శ్లో॥ యథాయథా హసతి మృగాక్షీ యౌవనలక్ష్మ్యా శిక్షితా మధురమ్। తథాతథా కుసుమేషు శరా వికసన్తి ప్రియ స్యాశాచ॥” అని దీనియుదాహరణము. వికృతవేషభాషాదులచేఁ గలుగుహాస మీహసితము గాదు ఈనరసభూపాలీయలక్షణము హాస్యరసస్థాయి యగుహాసమును వ్యాపించుచున్నయది

* మృగాక్షీ=లేడిచూపులవంటచూపులుగలచిన్నది: యౌవనలక్ష్మ్యా=యౌవనసంపదచేత; శిక్షితా=శిక్షింపఁబడినదై; యథాయథా=ఏయేచొప్పున; మధురమ్=మనోజ్ఞమగునట్లుగా; హసతి=నగుచున్నదో. తథాతథా=ఆయాచొప్పున;కుసుమేషుశరాః=కందర్పసాయకములు; ప్రియస్యాశాచ=ప్రియునియాసయు; వికసన్తి=వికసిల్లుచున్నవి. వికృతవేషదర్శనాదికారణము లేకయే యౌవనోల్బణతవలనఁ దనంతనే బాలికయొక్క నగవుమదనోద్దీపకము ప్రియాశావర్ధకము నైనదనుట.

§ రెండియు, “శ్లో॥ కేశాధరాదిగ్రహణే మోదమానాఽపి మానసే। దుఃఖితేవ బహిః కుప్యేద్యత్ర కుట్టమితం హి తత్॥” అనియు, “సుఖే దుఃఖచేష్టా కుట్టమితి” మ్మనియుఁ గుట్టమితంబునకుఁ బ్రాచీనలక్షణంబులును, * “శ్లో॥ పాణిపల్లవవిధూనన మన్త స్సీత్కృతాని నయనార్ధనిమేషాః। యోషితాం రహసి గద్గదవాచా మస్త్రతా ముపయయుర్మదనస్య॥” అనియు, † “శ్లో॥ రోద్ధుం పాణిః ప్రచలతి చిరాదఙ్గుళిర్నిశ్చలాఽసౌ భ్రూవిక్షేపో భవతి కుటిలో నేత్ర మన్తః ప్రసన్నమ్। గాఢాశ్లేషే భవతి సుతనో రర్ధమాత్రో నకారః కమ్పో మూర్ధ్నః ప్రసరతి ముఖం సమ్ముఖం న ప్రయాతి॥” అనియుఁ దదుదాహరణంబులు నుండఁగా, “శ్లో॥ సమ్మర్దేఽపి సుఖాధిక్యం రతౌ కుట్టమితం మతమ్।” అని ప్రతాపరుద్రీయమందును, “రతుల నతిసమ్మర్దోజ్జ్వలసౌఖ్యము కుట్టమితము” అని నరసభూపాలీయమునందును జెప్పుట సహృదయహృదయంగమము గాదని నాయెన్నిక.

---

* రహస్యమున నొనర్పఁబడిన కేశాధరస్తనసీవ్యాదిగ్రహణములకుఁ గార్యభూతములైన పాణివిధూనన సీత్కారములచే వెలపటనే కోపము ప్రతీయమానమగుటవలన నిటుఁ గుట్టమితమగును. దీనియర్థము వెనుక వ్రాయఁబడెను.

† సుతనోః = స్త్రీకి ; గాఢాశ్లేషే = గాఢాలింగనమునందు ; పాణిః = హస్తము ; చిరాత్ = చిరకాలము ; రోద్ధుమ్ = అడ్డగించుటకు ; ప్రచలతి = చలించుచున్నది. అంగుళిః = వ్రేళ్ళు, జాత్యేకవచనము. నిశ్చలా = స్పందశూన్యమైనది. అసౌ భ్రూవిక్షేపః = ఈకనుబొమలయాడుట ; కుటిలో భవతి = వక్రమగుచున్నది. నేత్రమ్ = నయనము ; అన్తః ప్రసన్నమ్ = లోపలనిర్మలమయినది. నకారః = నిషేధము ; అర్ధమాత్రః = అర్ధమైనదే కానిపూర్ణమైనది కాదు. కమ్పో మూర్ధ్నః ప్రసరతి = తలపదుర్పుట ప్రసరించుచున్నది. ముఖం సమ్ముఖం న ప్రయాతి = మోమెదుటికి రాదు. ఇందును కోపాభినయము స్పష్టము.

§ మఱియుఁ, గుతూహలమునకు, "శ్లో॥ కుతూహలం రమ్యదృష్టౌ చాపలం పరికీర్తితమ్" అని ప్రతాపరుద్రీయములో రమ్యమైనవస్తువును జూచుటయందుఁ జాపలమని లక్షణమును, *"శ్లో॥ వీరరుద్రమధిరూఢసిన్ధుర ద్రష్టుమన్ధ్రనగరీపురన్ధ్రయః। కుర్వతే రచితచఙ్క్రమత్వరా స్తుఙ్గసద్మశిఖరాధిరోహణమ్॥" అని లక్ష్యము నుండఁగా, నిందు "లలనకుఁజపలతకుతూహలం" బని నానారూపచాపలంబును బోధించునట్టిలక్షణముఁ జెప్పుట రమణీయంబుగాఁగనఁబడదు.

ఇఁకఁ జకితమ్మున కుదాహరణము.

చ. అఱుగిడి నిల్చు నిల్చి చెలి ♦ కానలు నెట్టు నదల్చు సిగ్గునం
దడఁబడుఁ గాంతుఁ డున్నమణి♦ధామము మొగిం జొరఁ జాల కింతియు
న్వడఁకు గృహాంబు పొచ్చియుఁ గ♦వాటము దాపున నిల్చు నచ్చెలు
ల్వడిఁ జనఁ జూచినం బెనఁగు ♦ వారిజలోచన మౌగ్ధ్యసంపదన్.

టీ॥ వారిజలోచన = కమలములవంటికన్నులుగలయొకయంగన; మౌగ్ధ్యసంపదన్ = ముగ్ధత్వాతిశయముచేత; గాంతుఁడున్నమణిధామము = ప్రియుఁడున్నమణిమయమందిరమును; ఒగిన్ = వరుసగా; చొరఁ జాలక = ప్రవేశింపఁజాలక; అఱుగిడినిల్చున్ = అడుగుఁబెట్టినిలుచును. నిల్చి... పెట్టున్ = నిలుచుండిసఖురాలికి ఆనలుఉంచును. సిగ్గునందడఁ

---

* ఆన్ధ్రనగరీపురన్ధ్రయః = ఏకశిలానగరవాసినులగుస్త్రీలు; అధిరూఢసిన్ధురమ్ = గజారూఢుఁడైన; వీరరుద్రమ్ = ప్రతాపరుద్రుని; ద్రష్టుమ్ = అవలోకించుటకు; రచితచఙ్క్రమత్వరాః = చేయఁబడిన గమనవేగముగలవారై; తుఙ్గసద్మశిఖరాధిరోహణమ్ = ఉన్నతములగు గృహోపరిభాగములనారోహించుటను; కుర్వతే = చేయుచున్నారు. ఇటరమ్యుండగు వీరరుద్రు నీక్షించుటకు స్త్రీలకుఁ జాపలము చెప్పఁబడినది గావునఁ గుతూహల మగును.

బడుగ=సిగ్గుచేతఁదొట్రుపడును. ఎంతయుఁ=మిక్కిలి; వడఁకుఁ=కంపించును. గృహంబునాచ్ఛియుఁ = ప్రియుసదనముఁజేరియు ; కవాటము దాపుననిల్చుఁ = తలుపుదగ్గఱనిలుచును. నెచ్చెలుల్...చూచినఁ= ప్రియసఖులువేగముగఁబోవఁజూడఁగ; పెనఁగుఁ = మెలిగొనును, వారిఁ బోనియ్యదనుట.

ఇందు నాయిక యలుకుటవలనఁ జకితంబగు నని తాత్పర్యము.

హసితమున కుదాహరణము.

చ. వదనసరోజవాసనకు ♦ వచ్చినతేఁటి నదల్చి చూడఁగా
నది యసితోత్పలంబు లని ♦ యక్షుల వ్రాలఁగఁ జే విదుర్పఁగా
నది మరలం బయోజ మని ♦ హస్తయుగంబున వ్రాల నవ్వె న
మ్మదవతి యేమి సేసినను ♦ మాన దిదేమి యటంచు నెంతయుఁ.

టీ॥ వదనసరోజవాసనకుఁ = ముఖపద్మపరిమళమునకు ; వచ్చిన...చూడఁగాఁ=వచ్చినట్టితుమ్మెదనదలించి దానిఁజూడఁగా ; అది= ఆతుమ్మెద ; అసితోత్పలంబులని=నల్లగలువలని ; అక్షులవ్రాలఁగ= కన్నులమీఁదవ్రాలఁగా ; చేవిదుర్పఁగాఁ =హస్తముచేవిదిలింపఁగా ; అది=ఆతుమ్మెద; మరలఁ ; పయోజమని=పద్మమని ; హస్తయుగంబు నవ్రాలఁ=చేతులజంటయందువ్రాలఁగా ; ఏమిసేసినఁ=ఏమిపనిచేసినను; మానదు=నివర్తిల్లదు. ఇదేమియటంచుఁ = ఇదియేమిచిత్రమనుచు ; అమ్మదవతి=ఆస్త్రీ ; ఎంతయుఁ=మిక్కిలి ; నవ్వెఁ=హసించెను. ఇందు నాయిక నవ్వుటవలన హసిత మగునని తాత్పర్యము.

§ ఇది హాస్యస్థాయి యగుహాసముగఁ దోఁచుచున్నదని మున్నె వ్రాయఁబడెను.

కుట్టమితమున కుదాహరణము,

చ. కెరలి ప్రియుండు మోవిపయిఁ ♦ గెంపులు నింపుటఁ బారవశ్యత
త్పరత నెఱుంగ లేక పిద ♦ ప న్నిలువద్దము చూచి సిగ్గునం
దరుణి చెలు ల్గనుంగొనినఁ ♦ దా రిఁక నే మని యాడుకొందురో
వరుని నటంచుఁ జిల్కకు న♦వారణ ముద్దులు వెట్టు సారెకున్. 167

టీ. తరుణి = ఒకయువతి; ప్రియుండు = వల్లభుఁడై ననరసభూపా లుఁడు; కెరలి=విజృంభించి; మోవిపయిన్=అధరముమీఁద; కెంపు లునింపుటన్ = దంతక్షతములునిండించుటను; పారవశ్యతత్పరతన్ = సుఖపారవశ్యమునకధీనయగుటచేత; ఎఱుంగలేక=తెలియఁజాలక; పి దపన్=వెనుక నిలువద్దముచూచి=నిలువుటద్దమునీక్షించి; సిగ్గునన్= లజ్జచేత; చెలుల్గనుంగొనినన్=సఖులుచూచినచో; తారు=సఖులు; వరునిన్=ప్రియుని; ఇఁకన్=ఇఁకమీఁద; ఏమనియాడుకొందురో=ఏ మనిదూఱుదురో; అటంచున్=అనితలంచుచు; చిల్కకున్=క్రీడాశుక మునకు; అవారణ=ఆటంకములేనిదై; సారెకున్=మాటికి; ముద్దులు వెట్టున్=ముద్దులిడును.

ఇందు నాయిక రతిసమ్మర్దంబున సౌఖ్యపారవశ్యము నొందుటవ లనఁ గుట్టమిత మగునని తాత్పర్యము. ఈలక్ష్యలక్షణములదోషము లిది వఱకె వ్రాయఁబడినవి.

కుతూహలమున కుదాహరణము.

చ. కలికి నృసింహభూవిభునిఁ ♦ గాంచి నవప్రణయాభిరామయై
కలితకరాబ్జకేళికమ ♦ లంబు భ్రమింపఁగఁ జేసె విభ్రమం
బలవడఁ బ్రాణనాథ హృద ♦ యాబ్జము ని స్నొదఁబాయ లేక యి
ట్లిలలమి భ్రమించుచున్న దని ♦ యేర్పడఁ జెప్పెడిచంద మొందఁగన్

టీ॥ కలి=స్త్రీ; నృసింహభూవిభునిన్ =నరసభూపాలుని; కాంచి=చూచి; నవ...యై=నూతనమైనప్రీతిచేతనొప్పుచున్నదై ; లలిత... కమలంబు = మనోజ్ఞమగుకరకమలమందున్న విలాసార్థమైనకమలమును ; ప్రాణనాథ=ఓప్రియుఁడా ! హృదయాబ్జము=హృదయకమలము; నిన్నుఁ బాయలేక=నిన్నువిడువఁజాలక; ఇట్లు=ఇభ్భంగి ; ఎలమిన్=మిక్కిలి; భ్రమించుచున్నదని=తిరుగుచున్నదని; పర్వడన్...అందఁగన్=వివరించిచెప్పురీతిగలుగునట్లు; విభ్రమంబలవడన్ = విలాసమేర్పడునట్లుగా ; భ్రమింపఁగఁజేసెన్=తిరుగునట్లుచేసెను, త్రిప్పెననుట.

§ ఇందు నాయిక తనహృదయాభిప్రాయమును నిలుపుకొనఁ జాలక ప్రియునకుఁ గేళికమలభ్రమణరూపమునఁ దెలుపుటవలనఁ జపలత యని కవి తాత్పర్యముగఁ దోఁచుచున్నది. అయిన “ శ్లో॥ కుతూహలం రమ్యదృష్టౌ చాపల ” మ్మనుప్రతాపరుద్రీయలక్షణమునకు, “ శ్లో॥ వీరరుద్రమధిరూఢసిన్ధుర” మ్మనుపూర్వోదాహృతతల్లక్ష్యమునకు నీలక్ష్యలక్షణంబులు మిగుల దూరంబు లని పూర్వమే వివరింపఁబడియున్నది.

కవిప్రతిజ్ఞావాక్యము.

తే. మఱియు శృంగార మంగనా ♦ మణులయందు
నంకురితపల్లవితపుష్పి ♦ తాదిభేద
వర్ణితాకృతియై దశా ♦ వస్థ (లయ్యె) మయ్యె
వీని నామక్రమంబులు ♦ విస్తరింతు. 169

టీ॥ మఱియున్=ఇంతియేకాక ; శృంగారము.—విప్రలంభశృంగారమనుట ; అంగనామణులయందున్ = స్త్రీరత్నములయందు ; అంకురిత...యై = అంకురితమును పల్లవితమును పుష్పితమును ఆదిశబ్ద

ముచేత ఫలితమును అను భేదములచేత వర్ణింపఁబడినస్వరూపము గలదియై; దశావస్థ లయ్యెన్=చక్షుఃప్రీత్యాదిదశావస్థలాయెను. వీనినామక్రమంబులు = ఈపదియవస్థలయొక్క-నామంబులవరుసను; విస్తరింతున్=వివరింతును.

§ నాయికానాయకులకుఁ బ్రథమావలోకనము మొదలుగ నుదయించినప్రీతి సంగమమునకుఁ బూర్వకాలమందు నంకురితాదిభేదములు గలదై చక్షుఃప్రీత్యాదిదశావస్థలకు హేతు వగు ననుట మొదలుగా రతిలక్షణపద్యవ్యాఖ్యానములో వ్రాయఁబడెను. ఈయంకురితాదిభేదంబులు, తజ్జన్యంబై నయవస్థాదశకము, స్త్రీపురుషసామాన్యముగా నుండిన నిం దంగనామణులయం దనుట సాత్త్వికభావవిశేషలక్షణపద్యములోఁ జెప్పినరీతిఁ దప్పుగాఁ దోఁచుచున్నయది.

§ వెండియుఁ బ్రతాపరుద్రీయములో "శ్లో॥ అథ శృఙ్గారస్యాఙ్కురితత్వపల్ల వితత్వకుసుమితత్వఫలితత్వహేతవో ద్వాదశావస్థా నిరూప్యన్తే" అనుదానిచేత శృంగారమున కంకురితత్వాది ధర్మములుగలుగు ననియు, వానివలన నీయవస్థ లుదయించు ననియు స్పష్టపడుచుండఁగా, నిందు శృంగారము దశావస్థ లయ్యె ననుట సుధీమణులచే నాలోచనీయముగా నున్నది. ఇట శృంగార మనఁగ శృంగారరసస్థాయియగురతియె. ఇట్లు రసగంగాధరములో "రసపదే నాత్ర ప్రకరణే తద్ధేతుః స్థాయిభావో గృహ్యతే। రసస్య సామాజికవృత్తిత్వేన నాయకాద్యవృత్తిత్వాత్ అద్వితీయానందమయత్వేన విరోధాసంభవాచ్చ" అని చెప్పఁబడినది. కాన నిటఁ బ్రేమమానప్రణయాదినామంబులతో విలసిల్లు రతియే శృంగార మనఁబడు. అయ్యది చక్షుఃప్రీతి మొదలగుదశావస్థ లగునా? దానివలన దశావస్థ లుదయించునా? యను

విషయము విచారింపఁ దగినది. లేదా, కర్తృభేదము నంగీకరించుపక్షమున, వర్ణితాకృతిమై యనుచోటి "ఐ" అనుదాని నగుధాతువు స్వార్థకరూపముగాఁ గ్రహించి, దానికిశ్శృంగారము కర్తగాను"అయ్యె" నను క్రియకు దశావస్థలు కర్తగాను అన్వయించి, పూర్వాపరభావమునకు హేతుహేతుమద్భావపరతను గల్పించి, శృంగారము అంకురితాది భేదములుగలది యగుటవలన దానికిఁ జక్షుఃప్రీత్యాదిదశావస్థలుకలిగెనని యర్థముఁజెప్పి, పైదోషమును నివారింపవచ్చునని కొందఱు.

§ దీనికన్న "దశావస్థమయ్యె" ననిమార్చి "దశావస్థస్సతత్రాద్యః" అనుదశరూపకమునందువలె బహువ్రీహినాశ్రయించి శృంగారమునకు విశేషణము చేయుటమంచిదని దోఁచినది.

మఱియు, "అఙ్కురితత్వపల్లవితత్వకుసుమితత్వఫలితత్వహేతవః" అనుప్రతాపరుద్రీయవాక్యమునందుఁ గోరికితత్త్వావస్థయు నైదవదిగా, "శ్లో॥ ఈషదఙ్కురిత విభ్రమచారా దేహపల్లవితకాన్తిని తన్వ్యాః। యౌవనే ముకులిత స్తనమాత్రే పుష్పితశ్చ ఫలితశ్చ మనోభూః॥" అనుతద్గ్రంథస్థపద్యముచేతఁ జేర్పఁదగినదను విచారమంతయుఁ బూర్వమే వ్రాయఁబడెను.

దశావస్థలనామంబులు.

క. ఇలఁ జూచుట చింతించుట
దలఁచుట గుణవినుతి యరతి ♦ తాపము లజ్జా
స్ఖలనము గమనము మూర్ఛయు
నల ధన్యత యన నవస్థ ♦ లగు నెట్లన్నన్. 171

టీ॥ ఇలన్=భూమియందు; చూచుట=అవలోకించుట ; చింతించుట=ఆలోచించుట ; తలఁచుట=స్మరించుట ; గుణవినుతి=గుణములఁ గొనియాడుట ; అరతి=అప్రీతి ; తాపము=సంతాపము ; లజ్జాస్ఖలనము=లజ్జాత్యాగము; గమనము=ప్రియునొద్దకుఁబోవయత్నించుట; మూర్ఛయున్=మూర్ఛిల్లుటయును ; అలంధన్యత=ప్రసిద్ధమగుధన్యతయు; అనవస్థలగున్=ఇల్లుపదియనస్థలగును. ఎల్లన్నన్. అనియథాశ్రుతిపద్యార్థమగుచున్నది.

§ ఇందు "శ్లో॥ చక్షుఃప్రీతిః ప్రథమం చిన్తాసఙ్గ స్తతోఽథ సంకల్పః । నిద్రాచ్ఛేద స్తనుతా విషయనివృత్తి స్త్రపానాశః। ఉన్మాదో మూర్ఛా మృతి రిత్యేతే స్మరదశా దశైవ స్యుః॥ దృఙ్మనస్సఙ్గసంకల్పా జాగరః కృశతా ఽరతిః । హ్రీత్యాగోన్మాదమూర్ఛాన్తా ఇత్యనఙ్గదశాదశ॥ అభిలాషచి న్తనాను స్మృతిగుణ సఙ్కీ ర్తనో ద్వేగాః" ఇత్యాదిగాఁ జెప్పఁబడిన యవస్థలలో గమనధన్యత లెందుఁ జేరునో తెలియకున్నది. తక్కినవిషయము ముందు వ్రాయఁబడును.

చక్షుఃప్రీతి కుదాహరణము.

మ. అనురాగాంబుధి యుబ్బి వెల్వడినయ ♦ ట్లాఘ్రూర్ణఘర్మాంబువుల్
దనువల్లిం డిగ జాఱఁ గన్నుఁగవలేఁ ♦ దళ్కు ల్విసాళించుచున్
ననవిల్కానిపురప్రవేశకలనా ♦ నాళీకదామంబులై
తనరం గోమలి నిన్నుఁ జూచె నరసేం ♦ ద్రా సాంద్రతేజోనిధీ. 171

టీ॥ సాంద్రతేజోనిధీ=దట్టమైన తేజస్సునకునిధియైనవాఁడా! నరసేంద్రా=నరసభూపాలుఁడా! కోమలి = కోమలాంగియగుచిన్నది ; అ

నురాగ...అట్లు = అనురాగమనెడుసముద్రముప్పొంగిపొరలినట్లు ; ఆ పూర్ణ...జాలక్ = అధికములైనస్వేదోదకములు శరీరమునుండిదిగ జాఱఁగా ; కన్నుఁగవలేఁదళ్కుల్ = కన్దోయియొక్క నూతనమైనకాంతులు ; పిసాళించుచున్ = వ్యాపించుచు ; నన...తనరన్ = మన్మథుఁడుపురప్రవేశముఁజేయువేళఁ గట్టుకమలమాలలై యొప్పఁగా ; నిన్నుఁజూచెన్ = నిన్నవలోకించెను.

ఇందు నాయిక పరిపూర్ణానురాగముచేత సరసభూపాలునిఁ జూచుటవలనఁ జూచుట యను నవస్థ యగు ననితాత్పర్యము.

§ ఈ చక్షుఃప్రీతియనునది దశావస్థలలో మొదటిది గదా! ఆయవస్థలు "దశావస్థా భవ న్త్యేతా విప్రలమ్భే ఖిలాష జే" అనుటచేతఁ బూర్వానురాగముననే కలుగుననుట తేల్లము. ఇట్లుండ "అనుకూలౌ నిషేవేతే యత్రా న్యోన్యం విలాసినౌ । దర్శనస్పర్శనాదీని స సమ్భోగ ఇతీరితః" అని చెప్పఁబడిన దర్శనాత్మక సంభోగమునకు నీచక్షుః ప్రీతికి నేమిభేదము చెప్పవలె నను విచారములోఁ గొందఱు, "తదేకాలోకనరతిర్యేష్టి" అనఁగా నెపుడెపుడు చూతమను కోరికయ చక్షుఃప్రీతియనియు, ఆదరమున నీక్షించుట దర్శనాత్మక సంభోగమనియుఁ జెప్పిరి. అట్లు చెప్పినయెడఁ బ్రథమావలోకనమెల్ల సంభోగము గావలసివచ్చునుగాన, "యత్ప్రేమ సజ్గమా త్పూర్వ న్దర్శనశ్రవణోద్భవమ్" అని పూర్వానురాగస్వరూపమును, "దర్శనస్పర్శనాదీని స సమ్భోగ ఇతీరితః" అని సంభోగస్వరూపమును పరిభావించి, సంగమ పూర్వకాలికాదర దర్శనము చక్షుఃప్రీతియనియు, సంగమోత్తరకాలికాదృశదర్శనము సంభోగమనియు నిర్ణయించికొనుటయే సమంజస మని తలంతు.

చింతించుట కుదాహరణము.

మ. అరవిందంబు విలాసమందిరము నీ ♦ హారాంశుఁ డేకోదరుం
డరయ న్గోత్రవిరోధ మేటికి నన ♦ ర్హం బంచు నూహించి యి
ర్వురఁ బొందించుపయోధికన్యక్రియఁ జే ♦ ర్చుం గేలు గండస్థలిం
దరుణీరత్నము చింతచేత నరసేం ♦ ద్రా సాంద్రతేజోనిధీ. 172

టీ॥ సాంద్ర తేజోనిధీ=దట్టమైన తేజస్సునకునిధియైనవాఁడా! నరసేంద్రా=నరసభూపాలుఁడా! తరుణీరత్నము=స్త్రీరత్నము; అరవిందంబువిలాసమందిరము=పద్మమునాకుఁ గ్రీడాగృహము; నీహారాంశుఁడేకోదరుండు=చంద్రుఁడుసహోదరుఁడు; అరయన్=విచారింపఁగా; గోత్రవిరోధమేటికిన్=సంబంధముగలవారికి విరోధమేల! అనర్హంబంచున్=ఉచితమ్ముకాదని; ఊహించి=ఊహచేసి; ఇర్వురన్=ఇద్దఱను, హస్తరూపపద్మమును ముఖరూపచంద్రుని ననుట; పొందించు...క్రియన్=కూడఁబెట్టు శ్రీదేవివిధంగి; కేలు=హస్తమును; గండస్థలిన్=చెక్కున; చింతచేతన్ = ఆలోచనచేత; చేర్చున్=ఉంచును.

ఇందు నాయిక ఆలోచనచేతఁ జెక్కుటఁ జెయిసేర్చుటవలనఁ జింతయగు నని తాత్పర్యము.

తలఁచుట కుదాహరణము.

మ. వరభూషాదులపై మనం బిడక దృ ♦ గ్వ్యాపార మెంతేఁ బర
స్పరసందర్శననాతిభిన్నము యి చూ ♦ పట్టంగఁ గార్యాంతర
స్మరణం బేమియు లేక నిశ్చలత నీ ♦ సాంగత్యముం గోరి మా
హారిణీలోచన యాత్మయందు నరసేం ♦ ద్రా నిన్ను భావించె రా.

టీ॥ నరసేంద్రా=నరసభూపాలుఁడా! మాహారిణీలోచన=మాచిన్నది. వర...ఇడక = శ్రేష్ఠములైనయాభరణములయందును చిత్తము

నుంచక ; దృగ్వ్యాపారము=చూపులయొక్క చలనాదిక్రియ ; ఎంతేఁ= మిక్కిలి ; పరస్పర...చూపట్టంగఁ=ఒకరినొకరుచూచుటకన్నను మిక్కిలి భిన్నముకానిదై యగపడఁగా, అనఁగా దాని చూపు, తన్నుఁ బ్రియుఁడు చూచుచుండఁగాఁ దానాప్రియునిఁ బ్రత్యక్షముగఁ జూచున ప్పటిచూపువలెనే యున్నదనుట ; కార్య...లేక=మఱియొకకృత్యంజే మియుఁదలఁపక; నిశ్చలతఁ=నిశ్చలత్వముచేత ; నీసాంగత్యముంగోరి= నీసంపర్కమునభిలషించి ; నిన్ను భావించెరా=నినుస్మరించెనురా.

ఇందు నాయిక నరసభూపాలుని భావించుటవలనఁ దలఁచుట యగు నని తాత్పర్యము.

గుణవినుతి కుదాహరణము.

మ. పలుకుం దోడగువీణలోఁ జెలియ నీ ♦ పై గీతము ల్మీటఁ దో
యల్యలిమైనీడ మెఱుంగుఁగాయ నిరవై ♦ యవ్వీణలో వాణి యో
లలితాంగీ మనచిత్తముం బ్రియుఁడు కొ♦ల్లల్ పెట్టెఁగా యంచు వె
ల్పలికిం దాను బుసాడ వచ్చె ననఁగ ♦ న్పట్టు న్నృసింహాధిపా. 174

టీ॥ నృసింహాధిపా=నరసభూపాలుఁడా! చెలియ=నాయిక ; పలుకుందోడగువీణలోఁ = పలుకుఁదోడగువీణయందు ; నీపై గీతముల్మీటఁ=నీమీఁదిగీతములువాయింపఁగా ; తోయ్యలిమైనీడ = ఆస్త్రీదేహముయొక్క ప్రతిబింబము ; మెఱుంగుఁగాయఁ = వీణయొక్క తళతళయనుకాంతిగలకాయయందు; ఇరవై=నిల్చినదియై; అవ్వీణలోవాణి=ఆవీణయందున్నవాగ్దేవి ; ఓలలితాంగీ=ఓమనోజ్ఞమైనయంగముగలదానా ! ప్రియుండు=ప్రియుఁడైననరసభూపాలుఁడు ; మనచిత్తముఁ=మనహృదయమును ; కొల్లల్ పెట్టెఁగా యంచుఁ=కొల్లలుపెట్టెఁగదాయనుచు ;

వెల్వలికిఁ=బయటికి; తాను; బుసాడవచ్చెనన్ = మొలపెట్టుటకు వచ్చెనోయనునట్లు; కన్పట్టున్=చూపట్టును.

ఇందునాయిక నృసింహుగీతములు పాడుటవలన గుణవినుతి యగు నని తాత్పర్యము.

అరతి కుదాహరణము.

మ. నిరతం బాత్మకరాంఘ్రిబాహునఖకాంతిస్ఫూర్తికిం దిగ్గుడై
శరణం బొందుప్రవాళపద్మబిసపుష్పశ్రేణికిం గ్రమ్మఱన్
శరణం బందుట హీన మంచును మదిన్ శైత్యోపచారక్రియా
గరిమం బొల్లదు మానినీమణి కడం కన్ శ్రీనృసింహాధిపా. 175

టీ॥ శ్రీనృసింహాధిపా=శ్రీనరసభూపాలుఁడా! మానినీమణి=స్త్రీరత్నము; నిరతంబు=ఎల్లప్పుడును; ఆత్మ...స్ఫూర్తికిన్=తనహస్తములయొక్కయు పాదములయొక్కయు బాహువులయొక్కయు గోళ్ళయొక్కయు కాంత్యతిశయమునకు; దిగ్గుడై=నికృష్టములై; శరణంబు... శ్రేణికిన్=శరణుచొచ్చినచిగుళ్ళయొక్కయు పద్మములయొక్కయు తామరతూండ్లయొక్కయు పువ్వులయొక్కయు సమూహమునకు; క్రమ్మఱన్=మరలను; శరణంబొందుట=శరణుచొచ్చుట; హీనమంచునో=నీచమనితలఁచియేమో; మదిన్=చిత్తమునందు; శైత్య...గరిమంబు=చల్లఁదనముగల్గించునట్టియుపచారాతిశయమును; కడంకన్=యత్నముచేత; ఒల్లదు=ఇష్టపడదు.

ఇందు నాయిక పల్లవకమలమృణాళకుసుమముల నొల్లకుండుట వలన నరతి యగు నని తాత్పర్యము.

తాపమున కుదాహరణము.

మ. ధవళాక్షీమణిమేను హేమలత య♦న్నత్వంబు ము న్నెల్లఁ ద
త్కవిలోకోక్తి యటంచు నుంటి నది త♦థ్యం బయ్యె నెట్లన్న భ
వ్యవియోగానలతప్తమై నిబిడబా♦ ష్పాసిక్తమై డస్సియు
న్నవశోభాతిశయంబుఁ జెందె నరసేం♦ద్రా సాంద్రతేజోనిధీ. 176

టీ॥ సాంద్రతేజోనిధీ = అధికమైనతేజమునకునిధియగువాఁడా! నరసేంద్రా=నరసభూపాలుఁడా! ధవళాక్షీ మణిమేను=స్త్రీరత్నముయొక్క శరీరము; హేమలతయన్నత్వంబు = బంగరుతీఁగెయనుభావము; మున్నెల్లన్=మునుపంతయు; తత్కవి. . .ఉంటిన్=మిథ్యావర్ణనఁజేయు కవిజనులమాటయనితలఁచియుంటిని. అదితథ్యంబయ్యెన్=ఆభావముయథార్థమాయెను. ఎట్లన్నన్=ఏవిధమున ననఁగా; భవ్య. . .తప్తమై=మనోజ్ఞమగువిరహాగ్నిచేఁదపింపఁజేయఁబడినదై; నిబిడ. . .సిక్తమై=దట్టమగుకన్నీటిచేఁదడుపఁబడినదై ; డస్సియున్=బడలియును ; నవ. . .చెందెన్=అపూర్వకాంత్యతిశయమునుబొందెను. ఇందువలనఁ దథ్యంబయ్యె నని యన్వయము. విరహతాపతప్తమైనం గాంతి మించు నని లోకశాస్త్రానుభవము.

ఇందు నాయికశరీరము వియోగానలతప్తమై నట్లు చెప్పినందునఁ దాప మగునని తాత్పర్యము.

లజ్జాత్యాగమున కుదాహరణము.

మ. చెలి నీమూర్తి లిఖించి చిత్రపలకం♦ జెన్నొందు బాష్పాంబువి
చ్ఛల మాపయ్యెదమీఁదఁ జేర్చుకొన నా♦ చిత్రం బలుష్యంబుగా

బళిరే కట్టినచీరయుం బగయుఁగాఁ ♦ ఘటించె దైవం బటం
చలినీలాలక యార్తిఁ జెందు నరసిం ♦ హా యింకఁ బాలింపుమీ.

టీ॥ నరసింహా=నరసభూపాలుఁడా! చెలి=స్త్రీ; నీమూర్తి లిఖించి=నీయొక్కయాకారమును వ్రాసి; చిత్రపలకన్=చిత్రపటమును; చెన్నొందు. . .పయ్యెదన్ = అందమునకాస్పదకముచేత వ్యాప్తమగు పైఁట చెఱఁగుమీఁద; చేర్చుకొనన్=ఉంచుకొనఁగా; ఆచిత్రంబు= ఆచిత్తరువు; అలక్ష్యంబుగాన్ = అగపడకపోఁగా; బళిరే = ఆశ్చర్యము! కట్టినచీరయున్=కట్టినవస్త్రమును; పగయుఁగాన్=శత్రువేయగునట్లు; దైవంబు; ఘటించెన్=ఘటిల్లఁజేసెను. అటంచున్; అలినీలాలక=ఆయువతి; ఆర్తిఁజెందున్= దుఃఖమునొందును. ఇఁకన్ = ఇంక మీఁద; పాలింపుమీ=కాపాడుమీ.

ఇందు నాయిక తానే చిత్రలేఖనాదిక్రియలొనర్చుటవలన లజ్జాత్యాగ మను నవస్థయగు నని తాత్పర్యము.

గమనమున కుదాహరణము.

మ. చెలుల న్వంచనచేసి యొక్కతెయ తాఁ ♦ జెన్నొంద నీయొద్దకు
న్నలినాక్షీమణి రాఁ దలంచి నవర ♦ త్న ప్రోతసౌధాంగణ
స్థలుల న్వె న్నని వచ్చునిర్మలతను ♦ చ్ఛాయ న్నిరీక్షించి నె
చ్చెలి యేతెంచె నెఱుంగఁ బోలు నని ని ♦ ల్చెన్ శ్రీనృసింహాధిపా.

టీ॥ శ్రీనృసింహాధిపా = శ్రీమంతుఁడగునరసరాజా! నలినాక్షీమణి=స్త్రీరత్నము; చెలులన్=సఖులను; వంచనచేసి=మోసపుచ్చి; ఒక్కతెయ తాన్=తానొక్కతెయే; చెన్నొందన్=అందమగునట్లు; నీయొద్దకున్ =నీచెంతకు; రాఁదలంచి; నవ. . .స్థలులన్=నవరత్నస్థగితములగు

మేడలయొక్క ముంగిళ్ళప్రదేశములయందు ; వెన్నని... ఛాయల్ = వెం బడించివచ్చునట్టి స్వచ్ఛమైనతన మైనీడను ; నిరీక్షించి=చూచి ; నెచ్చెలి.. నిల్చెన్ = ప్రియసఖివచ్చెను ఈబిడదెలిసికొను నని నిల్చెను.

ఇందు నాయిక ప్రియునొద్దకుఁ బోవ నుద్యమించుటవలన గమన మని కవియాశయము.

మూర్ఛ కుదాహరణము.

మ. బలితం బైన యనంగవేదనలచేఁ ♦ బల్మాఱు నిల్వోప లే
కలినీలాలకప్రాణము ల్వెడలి నే ♦ త్రాంభోజమార్గంబునం
గలయం బ్రాఁకుచు వచ్చి యన్నెలవునం ♦ గన్నీటియే యడ్డమై
నిలుప న్నిల్చె నృసింహభూరమణ మ ♦ న్నింపంగఁ బాడింతటన్.

టీ॥ నృసింహభూరమణ=నరసభూపాలుఁడా ! అలినీలాలకప్రాణ ముల్=తుమ్మెదలవలెనల్లనిముంగురులుగలచిన్నదానిప్రాణములు ; బలి తంబైన యనంగివేదనలచేన్=బలిష్ఠములైనమదనబాధలచేత ; పల్మా ఱున్=మాటిమాటికిని ; నిల్వోపలేక=ఓరువఁజాలక ; వెడలి=బయులు దేఱి ; నేత్రాంభోజమార్గంబునన్=నేత్రసరోజమార్గమునందు ; కల యంబ్రాఁకుచువచ్చి=అంతటనెగఁబ్రాఁకుచువచ్చి; అన్నెలవునన్=ఆప్ర దేశమునందు ; కన్నీఁటియేఅడ్డమై నిలుపన్ = కన్నీటిప్రవాహంబడ్డపడి నిలుపఁగా ; నిల్చెన్. ఇంతటన్ = ఇంతటితో ; మన్నింపంగఁబాడి= మన్నించుట ధర్మంబు.

ఇది నాయికావస్థను దెలుపు దూతీవాక్యము. నాయిక విరహో త్కంఠిత, గావున, విప్రలంభశృంగారోచితములగు హృదయసంతా పము వడఁకుట శరీరముకృశించుట ప్రియేతర సర్వవిషయములయుం

దప్రీతి బాష్పము తనయవస్థ దెలిపికొనుట ఆలసత గ్లాని దైన్యము నిర్వేదము శ్రమము అపస్మారము ఉన్మాదము జడత మొదలగునవి సంభవించును. కావున నతిసూక్ష్మములై స్వభావచంచలము లగు వాయురూపప్రాణములు గాఢములైనయిట్టి చక్షుఃప్రీతి చింత సంగమోత్కంఠ నిద్రాభావము కృశించుట మొదలగు మదన బాధలకును, వానివలనఁ గలుగు తీవ్రాయాసములకును, నిఁకనోర్చి యుంట దుస్తరము గావున మన్నించుట ధర్మంబని పరమార్థంబు. ఇందు నాయికకు మూర్ఛ స్పష్టము.

ఈపద్యమునందుఁ బ్రతిపదస్వారస్యమువలన సువ్యక్తంబుగ నిట్లు ధ్వనించుచున్నది. ఎట్లన. వేదన లను బహువచనముచేత నొకవిధము గాక యాయాసనులు నానావిధము లనుట సూచింపఁబడు. బలితం బనుపదముచేత అవియు నల్పములు గాక బలిష్ఠము లనునర్థము బోధితమగు. ఐన దృఢగాత్రులు కొంతవఱ కోర్వఁగలరనవచ్చు. "ప్రాణము" లనుటవలన. నట్లుగాక సుకుమారము లైనవాయురూపములు కావున నోర్వఁజాలవని సూచితమవుచున్నది. ఒకప్పుడు గలుగు నెట్టి బాధలనైన నెట్టివారలైన సహింపవచ్చుననన్నచో "పల్మా" అనుటచే మాటిమాటికిఁ గలుగు బాధలు సహించుట యసాధ్య మనియు, నీవు వచ్చెద ననునాశచే నోర్చియోర్చి యసాధ్యం బగుట నిల్పోపలేకపోయె ననియు ధ్వనించును. "ప్రాణముల్" అను బహువచనముచేత "శ్లో॥ న జహాతి మృతం వాపి సర్వవ్యాపీ ధనంజయః॥" అని మృతశరీరంబునైన వదలనట్టిధనంజయ మను ప్రాణము గూడఁ బై బాధలకు నిలువఁజాలక వెడలెనని తెలుపఁబడుచున్నది. "కలయంబ్రాఁకుచు" ననుటవలనఁ బ్రాణంబులు మిక్కిలి గాసిపడి శోషించి యెప్పు డెప్పుడు బయ

లు దేఱుద మంచు నుద్యమించి పోవునంతటిసామర్థ్యము లేక క్రమము గాఁ బోవఁజాలక నేత్రమార్గమున నంతంత నగఁ ద్రొక్కె నని వ్యక్తము గుచున్నది. "నేత్రాంభోజ మార్గంబున" ననుటవలన నీరాక కెదురు చూచిచూచి కన్నులలోఁ బ్రాణములు వెట్టుకొని యుల్లె మూర్ఛిల్లె నని ధ్వనితం బగుచున్నది "కన్నీటిచే" అనుటవలన దాఁటవలవిగాని నదీప్రవాహంబుగఁ గన్నీరు స్రవించుచున్న దని సూచింపఁబడుచున్నది. "అడ్డమైనిలుపక" అనుటవలన మరణమున కుద్యమించువారి నెంతవా రైన నెవ్వారైన సాంత్వోక్తులచేనూఱడించి యాప్రయత్నమును మాన్పుట ధర్మంబని యచేతనమగు కన్నీరుగూడ స్వానుష్ఠానముచేఁ దెలుపుచున్న దని తెలుపఁబడెను. "భూరమణా" యనుటవలన, ఇట్టియచేతన మగును దక మే మృతిఁజెందుట తగ దని నిలుపఁగా, నెల్లవారిని గాపాడవలసిన బాధ్యతగల యట్టి నీవు, దాని రక్షించుట యుక్తతరం బనివ్యంజితము. "మన్నింపంగఁబాడింతటక" అనుటవలన మరణమున కన్న నధికమగు దుర్దశ లోకమునం గానరాదు గావున నిట్టి యాపద దొలఁగించి కాపాడుట భూరమణుఁడ వైన నీకుఁ బరమధర్మం బనిసూచితము. ఇత్యాద్యర్థంబులు వ్యజ్యమానంబు లగును.

ధన్యత కుదాహరణము.

మ. శుకవర్గం బోకమాటలో మెలఁగె నా ♦ సూనాయుంధు డాంతరం
గికుఁడై యుండె మరాళ మొక్కనడకం ♦ గ్రేళ్ళుళ్ళి వర్తించె బా
యక వేడ్కన్ సుముఖత్వ మొందె శశి మా ♦ యబ్జాక్షి సేమంబుతో
నకలంకస్థితి నీవు గూడ నరసిం ♦ హా రాజకంఠీరవా. 180

టీ॥ రాజకంఠీరవా=రాజశ్రేష్ఠుఁడా! నరసింహా=నరసభూపాలుఁడా! మాయబ్జాక్షిన్=మాచిన్నదానిని; సేమంబులోన్=క్షేమము

తో; అకలంకస్థితిఁ=నిష్కలంకవృత్తిచేత; నీవుగూడఁ=నీవుచేరఁగా; అనఁగా నజ్ఞాతిఁ బ్రతికి క్షేమముతో నుండినపుడు నీవు గూడఁగా ననుట; శుకవర్గంబు=చిలుకలగుంపు; ఒకమాటలో మెలఁగెఁ=అల్పప్రయత్నమునఁ బూర్వవైరంబు మానికలిసెననుట. శుకములు పలుకులో మెలఁగుట సహజమని తాత్పర్యము. ఆసూనాయుధుండు=అట్లువిరోధించినకుసుమబాణుఁడు; అంతరంగికుఁడై యుండెఁ=ఆప్తుండై యుండెను. కాముం డంతరంగమునందు అనఁగా హృదయమునందుండువాఁడగుట సహజమని తాత్పర్యము. మరాళము=హంసయు; ఒక్కనడకం బ్రగల్భవృత్తి వర్తించెఁ=ఒకటేవృత్తితో ననఁగా మంచివృత్తితో నతిశయించి వర్తించెను. మరాళము నడకతో నతిశయించి వర్తించుట సహజమని తాత్పర్యము పాయక=విడువక; శశి=చంద్రుఁడు; వేడ్కఁ=సంతోషముచేత; సుముఖత్వమొందెఁ=అనుకూలత నొందెననుట; చంద్రుఁడు సుముఖత్వమనఁగా సౌమ్యభావము నొందుట సహజమని తాత్పర్యము. ఇది యంతయు నీయనుగ్రహమే కానివేఱు కాదని ఫలితార్థము.

కొందఱు శుకవర్గంబొకమాటలో మెలఁగెననుటచే శుకవాణియనియు, సూనాయుధుండాంతరంగికుఁడై యొప్పెననుటచేఁ గాముఁడు మనోజాతుం డాయెననియు, మరాళ మొక్కనడకఁ బ్రగల్భవృత్తి వర్తించెననుటచే మరాళగమనయనియు, శశి సుముఖత్వ మొందెననుటచేఁ జంద్రవదనయనియు, ధ్వనితమగుననుట మంచిదని తలంచిరి.

మాటలో మెలఁగెననక ఒక మాటలోననుట, ఆంతరంగిక శబ్దప్రయోగము, నడకఁ అని మాత్రమే అనక ఒక్క నడకఁ అనుట, సుముఖశబ్దప్రయోగము, వీనిని బట్టి యాలోచింపఁగాఁ గవి యభిప్రా

యున్నట్లుండక దనితోఁచి పై ప్రకారము వ్రాయంబడియె. అంతరంగిక శబ్దముచే వాచ్య మగు మనోజాతుఁ డనునర్థము ధ్వనితమనుట సంభవించునా యనియుఁ దోఁచుచున్నది.

మఱియు, కామశబ్దములెక్క స్మరబోధక శబ్దములన్నియు, దేవతా బోధకములేగాని మనోభావ బోధకములు గావను కల్పమున సూనాయుధుఁడు మనోజాతుఁడని శ్రీ పుత్రుండైన దేవునకు మనోజాతత్వము సుఘటముగానుండదు. భావార్థక తాపత్యము సుఘటమని వెనుక వ్రాయంబడినది. ఇట్లు వాత్స్యాయన కామసూత్ర వృత్తియందు, శాస్త్రోపక్రమ సూత్రమున "కామత్వం చానన్దాభివ్యఞ్జకవృత్తి విశేషత్వమ్, యోగాది జవ్యావృత్తయే విశేషపదమ్," అని కామస్వరూప నిర్వచనముఁజేసి "భాస్కర నృసింహాకృతినా కృతినా మానన్ద సంపదభివృద్ధ్యై। శ్రీపుత్ర సూత్రవృత్తౌ సాధారణ మత్రతన్యతే విశదమ్॥" అని నిరుక్తకామమునకుఁ బర్యాయముగా శ్రీ పుత్రపదము ప్రయోగించుట మొదలగునదియుఁ దత్కల్పమునకు విరుద్ధము. కాము సూత్రవృత్తౌ అని గదా యుండవలయుఁ, గావున స్మరబోధకశబ్దములలోఁ గామశబ్దేతరములన్నియు దేవతావాచకములేయనుటయు సుఘటము గాదు.

ఇందు నాయిక ప్రియసంగమము నొందినందున ధన్యత యని కవి యభిప్రాయము.

§ దశావస్థల యోగవిప్రలంభములోఁ గలుగునవి గావునఁదదంతరపాతి యగుదశనూవస్థయు నయోగాంగరూపముగనే యుండవలెఁ గాని సంయోగాంగరూపముగ నుండఁ గూడదు. "శ్లో॥ అనుకూలౌ నిషేవేతే యత్రాన్యోన్యం విలాసినౌ। దర్శనస్పర్శనాదీని స సంభోగ ఇతీరి

తః॥" అని యువకూలతచే నన్యోన్యముగ తరుణీతరుణులు దర్శనస్పర్శనాలింగనాదులు సేవించుటయె సంభోగ మని చెప్పఁబడినది గావునను, ప్రియసంగమరూప మైనధన్యత విప్రలంభోచితము లగుదశావస్థలలో గణనార్హముగాదు. ధన్యతయును నది సకలగ్రంథాదృష్టమైనదియు, నయుక్తమును నని తెలియునది. ఒకవేళ, మరణ మమంగళరూపముగాన నదికావ్యములయందుఁ గూడ దని యిట్లు చెప్పఁబడె నన్నచో, సంచారిభావములలో మృతికి " అగణితమృతియత్న మంత " మని లక్షణమును " వల పెటిఁగి రాఁ " డని లక్ష్యమును జెప్పినయట్లు, లక్షణము లక్ష్యము నేలఁ జెప్పఁ గూడదు ? కాన సర్వసమ్మతముగ మరణోద్యమమే మరణ మని లక్షణముఁ జెప్పి మనుచరిత్రవసుచరిత్ర చంద్రికాపరిణయములలో నుండు నీలక్ష్యము లుదాహరించుట యుక్తమని తోఁచుచున్నది. అవి యెవన.—

"సీ. చనుగప్పు దొలఁగ వా♦సనగాలి కెదురేగు, బరువొప్ప నలుఁగు
లఁ ♦ బాటుకరణి। నిడుదవేనలి నూనె ♦ ముడి జాఱఁ జిగురాకు, పొదఁ
దూఱుఁ గార్చిచ్చు ♦ గదియుకరణిఁ। బసిఁడిగాజులుపయి ♦ వెసఁద్రోచిను
నుదీఁగ, దమలించు నరిత్రాడు ♦ నమకుకరణి। మొలనూలు బిగియిం
చి ♦ వెలఁది వెన్నెలఁ జొచ్చుఁ, బిఱుదీయు కేటిలో ♦ నుఱుకుకరణి॥
తే. జడియు దళులకుఁ గుడియుళ్ళు ♦ పొప్పొడులమునుఁగు। మావికడ నిల్చు
విరులన ♦ త్రావి గ్రోలు। విషమసాయకు నేపుల ♦ విసివిసివిసివి। తనువు
దొఱఁగంగఁ దలఁచి యా♦వనరుహాక్షి॥"

సీ. పవమానమానవ ♦ ప్లవమానకైరవ, చ్యవమానరజము
మై ♦ నంటఁ దివురుఁ । గరసారసాగ్రతా ♦ మరసాతిసాంద్రశ్రీ, ధుర
సాక్షిఁ గన్నీరుఁ ♦ దుడువఁ గోరు। మదనావిలప్రభా ♦ సదనాగ్రమునో

మల,చ్ఛదనార్చిపైఁ జూపు ♦ జరుపఁజూచు । సలయావాతలతాకి ♦ సలయాగమలయాగ, నిలయానిలున కూర్పు ♦ దెలుపఁ దలఁచుఁ। గుంజపుటగుంజదళిపుంజ ♦ కింజలించు। వెగ్గలంబైనఁజెవి మొగ్గి ♦ వినఁ గడంగుఁ। బంచశరభూత ♦ హరిభూత పంచభూతములఁ దదీయస్థలం బులఁ ♦ గలుపుకరణి ॥

సీ. నకులాగనవపల్ల ♦ వకులాలిఁ జొరఁబారుఁ, గఱకు క్రైదు వులపై ♦ నుఱుకుపగిది । సుమనోజ్ఞచాంపేయ ♦ సుమనోరజముఁ దూఱు,ఘోరాగ్నిమండలిఁ ♦ జేరుపగిది। మధుపాదపానూన ♦ మధుపాళిఁ దిలకించు, ఘనవిషోదక మానఁ ♦ గాంచుపగిది। లతికానికరగార ♦ లతికాంతతతి మున్ను, ♦ మించుపన్నదిఁ బ్రవే ♦ శించుపగిదిఁ। దోర్దఁ బలుమాఱు బలుమారు ♦ దోర్బలమున । నాత్మ వలవంత వలవంత ♦ మగుచు నిగుడఁ। జటులకలనాదకలనాద ♦ పటలి కలికి । బడలి యూరామ ♦ యారామ పదవి నెనసి ॥

రసార్ణవసుధాకరమునందును, * శ్లో॥ తన్వీదర్శనసంజ్ఞయైవ లతికామాపృచ్ఛ్య సంవర్ధితాం న్యాసీకృత్య చ శారికాం పరిజనే స్నిగ్ధే సమం వీణయా । జ్యోత్స్నామావిశతీ విశారదసఖీ

---

* తన్వీ=కాంత; దర్శనసంజ్ఞయైవ=దర్శనసంజ్ఞచేతనే; సంవర్ధితాం=పోషింపఁబడిన; లతికామ్=తీవను; ఆపృచ్ఛ్య=వీడుకొని; స్నిగ్ధేపరిజనే = స్నేహయుక్తపరిజనమందు; శారికామ్=గోరవంకను; వీణయాసమమ్ = వీణతోఁగూడ; న్యాసీకృత్య=ఉంచువగానుంచి; జ్యోత్స్నామ్=వెన్నెలను; ఆవిశతీ=ప్రవేశించుచున్నదై; విశారదసఖీవర్గేణ=కౌశల్యముగలసఖియలబృందముచేత; కర్ణాన్తికే = చెవుల సమీపమందు; విక్తేన=తడుపఁబడిన, ఉచ్చరింపఁబడినయనుట; అనపోతసిద్ధనృపతేః=అనపోతరాజకొమారుఁడగుసింగభూపాలునియొక్క; నామ్నా=పేరుచేత; పునః=మరల; జీవితా=బ్రతికినది.

వర్గేణ కర్ణాన్తికే సిక్తేన వ్యానపోతశిఙ్గన్నృపతేరామ్నాయా పునర్జీవితా॥" అని వ్రాయఁబడినది. ఇందుకుఁ బ్రమాణఁబును నందె యిట్లు వ్రాయంబడినది. ఎట్లన్న, "శ్లో॥ తైస్తైః కృతైః ప్రతీకారైర్యది న స్యాత్సమాగమః। మరణస్మరణోద్యోగః కామాగ్నేస్తత్ర విక్రియాః। లీలాశుకచకోరాదిన్యాసః స్నిగ్ధసఖీకరే। కలకణ్ఠకలాలాపశ్రుతి ర్మన్దానిలాశ్రయః। జ్యోత్స్నాప్రవేశమాకన్దమఞ్జరీవీక్షణాదయః॥" అని ఇందువలన చేతన్నరసభూపాలీయలక్ష్యలక్షణప్రకారంబు చింత్యం బని తెలియునది.

క వి ప్ర తి జ్ఞా వా క్య ము.

తే. తెలియ శృంగార మిదియును ♦ ద్వివిధ మగుచుఁ
బరఁగు సంభోగవిప్రలం ♦ భంబు లనఁగ
నందు బహుభేదములను గ ♦ ణ్యంబు గాక
యేకవిధ మయ్యె సంభోగ ♦ మెట్ల టన్న. 181

టీ॥ తెలియన్ = తెలిసికొనఁగా; శృంగారమిదియున్ = ఈశృంగారరసమును; సంభోగవిప్రలంభంబులనఁగన్ = సంభోగమ్ము విప్రలంభము అని; ద్వివిధమగుచుఁబరఁగున్ = రెండుతెఱంగులైయొప్పును. అందున్=ఆరెంటిలో; సంభోగము = సంభోగశృంగారము; బహుభేదములను= పరస్పరావలోకనసంభాషణాలింగనాధరచుంబనాదులగు పెక్కుభేదములచేత; గణ్యంబుగాక=ఇన్నిభేదఁబులుగలదియని లెక్కపెట్టఁదగినదిగాక; ఇందు "నగణ్యంబు గాన నేకవిధమయ్యె" నని యున్నచో యథాశ్రుతమూలపాఠము సమంజసముగ నన్వయించును గాని "అగణ్యంబుగాక" యనుపాఠమునం దన్వయింపదు. ఏకవిధమయ్యెన్=ఒకవిధముగలదియాయెను. ఎట్లటన్నన్.

సంభోగశృంగారమున కుదాహరణము.

మ. మరుఁ డాచార్యుఁడు గా విశీర్ణకబరీ ♦ మాల్యాళి పుష్పాంజలి
స్ఫురణ ల్గాఁ దదుపేతభృంగనినద ♦ స్తోమంబు గానంబు గా
వరమంజీరరవంబు తాళగతి గా ♦ వర్ధిల్లు శాతోదరీ
సురతవ్యత్యయవేగతాండవ మొన ♦ ర్చుం జింతితాభీష్టముల్. 182

టీ॥ మరుఁడాచార్యుఁడుగాన్ = మదనుండు శిక్షాగురువు కాఁగా; విశీర్ణ...గాన్ = వీడినకొప్పునందలిమాలికలగుంపు పుష్పాంజలులు కాఁగా; తదుపేత...గాన్ = ఆపుష్పమాలికలనుబొందినతుమ్మెదలనాదముల మొత్తము సంగీతము కాఁగా; వర...గాన్ = శ్రేష్ఠములగు గజ్జెల చప్పుడు తాళఘాతము కాఁగా; వర్ధిల్లు...తాండవము = వృద్ధిఁబొందు నట్టి తనుమధ్య యొక్క యుపరిరతమను వేగసహితనాట్యవిశేషము; చింతితాభీష్టముల్ = నరసభూపాలుఁడుగోరినకోర్కెలను; ఒనర్చున్ = చేయునుగాక.

ఇందుపరిరతము చెప్పఁబడినది గాన సంభోగశృంగార మని తాత్పర్యము.

సంభోగము పరస్పరావలోకనాలింగనచుంబనాదినానారూపమై విలసిల్లునది గాన సురతరూపమే కాక యితరరూపము నుదాహరణంబు గావచ్చును. అది యెట్లన్న, నమరుకమున, "ఉ. లేమ నిజంబుగా అలిక ♦ లేకయ జోక వహింతు వంచు ని। కొక్కమలివేణికం బ్రియుఁడు ♦ గోరిక నంటఁగ సజ్జపజ్జ నం। తోమురిపెంపునవ్వాలయు ♦ తొయ్యలిచూడ్కుల వేడ్క లొంది యా। భామసఖీజనం బొకసే ♦ పం బిడి యేగెఁ గ్రమక్రమంబునన్." ఇది పురుషప్రవర్తితసంభోగ మనఁబడును,

"మ. విజనం బైననివాసమందిరము నుద్వీక్షించి రాకాంత లే। చి
జగత్సుందరి నిద్దురించె నను దృష్టి న్నమ్మి నాథాననాం। బుజ మొం
తేఁగని ముద్దు లాడి పులకప్రోద్యత్కపోలావలో। కజలజ్జావనతాస్య
యయ్యో నగుచుం గాంతుండు ముద్దాడఁగన్." ఇది స్త్రీప్రవర్తితసం
భోగమున కుదాహరణ మగును. వీనిమూలశ్లోకంబులు రెండును గా
వ్యప్రకాశమునందుఁ బై సంభోగద్వయమునకు నుదాహృతంబు లయ్యె.

విప్రలంభశృంగారభేద నిరూపణము.

క. పురుషులకుఁ దలోదరులకు
నరయంగా విప్రలంభ మభిలాషేర్ష్యా
విరహప్రవాసకారణ
పరిణతిచే నాల్గు గతులఁ బరఁగుచు నుండున్. 183

టీ॥ పురుషులకుఁదలోదరులకున్=పురుషులకున్ స్త్రీలకును; వి ప్రలంభము=విప్రలంభశృంగారము; అరయంగాన్ =విచారింపఁగా; అభిలాష...పరిణతిచేన్=అభిలాషము ఈర్ష్య విరహము ప్రవాసము అనుకారణముల భేదముచేత; నాల్గుగతులన్ = అభిలాషవిప్రలంభము ఈర్ష్యావిప్రలంభము విరహవిప్రలంభము ప్రవాసవిప్రలంభము అని నాల్గుతెఱంగులుగా; పరఁగుచునుండున్=ఒప్పుచుండును.

కొందఱు శాపవిప్రలంభమని యైదవదానిం జెప్పియున్నారు. అందుకు మేఘసందేశాదు లుదాహరణంబులు.

అభిలాషాదులలక్షణములు.

క. కలయుటకు మున్ను కోరిక
యిల నభిలాషంబు నాన నీర్ష్యా విరహ మనా

గలసి యెడఁబాయ హృదయో
త్కలిక ప్రవాసము విదేశ • గతి యెట్లన్నన్.

టీ॥ కలయుటకుమున్ను=స్త్రీపురుషులసంయోగమునకు పూర్వకాలమందు; కోరిక=వాంఛ; ఇఁకన్=భూమియందు; అభిలాషంబు=అభిలాషమనఁబడును. మానము = ప్రియుఁడన్యస్త్రీసంబంధముగలవాఁడని గలిగెడుకోపము; ఈర్ష్య=ఈర్ష్యయనఁబడును. కలసియెడఁబాయన్=స్త్రీ పురుషులుకూడి మరలనెడఁబాయఁగా; హృదయోత్కలిక = మనస్సునందుఁ గలిగెడునుత్కంఠ,అనఁగానిచ్ఛావిశేషము; "శ్లో॥ సర్వేంద్రియసుఖాస్వాదో యత్రాస్తీత్యభిమన్యతే। తత్ప్రాప్తీచ్ఛాం ససంకల్పా ముత్కంఠాంకవయోవిదుః॥" అని తత్ప్రమాణవచనము, ఇట్టియుత్కంఠ; విరహమౌన్=విరహమగును. విదేశగతి = నాయికానాయకులకుభిన్న దేశప్రాప్తి; ప్రవాసము = ప్రవాసమనఁబడును. ఎట్లన్నన్.

§ "శ్లో॥ స్త్రీణామీర్ష్యాకృతః కోపో మానో ఽన్యాసఙ్గినిప్రియే" అనిదశరూపకము. ఇందు మానపదముచేతఁ బ్రణయమానమును బోధిత మగుచున్నది. అది యీర్ష్యాశబ్దవాచ్యము గాక విరహములోఁ జేరుచున్నదని కొందఱి యాశయము. మఱికొంద ఱీర్ష్యాపదమున్న చోట మూలమునందే మానపదము నుంచి ప్రణయేర్ష్యామానములు రెండును దాని యర్థములుగాఁ జెప్పుచున్నారు. సర్వమతములయందు నీర్ష్యామానము స్త్రీలకే యనియుఁ బ్రణయమానము స్త్రీ పురుషులకుఁ గలుగు ననియు సిద్ధాంతముగ నున్నది. "శ్లో॥ తత్ర ప్రణయమానస్స్యాత్కోపావసితయోర్ద్వయోః" అనియు, "శ్లో॥ స్త్రీణామీర్ష్యాకృతః కోపోమానో ఽన్యాసఙ్గినిప్రియే" యనియు దశరూపకంబు. ఇట్లు

సిద్ధాంతస్థితియుండఁగా నీగ్రంథములో "పులుషులకుఁ దలోదరుల" కని పురుషులకును ఈర్ష్యామానము గలుగునట్లు చెప్పఁబడినది. ఇది యొప్పుగాఁ దోఁపదు. స్త్రీల కీర్ష్యామాన మన్య స్త్రీసంగతిజన్య కోపరూపమగునపుడు, పురుషుల కన్యపురుషసంగతిజన్యకోప మీర్ష్యామాన మని కదా వచింపవలె. అది యసంగతమ్మని వేఱుగఁ జెప్పుట యనావశ్యకము.

§ ప్రతాపరుద్రీయములో, "విరహో నామలబ్ధసంయోగయోర్నాయికానాయకయోః కేనచి త్కారణేన పునస్సమాగమకాలాతిక్షేపః" అని విరహపదార్థము చెప్పఁబడియుండఁగా, నిందుఁ "గలసి యెడఁబాయ" నని మాత్రమే చెప్పక "హృదయోత్కలిక" యని యధికముగాఁ జెప్పుట విరహలక్షణవిరుద్ధము. విరహోత్కంఠితాశబ్దమునకు విరహకాలమం దుత్కంఠగల దని యర్థము. వీనిమతమందు విరహశబ్దమునకే విరహకాలికోత్కంఠ యర్థమైనపుడు విరహోత్కంఠయం దుత్కంఠ గల దని యసంగతార్థము గలుగును గదా!

అభిలాషజన్యవిప్రలంభమున కుదాహరణము.

చ. అనయము శ్రీనృసింహునిలలి ♦ తాంకతలంబున నుండ వచ్చు నా
యనఘునఖాంకసంగతుల ♦ నందఁగ వచ్చు నృపాలమౌళితోఁ
జనవునఁ గుల్క వచ్చు గుణ ♦ సంగతి మెచ్చులు చూప వచ్చు నో
వనజదళాక్షి యాకనక ♦ వల్లికి నైనను ధన్య నాదుఁ గా. 185

టీ॥ ఓవనజదళాక్షి=ఓకమలపత్త్రములవంటికన్నులుగలదానా! అనయమున్=ఎల్లపుడు; శ్రీ...వచ్చున్ = సంపన్నుఁడగు నరసభూపాలునియొక్క మనోహరమైనతొడమీఁదనుండవచ్చును. ఆయనఘు...వ

చ్చుఁ=అపవిత్రుండగువాని నఖచిహ్నములసంబంధముచేఁ బొందవచ్చును. నృపాలమౌళితోన్=రాజశ్రేష్ఠుండగు నరసభూపాలునితో; వనపుసన్=మచ్చికచేత ; కుల్కవచ్చున్=ప్రకాశింపవచ్చును. గుణసంగతిన్=సౌశీలాద్యదిగుణములయొక్కయు, తంతువులయొక్కయు, సంబంధముచేత; మెచ్చులు=శ్లాఘనలను ; చూపవచ్చున్. ఆకనకవల్లకినై నను=నేనుఆనరసభూపాలునొద్దనున్న బంగరువీణగానైనను ; ధన్యనౌదుఁగా=ధన్యురాలనౌదునుగదా.

ఇందు నాయిక నరసభూపాలుని సాంగత్యమును గోరినందున నభిలాషజ విప్రలంభ మగును.

ఈర్ష్యాజన్యవిప్రలంభమున కుదాహరణము.

చ. వదనాగ్రంబున వాణి యున్నది మము ♦ న్వాక్రువ్వ నీ దిందిరా
మదిరాక్షీమణి యున్న దక్షుల మము ♦ న్మన్నించి వీక్షింప నీ
దదియుండగాక నృసింహ నీవిపులబా ♦ హాశ్లేష మే నొంద నో
ర్వదు భూదేవి బహుప్రియారత నినుం ♦ బ్రార్థింప నిం కేటికిన్.

టీ॥ నృసింహ=నరసభూపాలుఁడా ! వదనాగ్రంబునన్=నీముఖాగ్రమునందు, జిహ్వాగ్రమున ననుట ; వాణియున్నది=సరస్వతియున్నది. మమున్=భాగ్యహీనయగునాతో ; వాక్రువ్వనీదు=మాటాడనీయదు. అక్షులన్=నీకన్నులయందు ; ఇందిరామదిరాక్షీమణి=లక్ష్మీదేవి ; ఉన్నది=వసించినది. మమున్=అభాగ్యయగునన్ను ; మన్నించివీక్షింపనీదు=గారవించిచూడనీయదు. అదియుండగాక=అంతియేకాక; భూదేవి=భూమిదేవియు ; నీవిపులబాహాశ్లేషము=నీవిశాలములైనభుజములయాలింగనమును ; ఏనొందఁగనోర్వదు=నేనుబొందఁగాసహింపదు. బహు

ప్రియారత = బహునాయికాసక్తుఁడా ! నినుఁ=నిన్ను ; ప్రార్థింపఁ= యాచించుట ; ఇంకేటికిఁ=ఇంక నేమిప్రయోజనమునకు ? సంభావనా లోకనాలింగనాదికృత్యంబులకై నిన్నుఁ బ్రార్థింప సరసత్వాదులవలం వదుఁడవై నీవు మన్మనోరథపూర్తి సేయవు, ఇఁక నిన్నుఁబ్రార్థించుట వ్యర్థమని తాత్పర్యము.

ఇందు నాయిక తనప్రియుం డగునరసభూపాలుండు నాయికాంతరాసక్తుఁ డాయెనని యీర్ష్య నొందినందున నిది యీర్ష్యావిప్రలంభమగునని తాత్పర్యము.

విరహజన్యవిప్రలంభమున కుదాహరణము.

ఉ. నెచ్చెలు లీనృసింహధర ♦ ణీవరుఁ దెచ్చెద మంచుఁ బోయి రా
రిచ్చట నీవునుం గరుణ ♦ యించుక లే కలరంపగుంపులం
గ్రుచ్చెద వేల మత్ప్రియునిఁ ♦ గూర్పుము మన్మథ నీకుఁ దద్విభుం
దెచ్చుటకై యొసంగెద మ ♦ దీయకటాక్షము. లబ్జయాత్రముల్.

ఇది నాయికా ప్రకరణంబున విరహోత్కంఠితకు లక్ష్యముగ నుదాహరింపఁబడినందున నందేదీనియర్థము వ్రాయఁబడినది. ఇందునాయిక ప్రియుఁ నెడఁబాసినందున విరహవిప్రలంభ మగునని తాత్పర్యము.

ప్రవాసజ విప్రలంభమున కుదాహరణము.

చ. చిరయశ యోబభూవర నృ ♦ సింహ భవద్రిపుకాంత కాననాం
తరమున కేగి యందు నిజ ♦ నాథునిఁ గానక మన్మథార్తయై
వరుని సరోజపత్త్రమున ♦ వ్రాయు నెడం గరము ల్చెమర్పఁగా
నరయ నిజాంగకంబు పగ ♦ యయ్యె నటంచుఁ దలంచు దైవముఁ.

ఇదియు నాయికాప్రకరణమ్మునఁ బ్రోషితపతికోదాహరణమగు ట నంచె వ్యాఖ్యాత మయ్యె. ఇందు నాయికానాయకులకు భిన్నదేశ వాసము గలిగినందునఁ బ్రవాసవిప్రలంభ మగునని తాత్పర్యము.

రసాభాసమునకు లక్షణము.

క. పలువుర కొకభామినిపైఁ
దలఁపును నొకవారసతికిఁ ♦ దగఁ బలువురపై
వలపును మృగవిహగాదుల
కెలవు రసాభాస మయ్యె ♦ క్షితి నెట్లన్నన్. 189

టీ॥ పలువురికున్=బహుపురుషులకు; ఒకభామినిపైఁదలఁపును= ఒకస్త్రీయందు అనురాగమును; తగన్=ఒప్పునట్లుగా; పలువురపైన్= బహుపురుషులయందు; ఒక వారసతికిన్=ఒకవారాంగనకు, వలపును= అనురాగమును; మృగవిహగాదుల కెలవు=మృగములుపక్షులు మొదల గువానియనురాగమును; క్షితిన్=భూమియందు; రసాభాసమయ్యెన్= రసాభాసమనునది యాయెను. ఎట్లన్నన్.

§ ఈలక్షణము "శ్లో॥ ఏకత్రైవానురాగ శ్చేత్తిర్యక్ష్మ్లేచ్ఛగతోఽపివా। యోషితో బహుసక్తి శ్చే ద్రసాభాస స్త్రిధా మతః॥" అను ప్రతాపరుద్రీయమునం దున్న ప్రాచీన లక్షణమునందుఁ జెప్పఁబడినవాని లో ఏకత్రైవానురాగ మనఁగా స్త్రీపురుషులలో నొకరికే యనురాగ ము గలిగియుంటయు, పశుపక్ష్యాది తిర్యగ్జంతుగతరతియు, నీచజనాశ్ర యంబగురతియు, స్త్రీకి బహుపురుషులయం దాసక్తియు, ననురసాభా సభేదంబులలోఁ దిర్యగ్గతిమాత్రమున కె సంగ్రాహకమై యున్నది గాని తక్కిన యేకత్రానురాగమునకు మ్లేచ్ఛానురాగమునకు స్త్రీనిష్ఠ మగు

బహుపురుషానురాగమునకు సంగ్రాహకంబు గాదు. మృగవిహగాదుల యనుచోటి యాదిపదముచేత నీచనరాశ్రయ మగుననురాగమునకుమాత్రము గ్రహణ మైనను నితరంబులకుఁ గాదు. ఒకవారసతి కనుచోట వారపదములేక యొకసతి కనిమాత్ర మున్నచో స్త్రీనిష్ఠ బహుపురుష విషయకరతికి సంగ్రహం బగును. విత్తమాత్రోపాధిక సకలపురుషానురాగ సామాన్యయని సహజసిద్ధయగు వారకాంతయనురాగమే రసాభాసమైనపుడు కులటాదినిష్ఠ బహుపురుషానురాగము రసాభాస మేల కాదు? కావున నొకవారసతి కనునది యుక్తంబుగాఁ దోఁపదు. ఇట్లు పలువుర కొకభామినిపై వల పనునదియు యుక్తంబుగాఁ దోఁపదు. ఎట్లన్న, బహుపురుషుల కొకభామినిపై వలపు గలిగినపు డాభామినికిని వారియం దనురాగ ముండెనేని "యోషితో బహుసక్తిశ్చేత్" అని ప్రాచీనులు చెప్పిన రసాభాసములోఁ జేరును. ఆస్త్రీకి లేక పురుషులకు మాత్రమే యనురాగ ముండినచో "ఏకత్రైవానురాగశ్చేత్" అని చెప్పినదానిలోఁ జేరును. కావున నిట్లు ప్రాచీనలక్షణ విపరీతముగాఁ గల్పించుటయే గాక వేఱు విశేషము లేదు. మఱియు ననేకస్త్రీల కొక నాయకునియందుఁ గల యనురాగ మాభాసము గాక రసములోఁ జేరునపుడు, అనేకపురుషుల కొక నాయికయందుఁ గలుగు ననురాగము మాత్రము స్వయంవరాది దృష్టాంతములచేత రసాభాసము గాక రసరూపమేల కాఁదగదు?

§ ఇందు రసార్ణవసుధాకరమున, "తత్ర శృఙ్గార స్యారాగా దనేకరాగా త్తిర్యగ్రాగా న్మ్లేచ్ఛరాగా చ్చాభాసత్వమ్। తత్రారాగో రాగాభావః। సచ ప్రాగభావః ప్రధ్వంసాభావో ఽత్యంతాభావ శ్చేతి త్రివిధః। తత్ర ప్రాగభావే దర్శనాదికారణేషు సంభావితేషు రాగోత్పత్తిసంభావనయా నాభాసత్వ మితరయోస్తు కారణసద్భావేపి రా

గానుత్పత్తేః రాభాసత్వమేవ॥ ఇత్యాదిగ్రంథముచేతఁ బూర్వానురాగమం దనురాగోదయసంభావనచే నొకరికె తొలుత రతి గలిగినను రసాభాసతయే దని చెప్పఁబడి యున్నది. ఇట్లనేకు లగుపురుషులకుఁ గాని స్త్రీలకుఁ గాని యొకరియం దనురాగము రసాభాసము గాదని యేర్పడుచుండఁగాఁ "బలువుర కొకభామినిపై వలపు" అనుట యుక్తరూపంబుగాఁ దోఁపదు.

అనురాగ మనఁగా రత్యవస్థావిశేషము. అది పరిపూర్ణత నొందునపుడు రసత్వము నొందు నని సిద్ధాంతము గావున నొక చిత్తమునం దనేకవిషయానురాగ ముదయించినపుడు దేనికిని బరిపూర్ణభావము గలుగ దని యాభాసత చెప్పవచ్చును, అనేక చిత్తవ్యక్తులయందుఁ బ్రత్యేకమనురాగ ముదయించినపుడు స్వయంవరాదులయందువలె ననురాగోత్పత్తిసంభావనవలన నాభాసత గలుగ దని పైగ్రంథాశయము. ఇందుననే పరకీయకుఁ బతియందు నుపపతియందు ననురాగమున్నచో రసాభాసత ప్రసక్తించు నని శంకించి బలవత్తరమైన పరపురుషానురాగముచేత దుర్బల మగుస్వపురుషానురాగము బాధిత మగుటం జేసి రసత్వము నొంద దని "స్వామిన్యేవానురక్తాస్వీయా॥" యనురసతరంగిణీ వాక్యము వ్యాఖ్యలయందు వ్రాయంబడినది.

ఇట్లేకవ్యక్తి కనేకవ్యక్తులయం దనురాగ మాభాసమే యనియేర్పడినచో "శ్లో॥ ఏత త్పరిస్ఫురతిపద్మదృశాం సహస్ర మక్షిద్వయం కథయ కుత్ర నివేశయామి। ఇత్యాకులయ్య నయనామ్బురుహే నిమీల్య రోమాఞ్చితేన వపుషా స్థిత మచ్యుతేన ॥ వ్యానమ్రాః శ్చలితాశ్చైవ స్ఫారితాః పరమాకులాః। పాండుపుత్రేషు పాఞ్చాల్యాః పతన్తి ప్రథమా దృశః॥" అనులక్ష్యములయందును రసాభాసత ప్రసక్తించును.

దీనింగూర్చి గ్రంథములయందిట్లు వ్రాయంబడినది. ఎట్లన్న, "ఏన మేక స్యానేకవిషయరతీ రసాభాస ఏవ । పరం త్వేష విశేషః । యస్య వ్యవస్థితా బహ్వ్యో నాయికా భవన్తి తత్ర న రసాభాసః । తథా సతి కృష్ణస్య సకలోత్తమనాయకస్య బహుకామినీవిషయాయాం రతౌ రాభాసత్వాపత్తేః । తస్మాత్ అవ్యవస్థితబహుకామినీక వైశికనాయక పరమేతత్ । అత ఏవ వైశికానాం వేశ్యానాం చరతీ రసాభాస ఇతి ప్రాచీనమతమ్॥" అనిపూర్వపద్యవిషయమై రసతరంగిణీయందును, ఉత్తర పద్యమునుగూర్చి "అత్ర పాఞ్చాల్యా బహువిషయాయా రతే రభివ్యంజనా ద్రసాభాస ఏవేతి నవ్యాః । ప్రాఞ్చస్తు పరిణేతృబహునాయకవిషయత్వే రసే రసాభాస తేత్యాహుః" అని రసగంగాధరమునందును వ్రాయంబడినది.

ఇట్లు చెప్పటవలన, * "శ్లో॥ పఞ్చేషుక్షితిపప్రతాపలహరీ ప్రీతిస్తదీయా పునః కాసాం న స్తనకాఞ్చనాచలతటే కాశ్మీరపఙ్కాయతే। కాసా మ్మూర్ధని నైవ పఙ్కజదృశాం సిన్దూరలేఖాయతే కాసాంవా

---

* ఇదివైశికనాయకునిగూర్చి వేశ్యాంగనలవాక్యముగనున్నది. ప్రియసఖే=నెచ్చెలీ; పఞ్చేషుక్షితిపప్రతాపలహరీ = మరుండనురాజుయొక్క ప్రతాపపరంపరారూపమగు; తదీయా = వానిసంబంధినియగు; ప్రీతిః పునః=ప్రేమమయ్యైతే; కాసామ్ = ఏస్త్రీలయొక్క; స్తనకాఞ్చనాచలతటే = మేరుగిరులవలెనున్నతములగు స్తనముల ప్రదేశమున; నకాశ్మీరపఙ్కాయతే=కుంకుమపంకముగ నాచరింపకున్నది? కాసామ్ పఙ్కజదృశామ్= ఏస్త్రీలయొక్క; మూర్ధని = శిరమునందు; నైవసిన్దూరలేఖాయతే=సిందూరరేఖవలె నాచరింపకున్నది? కాసాంవా=ఏస్త్రీలయొక్క; కర్ణయోః=శ్రోత్రములయందు; నచమాణిక్యభూషాయతే=మాణిక్యభూషణమువలె నాచరింపదు?

నచ కర్ణయోః ప్రియసఖే మాణిక్యభూషాయతే ॥ అను వైశికవిషయమందును, * “శ్లో॥ స్తుమః కం వామాక్షి క్షణమపి వినా యం న రమసే విలేభే కః ప్రాణాన్ రణముఖమఖే యమ్మృగయసే। సులగ్నే కో జాతశ్శశిముఖి యమాలిఙ్గసి బలా త్తపశ్శ్రీః కస్యైషా మదననగరి ధ్యాయసి తు యమ్॥” అను వేశ్యావిషయమందును, † శ్లో॥ క్షోణీ నామ త్రికోణీ నదనగనగరగ్రామరుద్ధం తదర్ధం తత్రాప్యర్ధం తరుణ్యశ్శిశుగళితవయఃపూరితం తత్ర చార్ధమ్। త్యాజ్యాస్తత్రాపి

---

* వామాక్షి = మనోజ్ఞములగు కన్నులుగలదానా! యమ్ = ఎవని; వినా = వదలి; క్షణమపి = కొంచెముసేపైనను; నరమసే = రమింపవో; కంస్తుమః = అట్టివాని నెవ్వనిసుతియింతుము? కః = ఎవఁడు; రణముఖమఖే = యుద్ధముఖయజ్ఞమునందు; ప్రాణాన్ విలేభే = ప్రాణములను విడిచెను. ఎవఁడు రణముఖమున మరణము నొంది తజ్జనితపుణ్యముతోఁ బుట్టినవాఁడని భావము. యమ్మృగయసే = ఎవని వెదకుచున్నావో. సులగ్నే = శుభలగ్నమందు; కోజాతః = ఎవఁడుదయించినవాఁడు? శశిముఖి = ఓచంద్రవదనా! బలాత్ = బలాత్కారముగ; యమాలిఙ్గసి = ఎవ్వనిఁ గౌఁగిలించుకొనుచున్నావో. ఏషాతపశ్శ్రీః = ఈతపస్సంపద; కస్య = ఎవనిది? మదననగరి = మదననివాసపురకల్పమైనదానా! యన్ధ్యాయసితు = ఎవనినైతే ధ్యానించుచున్నావో.

† క్షోణీనామ = భూమియనునది; త్రికోణీ = మూడుమూలలంతటిదిగానున్నది. తదర్ధం = దానిలో సగము; నదనగనగరగ్రామరుద్ధమ్ = నదములు గిరులు నగరములు గ్రామములు వీనిచే నావరింపఁబడినది. తత్రాప్యర్ధమ్ = అందును సగము; తరుణ్యః = స్త్రీలు. తత్రచ = అందులోను; అర్ధమ్ = సగము; శిశుగళితవయఃపూరితమ్ = పసివాండ్లచేతను ముదుసలివాండ్లచేతను బూర్ణమైనది. తత్రాపి = అందును; పూజ్యాః = పూజనీయులగు; శ్వశురగురుముఖాః = మామయు జనకుఁడు లోనగువారు; త్యాజ్యాః = త్యజింపఁదగినవారు. శేషాః = తక్కినవారలు; కియన్తః = ఎందఱు; సన్తి = ఉన్నారు? మమ = నాకు; పుంశ్చలీపుంశ్చలీతి = జారిణిజారిణియని; అయమ్మిథ్యావాదః = ఈయసత్యవార్త; దిశిదిశిముఖరః = ప్రతిదిక్కునందు వ్యాపించినదనుట.

పూజ్యా శ్వశురగురుముఖాస్సన్తి శేషాః కియన్తో మిథ్యావాదోయ మాయం దిశి దిశి ముఖరః పుంశ్చలీ పుంశ్చ లీతి” అనుకులటావిషయమందును రసాభాసతయె యేర్పడుచున్నది. * “శ్లో॥ స్నాతా తిష్ఠతి కున్తలేశ్వరసుతా వారోఙ్గరాజస్వసు ర్ద్యూతే రాత్రి రియం జితా కమలయా దేవీ ప్రసాద్యాఽధునా। ఇత్యన్తఃపురసున్దరీజనగుణే న్యూనాధికం ధ్యాయతా దేవే నాప్రతిపత్తిమూఢమనసా ద్విత్రాః స్థితంనాడికాః” ఇత్యాదులయందు దక్షిణనాయకత్వంబును నిరాబాధముగ సిద్ధించుచున్నది.

కొందఱు దక్షిణనాయకునివిషయమై, “దక్షిణస్య నాయకస్య నాయికా స్వనేకాసు వృత్తిమాత్రేణైవ సాధారణ్యం న రాగేణ। తదేకస్యా మేవ రాగస్య ప్రౌఢత్వ మితరస్యాంతు మధ్యమత్వం మందత్వం వేతి న తదనురాగస్య రసాభాసతా॥” అని వ్రాసిరి. ఈమతమునం బాంచాల్యాదులయందు ననురాగ తారతమ్యము గల్పించి బాహ్యవృత్తి తౌల్యమువలన నాభాసత పరిహారము చేయవలసి వచ్చును. ఇట్లు చెప్పినపుడు గాఢానురాగ మున్నవిషయముననే రసత్వ మనియుఁ

---

* కున్తలేశ్వరసుతా=కుంతలరాజపుత్రి ; స్నాతా తిష్ఠతి=ఋతుస్నానము చేసియున్నది. అఙ్గరాజస్వసుః=అంగదేశాధీశుని సహోదరికి; వారః=గన్తవ్యవాసరము. ఇయంరాత్రిః=ఈరాత్రి ; ద్యూతే=ద్యూతమందు ; కమలయా=కమలయనువామెచేత ; జితా=జయింపఁబడినది. దేవీ=పట్టపురాణి ; అధునా=నేఁడు; ప్రసాద్యా=ప్రసన్నగాఁ జేయఁదగినది. ఇతి=ఈప్రకారముగ ; అన్తః పురసుందరీజనగుణే=అంతఃపుర స్త్రీ) జనగుణమునందు ; న్యూనాధికమ్=న్యూనత్వాధిక్యములను; ధ్యాయతా=ధ్యానించుచున్న వాఁడు గనుకనే; అప్రతిపత్తిమూఢ మనసా=అనిర్ణయముచే మూఢమైనమనస్సుగల ; దేవేన=భోజరాజుచేత ; ద్విత్రానాడికాః=రెండుమూడు గడియలు ; స్థితమ్=ఉండుటయయ్యె.

దదితరవిషయమున నాభాసత యనియుఁ బ్రసక్తించు నని తోఁచుచు న్నది. మఱియు, వేశ్యాకులటాను రాగములకును దారతమ్యకల్పనచే నాభాసత పరిహార్యమై యతిప్రసంగమగును. కావునఁ బూర్వమందు వ్రాసినసిద్ధాంతమె తగును.

వెండియు నీగ్రంథములో, "శ్లో॥ సామాన్యవనితా వేశ్యాసా ద్రవ్యపర మిచ్ఛతి। గుణహీనే నచ ద్వేషో నానురాగో గుణిన్యపి। శృఙ్గారాభాస ఏతస్యాం న శృఙ్గారః కదాచన। తన్మతం నానుమనుతే శ్రీమాన్ శిఙ్గమహీపతిః। తస్యాః ప్రకరణాద్యాచ నాయికాత్వవిధానతః। అనాయికావర్ణనేతు రసాభాసప్రసఙ్గతః" ఇత్యాదులచే సామాన్యనాయికారతి రసాభాసముగా దని వ్రాయఁబడెను. అయినను సామాన్య రక్తావిరక్తాభేదములచే రెండు తెఱఁగులు గాన రక్తలగునూర్వశ్యాదులరతి యాభాసము గాకపోయినను మనము చూచుచున్న కేవలభగవృత్తులుగా నుండుదాసులు కులటలు వేశ్యలు మొదలగువారిరతి ఆభాసమే. భగవృత్తులుగాక యనురాగముచేఁ బురూరవునియం దూర్వశివలె వర్తించుకాంతలరతి ఆభాసము గాకుండవచ్చునని నా యాశయము.

ఇవి యన్ని యిట్లుండఁగా, రసగంగాధరములో "శ్లో॥ అనౌచిత్యా దృతే నాన్య ద్రసభఙ్గస్య కారణమ్। ప్రసిద్ధౌచిత్యబన్ధస్తు రసస్యోపనిష త్పరా। తదాభాసా అనౌచిత్యప్రవర్తితాః॥" ఇత్యాదిగ్రంథములనుబట్టి "అనుచితవిభావాలమ్బనకరతిత్వం రసాభాసత్వమ్" అని లోకయాత్రానువిధాయిగ నుండి లోకమున ననుచిత మని తోఁపకుండురతి రస మనియు, లోకగర్హాస్పద మగునది యాభాస మనియుఁ,

పరిష్కరించి, తదనుగుణముగ, “ శ్లో॥ ఉపనాయకవిషయాయాం మునిగురుపత్నీగతాయాంచ। బహునాయకవిషయాయాం రతౌ తథానుభయనిష్ఠాయామ్ ” అని యుపపతివిషయకపరకీయారతియు, మునిగురురాజపత్న్యాదివిషయకరతియు, బహునాయకవిషయకరతియు, అనుభయనిష్ఠరతి యనఁగా నొకరియందె గల రతియు, నాభాసము లని వ్రాయఁబడినది. ఇందుఁ బూర్వమందు వ్రాసినదానికన్న నుపనాయకరతియు మునిగుర్వాదిపత్నీవిషయకరతియు రసాభాస మని విశేషము గనుపట్టుచున్నది.

అందులోఁ బరకీయ కుపనాయకవిషయరతి ఆభాస మనువిషయమునందు “పరోఢాం వర్జయిత్వాత్ర వేశ్యాంచాననురాగిణీమ్। ఆలమ్బనం నాయికాస్స్యు ర్దక్షిణాద్యాశ్చ నాయకాః॥” అనుసాహిత్యదర్పణము, “ శ్లో॥ పరోఢాతు పరేణోఢాప్యన్యసంభోగలాలసా। లక్ష్యా క్షుద్రప్రబన్ధేషా సప్తశత్యాదికేబుధైః ” అనుశింగభూపాలీయమును సహాయ మగుచున్నది. ఐనను మునిగుర్వాదిపత్నీవిషయకరతివలెఁ బరకీయకు బహునాయకాసక్తియె యత్యంతానుచితంబై రసాభాసం బగుఁ గాని యొక యుపపతియందే యనురాగమున్నచో నది ఆభాసముగా దనుచుఁ గొన్నియుక్తులు కొందఱు రసికులు వచింతురు. అందలి సారాసారంబులు చర్చించి పరిష్కరించుట గ్రంథవిస్తరహేతువని విరమింప నాయెను.

ఇఁక మున్యాదిపత్నీవిషయకరతి ఆభాస మనుటకు “అనౌచిత్యాదృతేనాన్య ద్రసభఙ్గస్య కారణమ్.” అని యనౌచిత్యమె ముఖ్యబీజము. సామాజికసహృదయాంతఃకరణమున కనౌచిత్యము దోఁచుటవ

లనఁ, దత్తజ్జాతులయందు గురుపత్న్యాదిగాములకు సుఖానుభవ ముండి నను, నది కావ్యనాట్యాదిద్వారముగ రసత్వ మొందదు. ఇట్టిస్థితియం దుఁ దారాశశాంకాదులు రసాభాసము లని వేఱుగ వ్రాయం బని లేదు. పెక్కేల? కావ్యప్రకాశములో, "అత్యుత్తమదేవతాదివిషయత్వేన వర్ణ్యమానా రతి రనుచితా । తద్వర్ణనంహి మాతాపిత్రో రతివర్ణన మివాత్యన్త మనుచితమ్." అని మాతాపిత్రాదిరతివర్ణనమువలె నత్యుత్తమదేవతారతివర్ణనమును అత్యంతానుచితంబు గాఁబట్టి రసాభాస మగు నను నాశయము తెలుపఁబడినది.

కావునఁ గావ్యమందును నాట్యమందును గవిచేతను నటునిచేతను లలితసందర్భముతోఁ దెలుపఁబడిన లోకోత్తరదుష్యంతశకుంతలాదినాయికానాయకులచేతను మలయానిలచంద్రికాద్యుద్దీపనములచేతను చింతాదివ్యభిచారులచేతను అశ్రుపాతాదిసాత్త్వికములచేతను సహృదయసామాజికచిత్తములు ద్రవించి తన్మయత్వము నొంది విగలితవేద్యాంతర మగునిర్భరానందము నొందుటయే రసానుభవరూపమై యుండఁగా, పానకాదిరసములోఁ దృణాదులవలె ననుచితవిభావాదులు దోఁచినపుడు రసాభాసంబు గాక దప్పదు.

తిర్యఙ్మ్లేచ్ఛాదిరతి రసాభాస మనుటకు నిదియే ముఖ్యకారణ మని నాయభిప్రాయము. తత్తజ్జాత్యుచితవిభావాదులచేఁ దత్తజ్జాతీయులకు సుఖానుభవ మగుచున్నదే యన్నను, సహృదయసామాజికులకుఁ, దద్రత్యాదివర్ణనము సేయునపుడు, దుష్యంతశకుంతలాదిరతివర్ణనమునందువలెఁ దన్మయత్వంబు గలిగి, దాము వర్ణ్యనాయకులుగను వారిస్త్రీలు తమ్ముఁగూర్చి విభావంబులుగను చిత్తము పరిణమిల్లి, రసానుభవంబు గావలెఁ గదా! ఇందు, "తత్కాలవిగలితదు

ష్యంతరమణీత్వాదిభి రలౌకికవిభావాదిశబ్దవ్యపదేశ్యైః ధమ్యౌ ప్రకాశ న్తలాదిభిః" ఇత్యాదిగా "అతఏవ పరిస్ఫుష్టపరిమితప్రమా తృత్వాదినిజ ధర్మేణ ప్రమాత్రా" అనునంతవఱకు కావ్యప్రకాశగ్రంథము నవలోకింపవలయు. ఇందే పిత్రాదిరతియు దేవాదిరతియు మొదలగుననుచితవిభావాలంబనరతులు రసాభాస మని చెప్పఁబడెను. ఏలయనఁగా, వారి రతివర్ణనమందు సామాజికసహృదయులకుఁ దమయందు పిత్రాదిబుద్ధియుఁ దద్విభావములందు స్వవిభావబుద్ధియుఁ గలుగవలెఁ గదా!

కావున ననుచితరతి పశ్వాదిరతి మొదలగునవి లోకములో రుచ్యంబులుగఁ దోఁచినను గావ్యనాట్యయోగ్యములగుశాస్త్రసిద్ధరసత్వము నొందఁ జాలవు. చూడుఁడు శాస్త్రము, "అభక్ష్యో గ్రామ్యకుక్కుటః అభక్ష్యో గ్రామ్యసూకరః" అని భక్ష్యాభక్ష్యనియమంబును, "ఇయం గమ్యా ఇయమగమ్యా" అని గమ్యాగమ్యనియమమును మొదలగునవి విధించి యట్లనుష్ఠించువారి కభ్యుదయ మగు నని తెలుపుచున్నదే గాని ప్రవర్తించువారిని వారింపఁ జాలదు. వారికిని భక్ష్యమునందువలె నభక్ష్యమునందుఁ దృప్తి, గమ్యలందువలె నగమ్యలయందును సుఖము, నవైషమ్యంబుగఁ జూపట్టుఁగాక. ఇట్లు లోకానుభవములో రుచ్యములుగాఁ దోఁచినను, అనుచితవిభావాలంబనరత్యాదివర్ణనంబులు శాస్త్రమార్గవిరుద్ధంబులై ఆభాసత నధిగమించుచున్నవి.

ఇఁక రసాభాసంబులకు వరుసగ నుదాహరణంబులు.

అందలి యరాగము రాగాభావ మనియు, నది ప్రాగభావము ప్రధ్వంసాభావము అత్యంతాభావ మని త్రివిధ మ్మనియు, అందుఁ బ్రాగభావమునందు దర్శనాదికారణసామగ్రియుండఁగా రాగోదయం బగు

నని సంభాషణచే తరుణీతరుణులలో నొకరికి ముందు రతి గలిగి యితరులకు లేకున్నను రసాభాసము గాదనియు వ్రాసి యున్నాఁడను. అందు *"శ్లో॥ భవిత్రీ రమ్భోరు త్రిదశవదనగ్లాని రధునా స మే రామః స్థాతా న యుధి. పురతో లక్ష్మణసఖః। ఇయం యాస్యత్యుచ్చై ర్విపద మధునా వానరచమూ ర్లఘిష్ఠేదం షష్ఠాక్షరపరవిలోపా త్పఠ పునః॥" అనునది రాగాత్యంతాభావమున నాభాసత కుదాహరణము.

†"శ్లో॥ గతే ప్రేమావేశే ప్రణయబహుమానే విగలితే నివృత్తే సద్భావే జన ఇవ జనే గచ్ఛతి పురః। త దుత్ప్రేక్ష్యోత్ప్రేక్ష్య ప్రియ

---

* రమ్భోరు=అరఁటిబోదెలవంటి తొడలుగల జానకీ! అధునా = ఇపుడు; త్రిదశవదనగ్లానిః = దేవతలముఖములకుహర్షక్షయము; భవిత్రీ = కాఁగలదు. లక్ష్మణసఖః=లక్ష్మణసహాయుఁడగు; సః=ఆ; రామః=రాముఁడు; యుధి=యుద్ధమందు; మే=నాయొక్క; పురతః=ముంగల; నస్థాతా=ఉండఁగలవాఁడు కాఁడు ఇయంవానరచమూః = ఈవానరసైన్యము; అధునా = ఇపుడు; ఉచ్చైర్విపదమ్ = గొప్పయాపదను; యాస్యతి = పొందఁగలదు. లఘిష్ఠ = ఓనీచుఁడా; ఇదమ్=ఈపద్యమును; పునః = మఱల; షష్ఠాక్షరపరవిలోపాత్.—షష్ఠాక్షరపర = సప్తమాక్షరముయొక్క, విలోపాత్=లోపమునుజేసి; ఇటల్యబ్లోపపంచమి; పఠ=పఠింపుము. ఇదిరావణసీతావాక్యప్రతివాక్యరూపముగనున్నది. త్రిదశవదనగ్లాని రామస్థాతానయుధి ఉచ్చైర్విపదమనుచోటులవరుసగఁజదువఁగా, సప్తమాక్షరములగు త్రి న వి అనునక్షరములు తీసి చదువఁగా దశవదనగ్లాని రామస్థాతా యుధి ఉచ్చైః పదమనియగునని తెలియవలయు.

† ప్రియునిచేఁదిరస్కరింపఁబడిననాయిక చెలితోఁ దనదశను చెప్పుచున్నది. హేప్రియసఖి=ఓస్నేహితురాలా! ప్రేమావేశే=అనురాగాతిశయము; గతేసతి=పోఁగా; ప్రణయబహుమానే=ప్రీతిచేఁజేయునాదరము; విగలితేసతి=పోఁగా; సద్భావే = సౌజన్యము; నివృత్తే=నివర్తిల్లఁగా; జనే=ప్రియుఁడు; జనఇవ= సామాన్యజనుఁడు

సఖ గతాం స్తాంశ్చ దివసాన్ న జానే కో హేతు ర్దళతి శతధా యన్న హృదయమ్॥" అను నది రాగప్రధ్వంసాభావమున నాభాసత కుదాహరణము.

*"శ్లో॥ పరస్పరేణ క్షతయోః ప్రహర్త్రో రుత్క్రాన్తవాయ్వో స్సమకాల మేవ । అమర్త్యభావేపి కయో శ్చి దాసీ దేకాప్సరః ప్రార్థితయో ర్వివాదః॥" అనునది స్త్రీకి బహుపురుషా సక్తివలన నాభాసత కుదాహరణము.

ఈ శ్లోకము సింగభూపాలీయములో రసాభాస ప్రకరణములో నొక స్త్రీకనేకపురుషులయం దాసక్తివలన నగురసాభాసత కుదాహరణముగా వ్రాయఁబడినది. ఏలాగనిన, "అనేకత్ర యోషితో రాగా

వలె; పురః=ఎదుట; గచ్ఛతిసతి=పోవుచుండఁగా; తత్=వానిచేఁజేయఁబడిన యవమానమును; గతాన్ తాంశ్చదివసాన్=కడచిపోయినయాదినములను; ఉత్ప్రేక్ష్యోత్ప్రేక్ష్య = తలఁచుకొని తలఁచుకొని; మమ = నాయొక్క; హృదయమ్ = గుండె; శతధా = నూఱుప్రకారములుగా; నదళతీతియత్ = పగులకున్నదనునదియేదికలదో; తత్ర = ఆవిషయమందు; కోహేతుః=ఏమికారణమో; నజానే = ఎఱుఁగను.

* పరస్పరేణ= ఒండొరులచేత; క్షతయోః = కొట్టఁబడినవారుగాననే; సమకాలమేవ = ఏకకాలమందే; ఉత్క్రాన్తవాయ్వోః = పోయినప్రాణవాయువుగలయట్టి; కయోశ్చిత్ప్రహర్త్రోః = కొందఱిభటులకు; అమర్త్యభావేపి=దేవత్వప్రాప్తియందును; ఏకాప్సరఃప్రార్థితయోః = ఒకయప్సరస్త్రీచేఁబ్రార్థింపఁబడినవారికి; వివాదః = జగడము; ఆసీత్ = ఆయెను. మనుష్యదశయందు జగడమాడిచనిపోయిన భటులకిరువురకు దేవత్వమందు నొకయప్సరస్త్రీ యిరువురను గోరుటవలన జగడముగలిగె ననుట.

దాభాసత్వం యథా" అని యవతారికవెంట నీపద్యమును వ్రాసి "అత్ర కస్యాశ్చి ద్దివ్యవనితాయా రణా నివృత్తి మరణ ప్రాప్తదేవభావే వీరద్వయే నిరుపమానగుణోపాధే ర్న్వైషమ్యేణ ప్రతిభాసనా దాభాసత్వమ్" అని సమన్వయము వ్రాయఁబడినది.

రఘువంశకావ్యస్థ మగునీపద్యము వ్యాఖ్యలో మల్లినాథసూరి "ఏకా ప్సరః ప్రార్థితయోః ప్రార్థితైకాప్సరసో రిత్యర్థః వాహితాగ్న్యాదిషు ఇతి పరనిపాతః అథవా ఏకస్యా మప్సరసి ప్రార్థితం ప్రార్థనా యయో రితి విగ్రహః స్త్రియాం బహు ష్వప్సరస ఇతి బహుత్వాభిధానం ప్రాయికమ్ ఏకామిషాభిలాషోహి మహద్వైరబీజ మితి భావః" అని వ్రాసినాఁడు కావున నిట నొకస్త్రీయందు బహుపురుషాసక్తి చెప్పఁబడినది గాని యొకతెకుఁ బలువురియం దాసక్తి చెప్పఁబడుట గా దని కొందఱు.

నాకుఁదోఁచిన దిట్లు.—లోకమున నొకస్త్రీ యిరువురను గోరినను వారలు పరస్పరము కలహించుటయు, నొక నాయకుం డిరువుర నాయికలను గోరినను వారు పరస్పరము కలహించుటయుఁ గలదు, ఇట్లు కోరఁబడినవారలలో నొకఁడు వలచి తక్కినవాఁ డొల్లకున్నను ఇరువురు నొల్లకున్నను జగడమునకుఁ బ్రసక్తి లేకుంటయు, స్త్రీలలో నొకతె వలచి యొకతె వలవకున్నను, నిద్దఱు వలవకున్నను జగడము నకుఁ బ్రసక్తి లేకుంటయుఁ గలదు. ఇఁక దానిం గోరినవా రిద్దఱు నైకమత్యముతో నుండిరేని జగడము లేమియు, నైకమత్యములేనిచోఁ గాని నేను ముందు నేను మం దని యో నే నొకండనే యనుభవింప వలయు నని యో బుద్ధి గలిగినచోఁ గాని జగడము గలుగుటయుఁ గనుచున్నారము. ఒకద్రౌపదిని గోరిన పంచపాండవులు, తారానురక్తు

లగువాలి సుగ్రీవులు నిందులకుఁ దార్కాణంబుగాఁ గొనఁ దగుదురు. ఇట్లు కాఁగా వరింపఁబడినవారి పూర్వవైరమో తాత్కాలికేచ్ఛాజన్యవైరమో జగడమునకుఁ గారణ మగుచున్నది గాని తాను వరించుట గాని తమ్ము వరించుట గాని సాహాత్కలహకారణము గానే యుండు ననుట కాదు. ఇట్లు వివాదసంభవమును బట్టియు బహుస్త్రీవ్యాశ్రయణమునకన్నఁ దత్పురుషాశ్రయణమునందు లాఘవమును బట్టియు సింగభూపతి యట్లు వ్రాసెను. చారిత్రవర్ధనవ్యాఖ్యానమునను బర్యాలోచింప దేవాంగనయే తొలుతఁ గోరి యున్న ట్లేర్పడుటను బట్టియు, సింగభూపతి యట్లు వ్రాసినది యుక్త మనియే భావింపఁ దగి యున్నది గాని నేఁబు గాదు. చారిత్రవర్ధనవ్యాఖ్య ప్రకృతపద్యమున నిట్లున్నది "యస్తు సంగ్రామే హన్యతే స్వర్గామినం దేవత్వ ముపగతం త మనుగృహీతు మప్సరస స్సమాయాన్తి ఇహాతు సమకాల మ్మరణ ముపగతయోః ఏకస్యా మేవ సమాగతాయాం దేవాఙ్గనయాం కాముకయో రనయో ర్ద్వివిరణ మభూ దిత్యర్థః" అనియున్నది. ఇందలి "తమనుగృహీతు మప్సరస స్సమాయాన్తి, సమాగతాయాం దేవాఙ్గనాయామ్" అనుటచేఁ దొలుత దేవాంగనలు వలచి వచ్చుట సిద్ధపనచ్చుటకిఁ బోయినవారు వలచుట వ్యక్త మగుచున్నది. సుకృతఫలభోగమునకై దేవత లెదుర్కొని తోడ్కొని పోవుటయు, "ప్రవృత్తా స్వస్త్రీస్సనామహమహమికా వీరవరణే" ఇత్యాదివ్యవహారములు, శైల్లములు గాని సుకృతముఁ జేసినవాఁడు స్వర్గమునకుఁ బోయియుండుఁ దా నుభోగింపవలసిన విషయములను సురరాజు నొద్దనో యితరులయొద్దనో తెలిసికొని ప్రవర్తించినట్లు గాని తనంతనే భోగ్యవస్తువులపైకిఁ గదిసినయట్లు గాని యంత ప్రచురము గాదు గదా! అని తోఁచినది.

* “శ్లో॥ రమ్యం గాయతి మేనకాఽప్రతిరుచి ర్వీణాస్వనై రూర్వశీ చిత్రం వక్తి తిలోత్తమా పరిచయ న్నానాఙ్గహారక్రమైః । ఆదత్తే లమిదం త దుత్తమ మితి ప్రేమా నవో విద్విషా భేజే శ్రీయనపోతశిఙ్గ నృపతే త్వత్ఖడ్గ భిన్నాత్మనా॥” ఇది పురుషునకు బహునాయికాసక్తి వలన రసాభాసత కుదాహరణము.

† “శ్లో॥ మధు ద్విరేఫః కుసుమైక పాత్రే పపౌ ప్రియాం స్వా మను వర్తమానః। శృఙ్గేణ సంస్పర్శనిమీలితాక్షీం మృగీ మకణ్డూయత కృష్ణ సారః॥” ఇది తిర్యగ్గతమైనందున రసాభాసత కుదాహరణము.

---

* అప్రతిరుచిః=సాటిలేనికాంతిగల; మేనకా=ఒక దేవాంగన; రమ్యమ్=మనోహరముగా; గాయతి=గానముచేయుచున్నది. ఊర్వశీ=ఊర్వశియనునది; వీణాస్వనైః=వీణాధ్వనులచేత; చిత్రమ్=చిత్రముగునట్లు; వక్తి=పలుకుచున్నది. తిలోత్తమా=తిలోత్తమయనునది; నానాఙ్గహారక్రమైః=అనేక ప్రకారములగునంగవిక్షేపక్రమములచేత; పరిచయమ్=సంస్తవమును; ఆదత్తే = గ్రహించుచున్నది. ఇదమలమ్=ఇదిచాలు. తదుత్తమమ్=అది శ్రేష్ఠమైనది. ఇతి=ఇటని; శ్రీయనపోతసింగనృపతే=అనపోతరాజనందనుఁడవైన సింగభూపాలుఁడా! త్వత్ఖడ్గభిన్నాత్మనా=నీఖడ్గముచే తదళితవిగ్రహుండగు; విద్విషా=శత్రువుచేత; నవః=నూతనమగు; ప్రేమా=ప్రీతి; భేజే=భజింపఁబడెను.

† ద్విరేఫః=భృంగము; స్వాంప్రియామనువర్తమానః=తనప్రియురాలి ననుసరించుచున్నదై; కుసుమైకపాత్రే=కుసుమమను నొక పాత్రయందు; మధు=మకరందమును; పపౌ=పానముఁజేసెను. కృష్ణసారః=కృష్ణమృగము; సంస్పర్శనిమీలితాక్షీమ్=స్పర్శచేయాసికొనఁబడిన కన్నులుగల; మృగీమ్=ఆఁడుజింకను; శృంగేణ=కొమ్ముచేత; అకండూయత=దీరినదాయెను.

* "శ్లో॥ ఏతన్మన్ద విపక్వతిన్దుక ఫలశ్యామోదరాపాణ్డుర ప్రాన్తం హన్త పులిన్దసున్దరకరస్పర్శక్షమం లక్ష్యతే। తత్పల్లీపతిపుత్త్రి కుఞ్జర కులం కుమ్భాభయాభ్యర్థనాదీనం త్వామనునాథతి స్తనయుగం పత్త్రావృతం మాకృథాః॥" ఇందు "కిరాతశబరపులిన్దామ్లేచ్ఛజాతయః" అని మ్లేచ్ఛజాతివిశేషములగు పులిందపల్లీ పతిపుత్త్రికలయను రాగము వర్ణితమైనందున మ్లేచ్ఛాలంబనక మగుట రసాభాసతకు నుదాహరణము.

† "శ్లో॥ పతింముక్త్వా నిద్రాశిథిలభుజబన్ధం చలితయా కవాటంనిశ్శబ్దం లఘు వివృతవత్యా మృగదృశా। క్వచిత్కోణే లీనోఘన

---

* పల్లీపతిపుత్త్రి=ఓరెడ్డికూఁతురా! ఏతత్ స్తనయుగమ్=ఈచన్దోయి; మన్ద విపక్వతిన్దుకఫలశ్యామోదరా పాణ్డురప్రాన్తమ్.—మందవిపక్వ=కొంచెముమాఁగినట్టి, తిన్దుకఫల=గారపండ్లవలె, శ్యామోదర=నల్లనిమధ్యభాగముగలదియు, ఆపాణ్డురప్రాన్తమ్ = తెల్లనగుపర్యంతభాగముగలదియునై; పులిన్దసున్దరకరస్పర్శక్షమమ్=మ్లేచ్ఛవిశేషముయొక్క కరస్పర్శనమునకుసమర్థమైనదిగా; దృశ్యతే=కనఁబడుచున్నది. తత్=అకారణమున; కుమ్భాభయాభ్యర్థనాదీనమ్=కుంభములయొక్క యభయప్రార్థనయందు దీనమైన; కుఞ్జరకులమ్=ఏనుఁగులగుంపు; త్వామనునాథతి=నిన్నుయాచించుచున్నది. పత్త్రావృతమ్=ఆకులచేనావృతమైనదానిఁగా, మాకృథాః=చేయకు.

† నిద్రాశిథిలభుజబన్ధమ్=నిద్రచేతసడలిన బాహుబంధముగల; పతిమ్=భర్తను; ముక్త్వా=వదలి; నిశ్శబ్దమ్=చప్పుడులేనట్టుగా; కవాటమ్=తలుపును; లఘు=తిన్నగా; వివృతవత్యా=తెఱచినట్టి; తయామృగదృశా=ఆస్త్రీతోఁగూడ; ఘనతమసి=గాఢాంధకారమందు; క్వచిత్కోణే=ఒకమూలన; లీనః=దాఁగినట్టి; కోపిసుకృతీ=ఒకానొకపుణ్యవంతుఁడు; సాంకేతికగిరా=సంకేతవాక్కుచేత; సమాహూతః=పిలువఁబడినవాఁడై; స్వైరమ్=యథేష్టముగా; విహరతి=క్రీడించుచున్నాఁడు.

తమసి సాకేతశిఖరా సమాహూత సైన్యవైరం విహరతి తయా కోఽపి సుకృతీ॥" ఇది యుపనాయక విషయకరతి యగుటంజేసి యాభాసత కుదాహరణము.

* "శ్లో॥ శతే నోపాయానాం కథమపి గత స్సౌధశిఖరం సుధాఫేనస్వచ్ఛే రహసి శయితాం పుష్పశయనే। విబోధ్య క్షామాఙ్గీం చకితనయనాం స్మేరవదనాం సనిశ్వాసం శ్లిష్య త్యహహ సుకృతీ రాజరమణీమ్॥" ఇందు రతి రాజపత్నీవిషయ మగుటం జేసి యాభాసత కుదాహరణము. ఉదాహరణాంతరంబు లూహ్యంబులు. ఇవి సంభోగాభాసోదాహరణములు.

† "శ్లో॥ వ్యత్యస్తం లపతి క్షణంక్షణ మథో మౌనం సమాలమ్బతే సర్వస్మిన్ విదధాతి కించ విషయే దృష్టిం నిరాలమ్బనామ్।

---

* ఉపాయానాం శతేన=అనేకోపాయములచేత; కథమపి=ఎట్లో యొకయట్లు; సౌధశిఖరమ్=మేడయొక్క యుపరిభాగమును; గతః=పొందినవాఁడై; సుధాఫేనస్వచ్ఛే=అమృతపునురుఁగువలె, కాదేని, సున్నపునురుఁగుచేత,స్వచ్ఛమగు; పుష్పశయనే = పువ్వులపాన్పునందు ; రహసి=ఏకాంతమందు ; శయితామ్=నిద్రించినట్టియు ; క్షామాఙ్గీమ్=కృశాంగియయినట్టియు ; చకితచకితామ్=అకస్మిక పురుషదర్శనమున భీతిల్లినదియు; స్మేరవదనామ్=పరిచితస్వపతియని తెలిసి చిఱునగవుతోఁగూడిన మోముగలదియునగు ; రాజరమణీమ్=రాజభార్యను ; విబోధ్య=మేల్కొలిపి ; సనిశ్వాసమ్=ఊర్పులతోఁగూడునట్లు; సుకృతీ=ఒకపుణ్యవంతుఁడు ; శ్లిష్యతి=ఆలింగనముఁ జేసికొనుచున్నాఁడు. అహహ=ఖేదము.

† వ్యత్యస్తమను నీపద్యము సీతావిషయకమైన రావణగత విప్రలంభరతిని దెలుపుననియు, దీనియర్థమిట్టిదనియు, శమోదాహరణ పద్యము వెనుక వ్రాయంబడిరి.

శ్వాసం దీర్ఘ మురీకరోతి న మనా గజ్ఞేషు ధత్తే ధృతిం నైజేహీకము నీయతాకబలితో లజ్జేశ్వరో వర్తతే॥" ఇది విప్రలంభాభాసమున కుదాహరణము.

ఇట్లు, కలహాశీలకుపుత్రాద్యాలంబనముగను వీతరాగాదినిష్ఠముగను శోకము, బ్రహ్మవిద్యానధికారిచండాలాదిగతముగ నిర్వేదము, కదర్యకాతరాదిగతముగను పితాద్యాలంబనముగను క్రోధోత్సాహములు, ఐంద్రజాలికాలంబనముగ విస్మయము, గుర్వాద్యాలంబనముగ హాసము, మహావీరనిష్ఠముగ భయము, యజ్ఞీయపశువసాస్రఙ్మాంసాద్యాలంబనముగ జుగుప్సయు, కావ్యనాట్యాదులయందు వర్ణితమైన యెడ రసాభాస మగు నని యెఱుంగునది. వీనికిఁ బ్రత్యేకముగ నుదాహరణంబులు గ్రంథవిస్తర భయముచే వ్రాయలేదు.

భావోదయాదినామక్రమతెల్లముఁగ నిరూపణము.

క. భావింప భావశాంతియు
భావోదయభావసంధి భావశబలతల్
భావం బడఁగుట పుట్టుట
ద్వైవిధ్యము బహుత యనఁగఁ దగు నెట్లన్నన్. 190

టీ॥ భావింపన్=ఆలోచింపఁగా; భావ...శబలతల్=భావశాంతి భావోదయము భావసంధి భావశబలత ఇవి వరుసగా ; భావంబడఁగుట...అనఁగన్ = భావముశమించుట భావశాంతియనియు, భావంబు పుట్టుట భావోదయమనియు, రెండుభావములు సమముగ ఘటిల్లుట భావసంధియనియు, ఉత్తరోత్తరములు పూర్వపూర్వభావోప మర్దక

ముగ అనేకభావములు లోకచోఁ జేరుట భావశబలత యనియు; తగున్=
ఒప్పును. ఎట్లన్నన్.

§ ఇందు భావం బనునది యడఁగుట పుట్టుట యనువానియం దన్వయించినను, ద్వైవిధ్యము బహుత యనువానితోఁ బ్రథమావిభక్త్యంత మగుట నన్వయింపదు. కాన భావములయొక్క యని పదాధ్యాహారము చేసి భావములయొక్క ద్వైవిధ్యము బహుత యని యన్వయింపఁదగియున్నది. ఇట్లన్వయించినను ద్వైవిధ్య మనుశబ్దము రెండుభావము లొకచోటఁ జేరి యుండుట యనునర్థమును జెప్పదు. మఱియేమన్న, రెండుతెఱంగు లగుట యనునర్థమును జెప్పును. అట్లు భావమొకండే రెండుప్రకారములుగ నుండవచ్చుఁగాన ప్రకృతంబున కుపయుక్తంబు గాదు. ఇట్లు బహుతాశబ్దమును ననేకత యనునర్థమును జెప్పును గాని యనేకభావంబు లొకచో బాధ్యబాధకరూపముగఁ జేరి యుండుట యనునర్థమును బోధింపదు. అట్లనుకూలములగు భావములనేకములు చేరి నపుడు "అలసాలోలములై" ఇత్యాదులయందు భావశబలత యన వలసి వచ్చును. కాన సవరింపవలయు నని తోఁచుచున్నది.

భావశాంతి కుదాహరణము.

చ. తలఁపఁగ రాజశేఖరుఁ డ ♦ తండు తలోదరి సర్వమంగళా
కలితవు నీవు మీర లొక ♦ గాత్రము కై వడిఁ గూడి యాడుచుం
జెలఁగుట యొప్పుఁగా కలుగఁ ♦ జెల్లునె మీకసి బోటిప్రోక్కఁగా
లలనకుఁ దోఁచె బాష్పసలి ♦ లంబు నివారితమానపంకమై. 191

టీ॥ తలోదరి=ఓచెలియా! తలఁపగన్=విచారింపఁగా. అతండు=ఆనీభర్తయైనసభూపాలుఁడు; రాజశేఖరుండు=రాజశ్రేష్ఠుఁడు,

చంద్రభూషణుం డైనశివుం డని యర్థాంతరము. నీవుసర్వమంగళాకలిత వు=నీవుసమస్తశుభసంపన్నురాలవు, పార్వతికి సర్వమంగళ యనునామాంతరము గావున నట్టి నామము గలదాన వని యర్థాంతరము; మీరు=మీరిరువురు ; ఒకగాత్రముకైవడిన్=ఒకశరీరముభంగి, పార్వతీపరమేశ్వరు లేకశరీరముగ నుండువారు గావున నట్లనుట ; కూడియాడుచున్=కలిసిక్రీడించుచు ; చెలఁగుట=ప్రకాశించుట ; ఒప్పుఁగాక=యుక్తముగాని ; మీకలుగఁజెల్లునె=మీకుఁ గోపించుటతగునా ? అనిబోటిప్రొక్కఁగాన్=ఇటనుచు సఖి ప్రణమిల్లఁగా; లలనకున్=స్త్రీకి ; బాష్పసలిలంబు=కన్నీరు ; నివారితమానపంకమై=పోఁగొట్టఁబడిన మానమను నడుసుగలదై ; తోఁచెన్=ఉదయించెను.

§ ఇందు నాయికకుఁగోపం బనెడు భావంబు శమించినందున భావశాంతిధ్వని యని తాత్పర్యము, కాని "లలనకుఁదోఁచె బాష్పసలిలం" బన్ననే, కోపశాంతి వ్యజ్యమానం బగుచుండఁగా, నివారితమానపంకమై యని యాయర్థమును వాచ్యముగాఁ జెప్పుట ధ్వనిమార్గ విరుద్ధంబై దీనికి భావశాంతిధ్వన్యుదాహరణార్హతను 'దొలఁగించుచున్నది ఇటఁ బ్రతాపరుద్రీయములో * శ్లో॥ లక్ష్మీస్త్వం పురుషోత్తమస్తవపతిశ్శ్రీవీరరుద్రో నృప స్సృష్టౌ వా మ్బుజవిష్టరస్య సదృశో ర్యోగశ్చిరా

---

* త్వమ్=నీవు; లక్ష్మీః=సిరివి. తవపతిః=నీభర్తయగు; శ్రీవీరరుద్రోనృపః=శ్రీప్రతాపరుద్రుఁడు ; పురుషోత్తమః=విష్ణుమూర్తియ. అమ్బుజవిష్టరస్య=బ్రహ్మదేవుకు ; సృష్ట్యామ్=నిర్మాణమందు ; సదృశోః=సాటియైన మీరిరువురకు ; యోగః=సంబంధము ; చిరాత్=బహుకాలమునకు ; సమ్భృతః=సంపాదింపఁబడినది. తస్మాత్=అందువలన ; వామ్=మీకు ; కృత్రిమకుపి=కృత్రిమమైనదైన ; కైతవసఖ్యమ్=కపటసఖిత ; మనాక్=అల్పమైనను ; అసామ్ప్రతమ్=అయుక్తము . ఇతి=ఇటని ;

త్సంభృతః | తస్మై తత్కృతే ప్రేమ మ ప్యసాంప్రత మిదం వాం వైమన
స్యం మనా గిత్యాలీం ప్రణతాం విలోక్య వికసద్వక్త్రాంబుజా మానినీ"
అని యున్నది. ఇందు వక్త్రాంబుజవికసనముచేతఁ గోపశాంతి వ్యంగ్యం
బుగా నున్నది. పై యుదాహరణమునకు దీనికిం గలభేదంబు స్పష్టము.

ఇట "కళంకితహారయష్టియై" యని యేని మఱియొండువిధము
న నేనిఁబఠింప వచ్చును గానికోపశాంతి వక్త్రాంబుజవికాసముచే వ్యజ్య
మానమైనట్లుగా బాష్పసలిలముచేతఁ గా నేరదు. కోపాధిక్యమందును
బాష్పసలిలౌఘము గలుగ వచ్చును. అందువలన "నివారితమానపం
కమై" యని కవి ప్రయోగించి యుండ నోపు" అని కొందఱియభి
ప్రాయము.

నా కిట్లు దోఁచినది. భావశాంతి ధ్వన్యుదాహరణ మొసంగ
వలయునని కదా ధ్వనిప్రకరణానుగుణముగఁ గవియభిప్రాయ ముండ
వలె. మానశాంతివాచ్య మైనపు డుదాహరణతానిర్వాహము గాకపో
వును గదా! ఎట్లో యొకయట్లు మానశాంతిని జెప్పిన మాత్రాన నుదా
హరణత ఘటిల్లదు. కానఁ గవి యట్లు తలంచి యుండు ననుట ప్రకృ
తానుగుణము గాదు. మఱియు, బాష్పము కోపశాంతివ్యంజకమే కాద
నియా ? నియతముగ నట్లు గాదనియా ! నియతముగఁ గా దనుట
"విషాదరోషసంతోషధూమాద్యైర్ద్రవ్యశక్తితః । [illegible]యాః" అనునదిగాఁ
గలప్రమాణములచేతను ననుభవముచేతను సకల సంప్రతిపన్నంబు. ఇఁక

ప్రణతామ్=నమస్కరించునదియైన ; ఆలీమ్=సఖని ; విలోక్య=చూచి ; మానినీ=
మానవతియైనయొక ర్తు ; వికసద్వక్త్రాంబుజా=వికసించిన ముఖపద్మముగలది అయ్యె
ననియధ్యాహారముచేసి యన్వయము చేయునది.

కోపశాంతివ్యంజకమే కా దనుపక్షమందు "ప్రసాదో బాష్పేణ స్తనతటవిశీర్ణేన కథితః । నివాహామ్భో దత్తే నయనసలిలై ర్మానసుహృదే" ఇత్యాదికవి వ్యవహారములు తాదృశ సహృదయానుభవము విరోధించును. ఒకచోటఁ గారణాంతరమునఁ గలిగినట్లున్నమాత్రాన నక్లేయంతటఁ గలుగు నని నిర్బంధ ముండ దని తలంచెద.

మఱికొందఱు రసాదులను స్వశబ్దముతోఁ జెప్పుట దోష మని గానిభావశాంత్యాదులు ధ్వన్యమానముగనే యుండవలయు నని గాని యీకవి తనగ్రంథములో నెచటనేని చెప్పలేదు గదా! అందువలన నితరగ్రంథకార సమ్మతము లైనదోషము లీతనియందు మోపుట యుక్తము గాదనిరి. అది సుందరమైనది గాఁ దోఁపదు, అట్లైనపుడొకచో నవ్యాప్తి యొకచో నన్యోన్యాశ్రయము నొకచో వ్యాకరణవిరోధము లోనగునవి ప్రదర్శించినపుడట్లే యవి యెల్ల నితండు చెప్పలేదు గాన నీతనిగ్రంథమం దాదోషములు ప్రసక్తింపఁగూడ దని మఱికొందఱు చెప్పవచ్చును గదా! అని తోఁచినది.

ఇట్లు నిర్బంధ మైనధ్వనిప్రకరణమునందే కాక, "శృఙ్గారాచ్చ భవేద్ధాస్యో రౌద్రాచ్చ కరుణోభవేత్" ఇత్యాదులయందుఁ గాని, ధ్వనిత్వము వివక్షితము గానిచోటఁగాని స్వశబ్దముతోఁ జెప్పినం జెప్పవచ్చును. "నదోషస్స్వపదేనోక్తా వపి సంచారిణః క్వచిత్" అని కావ్యప్రకాశమువలన స్పష్టప్రతిపత్తికై కావ్యములో నెందైనఁ జెప్పుకొన్నను, సిద్ధాంతప్రతిపాదకంబగునిట నట్లు చెప్పుట సరిగా దని నాతలంపు.

భావోదయమున కుదాహరణము.

ఉ. మేలము లాడువేళల స ♦ మేలములై చెలు లెల్లఁ గూడి యీ
బాలిక శ్రీనృసింహునకు ♦ పాలు వరించెదవే యటన్న నీ

లాలక ఘుంగవల్లిఁ బుల • కాంకురముల్ గన లోత్త నేమనం
జాలక యూరకుండె నని • శంబు (త్రపావృత యైనకై వడిన్)
విన మ్రముఖాంబుజాతయై.

దీనియర్థ మిది హేలోదాహరణ మైనపుడు వెనుక వ్రాయఁబడెను.

§ ఇందు లజ్జారూప మైనభావంబున కుదయము గదితం బయ్యె నని కొందఱు వ్రాసిరి. అది గ్రాహ్యంబుగాదు. ఏమనఁగా "కై వడిన్", అనుటవలనఁ ద్రపోదయమై నట్లు భావంబు గాక కారణాంతరముచే నూరకుండిన దను నర్థము బోధిత మగుచున్నది. కావున వారు వ్రాసి నది యొప్పఁదగదు.

§ ఒకవేళఁ, బులకోదయమైనందున భావోదయోదాహరణంబు గావచ్చు నని యాశంకింతు రేమో. అట్లును వలను గాదు. ఏమన్న, పులకంబులు సాత్త్వికభావములలోఁ జేరినవి. "శ్లో॥ వ్యభిచా ర్యఞ్జి తో భావః" అనుటవలన ధ్వన్యమాన మైనవ్యభిచారియె భావధ్వన్యు పయుక్తభావం బగుఁగాని సాత్త్వికంబుగాదు. "త్రపావృతయైనకై వడిన్" అనుచోటఁ గై వడిపదము మార్చి "త్రపావృతయై చెలంగుచున్" ఇత్యాదిపదములచే సవరించినప్పటికిని వ్యంగ్యవృత్తిచే బోధింపఁదగిన త్రప వాచ్యవృత్తిచే బోధిత మగుటవలనఁ, బూర్వోక్తరీతిగ ధ్వని మార్గమునకు విరుద్ధమై యుదాహరణానర్హతఁ బొందు నని తెలి యునది. ప్రతాపరుద్రీయములో, * "శ్లో॥ ముగ్ధే క స్తవ వర్తతే హృది మనో జన్మైవ నాన్య శ్శపే సఖ్యేతస్య కిమత్ర కార్యమపరం

* ముగ్ధే=ఓసుందరీ! తవ=నీయొక్క; హృది=చిత్తమందు; కోవర్తతే= ఎవ్వఁడున్నాఁడు? అని ప్రశ్నము. మనోజన్మైవ=మదనుఁడే; నాన్యః=మఱియు

కిం జన్మ సద్మాదరః । కోఽన్య స్తత్ప్రతిబిమ్బ ఏవ నిపుణే జానాసి కామాధికః ప్రేయా న్రుద్రనృప స్తవేతి కథితా నమ్రానా నాఽభూద్వధూః" అనియున్నది. ఇందు "నమ్రాననా" యనుటవలన లజ్జోదయము వ్యంగ్యం బని స్పష్టము. ఈతెలంగున నుదాహార్యము. ఇట్లు, "వినమ్రముఖాంబుజాతయై" యని సవరింపవచ్చును.

"త్రపాకృతమైన కైవడిన్" అనిపఠించి త్రపయను నుపాదానకారణముచే నిర్మింపఁబడినదానివలె నున్న దని యర్థముఁ గొని "కరుణస్యమూర్తి రేవ వా శరీరిణీ విరహవ్యథేవ వన మేతి జానకీ"ఇత్యాదులవలె ఘటిత మగు నని తలంతు మేని యట్లు హోవోదాహరణప్రకరణమున ఘటితమైనను లజ్జ త్రపాశబ్దవాచ్యమయినందున దార్ష్టాంతికమందు అత్యంతశోకవత్త్వాత్యంత విరహవ్యథావత్త్వములవలె నత్యంతలజ్జావత్త్వము తోఁచి పూర్వోక్త దోషతాదవస్థ్యము ఘటిల్లు నని తోఁచినది.

కంముకాఁడు. శపే=ఒట్టువెట్టుకొనియెద నని ప్రతివాక్యము. సఖి=ఓచెలీ! అత్ర=ఈసీమనమున ; ఏతస్య=ఈమనన్మథునకు; కిఙ్కార్యమ్=ఏమిపని? అని ప్రశ్నము. అపరమ్కిమ్=మఱియొక పనియనునది యేమి ? జన్మసద్మాదరః=పుట్టినింటియందాదరమే పనియని ప్రతివాక్యము. కోన్యః=మఱియొకండుగలఁడే వాఁడెవఁడు? అని ప్రశ్నము. తత్ప్రతిబిమ్బ ఏవ=వానిప్రతిబింబమే, కాని యన్యుఁడుకాఁడని ప్రతివాక్యము. నిపుణే=నేర్పరియైనదానా ! జానాసి=తెలియుదువు. తవప్రేయాన్=నీవల్లభుఁడైన ; రుద్రనృపః=వీరరుద్రుఁడు ; కామాధికః=మరునికన్న యెక్కుడైనవాఁడు. ఇతి=ఇటని ; కథితా=సఖిచేతఁజెప్పఁబడినదై ; వధూః=స్త్రీ ; నమ్రాననాభూత్=నమ్రవదనయయ్యె.

భావసంధిధ్వన్యుదాహరణము.

ఉ. హారి కానంగశరాళియై యరికి వే ♦ లాభీలదివ్యాశుగో
త్కరమై శౌరికిఁ బాటలాబ్జకలికా ♦ దామంబులై వైరికి
న్నిరతాగ్నిప్రభలై వెలుంగు నరకా ♦ నీకాధికోల్లాసభా
సురసత్యారమణీకటాక్షములు ప్రో♦చుఁ శ్రీనృసింహాధపుఁ. 193

టీ॥ హారికిఁ = కృష్ణునకు; ఆనంగశరాళియై = మదనసంబంధి బాణపరంపరయై; అరికిఁ=శత్రువైననరకాసురునకు; అవేల...ఉత్కరమై=మిక్కిలి భయంకరమై దివ్యమైనబాణసంఘమై; శౌరికిఁ= కృష్ణునకు; పాటల...ఐ = రక్తోత్పలకలికలహారంబులై; వైరికిఁ= నరకాసురునకు; నిరతాగ్నిప్రభలై =అవిచ్ఛిన్నాగ్నికాంతులై; వెలుంగు... కటాక్షములు=ప్రకాశించెడు నరకాసురయుద్ధమందలి యధికోల్లాసముచే భాసిల్లుసత్య భామాకటాక్షములు; శ్రీనృసింహాధిపుఁ=శ్రీనరసభూపాలుని; ప్రోచుఁ=రక్షించుఁగాక.

§ ఇందు రత్యుత్సాహరూపభావంబులకు సంధి వచింపఁబడియె నని పూర్వటీకాకారులు వ్రాసిరి. అది గ్రాహ్యంబు గాదు. "విభావా దివ్యజ్యమానహర్షాద్యన్యతమత్వం భావత్వం। తదుక్తం వ్యభిచార్యఞ్జితో భావః" అనురసగంగాధరమును "రతి ర్దేవాదివిషయా వ్యభిచారీ తథాఞ్జితః, భావః ప్రోక్తః" అనుకావ్యప్రకాశమును బట్టి వ్యజ్యమానవ్యభిచారియు దేవాదివిషయకరతియు నే భావధ్వన్యాదులయందు భావపదవ్యవహార్యం బని సిద్ధాంతితమై యుండ శృంగారవీరస్థాయు లగురత్యుత్సాహముల సంధి యనుట యసంగతము. ప్రతాపరుద్రీయము

నందును * "శ్లో॥ ప్రతాపరుద్రస్య దిగన్తజైత్రయాత్రాప్రభూతైః పటహప్రణాదైః। ప్రియానులాపైశ్చ తథా భటానాం లోమాఞ్చవర్మావృత మఙ్గ మాసీత్" అనుదానిలో "అత్ర వీరశృఙ్గారకృతయోర్హర్షయోస్సంధిః" అని వ్రాయఁబడినది గాని వీరశృంగారస్థాయులైన రత్యుత్సాహములకు సంధి యని వ్రాయలేదు. కావున నావ్యాఖ్యాతలు పొరపడిరి. రెండియు, భావద్వయమునకుఁ బరస్పరోపమర్ద్యోపమర్దకభావముచేత నేకాధికరణవృత్తిత్వము వర్ణించినపుడే భావసంధి యగును గాని వేర్వేఱుగ హరిచిత్తమునందు రతియు నరకాసురునిచిత్తమునందుత్సాహమును దోఁచినపుడు కాఁజాలదు. అట్లగు నని యెంచుటకుఁ బ్రాచీనోదాహరణములు గావి లక్షణములు గాని గాన్పింపవు. సత్యభామకే కెంఁడు నుదయించినవనుటకు, ఉత్సాహము యుద్ధదశయందుఁ బరిపూర్ణమై వీరరసభావము నొందియుండఁగా, దానికి సమబలముగా రతి యుదయించుట యసంభవమగుటను వలనుగాదు. వ్యభిచారరూపముగా రతి యుదయించిన దన్న; నుత్సాహమునకు సమబలముగాని యపుడు భావసంధియె కాదు. కావున, హర్షద్వయసంధియె యెట్లయినఁ జెప్పుకొనవలయుఁ గాని వేఱు గతి లేదు.

---

* ప్రతాపరుద్రస్య=వీరరుద్రునియొక్క; దిగన్తజైత్ర యాత్రాప్రభూతైః.— దిగన్తజైత్రయాత్రా=దిగంతములయందలి జయప్రయాణమందు, ప్రభూతైః=పుట్టినట్టి; పటహప్రణాదైః = ఆనకములధ్వనులచేతను ; తథా = అట్లు ; ప్రియానులాపైశ్చ= ప్రియురాండ్రయొక్క సల్లాపములచేతను ; భటానామ్ = యోధులకు ; అఙ్గమ్=శరీరము ; లోమాఞ్చవర్మావృతమ్=రోమాంచమనెడు కవచముచేత సంవృతమైనది ; ఆసీత్ =అయ్యె.

భావశబలత కుదాహరణము.

మ. చెలు లే మందురొ భావవీథి నకటా ♦ శ్రీనారసింహేంద్రుకౌఁ
గిలి నా కెన్నఁడు గల్గునో నృపతితోఁ ♦ గ్రీడింపఁగాఁ బోవుచం
చలఘుంజిత్తము నేమి సేయుదు గురు ♦ న్సద్భక్తిఁ బ్రార్థింతునో
యలప్రాణేశ్వరుఁ జూడ కున్నఁ బరితా ♦ పాటోపము ల్మానునే.

టీ॥ భావవీథిన్ = అంతరంగమందు; చెలులేమందురో=సఖులేమనుకొందురో! అకటా! నారసింహేంద్రు కౌఁగిలి = నరసభూపాలునియాలింగనము; నా కెన్నఁడుగల్గునో = నా కెన్నఁడబ్బునో; నృపతితోన్=నరసభూపాలునితో; క్రీడింపఁగాన్=విహరించుటకు; పోవుచంచల ఘుంజత్తమున్=పోవునట్టిచపలచిత్తమును; ఏమిసేయుదున్= ఏవిధముగావారింతును! గురున్=గురువును; సద్భక్తిన్=ఉత్తమభక్తిచేత; ప్రార్థింతునో=ప్రార్థనసేయుదునా? అలప్రాణేశ్వరున్=ఆప్రాణనాథుఁడగునరసభూపాలుని; చూడకున్నన్ = అవలోకింపకుండినయెడ; పరితాపాటోపముల్మానునే = సంతాపాతిశయములు మానునా? మానవనుట.

§ ఇందు భయౌత్సుక్యాదిరూపభావములకు మిశ్రణము వాక్యద్వయం బడియె నని కొందఱు. భయానకరసస్థాయి యగుభయము సంచారులలోఁ జేరనందునను, త్రాసము చేరినప్పటికి భయత్రాసములకు లక్షణపార్థక్య మగుటవలనను, “కింవత్స్య న్త్యపకల్మషాః కృతధియః, పశ్యే త్కశ్చి చ్చల చపల రే” యనుకావ్యప్రకాశోదాహృత పద్యములయందువలె నిందు శంక కవకాశమే కాని భయత్రాసముల కవకాశము లేనందునను, భయాభివ్యక్తియగు నన్నది మన్నింపం దగదు.

నవరససంకరమున కుదాహరణము.

మ. జయలక్ష్మీరతమై ప్రతాపయుతమై ♦ శత్రుచ్ఛిదాధుర్యమై
ప్రయతార్తావనమై కపీంద్రగతియై ♦ రక్తార్ద్రమై నిర్ఘనో
దయవిద్యున్నిభమై సకంపమయి వం ♦ దారుస్పృహాశూన్యమై
నయ మొప్ప న్నరసింహుఖడ్గ మమరు ♦ న్నానారసప్రక్రియన్. 195

టీ॥ జయలక్ష్మీరతమై=జయలక్ష్మియందు రతిగలదయి; ప్రతాపయుతమై=శౌర్యముతోఁగూడినదై; శత్రుచ్ఛిదాధుర్యమై = శత్రుసంహారదక్షమై; ప్రయతార్తావనమై=పరిశుద్ధులై దుఃఖితులయిన జనులరక్షించునదై, తనయందుద్వేషమువిడిచి దుఃఖితులయిన, అనఁగా శరణాగతులయిన వారి రక్షించునదై యనుట; కపీంద్రగతియై—చంచలమై యనుట; రక్తార్ద్రమై = రక్తముచేతఁ దడుపఁబడినదై; నిర్ఘనోదయవిద్యున్నిభమై=మేఘోదయములేని మెఱపుతోసమానమై; సకంపమయి=వడఁకుతోఁగూడినదయి; వందారు...ఐ = నమస్కరించువారియందు ఆశలేనిదయి, వారినివదలుచున్నదై యనుట ; నయమొప్పన్=నీతియతిశయిల్లునట్లుగా ; నరసింహుఖడ్గము=నరసభూపాలునిఖడ్గము ; నానారసప్రక్రియన్=శృంగారాదినవరసప్రక్రియచేత; అమరున్=ఒప్పును.

ఇందు వరుసగా శృంగార వీర రౌద్ర కరుణ హాస్యబీభత్సాద్భుత భయానక శాంత రసములకు సంకరము చెప్పఁబడినది. జయలక్ష్మీరతమై యనునది మొదలగువానిచేతనే శృంగారాదిరసములు వ్యజ్యమానము లగుచుండఁగా "నానారసప్రక్రియన్" అనుట "రసాదిలక్షణ స్త్వర్థ స్స్వశబ్దైరపి న వాచ్యః । వ్యభిచారి రసస్థాయిభావానాం శబ్దవాచ్యతా" ఇత్యాదికావ్యప్రకాశరసగంగాధరాది సర్వాలంకారికగ్రంథవిరుద్ధము, వమనాఖ్యదోషాదికారణమ్మునై రససంకరోదాహర

గానర్హాత నాపాదించుచున్నది. * “శ్లో॥ లక్ష్మీమాలోక్య లుభ్య న్నిగమ ముపహసన్ శోచయన్ యజ్ఞజన్తూన్ క్షత్త్రం శోణాక్షి పశ్యన్ సమితి దశముఖం వీక్ష్య రోమాఞ్చ మఞ్చన్। హృత్వా హైయఙ్గవీనం చకిత మపసరన్ మ్లేచ్ఛరక్తై ర్దిగన్తాన్ సిఞ్చన్దన్తేన భూమిం తిల మివ తులయన్ పాతు వః పీతవాసాః॥” అనునది యుక్తోదాహరణము.

రసాధిదేవతా నిరూపణము.

సీ. హరికి శృంగారలీ ♦ లాధిపత్య మొసర్చు
గణనాథు హాస్యసం ♦ గతునిఁ జేయు
నలికలోచనునిపై ♦ నధికరౌద్రము నిల్పు
శక్రుపై వీరర ♦ సంబు నెఱపు
యమునిపై (ని దయామ) శోకమ ♦ యత్వంబు ఘటియించు
జగతి మహాకాలు ♦ సభయుఁ జేయు
శర్వరీంద్రుని జుగు ♦ ప్సారసాన్వితుఁ జేయు
శతధృతి నద్భుతా ♦ న్వితు నొనర్చు

* లక్ష్మీమ్=లక్ష్మీదేవిని; ఆలోక్య=చూచి; లుభ్యన్=లోభపడుచున్నవాఁడు; నిగమమ్ = వేదమునుగూర్చి; ఉపహసన్ = హసించువాఁడు; యజ్ఞజన్తూన్=యజ్ఞపశువును; శోచయన్=శోకవంతములుగాఁ జేయువాఁడు; క్షత్త్రమ్=క్షత్త్రియకులమును; శోణాక్షి=ఎఱ్ఱనినేత్రములు గలుగునట్లు; పశ్యన్ =చూచుచున్నవాఁడు; సమితి=యుద్ధమందు; దశముఖమ్=రావణుని; వీక్ష్య=చూచి; రోమాఞ్చమ్=గగుర్పాటును; అఞ్చన్=పొందుచున్నవాఁడు; హైయఙ్గవీనమ్=నవనీతమును; హృత్వా=హరించి; చకితమ్=భయముతోఁగూడునట్లు; అపసరన్=పాఱిపోవుచున్నవాఁడు; మ్లేచ్ఛరక్తైః=మ్లేచ్ఛుల నెత్తురుచేత; దిగన్తాన్ = దిక్కులచివరలను; సిఞ్చన్=తడుపుచున్నవాఁడు; దన్తేన=దంతముచేత; భూమిమ్=భూమిని; తిలమివ=నూగింజనువలె; తులయన్=చేయువాఁడునగు; పీతవాసాః=పీతాంబరుఁడు; వః=మిమ్ము; పాతు=రక్షించుఁగాక.

క. కాంతి బ్రహ్మాండంబు: జేర్చు ని ♦ చ్చలు నృసింహు
భువనభరణంబు వరవిఘ్న ♦ నివహాహరణ
మీశతయు భోగము ననేక ♦ నృపతిహృతియు
ననియు యశమును మతియు బో ♦ ధాతిశయము. 196

టీ॥ నృసింహు...బోధాతిశయము=నరసభూపాలునియొక్క భూభరణము, విఘ్ననివారణము, ఈశ్వరత్వము, భోగము, శత్రురాజహారణము, యుద్ధము, యశస్సు, మతి, జ్ఞానాతిశయము నను నీ తొమ్మిదిగుణములు, వరునగా; హరికిశృంగార లీలాధిపత్య మొనర్చున్=విష్ణువునందున్న భూభరణమును దొలఁగించి శృంగారవిలాసాధిపత్యము గలుగఁ జేయును. గణనాథుహాస్యసంగతునిఁ జేయున్=గణపతినిహాస్యముతోఁ గూడిన వానిఁగాఁ జేయును, నరసభూపాలు నంతటి విఘ్నహారణశక్తిలేనందున గణపతి హాస్యమునకుఁ బాత్రుఁడగుననుట. అలికలోచనుని పై నధిక రౌద్రమునిల్పున్ = శివునిమీఁద ఎక్కుడుకోపముంచును, నరసభూపాలునిప్రభుత్వముకన్న శివుని యీశత్వము తక్కువయనుట. శక్రుపై వీరరసంబు నెఱపున్=ఇంద్రునకు వీరరసంబునిండించును, నరసభూపాలునిభోగమునుజూచి యింద్రుఁడు తనకట్టిభోగము లేమి చే వీరరసమునొందుననుట. యమునిపై దయామయత్వంబుఘటియించున్=యమునకు ఎక్కువదయగలవాఁడగుటను కలిగించును, నరసభూపాలుఁడు శత్రురాజులవధించుటను చూచి యముండును దయవహించునని తాత్పర్యము. జగతిన్=భూమియందు; మహాకాలున్=కాలరుద్రుని; సభయున్=భయముతోఁగూడినవానిఁగా ; చేయున్, నరసభూపాలుని యుద్ధముఁ జూచి మహాకాలుఁడుగూడ భయపడుననుట; శర్వరీంద్రుని జుగుప్సారసాన్వితుఁ జేయున్ = చంద్రునిరోఁతతోఁగూడినవానిని జేయును, నరస

భూపాలుని కీర్తి చంద్రునికన్నను ధవళముగానుండుటవలనఁ జంద్రుఁడు రోఁతకుఁ బాత్రుఁడగునని తాత్పర్యము. శతధృతిన్=బ్రహ్మను; అద్భుతాన్వితునొనర్చున్ = ఆశ్చర్యముతోఁగూడినవానిఁజేయును ; నరసభూపాలునిబుద్ధికి బ్రహ్మదేవుఁడును ఆశ్చర్యమునొందుననుట. బ్రహ్మంబున్ శాంతిఁజేర్చున్=బ్రహ్మమునుశాంతినిబొందించును, ఇతనిజ్ఞానాతిశయముచే, జ్ఞానస్వరూపమగు బ్రహ్మముకూడ శాంతమగుననుట. నిచ్చలు=నిశ్చయము.

శృంగారమునకు విష్ణువును, హాస్యమునకు గణపతియు, రౌద్రమునకు శివుఁడును, వీరమునకు దేవేంద్రుఁడును, కరుణమునకు యముఁడును, భయానకమునకు మహాకాలుఁడును, బీభత్సమునకుఁ జంద్రుఁడును, అద్భుతమునకుఁ జతుర్ముఖుండును, శాంతమునకు బ్రహ్మమును, అధిదేవతలని భావము.

§ ఇందు యమునియందు శోకస్థాయిక మైనకరుణరసాధిపత్యముఁ జెప్పుటకు మాఱుగా "యమునిపై ని దయామయత్వంబు ఘటియించు" ననుటయు, పై రససంకరపద్యములోఁ, గరుణరసపర్యాయముగాఁ "బ్రయతాత్త్వావనమై" యనుటయు, యుక్తంబుగాఁ దోఁప దని స్థాయిభావపద్య వ్యాఖ్యానమున వ్రాయఁబడినది. యమునిపై శోకమయత్వంబు ఘటించునని మార్చి దోషమును దొలంగింపవచ్చునంద్రు.

రసవర్ణని రూపణము.

సీ. మరకతాసీకదం ♦ భమున శృంగారంబు
 హాస్యంబు ముక్తాఘ ♦ లౌఘరుచులఁ

గరుణ (విద్రుమవర్ణ)ంబు విద్రుమ ♦ గౌరవచ్ఛలమున
రౌద్రంబు కురువింద ♦ రత్నకలన
వీరంబు గోమేధి ♦ కారోపితస్ఫూర్తి
భయము వైదూర్యశో ♦ భామిషమున
బీభత్స మింద్రనీ ♦ లాభాగుణంబున
శాంతి నిర్మలహీర ♦ కాంతిగతుల

తే. నద్భుతము పుష్యరాగరా ♦ గాపదేశ
విలసితంబున సాకార ♦ వృత్తి గాంచి
నవరసంబులు పొల్చు నీ ♦ భవనవీథిఁ
బ్రబల సుబలనృసింహ యో ♦ బయనృసింహ. 197

టీ॥ సుబలనృసింహ=పరాక్రమమందు నృసింహస్వామితో సమానుఁడవైన; ఓబయనృసింహ = ఓబయనరసభూపాలుఁడా! నీభవనవీథిన్=నీగృహప్రదేశమందు; మరకతానీకదంభమునన్ = మరకతసమూహముయొక్క నెపముచేత; శృంగారము = శృంగారరసమును; ముక్తాఫలౌఘరుచులన్=ముత్తెములసమూహముయొక్క కాంతులచేత; హాస్యంబు=హాస్యమును; విద్రుమవర్ణ గౌరవచ్ఛలమునన్=పగడములకాంత్యతిశయముయొక్క వ్యాజముచే; కరుణ=కరుణరసమును; కురువిందరత్నకలనన్=కెంపురాళ్ల రీతిచేత; రౌద్రంబు=రౌద్రమును; గోమేధికారోపితస్ఫూర్తిన్=గోమేధికములయారోపింపఁబడినకాంతిచే; వీరంబును= వీరమును; వైదూర్యశోభామిషమునన్=వైదూర్యమణికాంతియొక్క నెపముచేత; భయము = భయానకరసమును; ఇంద్రనీలాభాగుణంబునన్=ఇంద్రనీలమణులకాంతులవిధముచేత; బీభత్సము=బీభత్సమును; నిర్మలహీరకాంతిగతులన్ = స్వచ్ఛములయినవజ్రములకాంతులయొక్క

విధములచేత ; శాంతి = శాంతరసమును ; పుష్యరాగ రాగాపదేశ విలసితమునన్ = పుష్యరాగములకాంతియొక్క వ్యాజవిలాసముచేత; అద్భుతము=అద్భుతరసమును; సాకారవృత్తికాంచి=ఆకారముతోఁగూడి నయునికినిపొంది; నవరసంబులు; ప్రబలన్=అతిశయిల్లునట్లు; పొల్చున్= ప్రకాశించును.

శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానక భీభత్స శాంతాద్భుతంబులను తొమ్మిదిరసంబులు క్రమముగామరకత ముక్తావిద్రుమ పద్మరాగ గోమేధిక వైదూర్య నీల వజ్ర పుష్యరాగ వర్ణములని భావము.

రస మానందరూప మనుటయం దాక్షేపము.

క. (కరుణాభయబీభత్సము
ఖరసంబులు శోకభీతి ♦ గాఢజుగుప్సా)
కరుణభయానకబీభ
త్సరసంబులు శోకభీతి ♦ సారజుగుప్సా
కరములు గాన రసములై
తిర మగు నెట్లన్న దీనిఁ ♦ దెలిపెద వరుసన్. 198

టీ॥ కరుణా...రసంబులు=కరుణము భయానకము బీభత్సము మొదలగురసములు ; శోక...ఆకరములు=శోకముభీతిదట్టమైనజుగుప్స మొదలగువానికాకరములు. కాన ; రసములై తిరమగు నెట్లన్న = ఆనందరూపరసములై యెట్లుదృఢపడుననిశంకించినచో ; దీనివరుసన్ దెలిపెదన్=దీనిక్రమముఁజెప్పెదను.

§ ఇందుఁ "గరుణాభయ" యనియు, క్రిందిపద్యమునఁ "గరుణావిద్రుమ" యనియు, రసబోధక మగుకరుణశబ్దమును స్త్రీలింగముగ

బ్రయోగించుట చింత్యం బని స్థాయక్రమపద్యమువ్యాఖ్యానములో మున్ను వ్రాయఁబడియున్నది. ఇటఁ "గరుణాభయా నకభీభత్సరసంబులు శోకభీతిసారజుగుప్సా" అనియు వెనుక పద్యమున "కరుణంబువిద్రుమ గౌరవచ్ఛలమున" ననియు మార్చుట శ్రేయం బగు.

సమాధానక్రమముఁ జెప్పుచున్నాఁడు.

ఉ. భావ మలంక్రియాగుణవి ♦ భాసితమై వికసద్రసోదయ
శ్రీవినివారితేతరవి ♦ శేష నివేదనమై యెలర్ప నీ
వావిరి దుఃఖ మైన సుఖ ♦ వైభవ మైన విటీవిటాలియం
దావలఁ బూర్ణమై సహృద ♦ యాత్మలఁ గేవలహర్షమై తగున్. 199

టీ॥ భావము=రత్యాదిస్థాయిభావము ; అలంక్రియాగుణవిభాసితమై = ఉపమాద్యలంకారములచేతను మాధుర్యాదిగుణములచేతను ప్రకాశించుచున్నదై ; వికసత్ ... ఐ.—వికసత్=వికసించుచున్న, రసోదయ=రసావిర్భావముయొక్క, శ్రీ=సంపదచేత,. వినివారిత=నివర్తిల్లఁ జేయఁబడిన, ఇతరవిశేషనివేదనమై=జ్ఞానాంతరముగలదయి, విగలితవేద్యాంతరమైయనుట; ఎలర్పన్=ప్రకాశింపఁగా; ఈవావిరిన్=పైఁజెప్పిన క్రమముచేత; విటీవిటాలియందున్=జారిణీజారులయందు; దుఃఖమైనన్=దుఃఖరూపమైననుగాని; సుఖవైభవమైనన్=సుఖాతిశయరూపమైననుగాని; ఆవలన్=లోకవ్యతిరిక్తకావ్యములందనుట; సహృదయాత్మలన్=సహృదయులయంతరంగములయందు; పూర్ణమై=పరిపూర్ణరూపమై; కేవలహర్షమై=ఆనందమాత్రరూపమై ; తగున్=ఒప్పును.

లోకమునందుఁ దత్తద్రసవివేషానుభవకాలమందుఁ దత్తదుచితకారణాదిసామగ్రీబలమున ననుభవించెడు రామాదులకు శృంగారర

రణాదులు యథాయోగముగ సుఖదుఃఖాది రూపములుగా నుండినను, గావ్యనాట్యానుసంధాన దశయందు సహృదయులయంతరంగములయందు లలితసన్నివేశచారు వగు కావ్యముచేతను తాదృశాభినయముచేతను సమర్పితంబులయి, తదీయసహృదయతావశోన్మిషితం బగుభావనావిశేషమహిమచే దుష్యంతరమణీత్వాది ధర్మములు మాని సర్వసాధారణముగ విభావాదిపదవ్యవహార్యంబు లగుశకుంతలాద్యాలంబన కారణములును, చంద్రికాద్యుద్దీపనకారణములును, అశ్రుపాతాదికార్యములును, నేకీభావముగఁ జేరిపుట్టించిన అలౌకికవ్యాపారముచేతఁ, దత్కాలమందానందాంశావరణాజ్ఞానము నివర్తితమగుటవలన, పరిమిత ప్రమాతృత్వాదినిజధర్మములు విగళితములై తన్మయత్వము నొందిన దేవదత్తాది ప్రమాతలచే, నెదుటఁ ప్రకాశించు దానివలె, సర్వాంగముల నాలింగనముచేయు దానివలె, స్వేతరమగు సర్వమును తిరోధానముచేయుదానివలె, బ్రహ్మానందము ననుభవింపఁ జేయుదానివలె, సాక్షాత్కరింపఁ బడినభగ్నావరణ చిద్విశిష్టరత్యాదికము గాని, రత్యాద్యవచ్ఛిన్నభగ్నావరణచిత్తు గాని, కేవలపరిపూర్ణానందరూపమైన రసరూపమై తగును. కానఁ బూర్వోక్తాశంక ప్రసరింపదని తాత్పర్యము.

§ ఈపద్యమును, * "శ్లో॥ గుణాలఙ్కారశ్రీకృతపరికరో భావవిభవస్స్ఫురత్ప్రాదుర్భావః క్రమగలితవేద్యాన్తరమతిః। సుఖం వా దుఃఖం

* భావివిభవః=స్థాయిభావసమృద్ధి; యూనోః=తరుణీతరుణులకు; సుఖం వా దుఃఖం వా నిదధత్=సుఖమునుగాని దుఃఖమునుగాని గలుగఁజేయుఁగాక. సహృదయేషు = సహృదయునియందో; గుణాలఙ్కారశ్రీకృతపరికరః=మాధుర్యౌజఃప్రసాద గుణములు నుపమాద్యలంకారములు వీని సంపదచేతఁ జేయఁబడిన సామగ్రిగలదై; స్ఫురత్ప్రాదుర్భావః=వ్యక్తమగుచున్న యావిర్భావముగలదై; క్రమగలితవేద్యాన్తరమతిః=వరుసగా వీడినజ్ఞేయాంతర విషయకబుద్ధిగలదై; అమన్దానన్దాత్మా=నిరతిశయానందరూపమైన; పూర్ణః=నిండిన; రసభరః = రసాతిశయముగా; పరిణమతి =పరిణమించుచున్నది.

వా నిబిడయతు యూనో స్సహృదయే త్వమస్దానన్దాత్మా పరిణమతి పూర్ణో రసభరః॥" అనుప్రతాపరుద్రీయశ్లోకమును, సర్వరససాధారణ్యముగఁ బ్రవర్తించినవి గాని యొక శృంగారమునుగూర్చి మాత్రమ ప్రవర్తించినవి గావు. ఇందుననే, "సుఖంవా దుఃఖంవా నిబిడయతు" అని "దుఃఖమైన సుఖమైన భవమైన" అని చెప్పఁబడినది. ఇట్లుండ "యూనోః" అనుటయు, "విటీవిటాలియం" దనుటయు, తప్పులు. తరుణీతరుణు లాలంబనమగుట శృంగారేతరమునందు సంభవింపదుగావున, "లోకేస్యాదనుకార్య ఏవ," "తత్కాలమందైన సత్యము రామాదులయంద," యనునుత్తరపద్యములందువలె సర్వరససాధారణ ప్రయోగముగ నుండవలయు. మఱియు నీగ్రంథమందుఁ బ్రయోగింపఁబడినవిటీవిటశబ్దము సర్వవిధములఁ నయుక్తము. ఎట్లన, విటశబ్దము శృంగారాలంబననాయకసహాయు లగువిటపీఠమర్దచేటవిదూషకులలోఁ జేరినవాని బోధించినంగాని, జారుని బోధించినంగాని, సకలయువమిథునసాధారణాలంబనక మగు శృంగారరసమున కంతకుఁ దగినయాలంబనము గాఁ జాలదు. కావున నయుక్తతమంబు.

కొందఱు "శ్లో॥ కారణా న్యథ కార్యాణి సహకారీణి యానిచై। రత్యాదేః స్థాయినో లోకే తానిచే న్నాట్యకావ్యయోః। విభావా అనుభావాశ్చ కథ్యన్తే వ్యభిచారిణః। వ్యక్తస్స తైర్విభావాద్యైః స్థాయీభావో రసస్స్మృతః॥" ఇత్యాదులవలన లోకవిలక్షణములై కావ్యనాట్యములయందు మాత్రము వ్యవహరింపఁబడు విభావానుభావవ్యభిచారులచే సహృదయసామాజికాంతరంగములయందు లోకోత్తరకావ్యనాట్యానుసంధానదశయందుఁ గలుగునలౌకికానందమె రసము, కావున లోకమునందు విభావాదులు లేమిఁ దద్వ్యతిరిక్తకారణ

ములచే నుదయించుసుఖము రసశబ్దవాచ్యమే కాదు. అట్టి కావ్యనాట్యానుసంధానజన్యపరమానంద విశేషము, సర్వరసనిర్విశేషముగా, కరుణాదులయందును అఖండానందరూపమై యే విలసిల్లుచుండఁగా, లోకమునఁ గరుణాదులయందుఁ గలుగుదుఃఖమునుబట్టి కావ్యనాట్యాదులయందుఁగలుగు నలౌకికానందము దుఃఖదూషిత మని యాశంకించుట చెల్ల దని వక్కాణింతురు. లౌకికసుఖము రసశబ్దవాచ్యమే కాదని పరమార్థము.

§ ఇట్లలౌకికానందము కావ్యనాట్యోభయద్వారముగ సహృదయసామాజికాంతరంగాశ్రయమై విలసిల్లుచుండ "గుణాలంకారశ్రీకృతపరికరః" అనియు, "భావమలంక్రియాగుణవిభాసితమై" యనియు, గుణాలంకారములను జెప్పుటయు,ప్రతాపరుద్రీయవ్యాఖ్యయందు "గుణాలంకారగ్రహణం వృత్తిరీత్యాదీనాము ప్యుపలక్షణ" మ్మని వ్రాయుటయు, వాక్యార్థాభినయాత్మకం బగునాట్యమున నలంకారగుణవృత్తిరీతులు సంభవింపమి నసంగతంబులు. కావ్యమునుగూర్చియే యీపద్యద్వయము ప్రక్రాంత మయిన దన వచ్చుఁ గాని, యట్లైన "నాట్యేతుసామాజికే," "నాట్యమునసభ్యవాసమైభాసిలుఁ," అను నుపసంహారవాక్యమునకు నీయుపక్రమవాక్యమునకు నేకవాక్యత దుర్ఘటంబగును. ఉపక్రమోపసంహారముల కేకవాక్యతానైయత్యంబు శాస్త్రసిద్ధంబైనది.

ఇట్టి రసమెట్లు కావ్యాదులయందుదయించు నని శంకించి చెప్పుచున్నాఁడు.

తే. అలపదార్థంబు లగువిభా ♦ వానుభావ
సాత్త్వికాదులఁ గూడి ర ♦ సత్వమొందు

నవని భావంబు వాక్యార్థ • మనఁగ నెగడి
తంతువులు గూడి పట మనఁ • దనరుకరణి. 200

టీ॥ అవనిన్=భూమియందు; భావంబు=రత్యాదిస్థాయిభావము; వాక్యార్థమనఁగనెగడి=వాక్యార్థమనునట్లొప్పి, కవిసంరంభగోచరమయి యనుట, "శ్లో॥ కవే ర్వివక్షయా యత్ర ప్రాధాన్యం పరికల్ప్యతే। భవే త్స ఏవ వాక్యార్థ ఇతి నిర్ణీయతే బుధైః॥" అనుటవలన విభావాదులు రసము ప్రధాన మగు నవు డవాంతరవ్యాపారరూపములై పదార్థము లగును, స్వస్వప్రాధాన్యమునందు వాక్యార్థము లగు నని తెలియునది. తంతువులు...కరణిన్=దారములు గూడి వస్త్రములగు రీతి; అల...కూడి=పదార్థములుగాఁ బ్రసిద్ధము లగువిభావాదులఁగూడి; రసత్వమొందున్=రసరూపతనొందును.

శ్లో॥ యథాహి తన్తవో వేమతుర్యాదిక్రియ యాన్వితాః। పటాత్మతాపరిణతాః పటవాచ్యా భవన్తితే। తథైవ స్థాయినో భావా విభావాదిభి రన్వితాః। రసాత్మతాపరిణతా రసవాచ్యా భవన్తితే॥" ఇత్యాదిప్రమాణములు తెలియునది.

§ విభావాదులు ధరయందు లేక కావ్యాదులయందు మాత్ర ముండునవి గాన నిం దవనిశబ్దప్రయోగము చింత్యము, ఈవిషయమ్ము మున్నె వివరింపఁబడెను.

ఇఁక నిర్వేదాది స్థితిని మఱల సుబోధార్థము రసస్థితిని జెప్పుచున్నాఁడు.

మ. రమణీయోల్బణతాసమేత మగు నీ ♦ రత్యాదిభావాబ్ధిలో
నమరం బుట్టుచు మున్గుచుం దగుఁ దరం ♦ గాయూథి సంచారిసం
ఘము లేతత్ప్రతిపన్నమౌ రసము త ♦ త్కాలంబునం దైన స
త్యము రామాదులయందె నాట్యమున స ♦ భ్యావాసమై భాసిలున్

టీ॥ సంచారిసంఘములు=నిర్వేదాదివ్యభిచారులు; రమణీయ... అబ్ధిలోన్=మనోహర మగునుద్రేకముతోఁ గూడినరతి మొదలగు స్థాయిభావము లను సముద్రములో; తరంగాయూథిన్=అలలభంగి; అమరన్=ఒప్పునట్లు; పుట్టుచుమున్గుచున్; తగున్=ఒప్పును. ఏతత్ప్రతిపన్నమౌరసము = ఈనిర్వేదాద్యుపభోగమునఁబుట్టుశృంగారాదిరసము ; తత్కాలంబునందున్=ఆయావిర్భావకాలమందు, అనఁగా, లోకమునం దనుభవగోచరమగునపుడు; రామాదులయందె=రామాద్యనుకార్యుల యందే; ఏనన్=ఉండినను; నాట్యమునన్=నాట్యమునందు; సభ్యావాసమై=సామాజికనిష్ఠమై; భాసిలున్=ప్రకాశించును. సత్యము= నిక్కము.

ఇందు విశేషము "శ్లో॥ ఉన్మజ్జన్తో నిమజ్జన్తి కల్లోలా స్తేయథార్ణవే। తస్యోత్కర్షం వితన్వన్తి యాన్తి తద్రూపతామపి। తథా స్థాయిని నిర్మగ్నా హ్యున్మగ్నా వ్యభిచారిణః। పుష్ణన్తి స్థాయినం స్వాంశ్చ తన్నయన్తి రసాత్మతామ్॥" ఇత్యాదిప్రమాణములును, "గుణాలంకారశ్రీ" యని పై వ్రాయఁబడినదియు, * "శ్లో॥ రసో వాక్యార్థ స్స న్నైవ

* నైచ=ఇంతియకాదు. రస=శృంగారాదిరసము; వాక్యార్థస్సన్= "రసైర్విపక్షయా యత్ర ప్రాధాన్యమపి కల్ప్యతే। ధ ఏత్స ఏవ వాక్యార్థ ఇతినిర్ణీ

సతి పదార్థాః పున రమీ విభావాద్యా యస్మిన్ కిల దధతి విశ్రాన్తి ముచితామ్। అతో భావా ఏవ క్రమసముదితాన్యోన్యవిభవా రసీభావం బిభ్రతి త్యథచ పటతాం తన్తవ ఇవ॥" అనునదియు, * శ్లో॥ "భావే స్థాయిని వర్ధమానవిభవే రత్యాదికే సిన్ధువ త్కల్లోలా ఇవ సంభవన్తి విలయం చాయాన్తి భావా ముహుః। నిర్వేదాద్యుపభోగభావితనిజా

తేఋద్ధైః" అనురీతిగా వాక్యార్థమనఁవగినదై ; విలసతి=ప్రకాశించును. యస్మిన్= ఏరసమందు ; విభావాద్యాః = విభావానుభావసాత్త్విక వ్యభిచారులు ; ఉచితామ్= తగినట్టి ; విశ్రాన్తిమ్=కాప్పను ; దధతి=పొందుచున్నవో. అతః=అందువలన ; భావాఏవ=సంచార్యాదిభావములే ; క్రమసముదితాన్యోన్యవిభవాః = వరుసగనుదయించిన యొండొరుల సమృద్ధులుగలవై ; తంతవః=దారములు ; పటతామివ=వస్త్రభావమునువలె ; రసీభావమ్=రసత్వమును ; బిభ్రతి=భరించుచున్నయవి.

* సిన్ధువత్=సముద్రమువలె ; వర్ధమానవిభవే=వృద్ధిఁబొందుచున్న యతిశయముగల ; రత్యాదికే = రతిమొదలుగాఁగల ; స్థాయినిభావే = స్థాయిభావమునందు ; భావాః=సంచారులు ; కల్లోలాఇవ=తరంగములుంబోలె ; ముహుః=మాటిమాటికి ; సంభవన్తి = పుట్టుచుండును. విలయమ్ = లయమును ; ఆయాన్తిచ=పొందుచునుండును. నిర్వేదాద్యుపభోగ భావిత నిజాస్వాదాతిరేకః = నిర్వేదాది సంచారులయొక్క అనుభవముచే భావితమైన నిజానుభవాతిశయముగల ; రసః = శృంగారాదిరసము ; లోకే=లోకమునందు ; అనుకార్య ఏవ=అనుకార్యుఁడైన రామాదియందె ; స్యాత్=ఉండును. నాట్యేగు = నాట్యమునఁదో ; సామాజికే=సభ్యునియందు ; కథితః— చెప్పఁబడినది.

ప్యాదాతిరేకో రసో లోకే స్యా దనుకార్య ఏవ కథితో నాట్యేతు సామాజికే॥ అనునదియు, నీమూఁడు ప్రతాపరుద్రీయ శ్లోకములును, తద్వ్యాఖ్యయుఁ బరిశీలింపఁగా స్పష్టమగును. ఇట గ్రంథ విస్తరభయం బున నింతటితో విరమించుట యగును.

ఇట్లు కావ్యాలంకార సంగ్రహంబునఁ

తృ తీ యా శ్వా స ం బు

స వ్యా ఖ్యా న ం బు

ము గి సె ను.

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

Cl. No. 415 Acc No. 29360

Sa 15 K **DATE DUE**

DURATION OF LOAN — Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T Acc. No. 29360

Call No. 415 Sa15K

Author [illegible]

Title [illegible]

UNIVERSITY OF HYDERABAD

LIBRARY

HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

Help to keep the book fresh and clean